# సమకాలీన భారతదేశ చరిత్ర

## (A.D.1947 TO A.D. 2010)

### ఎం.ఏ. - చరిత్ర , సెమిస్టర్ - III, పేపర్ - III


డైరెక్టర్

**డా. నాగరాజు బట్టు**

యంహెచ్ఆర్ఎమ్., ఎంబిఎ., ఎల్ఎల్ఎమ్., ఎం.ఎ (సై) ఎం.ఎ (సో)., ఎం.ఇడి., ఎంఫిల్., పిహెచ్.డి

దూరవిద్యా కేంద్రం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ – 522 510

ఫోన్ నెం.0863-2346208, 0863-2346222,

0863-2346259 (స్టడీ మెటీరియల్)

వెబ్‌సైట్: www.anucde.info,

ఇమెయిల్:anucdedirector@gmail.com

SEMESTER-III

## ACHARYA NAGARJUNA UNNIVERSITY

DEPARTMENT OF HISTORY ARCHAEOLOGY

M.A. History

Paper III (H3.3)

### 303HI21 - Contemporary History of India 1947-2010

Unit -I. The Partition of India- Visions of New India -Integration of Princely states- The Kashmir and Hyderabad issue- The Republican constitution of India and its Salient features- Amendments.

Unit- II. Indian foreign policy –Non – Alignment- India and Commonwealth – India and the Super Powers- India's relations with Neighboring countries.

Unit-III. Socio-Economic policy-Five year plans- Socialist pattern of society – Agricultural policy- Education policy- Peasants-castes- women- New economic policy

Unit-IV. Reorganization of States and Indian polity- Formation of Andhra – the State Re-organization Commission, 1956- Emergence of National and Regional Parties.

Unit-.V The Growth of Science and Technology in Modern India – Communication, Transport, Science and Research, Antarctic expedition, IT Revolution.

**Suggested Readings**


1 Bhambhri, C. P., *The Indian State, 1947-1998*, Shipra, Delhi, 1998
2 Bipan Chandra, *India after Independence, 1947-2000*, Penguin, New Delhi, 2000
3 Dutt, V. P., *India's Foreign Policy*, NBT, New Delhi, 2007
4 Guha, R., *India After Gandhi*, Picader India, New Delhi, 2007
5 Iqbal Narain, *Politics in a Changing India,* Rawat, New Delhi, 1994
6 Iqbal Narain, *State Politics in India*, Rawat, New Delhi, 2002
7 Menon, V. P., *Integration of the Indian States*
8 Misra, B. B., *The Indian Political Parties,* Orient Longman, Hyderabad, 1997
9 Paul R. Brass, *The Politics of India Since Independence*, Cambridge, New Delhi, 1997
10 Ramakanth, R. M (ed), *India's Partition Precludes and Legacies*, Rawat, New Delhi, 2005
11 Sajal Basu, Regionalism, *Ethnicity and Left Politics*, Rawat, New Delhi, 1997
12 Stanley Wolpert, *A New History of India*
13 Venkatesan, G., *History of Contemporary India*, V. C. Publications, Rajapalayam, 2007

1. Bendict Costa, *India's Socialist Princes and Garibi Hatao*
2. Giseal Non, *The Indian Challenge*, Allied Publishers, Ltd, New Delhi, 1992
3. Michel Brecher, *Nehuru a Political Biography*, OUP, New Delhi, 1998
4. Panelbianco, A., *Political Parties: Organizaton and Power*, Cambridge University Press, Cambridge, 1988
5. Paul R., Brass, *The Politics of India Since Independence*, OUP, New Delhi, 1997
6. Russel, B., *The Indo-Pakistan Conflict*
7. Ved Mehta, *The New India*,

# 17

# భారతదేశంలో స్వదేశీ సంస్థానాల విలీనం

ఆంగ్లేయులు వ్యాపారనిమిత్తం భారతదేశానికి వచ్చేనాటికి దేశంలో అనేక చిన్న పెద్ద సంస్థానాలుండేవి. సంస్థానాలలో కొన్ని మొగల్ చక్రవర్తికి సామంతంగా ఉన్నప్పటికీ, అతనితో ఎలాంటి ప్రమేయం లేకుండా స్వతంత్రంగా వ్యవహరించేవి. సంస్థానాధిపతులు ప్రజాక్షేమాన్ని విస్మరించి, తరచుగా యుద్ధాలుచేస్తూ, వాటికయ్యే ఖర్చును ప్రజలపై మోపుతూ, వారిని పీడించి ధనాన్ని రాబట్టేవారు. అందువల్లనే వారికి ప్రజల సహకారం లేకుండా పోయింది. అంతేకాక స్వదేశీ సంస్థానాల రాజులు తమలో తాము నిరంతరం కలహించుకుంటూ, ఐరోపా వాసులైన, పోర్చుగీస్, ఫ్రెంచ్, ఆంగ్లేయుల సహాయాన్ని అర్థించేవారు. 17వ శతాబ్దంలో ఆంగ్లేయులు భారతదేశానికి వచ్చేనాటికి దేశంలో బెంగాల్, అయోధ్య, కర్ణాటక, మైసూర్, మహారాష్ట్ర, హైదరాబాద్ వంటి ప్రముఖ సంస్థానాలుండేవి. అయితే ఆంగ్లేయులు ఈ సంస్థానాలన్నింటిలో జోక్యం చేసుకొని, వాటిలో కొన్నింటిని వశపరచుకోవడం జరిగింది.

స్వదేశీ సంస్థానాలలో హైదరాబాద్, మైసూర్, కాశ్మీర్‌లు అతిపెద్ద సంస్థానాలు. వీటిలో కొన్ని ఐరోపా దేశాలతో సమాన విస్తీర్ణాన్ని కలిగి ఉండేవి. ఈ సంస్థానాలన్నీ బ్రిటిష్ వారి సర్వసమున్నతత్వాన్ని గుర్తించడమేకాకుండా దాన్ని తుచ తప్పకుండా ఆచరించేవి. దీనికిగాను బ్రిటిష్‌వారు స్వదేశీ సంస్థానాల పాలకులను అన్ని రకాల శత్రువుల నుంచి రక్షించేవారు.

ఆంగ్లేయులకు, సంస్థానాధిపతులకు ఉన్న సంబంధాన్ని చరిత్రకారులు మూడు దశలుగా విభజిస్తారు. మొదటి దశ 1757లో ప్లాసీ యుద్ధం తరవాత ప్రారంభమై 1818తో ముగుస్తుంది. దీనిని "వలయబద్ధ విధానం" అని వ్యవహరిస్తారు. రెండో దశను 1818 నుంచి 1857 వరకు గమనించవచ్చు. ఈ దశని "అధీన సంబంధ నిరోధ విధానం" అని పేరు. 1857 తిరుగుబాటుతో మూడో దశ ప్రారంభమవుతుంది. దీన్ని "అధీన సంఘం" () అని పేర్కొంటారు.

మొదటిదశలో ఆంగ్లేయులు స్వదేశీ సంస్థానాలతో స్నేహంచేసి, వారి వద్ద నుంచి కొన్ని ప్రదేశాలను పొంది, వారికి విదేశీ, రక్షణ వ్యవహారాలలో సలహాలిస్తూ, వారి ఆంతరంగిక

వ్యవహారాలలో జోక్యం కలిగించుకొనేవారు. అయితే ఆంగ్లేయుల జోక్యం సహించని సంస్థానాలతో వారు యుద్ధానికి దిగేవారు. మైసూర్, మహారాష్ట్ర యుద్ధాలను దీనికి ఉదాహరణలుగా చెప్పవచ్చు. 1803లో సర్‌జార్జి బార్లో "భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని తలకిందులు చేసే ప్రయత్నాలు సఫలం కాకుండా చూడాలంటే, ఆంగ్లేయాధికారానికి లోబడిన సంస్థానమేదీ భారతదేశంలో ఉండకూడదు" అని పేర్కొన్నాడు. నాటి ప్రజలు కూడా స్వదేశీ పాలకుల నిరంకుశ చర్యలతో విసుగుచెంది, ఆంగ్లేయులతో చేరి, వారి సంస్కరణలకు మద్దతుపలికారు. వారికి తమ రాజులు అనుసరించిన రాజనీతికంటే, ఆంగ్లేయులు ప్రదర్శించిన రాజనీతి నచ్చింది. వారన్‌హేస్టింగ్స్ కాలం నుంచి బ్రిటిష్ గవర్నర్ జనరల్‌లు అనేక సంస్కరణలను ప్రవేశపెట్టి, ప్రజల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి, న్యాయస్థానాలలో వారికి తగిన న్యాయం చేకూర్చడానికి ప్రయత్నాలు చేసి ప్రజాదరణ పొందడం జరిగింది. ఆకారణంగానే 1857 తిరుగుబాటులో సామాన్య ప్రజలు ఎలాంటి శ్రద్ధ కనబరచలేదు. అందువల్లనే లార్డ్ వెల్లస్లీ ప్రజల సానుభూతిని పొందలేని రాజులను అతిసునాయాసంగా స్వాధీనం చేసుకోవచ్చని భావించాడు. 1798 నుంచి 1805 వరకు బ్రిటిష్ గవర్నర్ జనరల్‌గా పనిచేసిన వెల్లస్లీ కాలంలో రాజ్యవిస్తరణ బాగా జరిగింది. భారతదేశ రాజకీయాల్లో జోక్యం చేసుకోవద్దనీ, కంపెనీ ఆర్థిక వనరులను మెరుగుపరచడంపైనే తన దృష్టిని కేంద్రీకరించాలని వెల్లస్లీకి సూచనలిచ్చి పంపడం జరిగింది. కానీ, వెల్లస్లీ మాత్రం భారతదేశానికి రాగానే స్థానిక పరిస్థితులను గమనించి, రాజ్యవిస్తరణ విధానాన్ని అవలంబించాడు. కేవలం యుద్ధాలవల్లనేకాకుండా, అతడు సహాయక సంధుల ()ద్వారా కంపెనీవారి సర్వసమున్నతత్వాన్ని భారతదేశంలో చాలావరకు సాధించగలిగాడు. సహాయక సంధి చేసుకున్న పాలకులు మరే ఇతర ఐరోపా రాజ్యాలతో, ఇంగ్లీష్ ఈస్టిండియా కంపెనీవారి అనుమతి లేకుండా సంధులు చేసుకోకూడదు. అలాగే ఆంతరంగిక, శాంతి పరిరక్షణకు మాత్రం పెద్ద సంస్థానాల పాలకులు తమ సొంత సైన్యాలను ఉంచుకోవచ్చు. శత్రువుల నుంచి కాపాడినందుకు ఈ రాజ్యాల వారు కంపెనీ సైన్యానికి అయ్యే ఖర్చు నిమిత్తం నగదునేకాకుండా, తమ రాజ్యాల్లో కొంత భూభాగాన్ని కూడా ఇచ్చివేయాలి. సహాయక సంధిని అంగీకరించిన పాలకులందరు తమ తమ రాజ్యాల్లో ఇంగ్లీష్ అధివాసీ () లను ఉంచుకోవడానికి అంగీకరించాలి.

సహాయక సంధిని అంగీకరించిన మొదటి సంస్థానం హైదరాబాదు. దీని పాలకుడు నిజాం ఆలీఖాన్ (1761-1803). అయితే కొన్ని సంస్థానాలు ఆంగ్లేయుల ఒత్తిడివల్ల ఈ సంధికి అంగీకరించాయి. అలాంటి వాటిలో అయోధ్య, సూరత్, ఫరూకాబాద్ ముఖ్యమైనవి. ఈవిధంగా యుద్ధం చేయకుండానే స్వదేశీ సంస్థానాలలో తమ ఆధిక్యాన్ని చాటుకోవడం మొదటి ఘట్టంలోని వలయబద్ధ విధాన ముఖ్య విశేషం.

ఆంగ్లేయుల స్వదేశీ సంస్థానాధిపతుల సంబంధాలతో రెండో దశ 1818 నుంచి 1857 వరకు, అంటే లార్డ్ హేస్టింగ్స్ కాలం నుంచి సిపాయిల తిరుగుబాటు వరకు గమనించవచ్చు.

ఈ దశలో అనుసరించిన 'అధీన సంబంధ నిరోధ విధానం"లో బ్రిటిష్ వారు సంస్థానాల అంతరంగిక విషయాలలో కాకుండా జోక్యం చేసుకొనే అధికారం పొందడం జరిగింది. హేస్టింగ్స్ కాలంలో కొన్ని సంస్థానాలు ముఖ్యంగా, హైదరాబాదు, మైసూర్, తిరువాన్కూర్, అయోధ్య సంస్థానాధీశులు; పీష్వా సహాయసంధికి లోబడి ఉన్నారు. బుందేల్ ఖండ్, కొల్హాపూర్, భరత్‌పూర్, శిక్కు సంస్థానాలు; ఆళ్వార్, రాంపూర్ వంటి సంస్థానాలు ఆంగ్లేయులతో సంధి చేసుకొని, వారి రక్షణలో ఉన్నాయి. సింధియా, బోంస్లే, హోల్కర్ వంటి సంస్థానాధిపతులు బ్రిటిష్ వారితో సంధి చేసుకున్నప్పటికీ, వారంటే గిట్టేదికాదు. అంతేకాకుండా స్వతంత్రంగా ఉన్న సంస్థానాలతో రహస్య సంబంధాలు పెట్టుకొని ఆంగ్లేయులపై కుట్ర పన్నేవారు. ఈ సమస్యను నివారించడానికి లార్డ్‌హేస్టింగ్స్ అధీన సంబంధ నిరోధ విధానాన్ని ప్రవేశపెట్టాడు. వెల్లస్లీ ప్రవేశపెట్టిన సైన్యసహకార పద్ధతికి కొత్తరూపమే ఈ విధానం. ఏ సంస్థానం వారైతే ఈ విధానాన్ని అంగీకరిస్తారో, వారు ఆంగ్లేయుల సర్వసమున్నతత్వాన్ని అంగీకరించాలి. అంతేకాక ఆంగ్లేయుల అనుమతి లేకుండా ఇతర రాజ్యాలతో సంబంధాలు ఏర్పరచుకోరాదు. ఏ సమస్య వచ్చినా దాన్ని ఆంగ్లేయుల ద్వారానే పరిష్కరించుకోవాలి. దీంతోపాటు స్వదేశీ సంస్థానాల రాజుల ఆంగ్లేయుల అధికారానికి పూర్తిగా లోబడి ఉంటామని స్పష్టమైన హామీ ఇవ్వాలి. ఈవిధానం ద్వారా రాజపుత్ర స్థానంలోని జోథ్‌పూర్, ఉదయపూర్, జైపూర్, బికనీర్, కోటా, ప్రతాప్‌ఘర్, జైసల్మీర్ సంస్థానాలు ఆంగ్లేయుల పరమయ్యాయి. లార్డ్‌హేస్టింగ్స్ 1823లో భారతదేశాన్ని వదలివెళ్ళే సమయానికి కేవలం పంజాబ్, సింధు తప్ప దేశాన్ని దాదాపు ప్రతి రాజ్యం కంపెనీ నియంత్రణ కిందకు వచ్చింది. దీంతో మొగల్ సామ్రాజ్య స్థానంలో కంపెనీ సామ్రాజ్యం అవతరించినట్లయింది. అన్నింటికంటే మించి రాజ్య విస్తరణలో మొదట ఆదివాసీలు దౌత్యవేత్తలుగా మాత్రమేతత వ్యవహరించేవారు. కానీ, కాలానుగతిలో వారు తమ హోదా పెంచుకుంటూ వచ్చారు. కొద్దికాలంలోనే వారు కార్యనిర్వహణాధికారులుగాను, నియంత్రణాధికారులుగాను వ్యవహరించసాగారు. బ్రిటిష్ వారికి సర్వసమున్నతత్వం లభించింది. అందువల్లనే వివిధ సంస్థానాల్లోని పాలకులు అన్ని విషయాలలో బ్రిటిష్ ఆదివాసులే నిర్వహిస్తున్నారని, ఆదివాసుల అభిరుచుల, కోరికలకనుగుణంగా స్వదేశీ సంస్థానాల పాలకులు వ్యవహరించవలసి వస్తుంది. పాత్రికేయుడు హెన్రీ మీడ్ అభిప్రాయపడ్డాడు. హేస్టింగ్స్ పద్ధతినే అమల్లోపెట్టిన ఆమ్‌హెర్స్ట్ కలుపుకొన్న కొన్ని సంస్థానాలతో భరత్‌పూర్, కొల్హాపూర్, కుట్టూర్, బర్మాలోని అరకాన్ ముఖ్యమైనవి. హేస్టింగ్స్ తరవాత ఈ విధానాన్ని ఎక్కువగా అమలులో పెట్టినవాడు డల్హౌసీ. ఇతడు భారతదేశంలో 1848 నుంచి 1856 వరకు బ్రిటిష్ గవర్నర్ జనరల్‌గా పనిచేసాడు. సహాయసంధి, ఆధీన సంబంధ నిరోధ విధానంవల్ల స్వదేశీ సంస్థానాలు చాలావరకు ఆంగ్లేయులతో మైత్రిగా ఉన్నా, డల్హౌసీ అది నచ్చక సంస్థానాలను వీలైనంత వరక కంపెనీ పరిపాలనలోకి తేవడానికి ప్రయత్నించాడు. అందులో భాగంగానే అతడు రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, వారసులులేని సంస్థానాలను తన సామ్రాజ్యంలో కలుపుకున్నాడు. సతారా, జైపూర్, సంబల్‌పూర్, భగత్, ఉదయ్‌పూర్, ఝాన్సీ, నాగపూర్‌లను

ఈవిధానం ద్వారానే స్వాధీనం చేసుకోవడం జరిగింది. అలాగే దుష్పరిపాలన అనే నెపంతో డల్హౌసీ 1856లో అయోధ్యను కంపెనీ రాజ్యంలో విలీనం చేశాడు. ఇతడు అనుసరించిన రాజ్యసంక్రమణ విధానం 1857 సిపాయిల తిరుగుబాటుకు కారణమయిందని ఇదివరకే మనం తెలుసుకున్నాం.

1857 తిరుగుబాటుతో ఆంగ్ల - స్వదేశీ సంస్థానాల సంబంధాలలో మూడో దశ ప్రారంభమవుతుంది. దీనికి 'అధీన సంఘం' అని పేరు. కొన్ని స్వదేశీ సంస్థానాలు సిపాయిల తిరుగుబాటును అణచివేయడంలో కీలకపాత్ర పోషించాయి. తిరుగుబాటు తరవాత భారతదేశ పాలనా బాధ్యత కంపెనీ యాజమాన్యం నుంచి, బ్రిటిష్ రాణి విక్టోరియా స్వీకరించింది. దీంతో కంపెనీ పాలన రద్దయి, బ్రిటిష్ ఇండియా బ్రిటిష్ రాజమకుటం కిందివి వచ్చింది. 'యాక్ట్ ఫర్ బెటర్ గవర్నమెంట్ ఫర్ ఇండియా' 1858లోనే అమల్లోకి వచ్చింది. సంస్థాన ప్రభువులతో ఈస్ట్ ఇండియా కంపెనీ చేసుకున్న సంధులన్నింటినీ, బ్రిటిష్ రాజమకుటం గౌరవిస్తుందని ఆ చట్టంలో పేర్కొనబడింది. బ్రిటిష్ రాజ్య విస్తరణ విధానం అంతమైంది. నాటి నుంచి సంస్థానాలు స్వతంత్ర ప్రతిపత్తిగల భాగాలుగా మనడం ప్రారంభించాయి. 1860 ఏప్రిల్ 30న కానింగ్ స్వదేశీ సంస్థానాధీశులకు దత్తత తీసుకొనే హక్కును కల్పించాలని సూచించాడు. ఈ సూచనకు భారత రాజ్యకార్యదర్శి ఆమోదం లభించింది. దీంతో సంస్థానాల పాలకులలో నెలకొన్న భయాందోళనలు తొలగి, బ్రిటిష్ సర్వసమున్నతత్వాన్ని సంతోషంగా అంగీకరించారు. ఈవిధంగా సంస్థానాలన్నీ స్వతంత్ర ప్రతిపత్తిగల భాగాల గా బ్రిటిష్ సామ్రాజ్యంలో అంతర్భాగం అయ్యాయి.

సంస్థానాధీశులకు, ఆంగ్లేయులకు ఉండే సంబంధం పూర్వం సంస్థానాధీశులకు, మొగల్ చక్రవర్తికి ఉండే సంబంధం వంటిదేనని నిరూపించడానికి ఆఖరి మొగల్ చక్రవర్తి బహదూర్‌షా (1862) మరణానంతరం 1876లో విక్టోరియా మహారాణి కైజర్-ఇ-హింద్ బిరుదును స్వీకరించింది. అనంతరం కర్జన్ తన పాలనా కాలంలో (1899-1905) సంస్థానాధీశుల పట్ల కఠినంగా వ్యవహరించాడు. సంస్థానాధీశులందరూ బ్రిటీష్ వారికి పూర్తిగా లోబడి ఉండాలని కూడా అతడు ఆదేశించాడు. కర్జన్ అనుసరించిన కఠిన వైఖరి జాతీయోద్యమం తీవ్రతరం కావడానికి కారణమయింది. అందువల్ల కర్జన్ తరవాత వైస్రాయిలుగా పనిచేసిన మింటో, మాంటెగుల సంస్థానాధీశుల పట్ల సఖ్యతగా ఉండటం ఎంతో మంచిదని, తద్వారా వారి సహాయంతో జాతీయోద్యమాన్ని అణచివేయవచ్చని భావించారు. అందులో భాగంగా సంస్థానాల రాజులు తమ కష్టసుఖాలను ఆంగ్లేయులకు తెలపడానికి సంస్థానాల మండలిని ఏర్పాటుచేయాలని మాంటెగు సూచించాడు. దీనికి అనుగుణంగా లార్డ్ రీడింగ్ కాలంలో 1921 ఫిబ్రవరి 8న సంస్థానాధీశుల మండలి ఏర్పాటయింది. డ్యూక్ ఆఫ్ కానాట్ ఢిల్లీలోని ఎర్రకోటలో ఈ మండలికి ప్రారంభోత్సవం చేశాడు. సంస్థానాధీశుల మండలిలో 120 మంది రాజులు సభ్యులుగా ఉండేవారు. వారిలో 12 మంది సంస్థానాధీశుల నుంచి, మిగిలిన 108 మంది తమ ప్రత్యేక హోదావల్ల

సభ్యత్వం పొందారు. అయితే 327 సంస్థానాలకు ఈ మండలిలో సభ్యత్వం లేదు. కొన్ని పెద్ద సంస్థానాలు ఇందులో చేరలేదు. ఈ మండలి ఏడాదికి ఒకసారి వైస్రాయి ఆధ్వర్యంలో సమవేశమయ్యేది. సంస్థానాధిపతులు బ్రిటిష్ ప్రభుత్వానికి ఒక విన్నపం చేసుకున్నారు. సంస్థానాధీశుల సమస్యలు పరిష్కరించడానికి 1927లో మొదట బట్లర్ కమిటీ, ఆ తరవాత సైమన్ కమీషన్‌ను బ్రిటిష్ ప్రభుత్వం నియమించింది. బట్లర్ కమిటీ తమ నివేదికలో సంస్థానాధిపతులు బ్రిటిష్ దేశంలో సమాన హోదాలో ఉండాలనీ, రాష్ట్ర ప్రభుత్వాల లాగా గవర్నర్ జనరల్ అధికారానికి లోబడి ఉండరాదని సూచించడం జరిగింది. అయితే ఈ సూచనలు అమలుకు నోచుకోలేదు.

## స్వదేశీ సంస్థానాలలో దుష్పరిపాలన

జాతీయోద్యమం ప్రారంభానికి పూర్వం స్వదేశీ సంస్థానాలపైన వారి పరస్పర సంబంధాలపైనా బ్రిటిష్ పాలకులు గట్టి నియంత్రణను నెలకొల్పారు. బ్రిటిష్ ప్రభుత్వం నుంచి లభించిన హామీల వల్ల అనేక సంస్థానాల పాలకులు తమ అధికారాలను ప్రజలపైన విశృంఖలంగా వినియోగించారు. సంస్థానాలలో మితిమీరిన నియంతృత్వం నెలకొంది. ప్రజలకు ప్రాథమిక హక్కులు మృగ్యమయ్యాయి. ప్రజాస్వామ్యమన్నా, ప్రాతినిధ్య సంస్థలన్నా సంస్థానాధీశులకు గిట్టేదికాదు. రాజకీయాలలో మార్పుకు సంఘ సంస్కరణోద్యమాలని ప్రోత్సహించలేదు అనేక సందర్భాలలో వారు వ్యతిరేకులు, ప్రజల నుంచి అధిక భూమిశిస్తు వసూలు చేయడం జరిగింది. ప్రజల నుంచి పీడించి వసూలుచేసిన ధనంతో వారు భోగాలను, వినోదాలకు ఖర్చుచేసేవారు. పరిశ్రమ పెద్దగా అభివృద్ధి కాలేదు. నీటిపారుదల వసతులు, సరైన విత్తనాలు, ఎరువులు లేనందువల్ల వ్యవసాయం దెబ్బతింది. రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రైతుల దుస్థితి జాతీయ వాదులను, బ్రిటీష్ పాలకులను ఆకర్షించింది. స్వదేశీ సంస్థానాల దుస్థితికి బ్రిటిష్ ప్రభుత్వమే ఏదో ఒక రోజు తప్పక సంజాయిషీ చెప్పవలసిన అవసరం వస్తుందని బ్రిటిష్ రాజనీతజ్ఞులు సైతం అంగీకరించారు.

బరోడా, మైసూర్ సంస్థానం వంటి సంస్థానాలు తప్ప మిగిలిన సంస్థానాలన్నింటిలో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రజాస్వామ్యం, పౌరహక్కులు, స్వరాజ్యం బాధ్యతాయుత పాలన వంటి నినాదాలు నిరసనలతో బ్రిటిష్ ఇండియా హోరెత్తిపోతుంటే, క్రమేణా వీటి ప్రభావం సంస్థానాలపై కూడా పడింది. ఫలితంగా ప్రజలలో రాజకీయ జాగృతి రగులుకొంది. హైదరాబాద్, నవ్రిమవాడ్, ఇండోర్, మైసూర్, నవనాగర్, బరోడాలలో ప్రజా మండలలులు ఏర్పడ్డాయి. వాటి కార్యక్రమాలను సమన్వయం చేయడానికి చేసిన ప్రయత్నాలలో భాగంగా 1927 డిసెంబర్‌లో అఖిలభారత సంస్థానాల సదస్సు ఆవిర్భవించింది. ఈ సదస్సును విజయవంతం చేయడానికి బల్వంతరాయ్ మెహతా, మనిలాల్ కోఠారి, జి.ఆర్. అభయంకర్‌లు కృషిచేసారు. దీంతో సంస్థానాలలో నూతన గాలులు వీచడం ప్రారంభించాయి.

## సంస్థానాలపట్ల కాంగ్రెస్ విధానం

గాంధీ సలహామేరకు భారత జాతీయ కాంగ్రెస్ మొదట్లో స్వదేశీ సంస్థానాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా ఉంది. 1925లో జరిగిన కథియవాడ్ రాజకీయ సదస్సులో అధ్యక్షోపన్యాసం చేస్తూ గాంధీజీ "సంస్థానాలకు, బ్రిటిష్ ప్రభుత్వానికి మధ్య ఉన్న సంబంధాల్లో ఏవిధంగా జోక్యం లేదో, అదేవిధంగా సంస్థానాల పాలకులకు, పాలితులకు మధ్య ఉన్న సంబంధాల్లో కూడా కాంగ్రెస్‌కు జోక్యం ఉండదు" అని ప్రకటించాడు. బ్రిటిష్ ఇండియాకు స్వయంపాలన ఏర్పడితే చాలుననే భావంతో గాంధీ ఉన్నట్లు దీనివల్ల తెలుస్తుంది. అయితే 1929 నుంచి కాంగ్రెస్ అధ్యక్షుడు జవహర్‌లాల్ నెహ్రూ ఆధ్వర్యంలో కాంగ్రెస్ వైఖరి మారింది. స్వదేశీ సంస్థానాల్లోని ప్రజాస్వామ్య ఉద్యమాలపట్ల కాంగ్రెస్ ఆసక్తి కనబరచసాగింది. "మిగిలిన భారతదేశంతో సంబంధం లేకుండా, స్వదేశీ సంస్థానాలు మనలేవు. సంస్థానాల భవితవ్యాన్ని నిర్ణయించేహక్కు, ఆయా సంస్థానాల ప్రజలకే ఉంటుంది" అని లాహోర్ కాంగ్రెస్‌లో నెహ్రూ పేర్కొన్నాడు. ఒక పక్క స్వయంపాలన, స్వాతంత్ర్యంకోసం ఉద్యమిస్తున్న కాంగ్రెస్, స్వదేశీ సంస్థానాల్లోని ప్రజలు కూడా అవే ఆశయాలకోసం చేసే ఆందోళనలపట్ల అనుకూల వైఖరి చూపకపోవడం ద్వంద్వ నీతి అవుతుందని కూడా కాంగ్రెస్ భావించింది. అప్పటి నుంచి సంస్థానాల్లోని ప్రజాఉద్యమంపట్ల కాంగ్రెస్ ఆసక్తి కనబరచసాగింది. సంస్థానాలపట్ల కాంగ్రెస్ వైఖరిలో వచ్చిన మార్పు 1938లో జరిగిన హరిపురం కాంగ్రెస్ మహాసభలో బాగా కనిపించింది. సంస్థానాలను భారతదేశంలో భాగంగా పరిగణిస్తామని, బ్రిటిష్ ఇండియాకు ఏవిధమైన రాజకీయ, ఆర్థిక, సాంఘిక స్వేచ్ఛలు కావాలని కోరుకుంటున్నామో, అవే సంస్థానాలకు కూడా కావాలని డిమాండ్ చేస్తున్నామని మహాసభ తీర్మానించింది. హరిపురం కాంగ్రెస్ తీర్మానం తరవాత కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు స్వదేశీ సంస్థానాలలో ప్రవేశించి, ఆందోళనలు ప్రారంభించారు. ఈ పరిస్థితుల కారణంగా గాంధీ వైఖరిలో కూడా మార్పు వచ్చింది. స్వదేశీ సంస్థానాల ప్రజలలో రాజకీయ చైతన్యం ద్విగుణీకృతమైందనీ, అందువల్ల సంస్థానాలలో బాధ్యతాయుత పాలన ఏర్పడకపోతే అనూహ్య పరిణామాలను సంభవిస్తాయనీ గాంధీజీ పాలకులను హెచ్చరించాడు. అంతేకాక సంస్థానాల ప్రజలతో రాజకీయ జాగృతి ఏర్పడనంతవరకు కాంగ్రెస్ జోక్యం చేసుకోకుండా ఉండటం సబబేనని, కానీ సంస్థానాల్లో ప్రతిచోటా ప్రజా ఉద్యమాలు ఉప్పొంగుతుంటే, పట్టీ పట్టనట్లు ఊరుకోవడం కేవలం పిరికితనం అవుతుందని, బ్రిటిష్ ఇండియా, సంస్థానాల మధ్య సరిహద్దులను తొలగించే రోజు దగ్గర పడిందని కూడా గాంధీ స్పష్టం చేశాడు. దీంతో సంస్థానాల ప్రజలలో ఉద్యమ స్ఫూర్తి బలపడింది.

భారత రాజ్యాంగ నిర్మాణానికి ప్రాతిపదిక అయిన 1935 రాజ్యాంగ చట్టంలో దేశంలో సమాఖ్య ప్రభుత్వం ఏర్పడాలని నిర్ధారించడం జరిగింది. ఈ సమాఖ్యతో సంస్థానాలకు రాజ్యాంగ బద్ధంగా బ్రిటిష్ ఇండియాతో సంబంధం ఉండాలి. దీనికిగాను సంస్థానాలు కేంద్రశాసనసభకు

ప్రతినిధులని పంపించాలని, సంస్థాన ప్రతినిధులు సంస్థానాల పాలకులతో నామినేట్ చేయబడిన వారై ఉండాలని నిర్ణయించారు. కేంద్ర శాసనసభలో నామినేట్ చేయబడిన వారి సంఖ్య 1/3వ వంతు. వారందరు పాలకులతో నామినేట్ చేయబడినవారైనందువల్ల కన్జర్వేటివ్ పక్షంగా తయారై, ప్రజాప్రతినిధుల పురోగమన విధానాన్ని అడ్డుకుంటారని బ్రిటిష్ ప్రభుత్వం ఆశించింది. అయితే సంస్థానాల తరపున కేంద్ర శాసనసభలో పాల్గొనే ప్రతినిధులు ప్రజాప్రతినిధులై ఉండాలేగాని, పాలకులచేత నామినేట్ చేయబడేవారు కాకూడదని కాంగ్రెస్ స్పష్టం చేసింది. 1935 చట్టం ప్రకారం ఏర్పడిన కేంద్ర సమాఖ్య శాసనసభలో 250 మంది సభ్యులుండగా సంస్థానాధీశులక 125 స్థానాలున్నాయి. కౌన్సిల్ ఆఫ్ స్టేట్‌లో 260 స్థానాలలో, 104 స్థానాలు సంస్థానాధీశులకు ఇవ్వడం జరిగింది. అంతేకాకుండా సంస్థానాలు సమాఖ్యలు చేరవచ్చు, లేకపోతే పూర్వంలాగా బ్రిటిష్ సార్వభౌముడితో ప్రత్యేక సంబంధం కలిగి ఉండవచ్చునని చట్టం ప్రస్తావించింది. దీంతో సంస్థానాధిపతుల ఆనందానికి అవధుల్లేకుండాపోయింది. 1935 చట్టం ప్రకారం 1937లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. అనేక రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి.

బ్రిటిష్ ఇండియాలో కాంగ్రెస్ సాధించిన విజయం సంస్థాన ప్రజలకు ఉత్సాహాన్ని కలిగించింది. మైసూర్, తిరుచానూర్, కాశ్మీర్, హైదరాబాద్, మియాపూర్, రాజ్‌కోట్, ఒరిస్సా సంస్థానాల్లో శాంతిభద్రతల సమస్యలు జటిలమైంది. 1939లో రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. స్వదేశీ సంస్థానాలు ఎంతో విశ్వాసంతో ఆంగ్లేయుల తరపున యుద్ధంలో పాల్గొన్నాయి. యుద్ధానంతరం తమ స్వాతంత్ర్యం లభిస్తుందని వారు భావించారు. ఈ పరిస్థితుల్లో 1942 ఆగస్టు 8న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ బొంబాయిలో సమావేశమై, క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపునిచ్చింది. ఈ ఉద్యమంలో సంస్థాన ప్రజలు పాల్గొని బాధ్యతాయుత పాలన ఏర్పరచాలని సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయాలని డిమాండ్ చేయడం జరిగింది.

1921లో ఏర్పడిన ఛాంబర్ ఆఫ్ ప్రిన్సెస్ 1944 వరకు కొనసాగింది. దీనికి భోపాల్ నవాబు ఛాన్సిలర్‌గా వ్యవహరించేవాడు. ఇతడు సంస్థాన పాలకులను అటు ముస్లిం లీగ్‌తోను, ఇటు కాంగ్రెస్‌తోను కలవకుండా దూరంగా ఉంచుతూ, సంస్థానాలను తృతీయశక్తిగా రూపొందించాలని భావించాడు. 1946లో భారత రాజ్యాంగ పరిషత్ సమావేశమైంది. వేచి చూసే పద్ధతి అవలంబించమని, త్వరపడి ఢిల్లీలో సమావేశమవుతున్న రాజ్యాంగ పరిషత్‌కు ప్రతినిధులను పంపించవద్దని, తోటి పాలకులకు భోపాల్ నవాబు సలహా ఇచ్చాడు. అయితే బికనీర్ మహారాజు సంస్థాన పాలకులకు ఒక లేఖ రాస్తూ, వేచిచూసే పద్ధతికి స్వస్తి చెప్పాలని, భారతదేశంలో గట్టి కేంద్ర ప్రభుత్వం ఏర్పడటం వాంఛనీయమని తెలియజేశాడు. జవహర్‌లాల్ నెహ్రూ సంస్థానాధీశులను వారి తరపున ప్రతినిధులను పరిషత్తుకు పంపమని, వారి సలహాలను కూడా తీసుకొని రాజ్యాంగాన్ని రూపొందిస్తే సంస్థానాలకు, వాటిలోని ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని విజ్ఞప్తి చేశాడు. నెహ్రూ విజ్ఞప్తి మేరకు బరోడా, పాటియాలా, జైపూర్, కొచ్చిన్, రీవా

సంస్థానాధీశులు తమ ప్రతినిధులను రాజ్యాంగ పరిషత్ సమావేశానికి పంపారు. ఆ తరవాత ఒక్కటిగా పరిషత్తులో చేరాయి. భారత్, పాకిస్తాన్‌లు స్వతంత్ర దేశాలుగా అవతరిస్తే, బ్రిటిష్ అధికారం రద్దవుతుంది కాబట్టి, రాజ్యాంగ సమితితో సంస్థానాలు సహకరించి, తమ సంస్థానాలలో పాలకులను మెరుగుపరచి, సమాఖ్యలో చేరవచ్చునని కాబినేట్ మిషన్ కూడా సూచించింది. అంతేకాకుండా సంస్థానాలకు 10 లక్షల జనాభాకు ఒక సభ్యుడు చొప్పున 93 మందిని రాజ్యాంగ సమితికి పంపడానికి అధికారాన్నిచ్చింది. అయితే సంస్థానాలు తమ అధికారాన్ని, వారసత్వ సూత్రాన్ని రక్షించుకోవాలనే తపన చూపారేగాని, తమ సంస్థానాలలో బాధ్యతాయుత ప్రభుత్వాలు నెలకొల్పి, ప్రజాభిప్రాయాన్ని చూరగొనే ధోరణిలో ఆలోచన చేయలేదు.

బరోడా మహారాజు, మరో 8 మంది సంస్థానాలు రాజ్యాంగ పరిషత్‌లో చేరిన మొదటి సంస్థానాధీశులు. జూలైలో మైసూర్, గ్వాలియర్ మహారాజులతో సహా 37 మంది సంస్థానాధిపతులు చేరారు. భోపాల్ నవాబు స్వాతంత్ర్యాన్ని నిలుపుకోవాలని భావించాడు. అలాగే తిరువాన్కూర్ సంస్థానం కూడా అదే ధోరణిని అవలంభించింది.

లార్డ్ మౌంట్‌బాటెన& సంస్థానాధీశులతో 1947 జూలై 25న సమావేశమై ఇండియా, పాకిస్తాన్‌లలో చేరడం తప్ప వేరే మార్గం లేదని చెప్పాడు. అంతేకాక విలీన పత్రాలపై ఆమోదం తెలుపుతూ సంతకాలు చేయవలసిందిగా సలహా కూడా ఇచ్చాడు. ఈ పరిస్థితులలో కూడా కొన్ని సంస్థానాలు ప్రత్యామ్నాయాలు వెదకడం ప్రారంభించాయి. జిన్నా, ముస్లింలీగ్‌తో సంప్రదింపులు జరిపాయి. వాటిలో జోథ్‌పూర్, జైసల్మార్, తిరువాన్కూర్ ముఖ్యమైనవి. ఇండోర్, ధోల్‌పూర్ సంస్థానాలు కూడా విలీనానికి పేచీపెట్టాయి. కానీ వైశాయి దృఢవైఖరి అవలంభించడంతో సమస్య పరిష్కారమైంది. 1947 ఆగస్టు 15 నాటికి హైదరాబాదు, జంఘడ్, కాశ్మీర్ సంస్థానాలు తప్ప మిగిలిన సంస్థానాలన్నీ భారతదేశంలో విలీనమయ్యాయి. సర్దార్ వల్లభాయ్ పటేల్ తన చాకచక్యంతో వాటిని కూడా విలీనం చేయడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు.

## సంస్థానాల విలీనీకరణ

స్వాతంత్ర్యానికి పూర్వం భారతదేశంలో రెండు రకాల ప్రాంతాలుండేవి. కొన్ని బ్రిటిష్ పాలనలో ఉండగా, మరికొన్ని స్వదేశీ సంస్థానాల అధిపతుల ఆధీనంలో ఉండేవి. స్వదేశీ సంస్థానాల పాలకులు విదేశీ వ్యవహారాలు, శాంతిభద్రతలు, రవాణా వంటి అంశాలలో మాత్రమే బ్రిటిష్ ఇండియాకు లోబడి, మిగిలిన విషయాలలో పూర్తి స్వాతంత్ర్యంతో తమ ఇష్టానుసారంగా నడుచుకొనేవి. అయితే ఈ సంస్థానాలు బ్రిటిష్ పాలకులు దేశం విడిచి వెళ్ళగానే, భారతదేశంలో చేరడమా లేదా స్వతంత్ర్యంగా ఉండటమా అనే ఆలోచన ప్రధానంగా వ్యాప్తిలోకి వచ్చింది. స్వతంత్రంగా వ్యవహరించడం తమకు లాభదాయకం కాదని అనేక సంస్థానాలు భావించాయి. అందువల్ల సంస్థానాలన్నీ స్వతంత్ర భారతదేశంలో చేరినా జునాఘడ్, కాశ్మీర్, హైదరాబాద్ స్వతంత్రంగా ఉండిపోవాలని నిర్ణయించుకున్నాయి.

బ్రిటిష్ ఇండియా భారతదేశం, పాకిస్తాన్ దేశాలుగా 1947లో విడిపోయేనాటికి దేశంలో దాదాపు 562 సంస్థానాలుండేవి. ఈ సంస్థానాలపై ఆంగ్లేయుల అధికారం అంతంకావడంతో వాటి భవిష్యత్ కార్యక్రమాన్ని ఆయా సంస్థానాధిపతులే నిర్ణయించుకోవాలని లార్డ్ మౌంట్ బాటెన్ రూపొందించిన పథకం నిర్దేశించింది.

సంస్థానాల్లో విస్తీర్ణం రీత్యా అత్యంత పెద్దది కాశ్మీర్. జనాభా దృష్ట్యా పెద్ద సంస్థానం హైదరాబాద్. మైసూర్, తరువాన్కూర్ సంస్థానాలు జనాభా రీత్యా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. కొన్ని చిన్న సంస్థానాల్లో 10 మంది జనాభా మాత్రమే ఉంది. ఈ సంస్థానాల విస్తీర్ణం దాదాపు 760000 చదరపు మైళ్ళు. మొత్తం జనాభా 93000000. లార్డ్ మౌంట్ బాటెన్ సంస్థానాధిపతులందర్నీ సమావేశపరచి భారతదేశంలోగాని, పాకిస్తాన్‌లోగాని చేరడం తప్ప మరే మార్గం వారికి లేదని స్పష్టం చేశాడు. దీనికి భిన్నంగా కొందరు సంస్థానాధీశులు మహ్మద్ ఆలీ జిన్నాతో సంప్రదింపులు ప్రారంభించారు. వారిలో జోద్‌పూర్, జైపూర్ సంస్థానాలు; తిరువాన్కూర్ ప్రధాని రామస్వామి అయ్యర్ ఉన్నారు. కానీ, చివరకు వైశ్రాయి కఠిన వైఖరి అవలంబించడంతో సమస్య పరిష్కారమైంది. అంతేకాక సర్దార్ వల్లభాయ్ పటేల్ అనుసరించిన రాజనీతిజ్ఞతవల్ల సంస్థానాల విలీనీకరణ విజయవంతమైంది. సంస్థానాల విలీనీకరణను వివరిస్తూ పెర్సివల్ స్పీర్ "కొన్నిసార్లు ఇది నిర్దాక్షణ్యంగా ఉండేది. అయినప్పటికీ ఈ కార్యక్రమం దేశ వ్యవహారాల కార్యదర్శి వి.పి. మీనన్ చతురతవల్ల ఆమోదయోగ్యమైంది. ఆయన ఇంత నమ్మకంగా సంస్థానాలు పోవడంలో లాభాలు వివరించారంటే చివరికి కాశ్మీర్ తప్ప ఒక్క హైదరాబాదు మాత్రమే నిజమైన సమస్యగా మిగిలింది" అని పలికాడు.

సంస్థానాల పాలనా నిర్వహణకోసం 1947లో ఒక మంత్రిత్వశాఖను ఏర్పాటుచేయడం జరిగింది. దీనికి సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వం వహించాడు. పటేల్‌కు, సంస్థానాధిపతులకు మధ్య జరిగిన అనేక చర్చలు, కృషి ఫలితంగా స్వదేశీ సంస్థానాలు భారత సమాఖ్యలో చేరడానికి ఒక ప్రణాళిక సిద్ధమైంది. 1947 ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం ముందే అనేకమంది సంస్థానాధిపతులు భారతీ డొమీనియన్‌లో చేరుతూ విలీనీకరణ పత్రం మీద సంతకాలు చేశారు. అయితే కొంతమంది సంస్థానాల పాలకులు మాత్రం వెంటనే సంతకం చేయలేదు. దాంతో పటేల్, వి.పి. మీనన్‌లు 'సమైక్యతకు భంగం కలిగే పక్షంలో భారతదేశం ఉదారంగా ఉండజాలదు" అని స్పష్టం చేయడం జరిగింది. ఈ దృఢ సంకల్పం దేశ సమైక్యత విషయంలోను, హైదరాబాద్, ఒరిస్సా, భోపాల్, తిరువాన్కూర్, కాశ్మీర్ వంటి సంస్థానాలలో రూపొందిన భూస్వామ్య వ్యతిరేక ఉద్యమాలపట్ల భారత ప్రభుత్వం అనుసరించిన స్పష్టమైన వైఖరి సంస్థానాధిపతులు విలీనీకరణ పత్రంపై త్వరపడి సంతకం చేయడానికి దోహదం చేశాయి. 1947 నాటికి దాదాపు 554

సంస్థానాలు భారతదేశంలోను, మిగిలినవి పాకిస్తాన్‌లోను విలీనమయ్యాయి. జునాగడ్, కాశ్మీర్, హైదరాబాద్, సంస్థానాలు తప్ప మిగిలిన సంస్థానాలన్నీ ఎలాంటి బలప్రయోగం లేకుండానే ఇండియన్ యూనియన్‌లో చేరాయి. ఆ మూడు సంస్థానాలపై, బలప్రయోగ సిద్ధాంతాన్ని అవలంబించి, వాటిని కూడా భారతదేశంలో విలీనం చేయడం జరిగింది.

**జునాఘడ్ :** కథియవార్ ద్వీపకల్పంలోని సంస్థానాలలో జునాఘడ్ ప్రసిద్ధమైంది. ఈ సంస్థానంలో 75 శాతం ప్రజలు హిందువులు. ప్రసిద్ధిగాంచిన సోమనాథ్ దేవాలయంతోపాటు, అనేక హిందూ దేవాలయాలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. సంస్థానం మొత్తం విస్తీర్ణం 3337 చదరపు మైళ్ళు. భౌగోళికంగా పరిశీలిస్తే జునాఘడ్ ఏక ఖండంకాదు. దీనికి చెందిన కొన్ని ప్రాంతాలు గోండాల్, భావనగర్, నవనగర్ వంటివి సంస్థానాలలో ఉన్నాయి. ఇండియన్ యూనియన్‌కు చెందిన అనేక ప్రాంతాలు జునాఘడ్ సంస్థానంతో చుట్టబడి ఉన్నాయి. సంస్థానానికి చెందిన రైల్వేలను భారత ప్రభుత్వమే నిర్వహిస్తూ ఉండేది. పాలకుడైన నవాబ్ సర్ మహ్మద్ రసూల్‌ఖాన్ విచిత్ర స్వభావం కలవాడు. ఇతడికి కుక్కలంటే మహా ఇష్టం. వందల సంఖ్యలో కుక్కలను పెంచేవాడు. వాటికి పెళ్ళిళ్ళు కూడా జరిపించేవాడు. సంస్థానంలోని ప్రజలు భారత సమాఖ్యలో చేరాలని, తద్వారానే తమ ప్రయోజనాలు కాపాడబడతాయని ఆశించారు. కానీ, నవాబు మాత్రం జునాఘడ్ పాకిస్తాన్‌లో చేరుతుందని ప్రకటించాడు. ఈ ప్రకటన సంస్థానంలో ఆందోళనలకు దారితీసింది.

జునాఘడ్ సంస్థానం ఉద్యోగాలలో జరిగిన కొన్ని మార్పులవల్ల నవాబ్ అసలు నైజం ముందుగానే బహిర్గతమైంది. ఇతడు ముస్లింలీగ్‌కి చెందిన సర్‌షా నవాబ్ భుట్టోను పిలిచి మంత్రిపదవి కట్టబెట్టాడు. భుట్టో 1947 మే లో పదోన్నతి పొందాడు. దీనివల్ల జునాఘడ్ సంస్థానం పాకిస్తాన్‌లో చేరే ప్రమాదం ఉందని నవనాగర్, ధ్రాస్ గోద్రా పాలకులు ముందుగానే భారత విదేశాంగ కార్యదర్శి వి.పి. మీనన్‌ను హెచ్చరించారు. మీనన్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసే పత్రాలను నవాబుకు పంపాడు. 1947 ఆగస్టు 12 వరకు నవాబు నుంచి ఎలాంటి సమాధానం రాకపోగా, ఈ విషయం తమ ప్రభుత్వ పరిశీలనలో ఉందని భుట్టో తెలిపాడు. నవాబ్ ఎత్తుగడలను పరిశీలించిన మీదట ప్రజల్లో ఆందోళన ప్రారంభమైంది. జునాఘడ్ పాకిస్తాన్‌లో చేరితే భౌగోళిక పరిస్థితులు దానికి అనుకూలంగాలేవని, జనాభాలో అధిక శాతం హిందువులయినందువల్ల నవాబ్ చేసే కార్యక్రమాలకు వ్యతిరేకంగా చివరివరకు పోరాటం చేస్తానని, కథియవాడ్‌లో జునాఘడ్‌కు ఉన్న ప్రాముఖ్యం అంతరిస్తుందని, వ్యాపార రంగంలో కూడా అది పూర్తిగా దెబ్బతింటుందని ప్రజలు నవాబ్‌ను హెచ్చరించారు. సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేయడానికి మీనన్ చేసిన చివరి ప్రయత్నం కూడా విఫలమైంది. నవాబు చర్యతో విసుగు చెందిన జునాఘడ్‌లోని కాంగ్రెస్ నాయకులు యు.ఎన్. దేబర్, బల్వంత్‌రాయ్ మెహతా,

శ్యామల్‌దాస్ గాంధీ, రసిక్‌లాల్ ఫరీఖ్‌లు ఉద్యమించడానికి సన్నాహాలు ప్రారంభించారు. కఠినమైన వైఖరి అవలంభించకపోతే ప్రభుత్వ ప్రతిష్ట అడుగంటుతుందని, స్వతంత్ర రాజ్యం కావాలని కలలుకంటున్న హైదరాబాదు నిజాంకు జునాఘడ్ పాకిస్తాన్‌లో విలీనం కావడం ప్రోత్సాహకారి కాగలదని కాంగ్రెస్ నాయకులు భారతప్రభుత్వాన్ని హెచ్చరించారు. శ్యామల్‌దాస్ జునాఘడ్‌లో పోటీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడానికి సిద్ధమని ప్రకటించాడు. బొంబాయి నుంచి రాజ్‌కోట్ వరకు జైత్రయాత్రను కూడా అతడు జరిపాడు. ఈ పరిస్థితులలో జునాఘడ్ ప్రాంతంలో భారత సైన్యాన్ని మోహరింపచేయడంతో చేసేదిలేక నవాబ్ కుటుంబ సభ్యులతో పాకిస్తాన్ పారిపోయాడు. పాలనాయంత్రాంగాన్ని పునర్ వ్యవస్థీకరించడానికి ప్రభుత్వం ఎస్.డబ్ల్యూ. షివేశ్వరార్కర్‌ను నియమించింది. నవంబర్ 13న సర్దార్ పటేల్ సంస్థానాన్ని సందర్శించాడు. సంస్థానంలో సాధారణ పరిస్థితులు ఏర్పడిన తరవాత భారత ప్రభుత్వం ప్రజాస్వామ్య సాంప్రదాయానికి అనుగుణంగా జునాఘడ్‌లో ప్రజాభిప్రాయసేకరణ చేస్తామని ప్రకటించింది. అందులో భాగంగా 1948 ఫిబ్రవరి 20న ప్రజాభిప్రాయసేకరణ జరిగింది. ఎక్కువ మంది భారతదేశంలో విలీనం కావడానికి అనుకూలంగా ఓటు వేశారు. ప్రజాభిప్రాయం మేరకు జునాఘడ్ సంస్థానం 1948 ఫిబ్రవరిలో భారతదేశంలో విలీనమైంది.

## హైదరాబాదు

దేశంలోని సంస్థానాలన్నింటిలో పెద్ద సంస్థానం హైదరాబాద్. దీని విస్తీర్ణం 83 వేల చదరపు మైళ్ళు. జనాభా ఒక కోటి అరవై లక్షలు. ఇక్కడి జనాభాలో 85శాతం హిందువులు. ఆనాటిసంస్థానాధిపతి నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ ముస్లిం. హైదరాబాదు నగరాన్ని మినహాయిస్తే మిగిలిన సంస్థానంలో ఉర్దూ మాట్లాడేవారు అరుదు. కానీ, నిజాం ఉర్దూను అధికార భాషగా చేశాడు. ప్రాథమిక స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు ఉర్దూ బోధనా మాధ్యమం. సంస్థానంలో నిరక్షరాస్యుల సంఖ్య 94 శాతంగా ఉండేది. నిజాం నవాబు మతోన్మాదం అతడి పరిపాలనలో కొట్టొచ్చినట్లు కనబడేది. మొత్తం జనాభాతో ముస్లింల శాతం కేవలం 12 మాత్రమే. అయినప్పటికీ ఉన్నతోద్యోగాలలో వారి శాతం 90 వరకు ఉండేది. నిజాం అండతో వారు నిరంకుశంగా వ్యవహరించేవారు. ఇక పరిపాలనా వ్యవస్థ పరిశీలిస్తే మధ్యయుగాలనాటి నిరంకుశత్వాన్ని పోలి ఉంది. పత్రికా స్వాతంత్ర్యం అసలు లేదు. పేరుకుమాత్రం ఒక శాసనసభ ఉండేది. కానీ, దాని సభ్యులందర్నీ నవాబ్ నామినేట్ చేసేవాడు. ప్రధానమంత్రిని కూడా అతడే నియమించేవాడు. సామాన్య ప్రజల పరిస్థితి దయనీయంగా ఉండేది. ప్రభుత్వోద్యోగులు, పోలీస్ అధికారులు ప్రజలను క్రూరంగా హింసించేవారు. జాగీర్దార్లు, ఇజారాదార్లు, ముక్తేదార్లు, అగ్రహారీకులు ప్రజలను వెట్టిచాకిరికి గురిచేసేవారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో హైదరాబాదు

సంస్థానంలోని తెలంగాణాలో ఆహార కొరత ఏర్పడింది. ధాన్యసేకరణ కోసం ప్రభుత్వం అనేక ఫర్మానాలు జారీచేసింది. ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకు రైతులు లెవిధాన్యాన్ని అమ్మవలసి వచ్చేది. లెవీధాన్య సేకరణలో ఎన్నో అవకతవకలు జరిగాయి. ఈ కారణంగా సంస్థానంలోని ప్రజలలో అసంతృప్తి విపరీతంగా పెరిగింది. అనేక తరాలుగా నిర్బంధ వెట్టిచాకిరి, దుర్భర నిజాం ఫ్యూడల్ పాలనలో మగ్గిపోయిన ప్రజానీకంలో 1920 నుంచి కొద్దికొద్దిగా రాజకీయ చైతన్యం ప్రారంభమైంది. దీనికి అంకురార్పణ చేసింది ఆంధ్రమహాసభ. దీని స్థాపన 1930లో జరిగింది. ఈ సభకు ప్రజలు అభిమానంతో సంఘం అని పిలుచుకున్నారు. ఆంధ్ర మహాసభ మొదట తెలుగు భాష, సంస్కృతుల వికాసాలకు ప్రారంభమైనప్పటికీ, తరవాతకాలంలో అది వెట్టిచాకిరి, ఫ్యూడల్ వ్యతిరేక పోరాటానికి బీజాలు నాటింది.

ఆంధ్రమహాసభలాగానే సంస్థానంలో ఇతర ప్రాంతాల ప్రజల ప్రయోజనార్థం మహారాష్ట్రులకు మహారాష్ట్ర పరిషత్ (1986), కన్నడిగులకు (1939) కన్నడ భాష పరిషత్‌లు ఏర్పడ్డాయి. వీటి కృషివల్ల హైదరాబాద్ సంస్థానంలో జాతీయ భావం క్రమంగా అభివృద్ధి చెందిది. బాధ్యతాయుత పాలన ఏర్పడాలనే నినాదం సంస్థానంలో మారుమోగింది. ఇది 1938లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ స్థాపనకు దారితీసింది. హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్ స్థాపించినప్పటి నుంచి, అది ప్రభుత్వ దాడికి గురయింది. నిజాం ప్రభుత్వం దాన్ని 1938లో నిషేధిస్తూ ఫర్మానా జారీచేసింది. ఈ నిషేదానికి వ్యతిరేకంగా స్వామి దయానంద తీర్థనాయకత్వంలో స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహాన్ని ప్రారంభించింది. అందులో భాగంగా హైదరాబాద్ నగరంలోని సుల్తాన్‌బజార్ నుంచి ఒక ఊరేగింపు ప్రారంభమై కోఠీ సమీపానికి చేరుకుంది. ప్రదర్శకులు సత్యాగ్రహ ప్రతిజ్ఞ చేశారు. దీంతో నిజాం వ్యతిరేక పోరాటం ఊపందుకుంది. హైదరాబాద్ సంస్తానం బారతదేశంలో విలీనం కావాలని, సంస్థానంలో ప్రజాపాలన ఏర్పడాలని నినాదాలు జోరందు కున్నాయి. ఇదే సమయంలో విద్యార్థులు కూడా వందేమాతరం ఉద్యమాన్ని ప్రారంభించారు. హాస్టళ్ళలో వందేమాతరం గీతం పాడరాదని నిజాం శాసించాడు. దీనికి వ్యతిరేకంగా హైదరాబాద్ కళాశాల విద్యార్థులు ఉద్యమాన్ని ప్రారంభించాడు. 1942 ఆగస్ట్‌లో క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమైంది. యువకులు ఉత్సాహంతో ఉద్యమంలో పాల్గొన్నారు.

రెండో ప్రపంచ యుద్ధం తరవాత దేశ స్వాతంత్ర్యం కనుచూపు మేరలోకి వచ్చింది. 1947 జూన్ 12న నిజాం ఒక ప్రకటనచేస్తూ, బ్రిటిష్ సమున్నతత్వం అంతంకాగానే హైదరాబాద్ సంస్థానం స్వతంత్ర దేశంగా రూపొందుతుందని ప్రకటించాడు. ఈ ప్రకటన నిజాం సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసే ఆలోచనలో లేదని స్పష్టమైంది. దీంతో స్టేట్ కాంగ్రెస్ నాయకత్వంలో నిజాం, హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనను

తీవ్రం చేసింది. ఫలితంగా హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావాలనే నినాదం పల్లెలు, పట్టణాలలో మారుమోగింది. లాఠీచార్జీలు, అరెస్టులు, సంస్థానంలో సర్వసాధారణం అయ్యాయి. జాతీయ పతాకం ఎగరవేయడం నిషేధించబడింది. ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న స్వామిరామానంద తీర్థను, అతడి అనుచరులను నిజాం ప్రభుత్వం అరెస్ట్ చేసింది. నిజాం ప్రభుత్వం ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ సుల్తాన్ బజార్‌లో వందమంది విద్యార్థులు జాతీయపతాకాన్ని ఎగరవేయడం జరిగింది. కాంగ్రెస్ సాగిస్తున్న ఈ ఉద్యమానికి ఆంధ్రమహాసభ, కమ్యూనిస్ట్ పార్టీలు సహకారాన్ని అందించాయి.

1927లో ముస్లింలు ప్రయోజనాలను రక్షించడానికి ఇత్తెహాద్-ఉల్-ముసల్మాన్ అనే పార్టీని సాదర్ ఆలీజంగ్ స్థాపించాడు. దీని సభ్యులు తరవాత కాలంలో రజాకార్లుగా పిలవబడి, ప్రత్యేక దుస్తులు ధరించేవారు. 1946 నాటికి ఖాసీం రజ్వీ రజాకార్ల దళాధినేతగా నియమించడం జరిగింది. నిజాం అతడి చేతిలో కీలుబొమ్మగా మారాడు. భారత ప్రభుత్వం అనేక సమస్యలతో సతమతమవుతుందని, హైదరాబాద్ సంస్థానానికి దానివల్ల ఎలాంటి ముప్పు ఉండదని, కాబట్టి విలీనాన్ని తిరస్కరించమని అతడు నిజాంకు సలహా కూడా ఇచ్చాడు. అంతేకాక సర్దార్ పటేల్‌తో ప్రజాభిప్రాయ సమస్యే లేదని, హైదరాబాద్ తన స్వాతంత్ర్యాన్ని ఎలాంటి పరిస్థితులలోను వదులుకోదని అందుకు యుద్ధానికైనా సిద్ధమేనని పెడసరంగా మాట్లాడాడు. విలీనీకరణ తప్ప మరేవిధంగానైనా భారత్‌తో అనుబంధాన్ని ఏర్పరచుకోవడానికి తాను సిద్ధమని భారత ప్రభుత్వానికి తెలియజేస్తూనే నిజాం మరోవైపు జిన్నాతో కూడా సంప్రదింపులు ప్రారంభించాడు.

ఇలాంటి అవాంతరాలు ఎన్ని ఎదురైనప్పటికీ ఇండియన్ యూనియన్, హైదరాబాద్ సంస్థానాల మధ్య సంప్రదింపులు కొనసాగాయి. తుదకు 1947 సెప్టెంబర్ 29న నిజాం ప్రభుత్వం ఇండియన్ యూనియన్‌తో యథాతథ ఒడంబడిక కుదుర్చుకుంది. ఈ ఒడంబడిక ప్రకారం సంస్థానం ఆంతరంగిక విషయాలలో భారత ప్రభుత్వం జోక్యం చేసుకోకూడదు. సంస్థానంలో మత సామరస్యాన్ని, శాంతిభద్రతలను కాపాడాలని భారత ప్రభుత్వం సహకారాన్ని అందిస్తుంది. నిజాం విదేశాలలో రాయబారులను నియమించుకోకూడదు. కానీ, ఏజెంట్స్ జనరల్స్‌లను నియమించుకోవచ్చు. ఒక ఏడాది తరవాత ఇరుపక్షాలు శాశ్వత ఒడంబడిక కుదుర్చుకుంటాయి. అయితే ఈ ఒప్పందం విలీనీకరణకు మార్గాన్ని సుగమం చేయగలదని భారత ప్రభుత్వం భావించగా, ఒడంబడిక హైదరాబాద్ సంస్థానం స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకోవడానికి వీలు కల్పించే వ్యవధిని ఇచ్చిందని నవాబు భావించాడు. ఈ సంవత్సర కాలంలో నవాబు సంస్థానాన్ని స్వతంత్ర రాజ్యంగా ప్రకటించుకోవడానికి చేయగలిగిందంతా చేశాడు.

ఒప్పందాన్ని అనుసరించి భారత ప్రభుత్వ ప్రతినిధిగా కె.ఎం. మున్షీ నియమించడం జరిగింది. అయితే ఆయనకు వసతి సదుపాయం కల్పించకుండా నిజాం ప్రభుత్వం విరక్త

ధోరణిని ప్రదర్శించింది. అంతేకాక భారత సైన్యాన్ని వీలైనంత త్వరగా సంస్థానం నుంచి పంపేయాలని నవాబు ఒత్తిడి పెంచాడు. దాంతోపాటుగా భారత ప్రభుత్వం ముద్రించిన ద్రవ్యాన్ని సంస్థానంలో చెలామణి కాకుండా నిషేధించాడు. విలువైన లోహాలు హైదరాబాదు సంస్థానం నుంచి భారతదేశానికి ఎగుమతి చేయరాదని ఆంక్షలు విధించాడు. ఇరవై కోట్ల రూపాయల విలువైన భారత ప్రభుత్వ సెక్యూరిటీ ధనాన్ని పాకిస్తాన్‌కు సమర్థించాడు. మరో వైపు రజాకార్ల దురాగతాలు రోజురోజుకు మితిమీరాయి. రజాకార్లు, పోలీసులు ఏకమై గ్రామాలను దోచుకున్నారు. అమాయకులను వధించి, స్త్రీలను చెరబట్టారు. రజాకార్ల నాయకుడు కాశింరజ్వీ కమాండర్ దుస్తులు ధరించి రజాకార్లతో హైదరాబాద్ వీధుల్లో ప్రదర్శనలు చేయించాడు. భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను, ఉపప్రధాని సర్దార్‌వల్లభాయ్ పటేల్‌ను బంధించి, నిజాం కాళ్ళ ముందు పడేస్తానని, ఢిల్లీలోని ఎర్రకోట ఆసఫ్‌జా పతాకాన్ని ఎగరవేస్తానని ప్రగల్భాలు కూడా అతడు పలికాడు.

ఈ పరిస్థితుల్లో మౌంట్ బాటెన్ నిజాం నవాబును ఢిల్లీకి పిలిపించి, విలీనానికి నచ్చచెప్పాలని ప్రయత్నం చేసాడు. అయితే నిజాం ఒకదాని తరవాత మరొకటి అంగీకారకాని డిమాండ్లను చేస్తూపోయాడు. ఈ లోపు సంస్థానంలో హత్యలు, మానబంగాలు, గృహ దహనాలు నిత్యకృత్యాలయ్యాయి. నిజాం సైన్యాధిపతి జనరల్ ఇద్రూస్ హైదరాబాద్ సంస్థానంలోకి ఆయుధాలను చేరవేయడానికి సిడ్నీకాటన్ అనే ఆస్ట్రేలియా దేశస్తుడిని నియమించుకున్నాడు.

ఇలాంటి పరిస్థితుల్లో సైనిక చర్య తప్ప భారత ప్రభుత్వానికి ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. 1948 సెప్టెంబర్ 13న భారత సైన్యాలు జె.ఎన్. చౌధురి, రాజేంద్ర సింహాజీల నాయకత్వంలో ప్రవేశించాయి. నిజాం సాయుధ బలగాలు, రజాకార్లు పలాయనం చిత్తగించారు. చెప్పుకోదగిన ప్రతిఘటనలేకుండానే భారత సైన్యం ముందు నిజాం సైన్యాలు కుప్పకూలి పోయాయి. లొంగిపోవడం తప్ప నిజాంకు గత్యంతరం లేకుండా పోయింది. నిజాం సైన్యాధికారి మేజర్ జనరల్ అహ్మద్‌ఆల్ ఇద్రూస్ లాంఛన పూర్వకంగా అసఫ్ జాహిమా పతాకాన్ని అవనతం చేసి నిజాం లొంగుబాటును ప్రకటించాడు. రజాకార్ల నాయకుడు ఖాసింరజ్వి అరెస్ట్ చేయబడ్డాడు. మేజర్ జనరల్ జె.ఎన్. చౌదరి సెప్టెంబర్ 18న సైనిక గవర్నర్‌గా పదవీబాధ్యతలు చేపట్టాడు. ఈ సైనిక చర్యను సర్దార్ పటేల్ 'పోలీస్ చర్య' అని పిలిచాడు. సైనిక పరిభాషలో దీనికి 'ఆపరేషన్ పోలో' అని పేరు.

## కాశ్మీర్

విలీనీకరణ సందర్భంలో సమస్యాత్మకంగా పరిణమించిన మరో సంస్థానం కాశ్మీర్. దీని విస్తీర్ణం 84 వేల చదరపు కిలోమీటర్లు. భౌగోళికంగా సంస్థానాన్ని నాలుగు భాగాలుగా

విభజించవచ్చు. దక్షిణాన జమ్ము, మధ్యన కాశ్మీర్ లోయ, ఉత్తరాన గిల్గిట్, కాశ్మీర్, టిబెట్‌ల మధ్య ఉన్న లఢఖ్. దేశ విభజన సమయానికి తూర్పున టిబెట్, ఈశాన్యంలో చైనాకి చెందిన సింకియాంగ్, వాయువ్యాన ఆఫ్ఘనిస్తాన్ పాకిస్తాన్‌కి అంతర్జాతీయ సరిహద్దులు. 1941 జనాభా లెక్కల ప్రకారం కాశ్మీర్ జనాభా నలభై లక్షలు. అందులో ముప్పై లక్షల మంది ముస్లింలు సంస్థానాధిపతి హరిసింగ్ హిందువు. అతడు కాశ్మీర్ సంస్థానాన్ని తటస్థంగా ఉంచాలని భావించాడు. జనాభాలో అధిక సంఖ్యాకులు ముస్లింలు అయినందువల్ల కాశ్మీర్ తమ దేశంలో విలీనం కావాలని పాకిస్తాన్ ఆశించింది. అయితే ప్రజలు షేక్ అబ్దుల్లా నాయకత్వంలో భారతదేశంలో విలీనం కావాలని కోరుకున్నారు. షేక్ అబ్దుల్లా లౌకిక వాది. ముస్లింల హక్కుల కోసం అతడు 1932లో నేషనల్ కాన్ఫిరెన్స్ పార్టీని స్థాపించాడు. మహారాజు హరిసింగ్ పాలనకు వ్యతిరేకంగా షేక్ అబ్దుల్లా అనేక పోరాటాలు చేసి, పలుమార్లు జైలుకు వెళ్ళాడు. 1946లో హరిసింగ్‌కు వ్యతిరేకంగా 'క్విట్ కాశ్మీర్' ఉద్యమాన్ని ప్రారంభించి, జైలుపాలయ్యాడు. తమ భవితవ్యాన్ని నిర్ణయించేది ప్రజలేకాని, మహారాజుకాదని ప్రకటించాడు. ఈ పోరాటంవల్ల అబ్దుల్లా కాశ్మీర్ ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడు.

కాశ్మీర్ విలీనం సమస్యపై మహారాజు హరిసింగ్, మౌంట్ బాటెన్‌తో చర్చలు జరిపాడు. కాశ్మీర్ సంస్థానాన్ని భారతదేశంలోగాని, పాకిస్తాన్‌లోగాని విలీనం చేయవచ్చునని, ఒకవేళ సంస్థానాన్ని పాకిస్తాన్‌లో విలీనం చేయాలని భావించినప్పటికీ, భారతదేశానికి ఎలాంటి అభ్యంతరం ఉండదని, అంతేతప్ప సర్వస్వతంత్ర రాజ్యంగా కాశ్మీర్‌ను బ్రిటిష్ ప్రభుత్వం గుర్తించదని మౌంట్‌బాటెన్ సంస్థానాధిపతికి స్పష్టం చేశాడు. అంతేకాక సంస్థాన ప్రజల అభిప్రాయాన్ని సేకరించడం మంచిదని సలహాను కూడా ఇవ్వడం జరిగింది. కానీ, హరిసింగ్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేక నిస్సహాయస్థితిలో ఉండిపోయాడు. భారతదేశంలో విలీనం చేస్తే కాశ్మీర్‌లోయలోని ముస్లింలకు, పాకిస్తాన్‌లో విలీనం చేసే జమ్ము హిందువులకు ఆగ్రహాన్ని కలిగిస్తుందని అతడు భావించాడు. ఇలాంటి సంకట స్థితిలో 1947 ఆగస్టులో అటు భారతదేశం, ఇటు పాకిస్తాన్ రెండు దేశాలతో యథాస్థితి పరిరక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడు.

కాశ్మీర్ రాజు నిర్ణయంవల్ల ఆశాభంగం చెందిన పాకిస్తాన్ పరోక్షంగా కాశ్మీర్‌పై దండయాత్ర ప్రారంభించింది. కాశ్మీర్‌కు అత్యవసర పదార్థాల రవాణాను నిలిపివేయడం, సైనికాధికారుల ద్వారా పాకిస్తాన్, కాశ్మీర్ సంస్థానం పాకిస్తాన్‌లో విలీనమయ్యేలా మహారాజుపై ఒత్తిడిని పెంచింది. ఆవిధంగా యథాస్థితి పరిరక్షణ ఒప్పందాన్ని పాకిస్తాన్ ఉల్లంఘించిందని సంస్థాన ప్రభుత్వం బ్రిటిష్ ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. కానీ దానివల్ల ఎలాంటి ప్రయోజనం కలగలేదు. ఇలాంటి పరిస్థితులలో పాకిస్తాన్ కాశ్మీర్‌పై బలప్రయోగానికి దిగింది. 1947 అక్టోబర్

22వ తేదీన కాశ్మీర్‌పై దండయాత్ర ప్రారంభించింది. ఈ దాడిని ప్రతిఘటించే శక్తిలేని రాజు హరిసింగ్ భారతదేశ సహాయాన్ని కోరాడు. కాశ్మీర్‌ను భారతదేశంలో విలీనం చేస్తే తప్ప ఎలాంటి సహాయం చేయడం వీలుకాదని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. గత్యంతరంలేని హరిసింగ్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసాడు. అంతేతప్ప విలీనీకరణ పత్రంపై 1947 అక్టోబర్ 26న సంతకం కూడా చేయడం జరిగింది. ఈ విధానాన్ని షేక్ అబ్దుల్లా సమర్థించాడు. వి.పి. మీనన్ సలహాపై భారత ప్రభుత్వం 1947 అక్టోబర్ 27వ తేదీన వైమానిక దళం ద్వారా సైనికులను కాశ్మీర్‌లో దించింది.

పాకిస్తాన్ దాడి నుంచి కాశ్మీర్‌ను రక్షించడానికి భారత సైన్యాలు కాశ్మీర్‌లోకి ప్రవేశించి, సాయుధ దుండగులను తరిమివేయడం ప్రారంభించాయి. ఈ సమయంలోనే తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమని కాశ్మీర్‌రాజు, షేక్ అబ్దుల్లాను కోరడం జరిగింది. షేక్ అబ్దుల్లా నాయకత్వంలో కాశ్మీర్‌లో మంత్రివర్గం ఏర్పడింది. ఐక్యరాజ్య సమితి నిర్ణయం ప్రకారం 1949 జనవరి 1వ తేదీన ఇండియా, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. అయితే ఇప్పటికీ కాశ్మీర్‌లో 1/3వ భాగం పాకిస్థాన్ ఆక్రమిత భాగంగా ఉంది. దాన్ని 'అజాద్‌కాశ్మీర్'గా పిలుస్తారు. కాశ్మీర్ సమస్య నేటికీ ఇరుదేశాల మధ్య ఎడతెగని సమస్యగా మిగిలిపోవడం దురదృష్టకర పరిణామం.

## భారత రాజ్యాంగం

1947జూలై 18న బ్రిటిష్ పార్లమెంటు భారత స్వాతంత్ర్య చట్టాన్ని ఆమోదించడంతో భారత ఉపఖండంలో రెండు అధినివేశ ప్రతిపత్తిగల స్వతంత్రదేశాలు ఏర్పడ్డాయి. అవి భారత్, పాకిస్థాన్‌లు. 1947 ఆగష్టు 14వ తేదీ అర్థరాత్రి 15వ తేది ఆరంభఘడియల్లో భారత్ స్వతంత్రదేశంగా అవతరించింది. ఢిల్లీలో ఎర్రకోట వద్ద ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ జాతీయ పతాకాన్ని ఎగురవేశాడు. లక్షలాదిమంది ఆ చరిత్రాత్మక సంఘటనలో పాల్గొని జయజయ ధ్వానాలు చేశారు. వైస్రాయి మౌంట్‌బాటెన్, ఆయన సలహాదారులు ఆ కార్యక్రమాన్ని వీక్షించారు. ఆ పర్వదినాన్ని నమోదు చేస్తూ 31 సార్లు ఫిరంగి ధ్వానాలు మారుమోగాయి.

బ్రిటన్ పక్షాన అంతిమ గవర్నర్ జనరల్‌గా ఉన్న వైస్రాయి మౌంట్‌బాటెన్ చక్రవర్తి అభినందన సందేశాన్ని ప్రకటించాడు. తొలి భారత ప్రధాని జవహర్‌లాల్ స్వతంత్ర, సర్వసత్తాక భారతదేశానికి అంకితభావంతో సేవ చేపడుతున్నట్లు ఉద్ఘాటించాడు; తొలి రాజ్యాంగబద్ధుడైన గవర్నర్ జనరల్‌గా మౌంట్‌బాటెన్ పదవీ ప్రమాణం చేశాడు. ఇతర స్వతంత్ర దేశాలు పంపిన శుభకామన సందేశాలను రాజ్యాంగ సమితి అధ్యక్షుడు, తొలి భారత రిపబ్లిక్ అధ్యక్షుడు అయిన రాజేంద్రప్రసాద్ చదివి విన్పించాడు.

ఆగష్టు 15, తొలి స్వతంత్ర ప్రభాత వేళలో దర్బారు హాల్‌లో జరిగిన సమావేశానికి దాదాపు మూడు లక్షలమంది ప్రజలు హాజరయ్యారు. పతాకావిష్కరణ జరుగుతూనే చిరుజల్లుగా వానపడింది. రంగురంగుల ఇంద్రధనస్సుతో ఆకాశం శోభిల్లింది. అవి చాలామందికి శుభశకునాల్లాగ కన్పించాయి. అయితే ఆ మహత్తర ఘడియల్లో మహాత్ముడు మాత్రం అక్కడలేడు. మతవైషమ్యానికి జాతీయ సమైక్యతను పణం పెట్టినట్లు, ధ్యేయాన్ని ఉపేక్షించి అధికారం కోసమే స్వాతంత్ర్యాన్ని సంపాదించినట్లు అనిపించి ఆయన హృదయ వేదనకు గురయ్యాడు.

స్వతంత్ర భారతదేశానికి రాజ్యాంగాన్ని రూపొందించే పనిని రాజ్యాంగ సభ నిర్వహించింది. రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన 1946 డిసెంబర్ 9వ తేదీ నుంచి 1949 నవంబర్ 26 తేదీ వరకు రాజ్యాంగ నిర్మాణ కార్యక్రమం కొనసాగింది. మొత్తం 389 మంది సభ్యులతో ఏర్పడిన రాజ్యాంగసభలో భారత జాతీయకాంగ్రెస్, ముస్లిమ్‌లీగ్ హిందూమహాసభ, దళిత జాతుల సమాఖ్య, అఖిల భారత మహిళా సమ్మేళనం, షెడ్యూల్డ్‌కులాల సమాఖ్య వంటి ముఖ్యసంస్థల ప్రతినిధులున్నారు.

రాజ్యాంగ రచన కోసం సంఘాన్ని ఏర్పరచడమైంది. ఆ సంఘానికి డా॥అంబేద్కర్ అధ్యక్షుడు కాగా అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, కె.ఎం.మున్షీ, టి.టి. కృష్ణమాచారి, ఎన్.గోపాలస్వామి అయ్యంగార్, మహమ్మద్ సాదుల్లా, మాదవరావులు సభ్యులు. రాజ్యాంగసభ సమావేశాలు రెండు సంవత్సరాల పదకొండు నెలలపై పద్దెనిమిది రోజులు జరిగాయి.

రాజ్యాంగం చిత్తుప్రతి 1948 జనవరిలో ప్రచురితమైంది. చిత్తుప్రతిని పరిశీలించి సలహాలు సూచనలు తెలియజేయడానికి ప్రజానీకానికి ఎనిమిది నెలల సమయాన్ని ఇవ్వడం జరిగింది.

1948 నవంబర్ 4వ తేదీ నుంచి నవంబర్ 9 వరకు చర్చ జరిగింది. 7,635 సవరణలను ప్రతిపాదించడమైంది. వాటిలో 2,473 సవరణలను పరిశీలించడమైంది. నవంబర్ 14 నుంచి నవంబర్ 26 వరకు మూడోసారి పరిశీలన చేసిన తరవాత 1949 నవంబర్ 26వ తేదీన రాజ్యాంగం ఆమోదం పొందింది. చర్చలో విమర్శలు, సూచనలు, సవరణ ప్రతిపాదనలు చేసిన వారిలో ప్రముఖులు హెచ్.వి.కామత్, కె.టి.షా (అధ్యక్షతరహా ప్రభుత్వాన్ని ఏర్పరచ వలసిందిగా వాదించారాయన), ఫ్రాంక్ ఆంథోనీ, పండిట్ ఠాకూర్ భార్గవ, మహావీర్ త్యాగి, దుర్గాబాయి ప్రభృతులు.

1949 నవంబర్ 26 తేదీన రాజ్యాంగం ఆమోదం పొందిన తరవాత రాజ్యాంగసభ రాష్ట్రాల పార్లమెంటుగా 1950 జనవరి 26 వరకు పనిచేసింది. తరవాత మొదటి సార్వత్రిక ఎన్నికలు జరిగే వరకు (1952, మే 12) రాజ్యాంగసభ కొనసాగింది. 1952 మే 13 తేదీన తొలి లోక్‌సభ సమావేశం జరిగింది. రాజ్యాంగసభ ఏర్పరిచిన రాజ్యాంగం సమాఖ్య లక్షణాలైన అధికార పంపిణి, కేంద్ర, రాష్ట్రాల పాలనాంశాల ప్రకటన, న్యాయశాఖ స్వతంత్ర ప్రతిపత్తి, ఉభయసభా

విధానం మొదలైన వాటిని ప్రవేశపెట్టింది. అయితే 249,250,256,257,365 ప్రకరణాల ద్వారా రాష్ట్రాలపై అతిక్రమణాధికారాన్ని కేంద్రానికి కట్టబెట్టడం జరిగింది.

అయితే పైన పేర్కొన్న ప్రకరణాలు ఉన్నప్పటికీ రాజ్యాంగాన్ని సమాఖ్య సమూనాలోనే రూపొందించడం జరిగిందని డా॥ అంబేద్కర్ అభిప్రాయపడ్డాడు.

రాజ్యాంగ నిర్మాణంలో చురుగ్గా పాల్గొని అందరికంటే ఎక్కువ సవరణలు ప్రవేశపెట్టిన హెచ్.వి.కామత్, రాజ్యాంగం ప్రతిపాదించిన అత్యవసరస్థితి అధికారాలను తీవ్రంగా విమర్శిస్తూ- 'ప్రపంచంలోని ఏ ప్రజాస్వామిక దేశాల రాజ్యాంగంలోనూ (ఒక్క వీమార్ రాజ్యాంగం తప్ప) ఈ అత్యవసరస్థితి అధికారాలవంటివి' తాను చూడలేదని అన్నాడు. అవి అవాంఛనీయమైనవైనా తప్పనిసరైనవి అని టి.టి. కృష్ణమాచారి అభిప్రాయపడ్డాడు. ఈ విషయమై డా॥ అంబేద్కర్ వివరిస్తూ 'అత్యవసరస్థితిలో కేంద్రానికి ఇతోధిక అధికారాలనిచ్చే ప్రకరణలు మృతాక్షరాలుగానే ఉండాలనీ, వాటిని అమలులోకి తేవలసిన పరిస్థితులు ఉత్పన్నం కావని తామాశిస్తున్నామనీ' వ్యాఖ్యానించాడు.

'ఈ రాజ్యాంగం మెజారిటీ రాజకీయపక్షంవారు తమ రాజకీయ సిద్ధాంతాలకు అనుగుణంగా ఏర్పరిచిన రాజ్యాంగమే, ఇతర రాజకీయపక్షాల అభిప్రాయాలను లాంఛనప్రాయంగా వినడం మాత్రమే జరిగింది' అని మరొక విమర్శ వచ్చింది.

రాజ్యాంగ రచనలో పాల్గొన్న వారిలో 'రాజనీతిశాస్త్రం, రాజ్యాంగ విషయాల' నిపుణులు లేకపోవడం, డెన్మార్క్ యువరాజు లేకుండానే హామ్లెట్ నాటకాన్ని ప్రదర్శించినట్లుందని ఒక విమర్శకుడు వ్యాఖ్యానించాడు.

'రాజ్యాంగంలో ఒక ముఖ్యలోపం రాజ్యాంగ రచనకు పూర్వంగానీ, తరవాతగానీ ప్రజానీకం అనుమతికోరి, పొందటం జరగలేదన్న విషయం. ఈ విషయం దృష్ట్యా చూస్తే రాజ్యాంగం ఆముఖం (ప్రీయాంబుల్)లో 'భారత ప్రజలమైన మేము' అనే ఉద్ఘాటన కేవలం వాగాడంబరమే గాని వేరుకాదు' అని మరొక విమర్శ.

భారత రాజ్యాంగాల మధ్య ప్రతివ్యక్తికి జీవించే హక్కుకు సంబంధించిన అంశాన్ని తులనాత్మకంగా పరిశీలించి దీనిని మన రాజ్యాంగంలోకి పొందుపరచడం జరిగింది. అలాగే ప్రపంచ రాజ్యాంగాలు అభివృద్ధి ప్రక్రియలో భాగంగా ఆస్ట్రేలియా రాజ్యాంగం నుంచి ఉమ్మడి జాబితాను మన రాజ్యాంగంలో పొందుపర్చడం జరిగింది.

## స్విట్జర్లాండ్‌తో తులనాత్మక పరిశీలన

భారత రాజ్యాంగానికి, స్విట్జర్లాండ్ రాజ్యాంగాలకు మధ్య సమతౌల్య తులనాత్మకత గోచరిస్తుంది. స్విస్ రాజ్యాంగం ప్రత్యక్ష ప్రజాస్వామ్యాన్ని అనుసరించగా మన రాజ్యాంగం పరోక్ష ప్రజాస్వామ్యాన్ని అనుసరిస్తున్నది. స్విట్జర్లాండ్‌లో ఫెడరల్ కౌన్సిల్ బహుళ సభ్య కార్యనిర్వాహక వర్గానికి మంచి ఉదాహరణ. ఫెడరల్ కౌన్సిల్‌లో ఏడుగురు అధ్యక్షులు ఉండగా అధికారాలు ఏ ఒక్క అధ్యక్షుని చేతిలో కాకుండా సమిష్టిగా అందరు సభ్యులకు చెంది ఉంటుంది. భారత రాజ్యాంగంలో ప్రస్తుతం ఆచరణలో ఉన్న కార్యనిర్వాహక వర్గం అంటే ప్రధానమంత్రి, మంత్రి మండలి మధ్య ఉన్న సమిష్టి బాధ్యత అనే అంశం స్విస్ రాజ్యాంగం ద్వారా రూపొందించడం జరిగింది.

స్విట్జర్లాండ్ రాజ్యాంగంలో బహుళ సభ్య కార్యనిర్వాహక వర్గాల వల్ల బహుళ ప్రయోజనాలుంటాయని భావిస్తారు. అది ప్రధానంగా కార్య నిర్వాహక వర్గాల అధికార దుర్వినియోగాన్ని అరికడుతుందని వాదన. శాసన సభల మీద, ప్రజల హక్కుల మీద దురాక్రమణను బహుళ సభ్య కార్యనిర్వాహఖ వర్గం అరికడుతుంది. అంతేకాకుండా ఇందులో దౌర్జన్య పూరితమైన ప్రభుత్వపు మార్పులు, సైనికతిరుగుబాట్లు వంటివి ఉండవు. ఏక సభ్య కార్యనిర్వాహక వర్గం కంటే ఇందులోని బహుళ కార్యనిర్వాహకుల్లో అధికదక్షత, వివేచనతో కూడిన సమన్వయశక్తి ఉండే వీలుంది

## 1. భారత రాజ్యాంగం విశిష్ట లక్షణాలు

**1. లిఖితమైన సుదీర్ఘమైన రాజ్యాంగం :** భారత రాజ్యాంగం విభిన్న ఆదర్శాలకు ప్రయోజనాలకు ప్రధాన కేంద్రం. ప్రస్తుతం ఈ రాజ్యాంగంలో 444 అధికరణాలు, 12 షెడ్యూల్స్ ఉన్నాయి. రాజ్యాంగాన్ని నిర్మించినప్పుడు కేవలం 395 అధికరణాలు మాత్రమే ఉండేవి. కాని మారుతున్న రాజకీయ, ఆర్థిక, సాంఘిక పరిస్థితులు దృష్ట్యా ఈ అధికరణాలను పెంచుకోవడం జరిగింది. ఈ రాజ్యాంగాన్ని 22 భాగాలుగా విభజించడం జరిగింది. భారత రాజ్యాంగం అతి పెద్ద రాజ్యాంగం. "కాబట్టి ఈ రాజ్యాంగాన్ని ఐరావతం అని ప్రముఖ రాజనీతి విశ్లేషకుడు "హెచ్. వి. కామత్" పేర్కొన్నాడు". మన రాజ్యాంగం పెద్దది కావడానికి ఈ దిగువ పేర్కొన్న అంశాలు దోహదకారి కాగలవు.

* భారత రాజ్యాంగ చరిత్రలో కేంద్ర ప్రభుత్వ స్వరూపమే కాక రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల స్వరూపం గురించి కూడా పేర్కొనడం జరిగింది. రాజ్యాంగ రూపకల్పనలో A, B, C, D అనే నాలుగు అంచెల రాష్ట్రాల పద్ధతిని అనుసరించడం జరిగింది.

* జనాభాలో విభిన్న మతాలు, భాషలు, తెగలు వెనకబడ్డ ప్రాంతాలు, ఇతర అల్పసంఖ్యాక వర్గాల గురించి ప్రత్యేక నిబంధనలను రూపొందించవలసి వచ్చింది.

* ప్రాథమిక హక్కులను సవిస్తారంగా పొందుపరిచి ప్రత్యేకమైన పరిస్థితులలో వాటికి హేతుబద్ధమైన కట్టుబాట్లను, పరిమితులను స్పష్టం చేయడం జరిగింది. రాజ్యం పరిపాలన రంగంలో పాటించవలసిన నిర్దేశక నియమాలను రూపొందించడం జరిగింది. ఈ సూత్రాలను (ఆదేశక సూత్రాలు) శ్రేయో రాజ్య స్థాపనకు మూలస్థంబాలుగా తోడ్పడతాయి.

* ప్రాథమిక విధులను కూడా రాజ్యాంగంలోని నాల్గవ అధ్యాయంలో విస్తృతంగా చర్చించడం జరిగింది.

* కేంద్ర, రాష్ట్ర సంబంధాలలో శాసనబద్ధమైన ఆర్థిక పరిపాలన సంబంధాలను సవివరంగా పొందుపరచడం జరిగింది.

* మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగ సవరణలు చేయడం జరిగింది. 2010 నాటికి మన రాజ్యాంగంలో 94 రాజ్యాంగ సవరణ చట్టాలు జరిగాయి. ప్రముఖ బ్రిటిష్ పార్లమెంట్ మాజీ సభ్యుడు "ఐవర్ జెన్నింగ్స్" అభిప్రాయంలో ప్రపంచ రాజ్యాంగాలలో భారత రాజ్యాంగం సుదీర్ఘం, అనేక సవరణలతో కూడిన విస్తృతమైన రాజ్యాంగం అని వర్ణించడం జరిగింది".

* రాజ్యాంగంలోని 369 నుంచి 372 వరకు గల ప్రకరణాలు తాత్కాలిక అంశాలకు సంబంధించినవి మాత్రమే.

* రాజ్యాంగంలోని 12వ షెడ్యూల్ అధికార భాష, ప్రాంతీయ భాషలను గురించి ప్రస్తావించినది.

## 2. ఇతర రాజ్యాంగాల ప్రభావం

౧. రాజ్యాంగ రచయితలు ప్రపంచ రాజ్యాంగాలను క్షుణంగా పరిశీలించి దేశ కాలామాన పరిస్థితులకు అనుగుణంగా అవసరం అనుకున్న ప్రతి విషయాన్ని గ్రహించారు. ఇలా చేయడంలో వారు కొన్ని సందర్భాలలో సూచనలను కూడా తప్పలేదు. ఉదా॥ 1935

భారత ప్రభుత్వ చట్టంలోని 395 నిబంధనలలో సుమారు 250 నిబంధనలను కొన్ని మార్పులతో పొందుపరిచారు. ఈ నిబంధనలు ముఖ్యంగా సమాఖ్య పద్ధతిని కేంద్ర, రాష్ట్ర సంబంధాలు, పార్లమెంటరీ విధానం, గవర్నర్, ద్విసభా విధానం, ఫెడరల్ న్యాయస్థానం, దేశంలోని అత్యవసర పరిస్థితికి సంబంధించినటువంటివి.

బి. పార్లమెంటరీ ప్రభుత్వ విధానం, సభా హక్కులు శాసన నిర్మాణ ప్రక్రియ, సభాపతి వ్యవస్థ, సమగ్ర న్యాయవ్యవస్థ నిర్మాణం, అఖిల భారత స్థాయి ఉద్యోగి వ్యవస్థ, ఏక పౌరత్వ విధానం మొదలైనవి బ్రిటిష్ రాజ్యాంగం నుంచి స్వీకరించడం జరిగింది.

సి. సమాఖ్య పద్ధతి, రాజ్యాంగ చట్టం సర్వోన్నత న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తి, రాష్ట్రపతి వ్యవస్థ అధికారాలు అతని ఎన్నిక, తొలగింపు విధానాలు, న్యాయమూర్తుల తొలగింపు విధానం, ప్రాథమిక హక్కులు, రాజ్యాంగ సవరణ బిల్లుకు రాష్ట్రాల ఆమోదం తెల్పడం మొదలైన అంశాలు అమెరికా రాజ్యాంగం నుంచి గ్రహించడం జరిగింది.

డి. ఐర్లాండ్ రాజ్యాంగం నుంచి నిర్దేశక నియమాలు, రాష్ట్రపతి ఎన్నికలో అనుసరించే నైష్పత్తిక ప్రాతినిధ్యం, ఏక ఓటు బదిలీ పద్ధతి, రాజ్యసభకు విశిష్ట సభ్యులను నామినేట్ చేయడం మొదలైన అంశాలను పొందుపరచడం జరిగింది.

ఇ. కెనడా రాజ్యాంగం నుంచి భారత యూనియన్‌కు సంబంధించిన నిబంధనలు, కేంద్రానికి అవశిష్ట అధికారాను ఇవ్వడం మొదలైన అంశాలను గ్రహించారు. జపాన్ రాజ్యాంగం నుంచి జీవించే హక్కుకు సంబంధించిన 21వ నిబంధనలో చట్టం నిర్ధారించిన పద్ధతి (Procedure established Law) అనే మాటను మన రాజ్యాంగంలోకి పొందుపరచడం జరిగింది. అలాగే ఆస్ట్రేలియా రాజ్యాంగం నుంచి ఉమ్మడి జాబితాను మన రాజ్యాంగంలో పొందుపరిచారు.

ఎఫ్. ప్రపంచ రాజ్యాంగాల నుంచి అనేక అంశాలను, అధికరణాలను గ్రహించిన కారణం చేత కొందరు విమర్శకులు మన రాజ్యాంగాన్ని అరువుల మూట (bundle of borrowings) అని విమర్శించారు. ఇది సరయిన విమర్శ కాదు. ఆయా అంశాలను గమనించి దేశ కాలపరిస్థితులను బట్టి వాటిని అనుకూలంగా మలుచుకోవడం జరిగింది అని రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడు డా॥ రాజేంద్రప్రసాద్ వాఖ్యానించాడు. ఈవిషయంలో మన రాజ్యాంగ నిర్మాతలు చాలా మౌళికంగా వ్యవహరించడం జరిగింది. ఉపరాష్ట్రపతి ఎన్నికకు నియోజక గణం (Electrol college) ఏర్పాటు, రాజ్యాంగ సవరణకు చెందిన 368వ నిబంధనను పేర్కొనవచ్చు. ఈ సందర్భంలో

రాజ్యాంగ రచన సంఘం అధ్యక్షులు డా॥ బి. ఆర్. అంబేద్కర్ మాటలను స్మరించడం సముచితంగా ఉంటుంది. అతడు రాజ్యాంగ పరిషత్‌లో ప్రసంగించిన అంశాలు ఇలా ఉన్నాయి.

" ప్రపంచంలో ఏ రాజ్యాంగం అయిన మౌళికంగా ఉండగలదా? సమకాలీన ప్రపంచ రాజ్యాల చరిత్రలో మొట్ట మొదటి లిఖిత రాజ్యాంగం రూపొంది వంద సంవత్సరాలు దాటాయి. అప్పటి నుంచి దానిని నమూనాగా పెట్టుకొని, ఇతర రాజ్యాలు తమ దేశ కాలాపరిస్థితుల కనుగుణంగా రాజ్యాంగాలను రాసుకొన్నారు. ఈ కారణం చేత ప్రపంచ రాజ్యాంగాలన్నీ ఒక దానితో ఒకటి పోలికలతో ఉంటాయి. వీటిలో ఏదైనా మౌళిక భావం కనిపిస్తుంది.

రాజ్యాంగ పరిషత్ వాగ్వాదాలు Vol. VII PP. 35-38.

### 3. దృఢ - అదృఢ సమ్మేళనం

భారత రాజ్యాంగం అమెరికా రాజ్యాంగం, స్విస్ రాజ్యాంగాల మాదిరి పూర్తిగా దృఢమైందికాదు. ఒక రకంగా మనది దృఢ రాజ్యాంగం, ఎందుకంటే సమాఖ్య ప్రభుత్వం, కేంద్ర రాష్ట్రాల మధ్య ఏర్పడే ఒప్పందం ఫలితంగా ఏర్పడుతుంది. ఇక్కడ దృఢ రాజ్యాంగాల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించాలి. ఎక్కడైతే సాధారణ చట్టానికి రాజ్యాంగ చట్టానికి మధ్య వ్యత్యాసం ఉంటుందో అటువంటి రాజ్యాంగాన్ని దృఢ రాజ్యాంగం అని పేర్కొనవచ్చు. ఏ రాజ్యాంగంలోనయితే సాధారణ చట్టాలను రూపొందించే విధంగానే సవరణలు చేయడం జరుగుతుందో అటువంటి రాజ్యాంగాన్ని అదృఢ రాజ్యాంగంగా పేర్కొనవచ్చు. సిద్ధాంతపరంగా భారత రాజ్యాంగం దృఢ - అదృఢ విధానాలతో మధ్యే మార్గాన్ని అనుసరించింది. ఉదాహరణకు కేశవానంద భారతి కేసులో (1973) సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రాజ్యాంగ మూల సూత్రాలను సవరించడానికి వీలు లేదు. సుమారు ఆరు దశాబ్దాల కాలంలో మన రాజ్యాంగ చరిత్రలో తొంభైలయిదుకు పైగా సవరణలు జరగడాన్ని బట్టి మన రాజ్యాంగం ఏర్పడిందని విమర్శ ఉంది.

### 4. సార్వభౌమ, ప్రజాసత్తాక ప్రజాస్వామ్య రాజ్యం

రాజ్యాంగ ప్రస్తావనలో వివరించినట్లు మన రాజ్యాంగం సార్వభౌమ, ప్రజాసత్తాక ప్రజాస్వామ్య రాజ్యాంగ ఏర్పాటుకు నిర్దేశించింది. అంతర్ దేశీయ, విదేశీ వ్యవహారాలలో ఇతర రాజ్యాంగాల జోక్యం లేకుండా మన రాజ్యాంగం అమలులోకి వచ్చింది. మొత్తం రాజ్యాంగ వ్యవస్థల ఆధికరణాలకు ప్రజలే మూలం. ప్రజల కోసం, ప్రజల చేత నిర్దేశించాలనే ఫలితంగా రాష్ట్రపతి, ప్రధానమంత్రి, శాసనసభ్యులు ప్రతి 5సంవత్సరాలకు సాధారణ ఎన్నికల ద్వారా

ఎన్నికవుతారు. మన రాజ్యాంగంలోని అన్ని అధికరణాలలో ప్రజాస్వామిక మౌలిక లక్ష్యాలు ప్రతిబింబిస్తాయి.

## 5. కేంద్ర ప్రాబల్యం ఉన్న సమాఖ్య విధానం

రాజ్యాంగంలో సమాఖ్య అనే పదాన్ని ఉపయోగించలేదు. రాష్ట్రాల సముదాయం Union of stats) గా పేర్కొనడం జరిగింది. లిఖిత రాజ్యాంగం, కేంద్ర రాష్ట్రాల మధ్య అధికార విభజన, రాష్ట్రాల స్వతంత్ర ప్రతిపత్తి, సమాఖ్య విధానానికి నిదర్శనం. రాజ్యాంగ అధికరణాలను సమీక్షించినట్లయితే అధికారాల విభజనలో కాని, ఆదేశక సూత్రాల అమలులో గాని, న్యాయ సమీక్ష విషయంలో గాని, ఆర్థిక పరమైన విధాన నిర్ణయంలోగాని కేంద్ర ప్రభుత్వనిదే పై చేయిగా కనిపిస్తుంది. అందువల్ల రాజ్యాంగంలో పొందుపరిచిన ఏకకేంద్ర లక్షణాలు, రాష్ట్రాలపై కేంద్ర ప్రాబల్యాన్ని ప్రతిబింబిస్తుంది.

మన రాజ్యాంగంలో కొన్ని ఏకకేంద్ర లక్షణాలు కూడా కొట్టొచ్చినట్లున్నాయి. అధికార విభజనకు సంబంధించిన జాబితాలో, కేంద్ర జాబితా అంశాల సంఖ్యను బట్టి ఉమ్మడి జాబితాపై కేంద్రానికి గల ప్రాబల్యాన్ని బట్టి అవిశిష్ట అంశాలపై కూడా దానికి గల అవసరాన్ని బట్టి రాష్ట్రాల కంటే కేంద్ర ప్రభుత్వానికి ఎక్కువ అధికారాలు సంక్రమించాయి. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో రాష్ట్ర జాబితాలోని అంశాలపై కూడా జోక్యం చేసుకొనే విధంగా రాజ్యాంగంలో చట్టబద్ధమైన ఏర్పాట్లు ఉన్నాయి. ఉదా॥ రాజ్యాంగంలో పొందుపరిచిన '249'వ అధికరణ ప్రకారం కొన్ని సందర్భాలలో రాష్ట్ర జాబితాపై శాసనాలు చేసే అధికారం కేంద్రానికి కేటాయించడం జరిగింది. ఈ విధంగా కొన్ని సమాఖ్య లక్షణాలు, మరికొన్ని ఏకకేంద్ర లక్షణాలు రాజ్యాంగంలో ఉన్నందువల్ల ప్రొ॥ కె.సి. వేర్ భారత రాజ్యాంగాన్ని అర్థ సమాఖ్యగా పేర్కొన్నాడు. (Quasi Federal) కాని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ చట్ట పరిధిలో వ్యవహరించినప్పుడు అనేక సందర్భాలలో రాష్ట్ర ప్రభుత్వాలపై తప్పనిసరిగా ఆధారపడి దాని వాటి సహకారాన్ని ఆపేక్షించాల్సి వస్తుంది. ఈ కారణం వల్ల ప్రొ॥ డి. ఎన్. బేనర్జీ ఈ రాజ్యాంగాన్ని సహకార సమాఖ్య" (Coperative fedaration) అన్ని అభివర్ణించాడు. ప్రొ॥ మారిస్‌జోన్స్, పాల్ ఆపిల్‌బీ వంటి రాజనీతి విశ్లేషకులు కూడా ఇదే అభిప్రాయాన్ని వెల్లిబుచ్చారు.

## 6. ఏక కేంద్ర - సమాఖ్య లక్షణాలు

"రాష్ట్రాల సముదాయం అని పేర్కొనడం వల్ల భారతదేశంలో ఉన్న విచ్ఛిన్నకర ధోరణులను అరికట్టేందుకు రాజ్యాంగ నిర్మాతలు దృఢమైన కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.

"ప్రొ॥ బేసర్ట్ అభిప్రాయంలో భారతరాజ్యాంగం కేంద్రం వైపు మొగ్గు చూపే లక్షణాలు ఉన్న సమాఖ్య స్వరూపం". భారత రాజ్యాంగ స్వభావం గురించి వివిధ వాదోపవాదాలు జరిగాయి. భారతదేశం ఏక కేంద్ర, సమాఖ్య లక్షణాలతో దేనిని ప్రధానంగా అనుసరించాలనే విషయంలో రాజ్యాంగ పరిషత్ సభ్యులు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగానికి అపురూపమైన ఏకకేంద్ర, సమాఖ్య లక్షణాలు కొన్ని ఉన్నాయి. ఉదాహరణ 1. ఒకే రాజ్యాంగం , 2. ఒకే పౌరత్వం, 3. ఒకే ఎన్నికల సంఘం, 4. అఖిల భారత సర్వీసుల సిబ్బంది, కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉండడం మొదలైన ఏక కేంద్ర లక్షణాలు భారత రాజ్యాంగంలో చోటు చేసుకొన్నాయి. అదే విధంగా 1. లిఖిత రాజ్యాంగం, 2. దృఢ రాజ్యాంగం, 3. మహోన్నతమైన రాజ్యాంగం, 4. కేంద్ర రాష్ట్రాల మధ్య అధికారాల విభజన, 5. న్యాయశాఖ ఔన్నత్యం, 6. ద్వంద్వ సభా విధానం, 7. పార్లమెంట్‌లోని ఎగువ సభలో (రాజ్యసభ) రాష్ట్రాలకు ప్రాతినిధ్యం అనే సమాఖ్య రాజ్యాలక్షణాలను మన రాజ్యాంగంలో పొందుపరిచారు.

కాబట్టి భారత రాజ్యాంగానికి ఏక కేంద్ర, సమాఖ్య రాజ్యాలు లక్షణాలు ఉన్నాయని తెలుస్తుంది. కాని భారత రాజ్యాంగానికి బ్రిటిష్ రాజ్యాంగం లాగా సంపూర్ణమైన ఏక కేంద్ర లక్షణాలు లేవని చెప్పవచ్చు. అట్లాగే అమెరికా సంయుక్త రాష్ట్రాల కంటే కొంత తక్కువ దృఢ రాజ్యాంగాన్ని సంతరించుకొన్న రాజ్యాంగం మనది. అందువల్లే "డి.డి. బసు" వంటి రాజనీతి విశ్లేషకులు అభిప్రాయంలో భారత రాజ్యాంగాన్ని అర్ధ సమాఖ్యగా పేర్కొన్నారు. భారతదేశం సమాఖ్య తను (fedaration) పరిరక్షించడం కోసం రాజ్యాంగ నిర్మాతలు కేంద్రీకృత లక్షణాలను మన సమాఖ్య వ్యవస్థలో పొందుపరిచారని తెలుస్తుంది. ఈ విధంగా కొన్ని సమాఖ్య లక్షణాలు మరికొన్ని ఏకకేంద్ర లక్షణాలు రాజ్యాంగంలో ఉన్నందువల్ల ప్రముఖ శాస్త్రజ్ఞుడు "కె.సి. వేర్" మన రాజ్యాంగాన్ని అర్థ సమాఖ్యగా వర్ణించాడు. అనేక సందర్భాలలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలపై తప్పనిసరిగా ఆధారపడి వాటి సహకారాన్ని పొందవలసి ఉంటుంది.

## 7. పార్లమెంటరీ లేదా బాధ్యతాయుత విధానం

భారత రాజ్యాంగం కేంద్రంలోను రాష్ట్రాలలోను పార్లమెంటరీ తరహా ప్రభుత్వాలు ఏర్పాటు చేసింది. ప్రధానమంత్రి పాలిత ప్రభుత్వంలో రాజ్యాధినేత, ప్రభుత్వాధినేత అనే ఇద్దరు కార్యనిర్వాహక అధికారులు ఉంటారు. రాజకీయ కార్యనిర్వాహక వర్గంలో ప్రధానమంత్రి నాయకత్వం వహించే మంత్రి మండలి ఉంటుంది. దీనినే క్యాబినెట్ అంటారు. ఈ మంత్రి మండలి సమిష్టి బాధ్యత సూత్రంపై పని చేస్తుంది. ఈ మంత్రి మండలి సమిష్టిగా ప్రధానమంత్రితో సహా పార్లమెంట్‌కు, ప్రధానంగా లోక్‌సభకు బాధ్యత వహిస్తుంది. పార్లమెంట్‌కు ప్రభుత్వం పై నియంత్రణ ఉంటుంది. ఈ నియంత్రణ అధికారం అనేక రూపాలలో అవిశ్వాస

తీర్మానం వరకు తన అధికారాన్ని ప్రదర్శిస్తుంది. భారత రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం మంత్రి మండలిని తొలగించే అత్యంత ప్రధానమైన అధికారం పార్లమెంట్ చేతులో ఉంటుంది. పార్లమెంటరే ప్రభుత్వంలోని మంత్రులు తమ అధికారాలు, విధులు నిర్వహణలో పార్లమెంట్‌కు బాధ్యులు అయి ఉంటారు. రాష్ట్రాలలోని మంత్రి మండలికి కూడా ఈ సూత్రమే వర్తిస్తుంది.

## 8. ద్విసభా విధానం

రాజ్యాంగం ప్రకారం మన రాజ్యాంగంలో ద్విసభా విధానానికి అవకాశం ఉంది. పార్లమెంట్‌లోని దిగువ సభను లోక్‌సభ అని ఎగువ సభను రాజ్యసభ అని అంటారు. లోక్‌సభ అశాశ్వత సభ. దీని పదవీకాలం 5సంవత్సరాలు గడువు ముగిసే లోపల దీనిని భారత రాష్ట్రపతి ప్రధాని సలహాపై రద్దు చేసి మధ్యంతర ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. ఈ సభను 71/2, 10లక్షల ప్రజలకు ఒక ప్రతినిధి చొప్పున దేశం మొత్తం మీద 545 మంది సభ్యులు సాధారణ ఎన్నికల ద్వారా ప్రజలచేత ఎన్నుకోబడతారు. రాష్ట్రపతి ఈ సభకు ఇద్దరు ఆంగ్లోఇండియన్‌లను నామినేట్ చేస్తారు. సాధారణంగా ప్రధానమంత్రి లోక్ సభలో మెజార్టీ పక్షానికి (అధికార పక్షం) చెందిన నాయకుడై చెలామణి అవుతారు. పార్లమెంట్‌లోని ఎగువసభను రాజ్యసభ అంటారు. ఇది శాశ్వతసభ దీనిని రద్దు చేయడానికి వీలులేదు. రాష్ట్ర శాసన సభ్యులు నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిలో ఈ సభకు చెందిన సభ్యులను ఎన్నుకొంటారు. ఈ విధంగా ఎన్నికయ్యే వారి సభ్యుల సంఖ్య 238. ప్రతి రెండు సంవత్సరాలకు 1/3వ వంతు మంది పదవీవిరమణ చేయగా ఆ స్థానంలో కొత్తవారు ఎన్నిక అవుతుంటారు. ఈ సభకు విభిన్న రంగాలలో సేవలు అందించిన నిష్ణాతులైన 12గురు ప్రముఖ వ్యక్తులను రాష్ట్రపతి నియమిస్తారు.

## 9. ప్రాథమిక హక్కులు

అమెరికా రాజ్యాంగం మాదిరిగానే భారత రాజ్యాంగం మూడవ భాగంలో రాజ్యాంగ నిర్మాతలు ప్రాథమిక హక్కులను పొందుపరిచారు. అమెరికా రాజ్యాంగం, ఐక్యరాజ్య సమితికి చెందిన ప్రపంచ మానవ హక్కుల ప్రకటన ద్వారా ప్రభావితులై రాజ్యాంగ నిర్మాతలు ప్రాథమిక హక్కులకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. రాజ్యాంగం ప్రతిపాదించిన 7 ప్రాథమిక హక్కులు పౌరుల సివిల్, రాజకీయ స్వాతంత్ర్యాలను స్పష్టంగా పేర్కొన్నాయి. కాని 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్థిహక్కును ప్రాథమిక హక్కుల నుంచి తొలగించడం జరిగింది. కాని ఆ తరవాత ఏర్పడిన సవరణ చట్టం ద్వారా ఆస్థి హక్కును 300 (ఎ) ఆధికరణ ప్రకారం ఈ హక్కును చట్టబద్ధమైన హక్కుగా గుర్తించారు. ప్రస్తుతం 1. సమానత్వపు హక్కు, 2. స్వాతంత్ర్యపు హక్కు, 3. ప్రాథమిక విద్యాహక్కు, 4. పీడనాన్ని నిరోధించే హక్కు,

5. మత స్వాతంత్ర్యపు హక్కు, 6. విద్యా సాంస్కృతిక విషయపు హక్కు, 7. రాజ్యాంగ పరిహారపు హక్కు, ఈ ప్రాథమిక హక్కులు నిరుపేక్షం అయినవి కావు. వీటిపై కొన్ని పరిమితులు ఉంటాయి. అత్యవసర పరిస్థితులలో వీటిని తాత్కాలికంగా రద్దు చేయవచ్చు వీటికి న్యాయస్థానాల రక్షణ ఉంటుంది. వీటిని పరిరక్షించడానికి న్యాయస్థానాలు వివిధ ఆజ్ఞలను (Writs) ను జారీ చేస్తుంది. ప్రాథమిక హక్కుల జాబితాలో కొన్ని వర్గాలకు సంరక్షణ నివేదన కల్పించడం జరిగింది. దీనివల్ల పిల్లలకు స్త్రీలకు, షెడ్యూల్ కులాలు, తెగల వారికి ప్రత్యేక మినహాయింపులు ఇవ్వడానికి వీలవుతుంది. సాధారణ చట్టాల కంటే ప్రాథమిక హక్కులకు ఆధిక్యత ఉంటుంది. ఈ హక్కులకు భంగం కలిగితే న్యాయస్థానం ద్వారా తగిన పరిహారం పొందవచ్చు. ఇంతవరకు 15, 16, 21, 30వ అధికరణలకు సవరణలు జరిగాయి.

రాజ్యాంగం అమలులోనికి వచ్చినప్పటి నుంచి ఆస్తి హక్కు అనేక వివాదాలకు దారి తీసింది. ఇది ప్రాథమిక హక్కుగా కొనసాగే పక్షంలో రాజ్యాంగ లక్ష్యమైన సామ్యవాద సమాజం సిద్ధించడం కష్టమని భావించి 1979లో ప్రధాని మొరార్జీ దేశాయ్ నేతృత్వంలో పని చేసిన జనతా ప్రభుత్వం 44వ సవరణ చట్టం ద్వారా ఈ హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించింది. ఆనాటి నుంచి నేటి వరకు ఆస్థిహక్కు చట్టబద్ధమైన హక్కుగా కొనసాగుతుంది.

**10. ప్రాథమిక విధులు**

హక్కులు విధుల మధ్య పరస్పర సంబంధం రాజ్యాంగం ద్వారా ఏర్పడింది. విధులు లేని హక్కులు ఉండవు. 1976కు పూర్వం పౌరుల విధులు లేదా బాధ్యతలు సివిల్ విధి నిషేదాత్మకంగా ఉండేది. మారిన రాజకీయ పరిస్థితులలో పౌర విధులను చేర్చాలని తలపెట్టి 42వ రాజ్యాంగ సవరణ చట్టం (1976) ద్వారా రాజ్యాంగంలో పది ప్రాథమిక విధులను చేర్చడం జరిగింది.

1. రాజ్యాంగాన్ని, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించడం.
2. స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి ఉదాత్త ఆశయాలను అనుసరించడం
3. దేశాన్ని రక్షించడం, అవసరం అయినప్పుడు జాతీయ సేవను అందించడం.
4. భారత దేశ సార్వభౌమాధికారాన్ని, ఐక్యతను, సమగ్రతను కాపాడడం, సంరక్షించడం.
5. భారతదేశ ప్రజల మధ్య అన్యోనతను, సోదర భావాన్ని పెంపొందించడం. స్త్రీ గౌరవానికి భంగకరమయ్యే చర్యలను విడనాడటం.

6. సుసంపన్నమైన జాతీయ బహుళ సంస్కృతిని రక్షించడం.

7. అడవులు, చెరువులు, నదులు, జంతువులు వంటి సహజ వాతావరణాన్ని సంరక్షించి పెంపొందించడం వన్యమృగాల పట్ల కనికరం చూపడం.

8. శాస్త్రీయ గుణాన్ని, మానవత్వాన్ని, పరిశోధన సంస్కరణ భావాలను అవలరుచుకోవడం.

9. ప్రభుత్వ ఆస్తులను సంరక్షించడం, హింసను విడనాడటం.

10. వ్యక్తిగత వికసానికి, సామాజిక వికాసానికి కృషి చేయడం.

11. ఆరు నుంచి పద్నాలుగు సంవత్సరాల బాలబాలికలకు నిర్బంధోచిత ప్రాథమిక విద్యను తల్లిదండ్రులు కాని, సంరక్షకులు కాని అందించడం.

రాజ్యాంగంలోని 21 (ఎ) ఆధికరణం ప్రకారం నిర్బంధ ఉచిత విద్యను ప్రాథమిక హక్కుగా పొందుపరచడం జరిగింది. 2002 సంవత్సరంలో రాజ్యాంగంలో ఏర్పడిన 86వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం నిర్బంధ ఉచిత విద్యకు ఎనలేని ప్రాముఖ్యత ఏర్పడి విద్య వికాస ప్రక్రియలో భాగంలో 21(ఎ) ఆధికరణ అత్యంత కీలకమయిన అంశంగా చోటు చేసుకుంది. విద్యారంగంలో వెనకబడిన బాల బాలికలను విద్యావంతులుగా తీర్చిదిద్దడమే కాకుండా వారి జీవన విధానంలో సృజనాత్మకతను పెంపొందించుటకు, వారి సంక్షేమానికి, ఆర్థిక అభ్యున్నతికి 21(ఎ) ఆధికరణ ఎంతగానో తోడ్పడుతుంది.

## 11. నిర్దేశక నియమాలు

భారత రాజ్యాంగం నాల్గవ భాగంలో నిర్దేశక నియమాలను పొందుపరచడం జరిగింది. ఈ నియమాలు ప్రాథమిక హక్కుల లాగా న్యాయస్థానాల ద్వారా రక్షణ పొందుటకు వీలుకాక పోయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పరిపాలన పరంగా మార్గదర్శం చేసి ప్రాథమిక నియమాలు సమాజానికి సంబంధించినవి అవుతాయి. ఆర్థిక పరమైన మార్పులను బట్టి భారతదేశంలో శ్రేయోరాజ్యాన్ని స్థాపించుటకు ప్రయత్నించడమే నిర్దేశక నియమాల (ఆదేశక సూత్రాలు) నియమాల ప్రధాన లక్ష్యమని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. రాజ్యాంగంలోని మూడవ భాగంలో పొందుపరిచన ప్రాథమిక హక్కులు స్వేచ్ఛ, సమానత్వాన్ని నెలకొల్పడంలో తోడ్పడినట్లయితే, నాల్గవ భాగంలో పొందుపరిచిన నిర్దేశక నియమాలు దేశ సాంఘిక, ఆర్థిక ప్రగతిని సాధించడానికి తోడ్పడతాయి. 1976కు పూర్వం న్యాయస్థానాలు ప్రాథమిక హక్కులకు ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తుండేవి. కాని నిర్దేశక నియమాల అమలుపట్ల తమ దృష్టిని మళ్లించలేకపోయాయి. దీనివల్ల నిర్దేశక నియమాల అమలులో జాప్యం జరుగుతుండేది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నియమాల అమలులో జాప్యం జరుగుతుండేది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ఈ విషయాలను అమలు పరచడంలో ఎక్కువ శ్రద్ధ చూపనందున ఈ సూత్రాలు సామాన్యులకు అందుబాటులో లేకుండపోయాయి. ఈ వాస్తవాన్ని గ్రహించి 1976లో చేపట్టిన 42 రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా నిర్దేశక నియమాల అమలుకు ప్రాధాన్యత లభించాలని అత్యున్నత న్యాయస్థానం పేర్కొన్నది.

ప్రజలందరికీ జీవనోపాధి కల్పించడం, సమాజంలో వనరులపై యాజమాన్యం నియంత్రణ, ఉత్పత్తి సాధనాలు, ప్రకృతి సంపద సామాజిక సంక్షేమానికి వ్యతిరేకంగా కేంద్రకృతం కాకుండా చూడడం.

## 12. స్వతంత్ర ప్రతిపత్తి గల సర్వోన్నత న్యాయస్థానం

భారత రాజ్యాంగం స్వతంత్ర ప్రతిపత్తి గల సర్వోన్నత న్యాయవ్యవస్థను రూపొందించింది. స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న న్యాయసమీక్ష అధికారం కేంద్రంలో భారత సుప్రీంకోర్టుకు, రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర హైకోర్టులకు లభించేటట్లు చట్టాలు చేయడం జరిగింది. న్యాయ సమీక్ష అధికారం కేవలం సుప్రీంకోర్టుకు, హైకోర్టులకు మాత్రమే వర్తించడం ఒక ప్రత్యేకత. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ పరిధిని అతిక్రమించకుండా చేసి అవి పౌరుల ప్రాథమిక హక్కులను సంరక్షిస్తూ ఉంటాయి. అలాగే రాజ్యాంగ నిబంధనలకు అర్థ వివరణను ఇచ్చి శాసన నిర్మాణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తలెత్తే వివాదాలను కూడా న్యాయస్థానం పరిష్కరిస్తుంది. కేంద్రంలో సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చే తీర్పులను చివరి తీర్పుగా పరిగణించవచ్చు.

## 13. సామ్యవాద, లౌకిక వాద లక్షణాలు

భారత రాజ్యాంగ ప్రవేశిక భారత దేశాన్ని ప్రజాస్వామ్య రాజ్యాంగా ప్రకటించింది. ప్రజాస్వామ్యం అంటే ప్రజల కోసం ఏర్పడిన ప్రజాప్రభుత్వం. వయోజన ఓటింగ్, ఎన్నికల నిర్వహణ ప్రజాస్వామానికి ప్రతిబింబాలై శాసన సభకు కార్యానిర్వాహక శాఖ బాధ్యత వహించే జవాబుదారీతనం, భారత పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులు వాటికి న్యాయస్థానాలు పరిరక్షణ, స్వతంత్ర ప్రత్తిపత్తి మొదలైన అంశాలు ప్రజాస్వామ్యాన్ని పటిష్టవంతం చేశాయి. ఈ లక్షణాలు ప్రజాసామ్య అంతర్భాగాలుగా గుర్తింపుపొందాయి.

భారత ప్రవేశిక (42వ సవరణ) భారతదేశాన్ని సామ్యవాద, లౌకిక రాజ్యంగా పేర్కొన్నది. ప్రభుత్వ విధానాల రూపకల్పనలో సామ్యవాదం, లౌకికవాదం మార్గదర్శకాలుగా ఉంటాయి. భారతదేశంలో సామ్యవాద రాజ్య స్థాపనకు అనుకూలంగా ప్రభుత్వ విధానాలను రూపొందించవలసి ఉంటుంది. సమాజ శ్రేయస్సు దృష్ట్యా (39వ ఆధికరణ) ఉత్పత్తి సాధనాలైన

యంత్రాలు, భూయాజమాన్యం, మూలధనం మొదలైన వాటి యాజమాన్యం నియంత్రణ, ఉత్పత్తి పంపిణీ సమాజపరంగా ఉండాలని సామ్యవాదం నిర్దేశిస్తుంది. ఈ లక్ష్య సాధనకు ప్రాథమిక హక్కులపై నిర్దేశక నియమాల అధిక్యాని గుర్తించడం, ఆస్తిహక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించి సామాన్య న్యాయహక్కుగా గుర్తించడం జరిగింది.

1976 రాజ్యాంగ సవరణ చట్టాన్ని అనుసరించి రాజ్యాంగ ప్రవేశికలో లౌకిక (సెక్యులర్) అనే పదాన్ని పొందుపరచడం జరిగింది. భారత రాజ్యాంగ ప్రాథమిక లక్షణాలలో లౌకిక విధానం ఒకటి. రాజ్యాంగంలోని 25 నుంచి 28 వరకు గల అధికరణాలు లౌకివాద సిద్ధాంతాన్ని ధృవపరుస్తున్నాయి. లౌకిక రాజ్యమంటే మత ప్రమేయం లేని ప్రజాస్వామిక రాజ్యం అని అర్థం. భారతదేశం ఏ మతాన్ని ఏ కులాన్ని నిరసించదు. అన్ని మతాలను ఒకే దృష్టితో చూస్తుంది. 15వ అధికరణం ప్రకారం మత సంబంధమైన వివక్షతలు ప్రభుత్వం ఉద్యోగ పదవి నియమాకాల వంటి విషయాలలో ప్రదర్శించదు.

## 14. రాజ్యాంగ సవరణ విధానం

రాజ్యాంగ సవరణ ఆధునిక సంక్షేమ రాజ్య ప్రక్రియలో ప్రముఖ స్థానాన్ని సతరించుకొంది. రాజ్యాంగ అధికరణలు ప్రజలకు ఉపయోగకరంగా లేనప్పుడు రాజ్యాంగం తన ఉనికిని కోల్పోతుంది. ఈ వాస్తవాన్ని గ్రహించిన రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగ సవరణ విధానానికి అవకాశం కలగచేశారు. ఈ విషయంలో రాజ్యాంగ పరిషత్ సభ్యులు రెండు వర్గాలుగా చీలిపోవడం గమనార్హం. రాజ్యాంగం దృఢంగా ఉండి తరుచు మార్పులు చేర్పులకు గురికాకుడదని ఒక వర్గం అభిప్రాయ పడితే రెండవ వర్గం రాజ్యాంగం అదృఢంగా ఉండి మారుతున్న పరిస్థితులకు తగినట్లు సవరణకు అనుకూలంగా ఉండాలని భావించారు. మొదటి వర్గానికి శ్రీ బి. గోపాలస్వామి అయ్యంగార్ న్యాయకత్వం వహించగా సర్ అల్లాడి కుప్పుస్వామి అయ్యర్, ప్రొ॥ కె.టి.షా. శ్రీ. కె.యం. మున్షీ, డా. శ్యాంప్రసాద్ ముఖర్జీ, రాజ్యాంగ సలహాదారుడు బెనెగల్ నర్సింగ్‌రావు బి. గోపాలస్వామి అయ్యంగార్‌ను సమర్థించారు. తాము సిద్ధం చేసిన ముసాయిదాలో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ నివేదికను మే 1947లో రాజ్యాంగ పరిషత్‌కు సమర్పిస్తూ పార్లమెంట్‌లోని ఉభయసభలో ఈ బిల్లు 2/3వ వంతు మెజార్టీ పొందడం అవసరమని సూచించారు.

రెండవ వర్గానికి నాయకుడైన పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ అతని అభిప్రాయాన్ని హెచ్. వి. కామత్, డా. చింతామని దేశ్‌ముఖ్, మహవీర్ త్యాగి మొదలైన వారు సమర్థించారు. వీరి అభిప్రాయంలో రాజ్యాంగ సవరణ పద్ధతి క్లిష్టమయినట్లయితే మారుతూ ఉండే సాంఘిక, ఆరిక రాజకీయ పరిసితులకు రాజ్యాంగ పరిష్కారం చూపదు. వారి దృష్టిలో ఫ్రెంచ్ రాజ్యాంగ

సవరణ విధానం అత్యంత కఠినంగా ఉండి ఫ్రెంచ్ ప్రజల ఆశయాలకు ఆకాంక్షలకు పొంతన కుదరక సాధారణ సవరణలవల్ల సమస్యలకు పరిష్కారం కుదురవలసి ఉంది. ఈ చారిత్రక సత్యంతో పాటు మన రాజ్యాంగ నిర్మాతలు ఈ దిగువ పేర్కొన్న వాస్తవాలను కూడా దృష్టిలో పెట్టుకొన్నారు.

1. రాజ్యాంగ పరిషత్ కుల, మత, వర్గ ప్రాతిపదికగా పరిమిత ఓటు పద్ధతిపై పరక్షో ఎన్నికల ద్వారా ఏర్పాటు అయింది. మన దేశంలో స్వతంత్ర రాజ్యాంగం అమలుకు వచ్చిన తరవాత పరోక్ష ఎన్నికల ద్వారా పార్లమెంట్ ఏర్పాటు జరిగినట్లయితే, అది అప్పటి రాజ్యాంగ పరిషత్ కంటే ఎక్కువగా ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తుంది.

2. భాష ప్రాతిపదికపై రాష్ట్రాల పునర్విభజన జరగాలని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఒత్తిడిని బట్టి రాజ్యాంగ రచన జరుగుతున్న సమయంలో వ్యక్తమయింది.

3. తక్కువ సమయంలో రాజ్యాంగ సవరణ పూర్తి చేయాలనే విషయంలో సభాహక్కులు మొదలైన అంశాలను నిర్దిష్టమైన నిబంధనలను రూపొంధించడం సాధ్యం కాలేదు.

4. సాంఘిక ఆర్థిక రంగాలలో ఆనాటి భారతదేశ పరిస్థితి ఆయోమయంగా ఉంది.' భారత రాజ్యాంగం లక్ష్యం ఉదారవాదమా? సామ్యవాదమా? అనే విషయంలో సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదురలేదు. కాబట్టి రాజ్యాంగ నిర్మాతలు మారుతు ఉండే పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగాన్ని సవరించడానికి మూడు ప్రత్యేక పరిస్థితులను రూపొందించడం జరిగింది.

ఎ. సాధారణ మెజార్టీ పద్ధతి.

బి. ఏకపక్ష ప్రత్యేక మెజార్టీ పద్ధతి.

సి. ద్విపక్ష ప్రత్యేక మెజార్టీ పద్ధతి.

**15. రాష్ట్ర శాసనసభల ఆమోదం**

రాజ్యాంగ సవరణ నిబంధన 368లో పేర్కొన్న పద్ధతిలో కొన్ని సవరణలకు 50% శాతం రాష్ట్ర శాసన సభల ఆమోదం అవసరమని పేర్కొన్నారు. దీని ప్రకారం కేంద్ర పాలిత ప్రాంతాలకు శాసనసభలు ఉన్నట్లయితే వాటి ఆమోదం రాజ్యాంగ సవరణకు అవసరం లేదు. రాష్ట్రంలో విధానసభ మాత్రమే ఉన్నట్లయితే ఆ సభ సాధారణ మెజార్టీ ఆమోదం సరిపోతుంది. రెండు సభలు ఉన్నట్లయితే విధానసభ, విధానమండలి విడివిడిగా సాధారణ మెజార్టీతో రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించేటట్లు తీర్మానిస్తే చాలు.

16. రాష్ట్రపతి అంగీకార ముద్ర

1971లో 24వ రాజ్యాంగ సవరణ చట్టం అమలుకు రాకముందు రాష్ట్రపతి విచక్షణతో అంగీకారం తెలిపేవారు. కాని 24వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా రాజ్యాంగ సవరణ బిల్లు ప్రత్యేక మెజార్టీ పద్ధతి ద్వారా ఆమోదం పొందిన తరవాత రాష్ట్రపతి అంగీకారానికి పంపటం జరిగింది. రాష్ట్రపతి ఆమోద ముద్రతో రాజ్యాంగ సవరణ చట్టం. శాసనంగా మారి అమలులోకి వస్తుంది. సందర్భంలో 1973లో కేశవానంద భారతి V/S భారత ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు తీర్పులో పార్లమెంట్ రాజ్యాంగం మౌలిక నిబంధనలను సవరించడానికి వీలులేదని చెప్పడం జరిగింది. 1980లో మినర్వామిల్స్ V/S భారత ప్రభుత్వం కేసు విచారణకు వచ్చినప్పుడు కూడా సుప్రీంకోర్టు ధర్మాసనం రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని నిర్వచించాలని ప్రయత్నం చేసి చివరికి సందిగ్ధంలో పడింది.

## భారత రాజ్యాంగం - సమీక్ష

విభిన్న ప్రజాస్వామ్య రాజ్యాంగాల ప్రాతిపదికపై భారత రాజ్యాంగం జనవరి 26 1950న అమలులోకి వచ్చింది. దాదాపు 70% శాతం 1935 భారత ప్రభుత్వ చట్టంలోని అంశాలను కూడా మన రాజ్యాంగంలోకి పొందుపరచడం జరిగింది. పార్లమెంటరీ ప్రభుత్వ విధానం, సమన్యాయపాలన, నామమాత్రపు రాజ్యాధిపతి, లోక్‌సభాధిపతి, శాసన సభ్యుల ప్రత్యేక హక్కులు, ద్వంద్వ శాసనసభలు, సుప్రీంకోర్టుకు ఉన్న న్యాయ సమీక్షాధికారం ప్రాథమిక హక్కులు, నిర్దేశక నియమాలు మొదలైన అంశాలను బ్రిటిష్, అమెరికన్ ఐరిష్ రాజ్యాంగాల నుంచి గ్రహించారు. "మన రాజ్యాంగ నిర్మాతలు సిద్ధాంతాల కంటే ఆచరణకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారు". అందువల్ల అమలులో ఉన్న అనేక రాజ్యాంగ ప్రక్రియలను పరిశీలించి మనకు అనుకూలమైన వాటిని గ్రహించి వాటిని రాజ్యాంగంలో పొందుపర్చడం జరిగింది.

ఆరు దశాబ్దాల వ్యవధి కాలంలో ఏర్పడిన రాజ్యాంగ నిబంధనల అమలు వాటి తీరుతెన్నులు దేశ పరిపాలకులకు నూతన ఉత్సాహాన్ని అనుభవాన్ని కలగ చేసింది. విభిన్న దేశాల రాజ్యాంగ నిబంధనలను మన రాజ్యాంగంలో పొందుపరచినప్పటికీ ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా భారత రాజ్యాంగం విజయవంతంగా కొనసాగుతుంది. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా వంటి తృతీయ ప్రపంచ దేశాల రాజ్యాంగ లక్షణాలను నిబంధనలను మన రాజ్యాంగంతో పోల్చినప్పుడు 100 కోట్లకు పైగా జనాభా, భాష, కుల, మత, ప్రాంతీయ, స్థానిక మార్పులకు లోనుకాకుండా అమలులో ఈనాటికి దృఢంగా ఉందంటే అది భారతీయుల దూర దృష్టికి మేధాశక్తికి, లౌకిక భావానికి, సమసమాజ నిర్మాణానికి, ప్రజాస్వామ్య మౌళిక విలువలకు ఆదర్శవంతమైనదని చెప్పవచ్చు. ఈ రాజ్యాంగ ప్రక్రియ పరిణతి చెందిన భారతీయ ప్రజల మనోభావాన్ని వారికి ప్రజాస్వామ్యం పట్ల ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది.

# 12
# విదేశాంగ విధానం - నెహ్రూ శకం

## మౌలిక ప్రమాణాలు

1947 తర్వాత రాజకీయాలలో భారతదేశం స్వతంత్ర విదేశాంగ విధానం అనుసరించేందుకు చేసిన ప్రయత్నాలు ప్రత్యేకంగా పేర్కొనదగిన అంశం. అంతర్జాతీయ పరిస్థితుల్లో విప్లవాత్మక మార్పులు వచ్చినప్పటికీ స్వతంత్ర పోరాటకాలంలోనూ స్వతంత్రానంతర తొలి సంవత్సరాల్లోనూ రూపొందింపబడిన విస్తృత ప్రమాణాలు ఇప్పటికీ వర్తించేవిగా వున్నాయి. జవహర్‌లాల్‌నెహ్రూ మన విదేశాంగ విధాన రూపశిల్పి. గొప్ప నాగరికత గల భారతదేశం తనసొంత గొంతుకను వినిపించాలని ఆకాంక్షిస్తుంది. అంతర్జాతీయ రంగంలో భారతదేశం తన విధానాన్ని వ్యక్తీకరించకపోతే వలస పాలన నుండి పోరాడి సాధించుకున్న స్వతంత్రం అర్థరహితమౌతుంది. ఉపఖండంగా ఉన్న భారతదేశం కక్షిదారీస్థాయిని అంగీకరించజాలదు. స్వేచ్ఛాయుత వ్యక్తీకరణ ఎంపిక కాదు. తప్పనిసరి.

ఈ వ్యక్తీరణకు అలీన ఆలోచన రూపంలో అలీన ఉద్యమం ద్వారా ఒక రూపాన్నిచ్చినవాడు నెహ్రూ. ఈ ఉద్యమ ఆవిర్భావానికి తక్షణ సందర్భం రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత, ప్రపంచం రెండు శత్రుశిబిరాలుగా చీలిఉండడం. ఒకటి అమెరికా ఇతర పశ్చిమ రాజ్యాల నాయకత్వంలో, మరొకటి సోవియట్ యూనియన్ నాయకత్వంలో. కొత్తగా స్వతంత్రం పొందిన ఆసియా, ఆఫ్రికా పేద దేశాలు అగ్రరాజ్యాల మిలిటరీ శిబిరాల్లో చేరడం వల్ల సర్వస్వం కోల్పోవడం తప్ప పొందే ప్రయోజనం ఏమీ ఉండదని నెహ్రూకి స్పష్టమైన అవగాహన ఉంది. అవి అగ్రరాజ్యాల ఘర్షణలో పావులుగా ఉపయోగించుకోబడతాయి. పేదరికం, నిరక్షరాస్యత, రోగాలు రొస్టులపై విపరీతంగా పోరాడడం పేద దేశాల అవసరాలు. ఇలాంటి అవసరాలు మిలిటరీ శిబిరాల్లో చేరడం వల్ల తీరవు. దీనికి భిన్నంగా భారతదేశం అలాంటి స్థితిలో

ఉన్న ఇతర దేశాలు అభివృద్ధి చెందడానికి శాంతి సామరస్యాలు అవసరం. వాటి ప్రయోజనాలు యుద్ధం, శత్రుత్వం కాక శాంతి సామరస్యాలు విస్తరణతో నెరవేరతాయి. కాబట్టి భారతదేశం బాగ్దాద్ ఒప్పందం, మనీలా ఒప్పందం, సీటో (SEATO) సెంటో (CENTO) లలో చేరలేదు. వాటిని ఆమోదించలేదు. ఈ ఒప్పందాలు పశ్చిమ, తూర్పు ఆసియా దేశాలను, పాశ్చాత్య రాజ్యాల శిబిరాల్లో చేర్చాయి.

కాని భారతదేశం తటస్థత లేక మిలిటరీ శిబిరాలకు బైట ఉండడంతో ఆగిపోలేదు. జాన్ ఫాస్టర్ డల్లెస్ భారతదేశంపై విసిరిన 'అనైతిక తటస్థత' ఆరోపణను నెహ్రూ వెంటనే తిరస్కరించాడు. అలీనత అంటే ప్రతి అంశాన్ని దాని గుణాల్ని బట్టి నిర్ణయించడం. ఏది మంచి, ఏది చెడు అని పర్యాలోచించడం, అప్పుడు మంచికి అనుకూలమైన వైఖరి చేపట్టడం.

"ఫాసిజం, వలసవాదం, జాత్యాహంకారం లేక అణుబాంబు దురాక్రమణ అణచివేత లాంటి దుష్ట శక్తులకు సంబంధించినంత వరకు మనం వాటికి వ్యతిరేకంగా దృఢంగా, నిస్సందేహంగా, నిబద్ధతతో నిలబడతాం... మన అలీనత మిలిటరీ ఒప్పందాలతో కూడిన ప్రచ్ఛన్న యుద్ధాన్ని, కొత్తగా విముక్తి పొందిన ఆసియా, ఆఫ్రికా దేశాలను వారు ప్రచ్ఛన్నయుద్ధ యంత్రాంగంలోకి లాగడాన్ని ఆక్షేపిస్తుంది. ప్రపంచానికి, చెడు లేక అపకారిగా పరిణమించే ప్రతి పరిణామాన్ని ఖండించే స్వేచ్ఛ మనకుంది. సందర్భం వచ్చినప్పుడు అలాంటి స్వేచ్ఛని మనం ఉపయోగించుకుంటాం."

వలసవాదం, సామ్రాజ్యవాదం నుండి భారతదేశం, కొత్తగా స్వతంత్రం సాధించిన ఇతర దేశాలు వాటి స్వతంత్రాన్ని నిలబెట్టుకుని పటిష్టపరుచుకోడానికి ప్రతీక 'అలీనత'. మొదట స్వతంత్రం పొందిన భారతదేశం ఇతర మాజీ వలస దేశాలకు నాయకత్వం వహించింది. ఈ దేశాలు సమిష్టిగా గణనీయమైన శక్తి. ఉదాహరణకు ఐక్యరాజ్య సమితిలో ఈ దేశాల చేరికతో సభ్యత్వం పెరిగింది. 'ఒక దేశం ఒక ఓటు' విధానంతో అలీన దేశాలు తరచుగా సోవియట్ సహకారంతో పాశ్చాత్య దేశాల ఆధిపత్యాన్ని అడ్డుకోగలిగాయి. ఆ విధంగా అంతర్జాతీయ సంబంధాల యొక్క ప్రజాస్వామ్య క్రమాన్ని అలీనత ముందుకు తీసుకుపోయింది.

వలసవాద, మాజీ వలసవాద దేశాల వలసవాదానికి వ్యతిరేకంగా చేసే పోరాటలకు మద్దతునివ్వడం భారత విదేశాంగ విధానం యొక్క మౌలిక లక్షణం. అలీన విధానం ఈ లక్ష్యానికి బాగా ఉపకరించింది. ప్రపంచ శాంతిని పెంచే మరొక లక్ష్యానికి కూడా అలీన విధానం తోడ్పడింది. యుద్ధానికి, అణుయుద్ధ ప్రమాదానికి నెహ్రూ వ్యతిరేకత హీరోషిమా సంఘటన తర్వాత పెరిగింది. అది తన అహింసాయుత పోరాట అనుభవం నుండి, అణుబాంబు చట్టవిరుద్ధమైనదిగా ప్రకటింపజేయడం

తన కర్తవ్యంగా పెట్టుకున్న గాంధీపై గల విశ్వాసం నుండి పెరిగింది.

గాంధీచే ప్రేరేపితుడై ఐన్‌స్టీన్, బెర్ట్రెండ్ రస్సెల్ వంటి గొప్ప మేధావుల మద్దతు పొందిన నెహ్రూ శాంతి అణ్వస్త్ర నిరాయుధీకరణ లక్ష్యాన్ని భారతదేశం తరపున ప్రపంచం ముందుంచారు.

విభిన్న సిద్ధాంతాల, విభిన్న వ్యవస్థల శాంతియుత సహజీవనం అవసరమని సత్యంపై ఎవరికీ గుత్తాధిపత్యం లేదని, బహుళత్వం జీవన విధానమని నెహ్రూ నొక్కి చెప్పాడు. దేశాల మధ్య సంబంధాల నిర్వహణకు శాంతియుత సహజీవనానికి ఐదు సూత్రాలను లేక పంచశీలను ప్రతిపాదించాడు. అవి ప్రాదేశిక, సమగ్రత, సర్వసత్తాక, అధికారం పట్ల పరస్పర గౌరవం, దురాక్రమణ జరపకుండుట, పరస్పరం అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండుట, సమానత్వం, పరస్పర ప్రయోజనం, శాంతియుత సహజీవనం.

దేశాల అంతర్జాతీయ సంబంధాలను గురించి నెహ్రూ తన ఆలోచనలను అవకాశమున్న ప్రతి వేదికనుండి చెప్తూ వచ్చాడు. ఈ అన్వేషణలో కొన్ని మహత్తర ఘటనలు ఉన్నాయి. స్వతంత్రానికి ముందు 1947 మార్చిలో నెహ్రూ ప్రేరణతో ఢిల్లీలో 20 దేశాలకు పైగా హాజరైన ఆసియా దేశాల సంబంధాల సదస్సు (Asian Relations Conference) నిర్వహించబడింది. సదస్సు యొక్క స్ఫూర్తి ఆసియా దేశాల స్వతంత్రం : దానిని ప్రపంచ వేదికనుండి స్పష్టంగా ప్రకటించడం. ఈ సదస్సు సాధారణ అంశాలకు సంబంధించిందైనప్పటికీ తరువాతి సదస్సు ప్రత్యేక సమస్యకు స్పందనగా జరపబడింది. సమస్య : 1948 డిసెంబర్‌లో ఇండోనేషియాను వలసగా మార్చేందుకు డచ్చి ప్రయత్నం. హిందూ మహాసముద్రం సరిహద్దుగా గల దేశాలను నెహ్రూ ఆహ్వానించాడు. చాలా ఆసియా, ఆస్ట్రేలియా దేశాలు వచ్చాయి. డచ్చి నౌకలకు వసతులు కల్పించకుండా నిరాకరించాలని సదస్సు తీర్మానించింది. తీర్మానాలను ఐక్యరాజ్య సమితికి పంపించింది. వారం లోపల యుద్ధవిరమణ ప్రకటించాలని ఇండోనేషియా జాతీయ ప్రభుత్వం పునరుద్ధరింపబడాలని భద్రతా సమితి తీర్మానించింది. వలసలను రద్దు చేసే ప్రయత్నం 1954లో కొలంబోలో ఆసియా దేశాల నాయకుల సదస్సులోనూ, భారతదేశం, ఇతర కొలంబో రాజ్యాలు 1955లో బాండుంగ్, ఇండోనేషియాలలో నిర్వహించిన ఆఫ్రో ఆసియన్ సదస్సులోనూ ముందుకు తీసుకుని పోవడం జరిగింది. సదస్సు ప్రపంచ శాంతిపై, అణ్వాయుధాల ప్రమాదాలపై తీర్మానాలు చేసి బెల్గ్రేడ్ అలీన సదస్సుకు అగ్రగామి దూతగా పనిచేసింది. నెహ్రూ, ఈజిప్టు అధ్యక్షుడు నాజర్, యుగోస్లేవియా అధ్యక్షుడు టిటోతో కలిసి బెల్గ్రేడ్‌లో శాంతి, అణ్వస్త్ర నిరాయుధీకరణకు పిలుపు ఇవ్వడంతో నెహ్రూ శాంతి ప్రయత్నాలు

శిఖరాగ్ర స్థితికి చేరుకున్నాయి. పలస వాద అవశేషాలు తొలగిపోతాయని తర్వాత ప్రపంచం ఎదర్కోనున్న సవాలు అణుయుద్ధ నివారణ అని నెహ్రూ విశ్వసించాడు.

భారతదేశ విదేశాంగ విధానం యొక్క కర్తవ్యం భారత ఆర్థిక ప్రయోజనాలను కాపాడడం. తాను స్వయంగా ఎంపిక చేసుకున్న మార్గంలో ముందుకు పోవడం. అలీనత ఏదో ఒక శిబిరానికి కట్టిపడవేయక పోవడం వల్ల, విభజన రేఖకి ఇరువైపులా ఉన్న దేశాలతో ఆర్థిక సంబంధాలు పెంపొందించుకోవడానికి తోడ్పడింది. తనకవసరమైన పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాలు, ఆహార ధాన్యాలను పశ్చిమ దేశాలనుండి పొందింది. భారతదేశం ప్రత్యేకించి 1954 తర్వాత పబ్లిక్ సెక్టార్ పరిశ్రమల నిర్మాణానికి సోవియట్ యూనియన్‌పై ఆధారపడింది. పబ్లిక్ సెక్టార్ పరిశ్రమలకు తోడ్పడేందుకు అమెరికా విముఖత వ్యక్తం చేసింది.

వివిధ వనరుల నుండి రక్షణ సామాగ్రి, ఆయుధాలు పొందగలగడం, భారతదేశం చాలా దేశాలతో స్నేహ సంబంధాలు కొనసాగించగలిగిందనే వాస్తవాన్ని స్పష్టం చేస్తుంది. ఏదో ఒక దేశంపై ఎక్కువగా ఆధారపడడాన్ని నివారించింది. ఈ విధంగా కొత్తగా స్వతంత్రం పొంది అభివృద్ధి చెందుతున్న పేదదేశం యొక్క స్వతస్సిద్ధ బలహీనతలు తగ్గించబడ్డాయి. అదే విధంగా భారతదేశం ఐక్యరాజ్య సమితి యొక్క వివిధ సంస్థల్లోనూ ఐ.ఎం.ఎఫ్, ప్రపంచ బ్యాంకులలో సభ్యత్వం కొనసాగించింది. అంతేకాక వివిధ అంతర్జాతీయ సంస్థలనుండి రాయితీలతో అత్యంత ఎక్కువ మొత్తాలను పొందగలగడం భారతదేశ ఆర్థిక రాజనీతిజ్ఞత యొక్క విశిష్టత.

భారతదేశ విదేశాంగ విధానం కొన్ని సార్లు సమాధానపరచడానికి పొసగని లక్ష్యాన్ని అనుసంధానం చేసింది. ఉదాహరణకు సోవియట్ యూనియన్, భారతదేశం 1963లో ప్రారంభించి 1964 ఆగస్టులో, 1965 ఆగస్టులో, 1965 నవంబర్‌లో ఆయుధ ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ విధంగా సోవియట్ యూనియన్ భారతదేశానికి అత్యంత ఎక్కువ ఆయుధాలు సరఫరా చేసే దేశమైంది. భారత సోవియట్ సంబంధాలు గుణాత్మకమైన నూతన దశలో ప్రవేశించాయి. అదే సమయంలో భారతదేశం అమెరికా మద్దతుతో వ్యవసాయ అభివృద్ధి కొరకు హరితవిప్లవ సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు పరచాలని నిర్ణయించింది. సోవియట్ యూనియన్‌తో ఆయుధ ఒప్పందాలు, కొద్ది సంవత్సరాల్లో ఆహారంలో స్వయం సమృద్ధి సాధించడానికి దారితీసిన హరిత విప్లవం భారతదేశం తన కాళ్లపై తాను నిలబడగల శక్తిని పెంచాయి. ప్రపంచ వ్యవహారాల్లో ఇంకా స్వతంత్ర వైఖరిని చేపట్టే శక్తిని పెంచాయి. అలాగే అమెరికా, సోవియట్ యూనియన్‌లు చాలా సందర్భాల్లో రూపాయలలో చెల్లింపులకు అంగీకరించాయి. ఆవిధంగా విదేశీ మారక ద్రవ్యంపై ఒత్తిడిని తగ్గించాయి.

భారతదేశం బహు అంతర్జాతీయ సంస్థల్లో చురుకుగా పాల్గొంది. వాటిలో తన ఉనికిని తనకనుకూలంగా మార్చుకుంది. ఈ కారణం రీత్యానే నెహ్రూ కామన్‌వెల్త్‌లో ఉండాలని నిర్ణయించాడు. అందుకు విరుద్ధంగా బలమైన ప్రజాభిప్రాయం ఉన్నప్పటికీ భారతదేశం ఒకసారి స్వతంత్రమైన తర్వాత దానిపై బ్రిటన్ ఆధిపత్యం చెలాయించే సమస్య ఉండదని, భారతదేశం బహుళజాతి సంస్థలలో ఉండడం వల్ల ప్రయోజనం పొందవచ్చునని నెహ్రూ భావించాడు. భారతదేశం తనకు మిత్రులెవరో, శత్రువులెవరో ఇంకా తెలుసుకోవలసిన పరిస్థితిలో కామన్‌వెల్త్ సభ్యత్వం ఒక మేరకు భద్రత కల్పించింది. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఐక్యరాజ్య సమితి శాంతి సంరక్షణ దళాలలో భారతదేశం చురుకైన పాత్ర నిర్వహించింది. భారతదేశం చురుకైన పాత్ర నిర్వహించిన కొన్ని అంతర్జాతీయ పరిస్థితుల్ని కొంత నిశితంగా పరిశీలిస్తే అలీన విదేశాంగ విధానం నిర్దేశించిన కర్తవ్యాలు తేటతెల్లమౌతాయి.

## అంతర్జాతీయ పాత్ర

### కొరియా యుద్ధం

రెండవ ప్రపంచయుద్ధం ముగింపు కొరియాని కమ్యూనిస్టుల అదుపులో ఉన్న ఉత్తర కొరియాగా, పశ్చిమ రాజ్యాల ఆధిపత్యంలో ఉన్న దక్షిణకొరియాగా విభజించింది. ఐక్యరాజ్య సమితి 1947 చివరిలో కొరియాపై నియమించిన కమిషన్‌కి ఛైర్మన్‌గా ఎన్నికైన కె.పి.ఎస్.మీనన్ ఐక్యరాజ్య సమితికి ఇచ్చిన నివేదికలో కొరియాని ఐక్యంగా వుంచమని అగ్రరాజ్యాలకు విజ్ఞప్తి చేశారు. కానీ ఫలితం లేదు. 1950లో ఉత్తర కొరియా దక్షిణకొరియాపై దాడిచేసినప్పుడు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారతదేశం అమెరికాకు మద్దతు ఇచ్చింది. ఉత్తర కొరియాని దురాక్రమణదారునిగా ఖండించింది. యుద్ధవిరమణకు పిలుపిచ్చింది. కాని దక్షిణ కొరియాకి సహాయం కొరకు పిలుపునిస్తూ, అందుకొరకు సైనిక దళాన్ని ఏర్పాటు చేయాలనే తీర్మానంపై ఓటింగుకు భారతదేశం గైరుహాజరవడంతో అమెరికా సంతోషం ఆగ్రహంగా మారింది. ఘర్షణలోకి బయటి సైనిక శక్తుల ప్రవేశాన్ని అడ్డుకోవాలని భారతదేశం కోరింది. నెహ్రూ, ట్రూమన్, స్టాలిన్‌లకు విజ్ఞప్తి చేశారు. స్టాలిన్ నుండి సానుకూలమైన స్పందన వచ్చింది.

కాని ఐక్యరాజ్య సమితి అదుపులో ఉన్న అమెరికా సైనికాధిపతి జనరల్ మాక్ ఆర్థర్ ఐక్యరాజ్య సమితి ఆమోదం పొందకుండానే ఉత్తర కొరియా సైనిక బలగాలను దక్షిణకొరియా నుండి నెట్టివేసి ఉత్తరకొరియాలో ఉన్న 38వ సమాంతర రేఖని అతిక్రమించి, కొరియా చైనాలను వేరు చేస్తున్న యాలూ నదివైపుకి

పురోగమించాడు. ప్రతీకారం తీర్చుకుంటామని చైనా ప్రధానమంత్రి చౌ యన్ లై చైనాలో భారత రాయబారిగా ఉన్న కె.ఎమ్. ఫణిక్కర్ ద్వారా పశ్చిమ రాజ్యాలను హెచ్చరించాడు. పశ్చిమ రాజ్యాలు హెచ్చరికను పట్టించుకోలేదు. అప్పుడు చైనా అలలు అలలుగా సైనిక దళాలను పంపించింది. అమెరికా సైనికుల్ని 38వ సమాంతర రేఖ దక్షిణానికి నెట్టివేసింది. కానీ ఈ ఘర్షణల్లో చైనా, కొరియా, అమెరికా సైనికులు పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. ఈ దశలో మరలా నెహ్రూ యుద్ధం ఆపివేయించాలని ప్రయత్నించాడు. కానీ అమెరికా హడావుడిగా ఐక్యరాజ్యసమితిలో చైనా దురాక్రమణదారుగా ప్రకటిస్తూ తీర్మానం చేయించింది. ఉత్తర కొరియాపై దురాక్రమణకు దిగింది చైనా కాదు, మాక్ ఆర్థర్ కనుక భారతదేశం ఆ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు చేసింది. మిలిటరీ ప్రతిష్టంభన ఏర్పడింది. భారతదేశం అలుపెరుగని ప్రయత్నాలు చేసినప్పటికీ ఇరుపక్షాల్ని యుద్ధవిరమణకి అంగీకరింపచేసి యుద్ధఖైదీల మార్పిడికి అంగీకారయోగ్యమైన ఒప్పందాన్ని కుదిరించడం 1953 జూన్ నాటికి గాని సాధ్యపడలేదు. కృష్ణమీనన్ ఒప్పందాన్ని రూపొందించాడు. దానిని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ, స్టాలిన్ మరణానంతరం సోవియట్ యూనియన్ శిబిరం ఆమోదించాయి. యుద్ధఖైదీల మార్పిడికి తటస్థదేశాల కమిషన్ నియమించబడింది. కమిషన్ అధ్యక్షుడు జనరల్ తిమ్మయ్య. యుద్ధఖైదీల మార్పిడి బాధ్యత జనరల్ తిమ్మయ్య నాయకత్వంలోని సంరక్షక దళానికి అప్పజెప్పబడింది.

కొరియా యుద్ధం అలీన విధానంలో భారతదేశం యొక్క విశ్వాసానికి, శాంతి పట్ల నిబద్ధతకు ఒక అగ్నిపరీక్ష. పరీక్షలో భారతదేశం నెగ్గింది. భారతదేశం తొలుత చైనా ఆగ్రహాన్ని, ఆ తర్వాత ఉత్తర కొరియా మొదటి దురాక్రమణ దారుగా ఓటు చేసి సోవియట్ యూనియన్ ఆగ్రహాన్ని చవిచూసింది. యుద్ధంలో పశ్చిమ దేశాల జోక్యంతో చేయి కలపనిరాకరించి, చైనాని దురాక్రమణదారుగా ప్రకటించ నిరాకరించి అమెరికా ఆగ్రహాన్ని భరించింది. ఇది ఇలా జరుగుతుండగా 1950లో చైనా టిబెట్‌పై దాడిచేసి టిబెట్‌ని కలుపుకొన్నది. నెహ్రూ కలతచెందినప్పటికీ కొరియా యుద్ధంపై వైఖరిని మార్చుకోలేదు. కమ్యూనిస్టు చైనాని గుర్తించి భద్రతా మండలి (Security Council) లో చైనాకి సభ్యత్వం ఇవ్వమని - ప్రత్యేకించి సోవియట్ యూనియన్ నిరసనతో వైదొలగిన పరిస్థితుల్లో ఐక్యరాజ్య సమితిపై ఒత్తిడి చేయడం కొనసాగించింది. అప్పుడు భారతదేశం దాదాపు కరువు పరిస్థితుల్లో ఉంది. కనుక అమెరికా అహారధాన్యాల సహాయం చాలా అవసరం. అయినప్పటికీ కొరియాలో అమెరికా వైఖరిపై తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు. భారతదేశం కృషి ఫలించింది. ఏ సరిహద్దురేఖని ఇరుపక్షాలూ మార్చాలని ప్రయత్నించాయో దానినే గుర్తించక తప్పలేదు.

ప్రపంచం అలీనవిధానం యొక్క విలువను గుర్తించింది. అలీన విధానాన్ని 'పిరికితనపు తటస్థత'గా త్రోసిపుచ్చలేకపోయింది. సోవియట్ యూనియన్ భారతదేశాన్ని కొత్తకోణం నుండి చూడడం ప్రారంభించింది. 'సోవియట్ యూనియన్ కామన్‌వెల్త్‌లో భారతదేశ వైఖరిని పూర్తిగా అభినందించింది. దానిలో ఉండడం కొనసాగించాలని ఆశిస్తుంది' అని సోవియట్ ప్రధాన మంత్రి బుల్గానిన్ భారతరాయబారి కె.పి.యస్.మీనన్‌కి చెప్పాడు. భారతదేశం పాశ్చాత్య సామ్రాజ్యవాదానికి లొంగిపోయిందనడానికి ఒక నిదర్శనంగా భావించబడిన సమయంలో ఇది పెద్ద మార్పు.

## ఇండో చైనా

కొరియా యుద్ధం ముగింపు ఆసియాకి తాత్కాలిక విరామాన్ని ఇచ్చింది. వియత్నాం యుద్ధంలో అలసి సొలసి ఉన్న ఫ్రెంచి వలసవాదాన్ని దరిచేర్చేందుకు పెద్ద ఎత్తున అమెరికా ఆసక్తితో సహాయం అందజేయడంతో 1954 ప్రారంభంలో కమ్యూనిజానికి వ్యతిరేకంగా జరుగుతున్న పవిత్ర యుద్ధాలకు ఇండో చైనా రంగ స్థలం కానున్నది. 1954 ఫిబ్రవరిలో యుద్ధ విరమణ కొరకు విజ్ఞప్తి చేసేందుకు నెహ్రూ చొరవ చూపాడు. పరిష్కారానికి తాను సూచించిన ఆరు సూత్రాల ప్రతిపాదనకు 1954 ఏప్రిల్‌లో జరిగిన కొలంబో సదస్సులో ఆసియా దేశాల నాయకుల మద్దతు కూడగట్టడానికి ప్రయత్నించాడు. ఇండో చైనాపై జరిగిన జనీవా సదస్సుకు (సభ్యదేశంగా భారతదేశం ఆహ్వానించబడలేదు) ఆసియా వైఖరిని వివరించేందుకు కృష్ణమీనన్‌ని పంపించారు. 1954లో నెహ్రూ ఢిల్లీలో కలవడంతో పాటు ఈ చర్యలు తెర వెనుక జరిపిన ఇతర చర్యలు, సంభాషణలు, పొందిన హామీలు ఇండోచైనా యుద్ధాన్ని అంతర్జాతీయం చేయకుండా నివారించాయి. లావోస్, కంబోడియాలను తటస్థం చేసే హామీని భారతదేశం చైనా నుండి పొందింది. లావోస్ కంబోడియాలలో అమెరికా స్థావరాలను అనుమతించబోమని గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్స్‌ల నుండి చైనాకు హామీ ఇప్పించింది. చర్చలు రాయబారాలలో భారతదేశం నిర్వహించిన పాత్రను గురించి ఫ్రెంచ్ ప్రధానమంత్రి పిర్రెమెండిస్ – ఫ్రాన్స్ జనీవాలో చేసిన ప్రస్తావన 'ఈ పది రాజ్యాల సదస్సులో తొమ్మిది తెరపైన ఉన్నాయి. మరి భారతదేశం (తెరవెనుక ఉంది)' – భారతదేశం చేసిన కృషిని వివరిస్తుంది. చైనా అభ్యర్థన మేరకు భారతదేశం ఇంటర్నేషనల్ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్‌గా నియమించబడింది. లావోస్, కంబోడియా, వియత్నాంలలోకి విదేశీ ఆయుధాల దిగుమతుల్ని పర్యవేక్షించడం కమిషన్ పనిలో భాగం. తాత్కాలికంగా వియత్నాం పక్షాన చైనా జోక్యం చేసుకునే ప్రమాదం, ఫ్రాన్స్‌కి అమెరికా సహాయాన్ని పెంచే ప్రమాదం నివారించబడ్డాయి. ఫ్రాన్స్ యుద్ధంతో

అలసిపోయింది. అమెరికా యుద్ధోన్మాద ఆలోచనలకు బ్రిటన్ భయపడింది. సోవియట్ యూనియన్ ప్రత్యేకించి స్టాలిన్ మరణానంతరం 'శాంతియుత సహజీవనం' దిశగా ఆలోచనలు సాగించింది.

అమెరికా కుటిల రాజనీతిజ్ఞతతో కంట్రోలు కమిషన్లు నిర్వీర్యం చేయబడ్డాయి. ఇండోచైనా ప్రచ్ఛన్న యుద్ధానికి రంగస్థలమయింది. ఆ తర్వాత శాంతి యత్నాలు నెహ్రూ సూచించిన పరిష్కారాల దిశలో సాగాయి.

## సూయజ్ కెనాల్

1956లో అలీన విధానాన్ని వదిలిపెట్టవలసిందిగా ఒత్తిడి చేసేందుకు బ్రిటన్ అమెరికాలు నైలునదిపై అశ్వాన్ ఆనకట్ట నిర్మాణం కొరకు వాగ్దానం చేసిన ఆర్థిక సహాయాన్ని నిలిపివేశాయి. దీనికి ప్రతిచర్యగా ఈజిప్టు సూయజ్ కాలువను జాతీయం చేసింది. ఈ చర్య సూయజ్ కాలువను ఉపయోగించుకునే దేశాల్ని కలవరపరిచింది. బ్రిటన్, ఫ్రాన్సులు సూయజ్‌కాలువపై అంతర్జాతీయ అదుపు ఉండాలని డిమాండు చేశాయి. సూయజ్‌కాలువను ఉపయోగించుకునే దేశాలలో భారతదేశం ఒకటి. కాని కాన్‌స్టాంటిల్ నోపుల్ సదస్సు (1888) తీర్మానాన్ననుసరించి సూయజ్ కాలువ ఈజిప్టులో అంతర్భాగం. సంయమనం పాటించవలసిందిగా కైరో, లండన్‌లను భారతదేశం అర్థించింది. సూయజ్‌కాలువ పై ఈజిప్టు అదుపు ఉండాలని, దానిని ఉపయోగించుకునే వారికి సలహాలు ఇచ్చే పాత్ర ఉండాలని, ఐక్యరాజ్యసమితి ఆదేశాలననుసరించి వివాదాలు పరిష్కరించుకోవాలని షరతులతో ఒప్పందాన్ని కుదిర్చాలని 1956 ఆగస్టులో లండన్ సదస్సులో ప్రయత్నించింది. భారతదేశ ప్రతిపాదనకు ఈజిప్టుతో సహా విస్తృతమైన మద్దతు లభించింది. ఆ తరువాత ఫ్రాన్సు, బ్రిటన్‌లు కలిసి ఇజ్రాయెల్ చేత ఈజిప్టుపై దాడి చేయించింది. సైన్యాన్ని సూయజ్‌లో దించినప్పుడు అమెరికా, ఐక్యరాజ్య సమితి కూడా ఈ చర్యని తీవ్రంగా ఖండించాయి. నెహ్రూ దీనిని 'నగ్నమైన దురాక్రమణ చర్య' అని, 'గత వలసవాద పద్ధతులను వెనక్కి తిప్పడం' అని పేర్కొన్నాడు. ఇజ్రాయెల్ సైన్యాల ఉపసంహరణ ఐక్యరాజ్యసమితి పర్యవేక్షణలో జరిగింది. శాంతి పరిరక్షణ దళాల్లో భారత సైనికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పరిష్కారానికి దారితీసిన తరువాతి చర్యలలో కూడా ఈజిప్టు ప్రజల ప్రయోజనాలకు భారతదేశం తన మద్దతు కొనసాగించింది. బ్రిటిషు వారి, అలాగే సూయజ్ కాలువను ఉపయోగించుకునే ఇతరుల ప్రయోజనాలకు కూడా రక్షణ కల్పించబడింది. ఆ తర్వాత బ్రిటన్ కూడా భారతదేశ వైఖరి యొక్క నిజాయితీని అంగీకరించింది. ఈ ఘటన భారత బ్రిటిషు సంబంధాలపై ఎలాంటి శాశ్వత ముద్ర వేయలేదు.

## హంగేరి

హంగేరిని సోవియట్ శిబిరం నుండి బయటికి రప్పించడానికి, జరిగిన తిరుగుబాటుని అణచివేయడానికి 1956 అక్టోబర్‌లో సోవియట్ యూనియన్ హంగేరిలో సైనిక చొరబాటు జరిపింది. ఐక్యరాజ్య సమితి చొరబాటుని ఖండించింది. చొరబాటుని విరమించుకోవలసిందిగా డిమాండు చేసింది. ఖండనలో పాల్గొనకుండా భారతదేశం గైరుహాజరయింది. యూరప్‌లో రెండు ప్రాంతాల ప్రభావం - పశ్చిమ దేశాల, తూర్పుదేశాల ప్రభావం రెండవ ప్రపంచ యుద్ధానంతర జీవితంలో ఒక వాస్తవం. పరిస్థితిలో చిన్న మార్పు కూడా పెద్ద ఉపద్రవానికి దారి తీస్తుంది. సోవియట్ యూనియన్‌ని చిన్నబుచ్చడం వల్ల ఒనగూడే ప్రయోజనం ఏమీలేదు. ఒక విధానపరమైన అంశంగా భావించి భారతదేశం గైరుహాజరయింది. ఖండించడం భవిష్యత్తులో రాజీపడడాన్ని కష్టతరం చేస్తుంది. నెహ్రూ సోవియట్ చర్యని విమర్శించారు. తన అయిష్టతని వ్యక్తం చేసేందుకు రెండు సంవత్సరాల వరకు బుడాపెస్ట్‌కి రాయబారిని పంపించలేదు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో కాశ్మీరు సమస్య వచ్చినప్పుడు సోవియట్ యూనియన్ గైర్హాజరై బదులు తీర్చుకుంది. తరువాత భారతదేశ ప్రయోజనాలకు భిన్నంగా వీటో హక్కుని వినియోగించుకుంది. భారతదేశంపై రెండు వైపుల నుండి ఒత్తిడి వచ్చింది. కానీ ఏ ఒక్కవైపుకీ మొగ్గు చూపలేదు.

## కాంగో

కాంగో స్వతంత్ర సమగ్రతల పరిరక్షణలో భారతదేశం అందజేసిన సహాయ సహకారాలు భారతదేశ విదేశాంగ విధానం యొక్క విజయాలుగా పేర్కొనవచ్చు. కాంగో 1960 జూన్ 30న బెల్జియం నుండి స్వతంత్రం పొందింది. కాంగోలో రాగితో సంపన్న రాష్ట్రంగా ఉన్న కటాంగా కాంగో నుండి స్వతంత్రతను ప్రకటించుకుంది. తిరుగుబాటు నాయకుడు షోంబేకి బెల్జియం మద్దతు ఉంది. బెల్జియం పౌరులకు రక్షణ కల్పించే నెపంతో బెల్జియం సేనలు కాంగో రాజధానికి తరలించబడ్డాయి. కాంగో ప్రధాన మంత్రి పాట్రిస్ లుమూంబా ఐక్యరాజ్య సమితి, అమెరికా, సోవియట్ యూనియన్ల సహాయం అర్థించాడు. సహాయం కొరకు తగు ఏర్పాట్లు చేయమని ఐక్యరాజ్యసమితి తన సెక్రటరీ జనరల్ డేగ్ హెమర్ షోల్డ్‌ని ఆదేశించింది. తరువాత కొద్ది నెలలు విదేశీ శక్తులు తమ కీలుబొమ్మలకు అధికారం అప్పజెప్పేందుకు చురుకుగా ప్రయత్నాలు చేశాయి. అమెరికా ప్రెసిడెంటు కసావుబుకి మద్దతు ఇచ్చింది. సోవియట్ యూనియన్ పాట్రిస్ లుముంబాకు దన్నుగా నిలబడింది. బెల్జియం సైనిక నాయకుడు 'మొబుటు'కి ఆశీస్సులందజేసింది. వారి ఎత్తుగడలు

లుముంబా హత్యకి దారితీశాయి. లుముంబా హత్య ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఐక్యరాజ్యసమితి చాలా నిర్ణయాత్మక పాత్ర నిర్వహించాలని కిరాయి సైనికుల్ని, విదేశీ సైనికుల్ని తొలగించాలని, అంతర్యుద్ధాన్ని ఆపాలని పార్లమెంటుని సమావేశపరిచి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నెహ్రూ డిమాండు చేశారు. అంతేకాక అందుకవసరమైన సైనికుల్ని పంపించడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. ఐక్యరాజ్యసమితి ఆమోదించింది. భద్రతామండలి 1961 ఫిబ్రవరి 21న ఒక తీర్మానాన్ని ఆమోదించింది. భారత సైనిక దళాలు జయప్రదంగా అంతర్యుద్ధాన్ని అణచివేశాయి. కటాంగా పై కేంద్ర ప్రభుత్వ అధికారాన్ని పునరుద్ధరించాయి. 1963 మార్చి నాటికి దేశ వ్యాప్తంగా శాంతి భద్రతలు పునరుద్ధరించబడ్డాయి.

డేగ్ హేమర్‌షోల్డ్ భారతదేశాన్ని అభినందించారు. అవి భారతదేశ అలీన విధానానికి అత్యుత్తమ ఘడియలు. కొత్తగా స్వతంత్రం పొందిన ఆఫ్రికా, ఆసియా దేశాలకు సహాయపడిన ఘడియలు. ఐక్యరాజ్యసమితి లాంటి బహుళజాతి సంస్థల పాత్రని బలోపేతం చేసిన ఘడియలు.

నెహ్రూ అలీన విధానం సక్రమంగా పనిచేయగలుగుతుందని, అలీన దేశాలు నూతనంగా ఆవిర్భవిస్తున్న దేశాలకు మద్దతుగా నిలిచి పనిచేయాలని నెహ్రూ చెప్పారు. కొత్తగా స్వతంత్రం పొందిన దేశాలు స్వతంత్రాన్ని రుచి చూడకముందే వాటిని కబళించడానికి అగ్రరాజ్యాలు పొంచివుంటాయిని హెచ్చరించారు.

## అగ్రరాజ్యాలతో సంబంధాలు-అమెరికా

యుద్ధానంతర ప్రపంచంలో అగ్రరాజ్యమయిన అమెరికాతో సత్సంబంధాలకు భారతదేశ అలీన విధానం ఆటంకం కాలేదు, అభిలషణీయమయింది. సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాలు, అభివృద్ధి ప్రయత్నాలకు సహాయం, ఆహారధాన్యాలు, జాతి నిర్మాణానికి, ప్రజాస్వామ్య యత్నాలకు నైతిక మద్దతు - అన్నీ కూడా అమెరికా సమకూర్చగలదని భారతదేశం అశించింది. కాని కాశ్మీర్‌పై అమెరికా వైఖరి ఈ ఆశల్ని కలచి వేసింది. 1940 దశాబ్దం చివరిలో, 1950 దశాబ్దం ప్రారంభంలో అమెరికా దాని మిత్రరాజ్యాల ఆధిపత్యంలో ఉన్న ఐక్యరాజ్యసమితి యొక్క భద్రతామండలి కాశ్మీర్‌లో పాకిస్తాన్ సైనిక దళాలున్నాయని ఐక్యరాజ్యసమితి కమిషన్ నివేదించిన తర్వాత కూడా పాకిస్తాన్ దురాక్రమణపై, భారతదేశ ఆరోపణపై నిర్ణయాన్ని తలాయించింది. భారతదేశానికి అనుకూలంగా ఉన్న ఐక్యరాజ్యసమితి మధ్యవర్తుల నిర్ధారణలన్నీ విస్మరించబడ్డాయి. ఐక్యరాజ్యసమితి ఆదేశాలను భారతదేశం పాటించలేదనే కల్పిత కథని పాశ్చాత్య దేశాలు తమ శక్తివంతమైన ప్రచార సాధనాల

ద్వారా ప్రచారం చేశాయి. ఆహార ధాన్యాల కొరకు చేసిన విజ్ఞప్తులు పక్కన పెట్టాయి. 1949లో నెహ్రూ అమెరికా పర్యటనలో దేశంలోని కరవు పరిస్థితుల్ని వివరించినప్పటకీ, నెహ్రూ ఆ విషయాన్నే ప్రస్తావించలేదన్నది అమెరికా. చైనా, సోవియట్ యూనియన్ సహాయం అందించేందుకు ముందుకు వచ్చిన తర్వాత అమెరికా ఆహార ధాన్యాల నౌకలను పంపించింది.

1950 దశాబ్దం ప్రారంభంలో భారతదేశం కమ్యూనిస్టు చైనాని గుర్తించడాన్ని అమెరికా జీర్ణించుకోలేకపోయింది. ఐక్యరాజ్య సమితిలో చైనాకు ప్రాతినిధ్యం ఇవ్వాలన్న భారతదేశ వైఖరి అమెరికాకు రుచించలేదు. కొరియాపై భారతదేశం తీసుకున్న తొలి వైఖరిని అమెరికా స్వాగతించింది. తర్వాత వైఖరిని నిరసించింది. పాకిస్తాన్‌కి మిలటరీ సహాయాన్ని అందజేసేందుకు 1952 లోనే సిద్ధపడింది. 1953లో బాహాటంగా ప్రకటించింది. ఆయుధాలు సోవియట్ కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా ప్రయోగించడానికని బయటికి చెప్పింది. కాని అవి హిందూ కుష్ పర్వతాలు దాటి వెళ్లగలిగే ఆయుధాలు కావు. భారతదేశంపై ప్రయోగించడానికి పనికి వస్తాయి. భారతదేశంపై ప్రయోగించబడవని అర్థం పర్థం లేని హామీలు గుప్పించి భారతదేశ అభ్యంతరాలను అమెరికా తోసిపుచ్చింది. పాకిస్తాన్‌ని Cento, Seato లలో చేర్చుకుని ప్రచ్ఛన్న యుద్ధాన్ని ఉపఖండంలోకి తెచ్చినందుకు నెహ్రూ ఆందోళన వ్యక్తం చేశాడు. గోవా విషయంలో కూడా భారతదేశ ఆందోళనను అమెరికా పరిగణనలోకి తీసుకోలేదు. గోవా పోర్చుగల్ రాష్ట్రమని 1955 లో పోర్చుగల్ వాదనని సమర్థించింది. స్వతంత్రం వచ్చిన తర్వాత 14 ఏళ్ళు ఓపికగా నిరీక్షించిన తర్వాత భారతదేశం 1961లో గోవాని బలప్రయోగంతో విముక్తి చేసినప్పుడు అమెరికా తీవ్రంగా విమర్శించింది.

ప్రపంచంలో రెండు అత్యంత పెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య సంబంధాలు సజావుగా లేకపోవడానికి కారణం రెండింటికి ప్రచ్ఛన్నయుద్ధం పట్ల వేర్వేరు దృక్పథాలు ఉండడమే. కమ్యూనిజం పట్ల తీవ్రమైన వ్యతిరేకతతో అమెరికా ఇతరులకు ప్రత్యామ్నాయ ప్రాధాన్యతలు ఉండడాన్ని అంగీకరించలేకపోయింది. ప్రపంచం వాషింగ్టన్ నుండి చూస్తే నల్లగా తెల్లగా కనిపించింది. ఢిల్లీ నుండి చూస్తే బూడిద రంగులో కనిపించింది. స్వతంత్ర పోరాటంలో నెహ్రూకి కమ్యూనిస్టులు మంచి మిత్రులుగా తెలుసు. ఆయన మార్క్సిజంతో చాలా ఎక్కువగా ప్రభావితుడయ్యాడు. నెహ్రూకి కమ్యూనిస్టులతో విభేదాలున్నప్పటికీ అధికారంలోకి వచ్చిన తర్వాత కమ్యూనిస్టు తిరుగుబాటుని అణచివేయవలసి వచ్చినప్పటికీ ఆయన వారిని చెడ్డ వారిగా పరిగణించలేదు. ఆర్థిక, ఆయుధ, సహాయం కొరకు భారతదేశం ప్రచ్ఛన్న

యుద్ధంలో పశ్చిమ దేశాల సరసకు చేరదలచుకోలేదు. అంతేగాక భారతదేశం ఆసియా, ఆఫ్రికా దేశాలను అలీన విధానం పాటించమని ప్రోత్సహించింది.

భారతదేశం పట్ల అమెరికా వ్యతిరేకతకు కారణం కేవలం ప్రచ్ఛన్న యుద్ధంలో భారతదేశం అమెరికా పక్షం వహించ నిరాకరించడమే కాదు. బ్రిటీష్ సామ్రాజ్యాన్ని కూలదోయడం కారణంగా కాంగ్రెస్ నాయకుల పట్ల వ్యతిరేకత, బ్రిటీష్ వారికి అనుకూలంగా ఉంటూ యుద్ధ ప్రయత్నాలకు సహకరించింది. కనుక ముస్లిం లీగు – పాకిస్తాన్ పట్ల సానుకూల వైఖరి అమెరికాకు వారసత్వంగా సంక్రమించింది. భారతదేశం సమైక్యంగా ఉండదని అమెరికా నమ్మిక. భారతదేశ వైవిధ్యం, భారతదేశ విచ్ఛిన్నతకు దారి తీస్తుందని నమ్మింది. ఫలితంగా కమ్యూనిజం వ్యాప్తిని అడ్డుకునే బలమైన కోటగా భారతదేశాన్ని పరిగణించలేదు. పశ్చిమరాజ్యాలకు భారతదేశం యొక్క విశ్వసనీయత, స్థిరత్వం పై బలంగా నాటుకున్న సందేహాలున్నాయి. అమెరికా విధానం యొక్క ప్రధానమైన లక్షణం అధికారం, సామ్రాజ్యవాదం. భారతదేశ నాయకులు సామ్రాజ్యవాదాన్ని అపఖ్యాతి పాలు చేసేందుకు బాహాటంగా కృషి చేశారు. అంతర్జాతీయ రాజకీయాల్లో సామ్రాజ్యవాద శక్తిని బలహీనపరిచే క్రమానికి దోహదం చేశారు. అమెరికా పాలనా వ్యవస్థలో బలమైన వలసవాద అనుకూల ధోరణి ఉంది. యుద్ధం తర్వాత ఫ్రెంచి, బ్రిటీష్ వలసలని నిలబెట్టేందుకు మద్దతు ఇచ్చింది. ఆఫ్రికాలో పోర్చుగీసు వలస వాదాన్ని దక్షిణాఫ్రికా, రొడీషియాలలో వోర్స్టర్, ఇయాన్‌స్మిత్‌ల వలస వాదాలను సమర్థించింది. భారతదేశం యొక్క బలమైన సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరి వీరికి ఇంపితం కాదు.

అలాగని భారత అమెరికా సంబంధాలు నిరంతర శత్రుత్వంతో సాగాయి అనుకోవడం తప్పు. ఇరుదేశాల ప్రజల మధ్య స్నేహ సంబంధాలున్నాయి. అమెరికా సాంకేతిక పరిజ్ఞానానికి యంత్రాలకు వనరు కనుక ఆర్థిక సంబంధాలు అభివృద్ధి చెందాయి. భారతదేశంలో విస్తృతంగా ప్రభావితం చేయగల అభిప్రాయం అమెరికాకు అనుకూలంగా ఉంది. అమెరికాలోని ఛెస్టర్ బౌల్స్, జాన్ షెర్మన్ కూపర్, సెనేటర్ ఫుల్‌బ్రైట్ లాంటి ఉదారవాదులు భారతదేశం పట్ల సానుకూల వైఖరితో ఉన్నారు. 1950 దశాబ్దం చివరికి భారత, అమెరికా సంబంధాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. అందుకు కారణం భారతదేశ విధానాల పట్ల సరియైన అవగాహన ఏర్పరచుకొనడం కావచ్చు, సోవియట్ మైత్రి, భారతదేశ స్థాయిని పెంచి ఉండవచ్చు. సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు కెనడి ప్రభుత్వం 1961 లో భారతదేశాన్ని అభిమానించిన వ్యక్తి నెహ్రూకి సన్నిహితుడైన జాన్ గాల్ బ్రెయిత్‌ని రాయబారిగా పంపించింది.

కానీ 1962 లో భారతదేశంపై చైనా దాడి పరిస్థితిని పూర్తిగా మార్చివేసింది.

దిగ్భ్రమకు గురైన నెహ్రూ సహాయం కొరకు కెనడీని అర్థించారు. గాల్ బ్రెయిత్ మధ్యవర్తిగా ఉండి పరిస్థితిని ఒక మేరకు చక్కదిద్దాడు.

కానీ ఈ కథ తన గొప్ప మిత్రుడు, శ్రేయోభిలాషి చైనా చేసిన ద్రోహగాథలో అంతర్భాగం.

## సోవియట్ యూనియన్

సోవియట్ యూనియన్‌తో భారతదేశ సంబంధాలు సాదాసీదాగా ప్రారంభమై గాఢానుబంధంగా అభివృద్ధి చెందాయి. భారతదేశం ఇంకా సామ్రాజ్యవాద ప్రభావంలో ఉందని సోవియట్ యూనియన్ భావించింది. భారత స్వాతంత్ర్య పోరాటం కాంగ్రెస్ నాయకుల పట్ల కమ్యూనిస్టులకు గల విరుద్ధభావాల ప్రభావం నెహ్రూ ప్రభుత్వంపై పడింది. భారత కమ్యూనిస్టు పార్టీ భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా తెలంగాణాలో తిరుగుబాటు చేసింది. కామన్‌వెల్త్‌లో ఉండాలన్న భారతదేశ నిర్ణయాన్ని సామ్రాజ్యావాదానికి లొంగిపోవడంగా పరిగణించింది సోవియట్ యూనియన్. దీనినే సోవియట్ రాయభారి నోవికోవ్ "భారతదేశానికి, ప్రపంచానికి దుర్దినం" గా వర్ణించాడు.

కాని నెహ్రూ 1946 తాత్కాలిక ప్రభుత్వ ఉపాధ్యక్షునిగా ఉపన్యసించినప్పటినుండి కూడా సోవియట్ పట్ల స్నేహపూరిత వైఖరితో ఉన్నారు. ఆయన సోవియట్ యూనియన్‌ని అభిమానించారు. 1927లో సందర్శించారు. భారతదేశంలో కమ్యూనిస్టు తిరుగుబాటుని సోవియట్ శత్రువైఖరికి నిదర్శనంగా వాఖ్యానించ నిరాకరించారు. స్వాతంత్ర్యానికి ముందే దౌత్య సంబంధాలు పెట్టుకోవాలని ఆకాంక్షించారు. తన సోదరి విజయలక్ష్మి పండిట్‌ని రాయబారిగా పంపించారు. స్టాలిన్ ఆమెకి ఇంటర్వ్యూ కూడా ఇవ్వలేదు.

కాని కొరియా యుద్ధ సంక్షోభంలో భారతదేశం వ్యవహరించిన తీరు సామ్రాజ్యవాద పలుకుబడికి లోనుకాకుండా స్వతంత్రంగా వ్యవహరించడంతో 1951 - 52 నాటికి సోవియట్ కాఠిన్యాన్ని తగ్గించుకున్నది. చైనాతో పాటు రష్యాకూడా ఆహార ధాన్యాల నౌకలు పంపించింది. నూతన రాయబారి, తర్వాత కాలంలో కానున్న రాష్ట్రపతి ఎస్.రాధాకృష్ణన్‌ని స్టాలిన్ కొన్ని సార్లు కలిశాడు. స్నేహ ఒప్పందాన్ని ప్రతిపాదించాడు. కాశ్మీర్ సమస్యపై ఐక్యరాజ్య సమితిలో మద్దతు సూచనలు ప్రారంభమయ్యాయి. నెహ్రూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేయవద్దని భారత కమ్యూనిస్టు పార్టీకి సూచనలు అందాయి. 1954లో స్టాలిన్ మరణానంతరం ఈ క్రమం వేగవంతం చేయబడింది. పాకిస్తాన్ సెంటో (Cento), సీటో (Seato) లలో

చేరిన తర్వాత సోవియట్ యూనియన్ భారతదేశానికి సైనిక పరికరాలను ఇస్తానని ప్రతిపాదించింది. కానీ ఉచితంగా సైనిక సహాయాన్ని పొందగూడదని తన విధానాలకి అనుగుణంగా భారతదేశం సహాయాన్ని నిరాకరించింది. 1955లో నెహ్రూ సోవియట్ యూనియన్ సందర్శించాడు. అదే సంవత్సరంలో కృశ్చేవ్, బుల్గానిన్ లు భారతదేశం సందర్శించారు. 1956లో సోవియట్ యూనియన్ అదుపులో ఉండి అన్ని కమ్యూనిస్టు పార్టీలకు సైద్ధాంతిక పంథాని నిర్దేశించిన కొమింటర్న్ 20వ కాంగ్రెస్, స్టాలిన్ మరణానంతరం స్టాలిన్ విధానాలను రద్దు చేసే క్రమంపై ఆమోదముద్ర వేసింది. వివిధ సామాజిక వ్యవస్థలు గల దేశాల మధ్య శాంతియుత సహజీవనాన్ని ప్రస్తావించడం ద్వారా ప్రచ్ఛన్న యుద్ధ వైఖరిని సరళతరం చేసే ప్రయత్నం చేసింది. అది మార్క్సిజంలో పూర్తిగా నూతన భావనని "సోషలిజానికి శాంతియుత మార్గాన్ని" ప్రవేశపెట్టింది. అమెరికా ఈ అవకాశాల కనుగుణంగా స్పందించడంలో విఫలమయింది. పరస్పర సహకారానికి అడ్డుగా ఉన్న సైద్ధాంతిక అవరోధాలు తొలగించబడ్డాయి. కనుక ఇది భారత్, సోవియట్ సంబంధాలకు ఎంతో దోహదపడింది. కాశ్మీర్‌పై భారత వైఖరికి 1955 నుండి సోవియట్ యూనియన్ పూర్తి మద్దతును ఇచ్చింది. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో కాశ్మీర్‌పై భారతదేశానికి ప్రతికూలంగా ఉన్న తీర్మానాలను అడ్డుకునేందుకు సోవియట్ యూనియన్ 1956 నుండి వీటోని ప్రయోగించింది. వీటోని ప్రయోగిస్తానని బెదిరించింది. సోవియట్ యూనియన్ రక్షణగా నిలబడడం ప్రారంభించేవరకు భద్రతామండలిలో భారతదేశ పరిస్థితి చాలా ఇరకాటంలో ఉంది. కనుక సోవియట్ వీటో బెదిరింపులని, వీటో చేయడాన్ని తక్కువ అంచనా వేయకూడదు. కాశ్మీర్‌పై ఇచ్చిన నిలకడయైన మద్దతు భారత, సోవియట్ మైత్రీ బంధాన్ని దృఢతరం చేసింది. రెండు దేశాలు కూడా వలసవాదానికి వ్యతిరేకంగా ఒకే వైఖరిని అవలంబించాయి. ఐక్యరాజ్యసమితిలో గోవా విలీనం సమస్యపై సోవియట్ యూనియన్ అమెరికాని వ్యతిరేకించి భారతదేశానికి మద్దతునిచ్చింది.

ప్రణాళిక ప్రాతిపదికగా పారిశ్రామికీకరణలో – ప్రత్యేకించి భారీ పరిశ్రమలో పబ్లిక్ సెక్టర్‌కి ప్రధానమైన పాత్ర – ఆర్థికాభివృద్ధిలో భారతదేశం ఎంపిక చేసుకున్న పంథా సోవియట్ యూనియన్ సన్నిహితం చేసింది. పశ్చిమ రాజ్యాలు, ప్రత్యేకించి అమెరికా సహాయపడేందుకు తటపటాయిస్తున్న సమయంలో, 1956 భిలాయ్ ఉక్కు కర్మాగారం నిర్మించడంలో సహాయపడింది. ఆ తర్వాత బ్రిటీష్ సహకారంతో దుర్గాపూర్‌లో, జర్మన్ సహకారంతో రూర్కెలా ఉక్కు కర్మాగారాలు నిర్మించబడ్డాయి. బొకారో కర్మాగారానికి అమెరికా సహాయం కోరగా, అది అంత సంసిద్ధత చూపకపోవడంతో మరలా సోవియట్ ముందుకు వచ్చి సహాయపడింది. ఆ తర్వాతి

సంవత్సరాలలో చమురు అన్వేషణలో కూడా కీలకపాత్ర పోషించింది. భారతదేశం "ఉక్కులో 30 శాతం, చమురులో 35 శాతం, విద్యుత్ శక్తిలో 20 శాతం, భారీ విద్యుత్ పరికరాలతో 65 శాతం, యంత్రాలనుత్పత్తి చేసే భారీయంత్రాల ఉత్పత్తిలో 85 శాతం సోవియట్ సహకారంతో నిర్మించబడిన భారీ పరిశ్రమల ద్వారా జరుగుతుందని 1973 - 74 లో అంచనా వేయబడింది."

దలైలామా భారతదేశంతో ఆశ్రయంకోరడం, భారత చైనా సరిహద్దులో ఘర్షణలతో 1969 నుండి భారత చైనాల మధ్య సంబంధాలు క్షీణించడం మొదలయింది. అప్పుడు సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు సోదరదేశం పక్షం వహించలేదు. తటస్థంగా వుంది. ఆ పరిస్థితులలో తటస్థంగా వుండడమే పెద్దసహాయం. నెహ్రూ సోవియట్ వైఖరి ప్రాధాన్యతను గుర్తించారు. సోవియట్ యూనియన్‌కి ఇంకా సన్నిహితుడయ్యాడు. అదే ఘటనతో సోవియట్ చైనా విభేదాలు ప్రారంభమయ్యాయి. అదే సంవత్సరం మిలటరీ సరఫరాల మొదటి ఒప్పందంపై భారతదేశం సోవియట్ యూనియన్ సంతకాలు చేశాయి. 1960లో భారతదేశం చైనాతో వివాదం వున్న ప్రాంతాలలో రోడ్లు నిర్మించేందుకు సరఫరాలను చేరవేసే విమానాలు, హెలికాప్టర్లు ఇంజనీరింగు పరికరాలు సోవియట్ యూనియన్ నుండి పొందింది. 1962 మధ్యలో మిగ్ విమానాలనుత్పత్తి చేయడానికి భారతదేశాన్ని అనుమతించే ఒప్పందం కుదుర్చుకొనబడింది. ఇది సోవియట్ యూనియన్ ఒక కమ్యూనిస్టేతర దేశాన్ని అధునాతన సైనిక పరికరాలను తయారు చేసుకొనడానికి అనుమతించిన మొదటి ఒప్పందం. సోవియట్ యూనియన్ అప్పటి వరకు చైనాకు కూడా అనుమతినివ్వలేదు.

1962 అక్టోబరులో చైనా భారతదేశంపై దాడి చేసినప్పుడు మరలా సోవియట్ యూనియన్ తటస్థత పాటించింది. అందుకు క్యూబా క్షిపణి సంక్షోభం తారాస్థాయిలో వున్నప్పుడు దాడి జరగడం పాక్షికంగా కారణం కావచ్చు. ఆ తరువాత 1962 డిసెంబరులో సోవియట్ ముఖ్యనాయకుడు సుస్లోవ్ సుప్రీం సోవియట్ సమావేశంలో యుద్ధానికి చైనాదే బాధ్యత అని విస్పష్టంగా ప్రకటించాడు.

భారత చైనా యుద్ధకాలంలో పశ్చిమ రాజ్యాలలా గాక సోవియట్ యూనియన్ చాలా ఆయుధాల విక్రయం ఒప్పందాలపై సంతకాలు చేసింది. హెలికాప్టర్లు, టాంకులు, మొబైల్ రాడార్ సెట్లు, భూమిపై నుండి గగనంలోకి ప్రయాణించగల క్షిపణులు, సబ్‌మేరిన్లు, క్షిపణినౌకలు, గస్తీ నౌకలు సరఫరా చేసింది మిగ్ విమానాల నుత్పత్తి చేసుకొనడానికి, నౌకాస్థావరాల నిర్మాణానికి తోడ్పడింది. హెలికాప్టర్లు, టాంకులు, సబ్‌మెరైన్లు, సరఫరా చేసింది మిగ్ విమానాల ఉత్పత్తి సౌకర్యాల అభివృద్ధికి నిర్మాణానికి తోడ్పడింది. ఈ స్వతంత్ర ఉత్పత్తి స్థావరం భారతదేశం 1971 యుద్ధంలో

విజయం సాధించడానికి తోడ్పడింది. మరీ ముఖ్యంగా అమెరికా లాగా గాక యుద్ధపరికరాల ఉపయోగించటాన్ని పర్యవేక్షించేందుకు వారి సైనిక స్థావరాన్ని నెలకొల్పడం గాని లేక యుద్ధపరికరాల్ని సరఫరా చేసేందుకు కఠినతరమైన షరతుల్ని విధించడంగాని చేయలేదు.

సోవియట్ యూనియన్ కూడా భారతదేశంతో సంబంధంతో ప్రయోజనం పొందింది. సోవియట్ మైత్రిని కోరుకుంటూ అమెరికాకు ఉపగ్రహాలుగా మారడానికీ యిష్టపడని, కొత్తగా స్వతంత్రం పొందిన ఆఫ్రికా, ఆసియా ప్రపంచదేశాలకు భారతదేశం ముఖ్యమైన ముఖద్వారం. ఇది ప్రచ్ఛన్న యుద్ధంలో సోవియట్ యూనియన్‌కి సహాయపడింది. సోవియట్లకు కూడా భారతదేశం లాగానే చైనాతో సుదీర్ఘమైన సరిహద్దు వుంది. పరిష్కరింపబడని సరిహద్దు వివాదాలూ వున్నాయి. భారతదేశంతో మైత్రి చైనాని అదుపులో వుంచింది. భారతదేశాల నుండి సమతుల్యతా మొగ్గుని మార్చింది. ఇది కూడా సోవియట్‌కి అనుకూలమైన అంశమే. అమెరికా ప్రేరిత ఒప్పందాలు, మిలటరీ స్థావరాలతో పరివేష్టించబడిన సోవియట్ యూనియన్‌కి మిత్రులు కావాలి. ఇతర దేశాలతో సమానస్థాయితో మిత్రత్వం నెరపింది. అంతేకాక లోపాలున్నప్పటికి మార్క్సిజం జాత్యాహంకారానికి వ్యతిరేకమైనది, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకమైనది, పేదలకు అనుకూలమైనది. ఇది ఆవిధంగా భారత సోవియట్ మైత్రి భారత విదేశాంగ విధానంతో ముఖ్యమైన అంశంగా ఆవిర్భవించింది. అభివృద్ధి చెందింది.

## పొరుగు దేశాలతో సంబంధాలు

1962 వరకు భారతదేశం ఒక్క పాకిస్తాన్ మినహాయించి మిగిలిన అన్ని పొరుగు దేశాలతో సత్సంబంధాలు కలిగి వుంది. 1950లో నేపాల్‌తో శాంతి స్నేహ ఒప్పందంపై సంతకం చేసింది. ఇది భారతదేశం ద్వారా వాణిజ్య రవాణాకు అవకాశం కల్పించింది. ఇరుదేశాలు పరస్పర రక్షణకు బాధ్యత వహించడం వలన నేపాల్ సర్వసత్తాక అధికారానికి రక్షణ కల్పించింది. బర్మాలో స్థిరపడిన భారతీయుల సమస్య, సరిహద్దు సమస్య స్నేహపూర్వకంగా పరిష్కారమయ్యాయి. శ్రీలంకలో స్థిరపడిన తమిళు ల సమస్య అంత సులభంగా పరిష్కారమయ్యేది కాదు. ఉద్రిక్తతలు వున్నాయి. కాని ఈకాలంలో అవి రగుల్కొనలేదు. ఇతరత్రా స్నేహ సంబంధాలు కొనసాగాయి. కాని పాకిస్థాన్‌తో, తరువాత సంవత్సరాలలో చైనాతో తీవ్ర సమస్యలు ఎదురయ్యాయి. వాటితో సంబంధాలు దిగువన వివరంగా చర్చించబడ్డాయి.

## పాకిస్తాన్

నెహ్రూ ఇతర నాయకులు దారికిరాని సమస్యకు పరిష్కారంగా అయిష్టంగానే దేశవిభజనకు అంగీకరించారు. విభజనతో వైరం కూడా అంతమవుతుందని ఆశించారు. కాని సమస్య తీవ్రత అంతర్జాతీయ రంగానికి బదిలీ చేయబడింది. గతంలో ఎన్నడూ లేనంత పెద్ద ఎత్తున జరిగిన మత ఘర్షణలు, ప్రజల వలసలు సంబంధాలను దెబ్బతీశాయి. కాని స్వతంత్రం వచ్చిన రెండు నెలల తరువాత 1947అక్టోబరులో కాశ్మీరుపై పాకిస్తాన్ దాడి కార్యకారణ సంబంధంతో చాలా ఘటనలకు దారి తీసింది. దాని యిటీవలి పరిణామమే కార్గిల్ యుద్ధం. 7వ అధ్యాయంలో వివరించినట్లు భారత్‌లో కాశ్మీర్ విలీనం చిక్కు సమస్య. బ్రిటీషు పాలకులు దేశాన్ని వదలి వెళ్ళినప్పుడు భారతీయ రాజుల చేత నామమాత్రంగాను, పరోక్షంగా బ్రిటీషు వారి చేతను పాలింపబడిన అత్యధిక స్వదేశీ సంస్థానాలు ఇటు భారతదేశంలో గాని అటు పాకిస్థాన్‌లో గాని విలీనమయ్యాయి. బ్రిటీషు పాలకులు ప్రోత్సహించిన దేశాన్ని ముక్కలు చెక్కలు చేసే ప్రమాదం నివారించ బడింది. కాని బ్రిటీషు అధికారులు అలాగే పాకిస్తాన్ ప్రోత్సాహంతో కొన్ని సంస్థానాలు స్వతంత్ర రాజ్యాలను గురించి కలలుగనడం ప్రారంభించాయి. హైదరాబాద్, జూనాగడ్, కాశ్మీరు అలాంటి సంస్థానాలు. హైదరాబాద్, జునాగడ్ భారతదేశంచే పరివేష్టింపబడి ఉన్నాయి. కనుక వాటికి అలాంటి అవకాశం బహు తక్కువ. కానీ కాశ్మీర్ సరిహద్దు పాకిస్తాన్‌తో ఉంది. మెజారిటీ ప్రజలు ముస్లింలు, హిందూ పాలకుడు నెహ్రూ, కాంగ్రెస్‌కి సన్నిహితుడైన షేక్ అబ్దుల్లా నేషనల్ కాన్ఫరెన్స్ నాయకత్వంలో ప్రజాస్వామ్యం కొరకు ప్రజాఉద్యమం సమస్యని జటిలం చేయడానికి ఇంధనంగా పనిచేశాయి. మహారాజా యథాస్థితిని కొనసాగిస్తూ తాను ఒక నిర్ణయానికి వచ్చేందుకు ఒక సంవత్సరం వ్యవధి కోరాడు. పాకిస్తాన్ అంగీకరించింది. భారతదేశం ఎన్నికల ద్వారా ప్రజాభిప్రాయాన్ని కనుగొని ఆ తర్వాత తెలియజేయాలనుకొన్నది. కాశ్మీర్‌లో ప్రజాభిప్రాయం తనకనుకూలంగా ఉండకపోవచ్చని ఆందోళన చెందింది. పాకిస్తాన్ కాశ్మీర్‌పై దాడి చేసేందుకు సరిహద్దు రాష్ట్రం నుండి తెగల ప్రజలనబడే వారికి తోడుగా సాయుధదళాల్ని పంపించింది. మహారాజా భారతదేశ సహాయాన్ని అర్థించాడు. కానీ కాశ్మీర్ భారతదేశంలో విలీనమైతేనే సైన్యాన్ని పంపించగలుగుతుంది. ఇతర వందలాది సంస్థానాధీశులలాగానే మహారాజా విలీన ఒప్పందంపై సంతకం చేశాడు. కాశ్మీర్ భారతదేశంలో భాగమైంది. భారత సైన్యాలు సకాలంలో శ్రీనగర్ చేరాయి. రాజధాని నగరం దురాక్రమణ దారుల వశం కాకుండా అడ్డుకున్నాయి. భారతదేశం పాకిస్తాన్ 'వాలంటీర్లను' వెనక్కి నెట్టివేశాయి. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేసింది. అక్కడ న్యాయం పొందడానికి బదులుగా భారతదేశం ప్రచ్ఛన్నయుద్ధ

రాజకీయాలలో మొదటి పాఠం నేర్చుకుంది. భారతదేశం యొక్క అసమ్మతిని, ఆగ్రహాన్ని, ముస్లింలీగు, పాకిస్తాన్‌ల పట్ల అనురాగం ఆసక్తిని పెంచి పోషించడం కొనసాగించిన బ్రిటీషువారి ప్రోత్సాహంతో, వ్యూహాత్మక కారణాల రీత్యా సోవియట్ యూనియన్‌కి వ్యతిరేకంగా అమెరికా పాకిస్తాన్‌తో జట్టుకట్టింది. భారతదేశం సామ్రాజ్యవాదానికి విధేయత కొనసాగిస్తుందా లేదా? అనే విషయంపై సోవియట్ యూనియన్ ఒక నిర్ణయానికి రాలేకపోయింది. అందువల్ల మద్దతు ఇవ్వలేదు. అయినప్పటికీ భారతదేశం సైనిక పరిస్థితి తనకనుకూలంగా ఉన్నప్పటికీ ఐక్యరాజ్యసమితి యుద్ధవిరమణ తీర్మానాన్ని ఆమోదించింది. ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేసినందుకు ప్లెబిసైటు నిర్వహిస్తామన్నందుకు నెహ్రూ తర్వాత తీవ్ర విమర్శలకు గురయ్యాడు. ఈ విమర్శలు అర్థరహితం. ఎందుకంటే భారతదేశం ఐక్యరాజ్య సమితికి ఫిర్యాదు చేసి ఉండకపోతే పాకిస్తాన్ చేసివుండేది. ప్లెబిసైటు జరపమని కోరివుండేది. ప్లెబిసైటు నిర్వహించడానికి తర్వాత భారతదేశం నిరాకరించడం వల్ల అపార్థం చేసుకొనబడింది. 1948 ఆగస్టు ఐక్యరాజ్యసమితి తీర్మానం ప్లెబిసైటు నిర్వహించడానికి రెండు షరతుల్ని విధించిందనే అంశానికి అంతగా ప్రచారం లభించలేదు. ఒకటి : పాకిస్తాన్ సైన్యాల్ని జమ్మూ కాశ్మీర్ నుండి విరమించుకోవాలి. రెండు : శ్రీనగర్ పరిపాలనాధికారం రాష్ట్రం మొత్తానికి వర్తింపచేయాలి. ఈ షరతులు అమలు జరగలేదు. ఈ కాలంలో కాశ్మీరు రాజ్యాంగ పరిషత్ కొరకు ఎన్నికలు జరిపింది. రాజ్యాంగ పరిషత్ భారతదేశంలో విలీనం కావడానికి ఓటు వేసింది. భారత ప్రభుత్వం ప్లెబిసైట్‌కి సరియైన ప్రత్యామ్నాయం రాజ్యాంగపరిషత్ ఓటు అనే వైఖరి తీసుకుంది. తర్వాత కాశ్మీర్ భారత సాధారణ ఎన్నికల్లో పాల్గొన్నది. రాష్ట్ర ఎన్నికలు నిర్వహించింది. ఆ విధంగా ప్లెబిసైటుపై చర్చని అసంబద్ధం చేసింది. ఏమైనప్పటికీ ముస్లిములు సహజంగా ముస్లింలీగుకి విధేయులుగా ఉంటారని, ముస్లిం మెజారిటీ ప్రాంతాలు పాకిస్తాన్‌కి చెందుతాయని, ఆ ప్రాతిపదికన కాశ్మీరు పాకిస్తాన్‌కి చెందాలని భారత జాతీయోద్యమ చరిత్రలో పరిచయం లేని పాశ్చాత్య పరిశీలకుల కొరకు పాకిస్తాన్ చేసే వాదన. ద్విజాతి సిద్ధాంత వాదనని భారతదేశం ఎప్పుడూ అంగీకరించలేదు.

1953 - 54 లో కొద్దికాలం కాశ్మీరు సమస్య పరిష్కరింపబడుతుందనే విశ్వాసం కలిగించిన కాలం. 1953 లో మహమ్మదాలీ బోగ్రా పాకిస్తాన్ ప్రధానమంత్రి అయ్యాడు. నెహ్రూ మహమ్మదాలీలు కలిసి సాదరంగా మాట్లాడుకున్నారు. కాశ్మీరులో ప్లెబిసైట్లు నిర్వహణకు నెహ్రూ అంగీకరించాడని 1953 ఆగస్టు 20న ఉమ్మడి ప్రకటన వెలువడింది. కాని ఈ ఆశాజ్యోతిని ప్రచ్ఛన్న యుద్ధ రాజకీయ అవసరాలు ఆర్పివేశాయి.

భారతదేశ అలీనత అనైతికమైనదని, కాబట్టి తాను (అమెరికా) పాకిస్తాన్‌కి మిలటరీ సహాయం అందజేయాలని కొరియా యుద్ధం తర్వాత అమెరికా నిర్ణయించింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ప్లెబిసైటు నిర్వహణాధికారి పొరుగుదేశం నుండి ఒకరిని పంపమని భారతదేశం కోరగా అమెరికా సీనియర్ సైనికాధికారి అడ్మిరల్ నిమిజ్ పేరు ప్రతిపాదించబడింది. రాజీకి గల చివరి అవకాశం చేజారిపోయింది.

పాకిస్తాన్ CENTO, SEATO బాగ్దాద్ ఒప్పందం, 1954లో అమెరికాతో మిలటరీ ఒప్పందం వగైరాలతో అమెరికా ఆధిపత్యం గల సైనిక కూటమిలో అధికారికంగా విలీనమవడంతో కాశ్మీర్ సమస్య ఐక్యరాజ్యసమితిలో తరచుగా ప్రస్తావించబడింది. అమెరికా ఆడించిన విధంగా ఆడేందుకు భారతదేశం తిరస్కరించింది. పాకిస్తాన్ అంగీకరించింది (స్వతంత్రం రాకముందు ముస్లింలీగు బ్రిటన్ ఆడించిన విధంగా ఆడింది. దానిబిడ్డ పాకిస్తాన్ ఇప్పుడు అమెరికా ఆదేశాల మేరకు ఆడుతుంది. కాంగ్రెస్ సామ్రాజ్యవాద వ్యతిరేక సంప్రదాయాన్ని కొనసాగించింది). ఈ పరిస్థితుల్లో కాశ్మీరు సమస్య పరిష్కారానికి ఏదో అద్భుతం జరగాలి. భారతదేశ అలీన విధానాన్ని సోవియట్ యూనియన్ అర్థం చేసుకోవడం ప్రారంభించి, కాశ్మీరు సమస్యపై భారతదేశాన్ని బాహాటంగా బలపరిచినప్పుడు కొంత ఉపశమనం పొందినట్లు భారతదేశం నిట్టూర్పు విడిచింది. 1956 తర్వాత ఐక్యరాజ్య సమితి భద్రతామండలిలో కాశ్మీరు సమస్యపై భారతదేశానికి అంగీకార యోగ్యంగాని అన్ని తీర్మానాలను తిరస్కరించేందుకు సోవియట్ యూనియన్ వీటో అధికారాన్ని ప్రయోగించింది.

భారతదేశం కాశ్మీర్ సమస్యపై అంతర్జాతీయ ఒత్తిడిని 1950 దశాబ్దం మధ్యలో, చివరిలో 1960 దశాబ్దం ప్రారంభంలో తట్టుకొనగలిగింది. కానీ 1962 లో చైనా దాడితో భారతదేశం పశ్చిమదేశాల సహాయం అర్థించక తప్పలేదు. అమెరికా, బ్రిటీషు ఒత్తిడికి తట్టుకోవడం కష్టమయింది. 1962 నుండి పాకిస్తాన్ చైనాతో జతకట్టడంతో భారతదేశాన్ని అడకత్తెర దాడికి గురిచేసే పరిస్థితి ఏర్పడింది. 1960 దశాబ్దం మధ్యలో సోవియట్ యూనియన్ పాకిస్తాన్‌కి కొంత సన్నిహితమయ్యే అవకాశాన్ని (1965 భారత - పాకిస్తాన్ యుద్ధాన్ని ఆపివేయించేందుకు కోసిగిన్ తాష్కెంట్‌లో తీసుకున్న చొరవ దానిలో భాగమే) పరిశీలించింది. కాని పాకిస్తాన్ పశ్చిమ దేశాల విధానంతో విలీనమయింది. కనుక దాని వలన ప్రయోజనం లేదని సోవియట్ యూనియన్ గుర్తించింది.

భారత పాకిస్తాన్ దేశాల మధ్యగల సంబంధాలు నెహ్రూకు, భారతీయులకు బాధ కలిగించాయి. ఉమ్మడి చరిత్ర భౌగోళిక పరిస్థితులు, సంస్కృతి, పేదరికంలో

అలమటిస్తున్న ప్రజల స్థితిగతుల్ని మెరుగుపరుచుకునే లక్ష్యం – రెండు దేశాల మధ్య సహకారాన్ని పెంచి ఉండవలసింది. రెండు దేశాల సంబంధంలో గల అడ్డంకుల్ని తొలగించాలని నెహ్రూ శాయశక్తులా కృషిచేశారు. విభజనకు ముందుగల ఆస్తి పంపకం శరణార్థులకు నష్టపరిహారం, సింధునదీ జలాల పంపకం అన్నింటిలో నెహ్రూ చాలా ఉదారంగా వ్యవహరించారు. 1953లో పాకిస్తాన్ సందర్శించారు. విభజన పరిష్కారంలో భాగంగా భారతదేశం పెద్దమొత్తాల్ని చెల్లించింది. పాకిస్తాన్ కాశ్మీర్ పై దాడి చేసినప్పుడు భారతప్రభుత్వం చెల్లింపుల్ని ఆపివేసింది. గాంధీజీకి విషయం తెలిసింది. చెల్లింపుల్ని పాకిస్తాన్ యుద్ధ అవసరాలకు వినియోగించకుండా నిరోధించేందుకు తాత్కాలికంగా నిలిపివేసినట్లుగా నెహ్రూ, పటేల్ చెప్పిన అభ్యంతరాలను తోసిపుచ్చి వెంటనే చెల్లింపులకు ఏర్పాట్లు చేయించారు. అదే సమయంలో కాశ్మీరును సాయుధదళాలతో రక్షించుకోవడానికి సమర్థించాడు.

పాకిస్తాన్ విదేశాంగ విధానం మన విదేశాంగ విధానం కంటే బాగుందని కొందరు వ్యాఖ్యానిస్తుంటారు. ఈ సందర్భంగా కె.పి.యస్.మీనన్ వ్యాఖ్యని జ్ఞప్తి తెచ్చుకోవడం అవసరం.

'పాకిస్తాన్ రాజనీతిజ్ఞత ఫలితం: అయూబ్‌ఖాన్ పదవి కోల్పోయాడు. యహ్యాఖాన్ తన స్వతంత్రం కోల్పోయాడు. పాకిస్తాన్ సగం భూభాగాన్ని కోల్పోయింది."

**చైనా**

భారతదేశం ప్రారంభం నుండి చైనాతో స్నేహ సంబంధం పాటించే విధానం అవలంబించింది. సామ్రాజ్యవాదం పట్ల చైనా చేసిన పోరాటం పట్ల కాంగ్రెస్ సహానుభూతి ప్రకటించింది. 1930 లలో చైనాకు వైద్యబృందాన్ని పంపించింది. జపాన్ చైనాని ఆక్రమించడానికి వ్యతిరేకతని వ్యక్తం చేసేందుకు జపాన్ వస్తువుల బహిష్కరణకు పిలుపునిచ్చింది. చైనా ప్రజారిపబ్లిక్‌ని మొట్టమొదటగా అంటే 1950 జనవరి 1న గుర్తించిన దేశం భారతదేశం. వలసవాద శక్తులచేతుల్లో బాధలకు గురయిన అనుభవం గల రెండుదేశాలు, పేదరికం, వెనుకబాటుతనం ఉమ్మడి సమస్యలుగా గల రెండు దేశాలు ప్రపంచంలో ఆసియాకు తగుస్థానం కల్పించేందుకు చేతులు కలపాలని పెద్ద ఆశలు ఆకాంక్షలతో ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో కమ్యూనిస్టు చైనాకు ప్రాతినిధ్యం వుండాలని నెహ్రూ ఒత్తిడి తెచ్చాడు. కొరియా యుద్ధంలో అమెరికా వైఖరిని బలపరచలేదు. కొరియా యుద్ధ పరిష్కారానికి శాయశక్తులా కృషి చేశాడు. 1950లో చైనా టిబెట్టుని ఆక్రమించినప్పుడు తనను విశ్వాసంలోనికి తీసుకోనందుకు భారతదేశం కొంత ఆందోళన చెందింది. కాన చైనా

చరిత్రలో టిబెట్ చాలా సార్లు చైనా పరిపాలనలో ఉంది గనుక టిబెట్టుపై చైనాకు గల హక్కుల్ని గుర్తించి ప్రశ్నించలేదు. 1954లో భారతదేశం చైనా ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. దానిలో టిబెట్టుపై చైనా హక్కుల్ని భారతదేశం గుర్తించింది. ఇరు దేశాలు తమ పరస్పర సంబంధాలలో పంచశీల సూత్రాలకు కట్టుబడి ఉండాలని అంగీకరించాయి. సరిహద్దు వివాదాలు చర్చకు వచ్చాయి. కానీ చైనా తాను ఇంకా కొమింగ్‌టాంగ్ మ్యాపులను అధ్యయనం చేయలేదని, విభేదాలు తర్వాత పరిష్కరించుకోవచ్చని చెప్పింది.

రెండు దేశాల మధ్య సంబంధాలు సన్నిహితంగా కొనసాగుతున్నాయి. నెహ్రూ బాండుంగ్ సదస్సులో చైనా గురించి చౌ-యన్-లై ని గురించి గొప్పగా చెప్పాడు. కాని 1959లో టిబెట్‌లో పెద్దతిరుగుబాటు చెలరేగింది. వేలాదిమంది కాందిశీకులతో దలైలామా టిబెట్టు ఉండి తప్పించుకుపోయాడు. భారతదేశం దలైలామాకు ఆశ్రయం కల్పించింది. కానీ ప్రవాస ప్రభుత్వాన్ని స్థాపించేందుకు అనుమతించలేదు. రాజకీయ కార్యకలాపాలు చేపట్టవద్దని చెప్పింది. అయినప్పటికీ చైనీయులకు ఇది నచ్చలేదు. 1959 అక్టోబర్‌లో చైనావాళ్లు లడక్‌లోని కోంగ్‌కా కనుమ వద్ద భారతదేశ గస్తీదళంపై కాల్పులు జరిపారు. కాల్పుల్లో ఐదుగురు చనిపోయారు. 12 మంది ఖైదీలుగా పట్టుబడ్డారు. రెండు ప్రభుత్వాలమధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచాయి. చర్చలకు ఉమ్మడి ప్రాతిపదిక ఏర్పడలేదు. భారతదేశం 1960 ఏప్రిల్‌లో చౌయన్ లై ని ఢిల్లీకి ఆహ్వానించింది. చర్చలు ముందుకు సాగలేదు. చర్చల ప్రాతిపదికన అధికారులచే రూపొందించబడాలని నిర్ధయం జరిగింది.

## 1962 చైనా దాడి

1962 సెప్టెంబర్ 8న చైనా సైనిక దళాలు తాగ్లా శిఖరంపై దాడిచేసి అక్కడున్న భారత్ సైనికుల్ని నెట్టివేశాయి. కానీ ఇది చిన్న సంఘటనగా పరిగణింపబడింది. నెహ్రూ లండన్ సదస్సుకి వెళ్లి వచ్చాడు. వెంటనే అక్టోబర్ 12 కొలంబో వెళ్లాడు. ఒకవారం తర్వాత చైనా సైన్యం పెద్ద ఎత్తున నీఫా (NEFA) లోని తూర్పురంగంలో గల సైనిక స్థావరాల్ని ఆక్రమించింది. నీఫాలోని భారత ఆర్మీ కమాండరు ప్రతిఘటించకుండా తప్పించుకుపోయాడు. చైనా సైన్యం లోపలికి రావడానికి తలుపులు తెరిచినట్లయింది. పశ్చిమరంగంలో అక్టోబర్ 20న గల్వాన్ లోయలో 13 అగ్రస్థావరాలు చైనా వశమయ్యాయి. చుషూల్ విమానాశ్రయం ప్రమాదంలో చిక్కుకుంది. చైనా ఉద్దేశాలు తెలియవు. ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. చైనా వాళ్ళు మైదాన ప్రాంతాల్లోకి చొచ్చుకుని వచ్చి అస్సాం, ఇతర ప్రాంతాలు ఆక్రమిస్తారని ప్రజలు

ఆందోళన చెందారు. నెహ్రూ నిరాశాజనకమైన పరిస్థితిని వివరిస్తూ మిలటరీ సహాయాన్ని అర్థిస్తూ నవంబర్ 9న ప్రెసిడెంటు కెనడీకి రెండు లేఖలు రాశాడు. బ్రిటన్ సహాయాన్ని కూడా కోరాడు. 24 గంటల తర్వాత చైనా ఏకపక్షంగా విరమణ ప్రకటించింది. చైనా భూతం ఎంత ఊహించని విధంగా వచ్చిందో అదే విధంగా అదృశ్యమైంది. గుండెపగిలిన మిత్రుణ్ణి, కకావికలమైన ప్రజల్ని వదిలి వెళ్లింది.

## ఆ తర్వాత

భారతదేశం తన ఆత్మగౌరవానికి తగిలిన దెబ్బనుండి కోలుకోటానికి చాలా సమయం పట్టింది. చైనా, అమెరికాలు పాకిస్తాన్‌కి మద్దతు ఇచ్చినప్పటికి బంగ్లాదేశ్ యుద్ధంలో పాకిస్తాన్‌పై విజయం సాధించిన తర్వాత భారతదేశం ఆత్మవిశ్వాసాన్ని ఆత్మగౌరవాన్ని పొందింది. నెహ్రూ దెబ్బ నుండి కోలుకోలేదు. 1964 మే లో చనిపోయాడు. ఆయన కీర్తి ప్రతిష్టలు అత్యున్నత దశకి చేరుకున్న తరుణంలో ప్రత్యర్థుల విమర్శలు ఎదుర్కొనవలసి వచ్చింది. విమర్శలకు తలొగ్గి తన చిరకాల మిత్రుడు రక్షణమంత్రి అయిన కృష్ణమీనన్‌ని మంత్రి వర్గం నుండి తొలగించవలసి వచ్చింది. తాము ఎంతో శ్రద్ధతో పెంచి పోషించిన అలీనవిధానం మిత్రుడు కొట్టిన దెబ్బకు తట్టుకుని నిలబడలేని పరిస్థితి వచ్చింది. బాధాకరమైన అంశం ఏంటంటే ఆ విధానాన్ని పట్టాలు తప్పించింది సోషలిస్టు దేశం, పెట్టుబడిదారీ దేశం కాదు. మితవాద శక్తులు, పశ్చిమ దేశాల కనుకూలంగా వ్యవహరించేవారు నెహ్రూని తీవ్రంగా విమర్శించారు. ఈ అవకాశాన్ని భూపరిమితి చట్టాన్ని పటిష్టపరిచేందుకు చేపట్టిన రాజ్యాంగ సవరణని అడ్డుకునేందుకు వాడుకొన్నారు. యుద్ధ ప్రభావం మూడవ పంచవర్ష ప్రణాళికపై పడింది. వనరులు రక్షణకు మరల్చబడ్డాయి. పార్లమెంటుకి జరిగిన మూడు వరుస ఉప ఎన్నికలలో కాంగ్రెస్ ఓడిపోయింది. నెహ్రూ తన జీవితంలో మొదటిసారిగా 1963 ఆగస్టులో విశ్వాస రాహిత్య తీర్మానాన్ని ఎదుర్కోవలసి వచ్చింది.

చైనా దాడి భారతదేశానికి ఇతర దేశాలతో గల సంబంధాల్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. సంక్షోభంలో సహాయపడి అమెరికా, బ్రిటన్ సానుకూలంగా స్పందించాయి. యుద్ధం ముగిసినప్పటికి బ్రిటన్, ఆమెరికాలను విస్మరించడానికి వీలు పడని పరిస్థితి ఏర్పడింది. పాకిస్తాన్ పురిగొల్పడంతో భారతదేశ బలహీనతను అవకాశంగా తీసుకుని కాశ్మీరు సమస్యపై లొంగదీసేందుకు అమెరికా, బ్రిటన్‌లు శక్తివంచన లేకుండా ప్రయత్నించాయి. కానీ నెహ్రూ ఒత్తిడిని తట్టుకుని నిలబడగలిగాడు. భారతదేశాన్ని అలీన విధానం నుండి వైదొలిగేలా చేయాలని అమెరికా బ్రిటన్‌లు ఆకాంక్షించాయి. అవి అందజేసిన ఆర్థిక సాయం 60- 120 మిలియన్లు అంత మొత్తాలేంకాదు. కానీ

అమెరికా ప్రభావం ప్రత్యేకించి మిలటరీ వ్యవహారాల్లో గణనీయంగా పెరిగింది. చైనా బూచికి వ్యతిరేకంగా పనిచేసే నెపంతో అమెరికా రహస్య సమాచార సంస్థలు సంబంధాలు పెంచుకున్నాయి. చైనా మిలటరీ కార్యకలాపాలపై నిఘా వుంచేందుకు హిమాలయాల్లో అణుశక్తి యంత్రం నెలకొల్పబడింది. నెహ్రూ ఈ ప్రయత్నాలను అవగతం చేసుకున్నాడు. సోవియట్లతో మిలటరీ ఒప్పందాలతో ముందుకు సాగాడు. సోవియట్ భారతదేశానికి దీర్ఘకాలిక అవసరాలరీత్యా ఏవి అవసరమో అవి ఇవ్వడానికి సిద్ధపడింది. అమెరికాలాగా కొద్ది మొత్తాల సహాయం అందజేసి అసాధ్యమైన షరతులు విధించలేదు. పాకిస్తాన్ చైనా సరసన చేరింది. భారతదేశం బలహీనపరచబడిందని భావించి 1965 లో యుద్ధానికి దిగింది.

**ఇది ఎవరి తప్పు?**

దాడి జరిగినప్పుడూ, ఆ తర్వాత కూడా పత్రికలు చైనా మోసానికి నెహ్రూని బాధ్యుణ్ణి చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. నెహ్రూ భావావేశం గల కపటరహితమైన అవివేకియని కమ్యూనిస్టు విద్రోహం నుండి భారత ప్రయోజనాలను సంరక్షించడంలో విఫలమయ్యాడని ఒక అభిప్రాయం. మరొక రకమైన అభిప్రాయం ఇండియా, చైనా యుద్ధంలో వ్యక్తం చేయబడింది. దీనిననుసరించి నెహ్రూ పట్టుదల గల జాతీయవాది, యుద్ధోన్మాద ప్రజాభిప్రాయంతో కొట్టుకుని పోయి చైనా ప్రతిపాదించిన హేతుబద్ధమైన షరతుల మేరకు సరిహద్దుల్ని పరిష్కరించుకునేందుకు తిరస్కరించారు. 1959 నుండి ముందుకు దూసుకుపోయే పద్ధతిననుసరించాడు. అది ఆత్మరక్షణ కొరకు చైనా దాడి చేసేలా రెచ్చగొట్టింది. ఈ రెండింటిలో ఏది కూడా చైనా పట్ల నెహ్రూ అవగాహనను సరిగా వివరించలేదు.

చైనా చరిత్ర పట్ల, విప్లవాల చరిత్ర పట్ల ప్రత్యేకించి రష్యా విప్లవం పట్ల నెహ్రూకు గల అవగాహన, చైనాను ఏకాకిని చేసి ఒక మూలకు తోచివేయబడకూడదని, జాతుల సమూహంలోకి తీసుకురాబడాలని విప్లవం మానవతతో పరిపూర్ణం చేయబడాలని అభిప్రాయాన్ని ఆయనలో నాటుకునేలా చేసింది. "బలమైన చైనా అంటే సాధారణంగా విస్తరణవాద చైనా అని అర్థం చేసుకునేందుకు మనకు కావలసినంత చరిత్ర తెలుసు" నెహ్రూ చెప్పాడు. కానీ చైనాతో ఎలాంటి యుద్ధమూ రావాలని కోరుకోం. ఎందుకంటే అది జర్మన్ ఫ్రెంచి యుద్ధం లాగానే రెండు దేశాలకు వినాశకరం. 1962 దాడికి ముందు 1961 డిసెంబర్ 7న లోక్‌సభలో నెహ్రూ ఇలా చెప్పాడు : "ఒక దేశం యొక్క పెద్ద ఏనుగు సరిహద్దుపై కూర్చుని ఉంది. ఇది మనం విమర్శించలేని వాస్తవం". చైనా విప్లవం మన సరిహద్దులకు ప్రమాదం పొంచి ఉందని నెహ్రూ గుర్తించాడు.

నెహ్రూ 1963 సెప్టెంబర్ 3 న రాజ్యసభలో మిలటరీపై ఎక్కువగా వెచ్చించడం సరియైనది కాదని, దేశం తన బలాన్ని తానే నిర్మించుకోవాలని, అదే సరైన రక్షణ అని వివరిస్తూ సుదీర్ఘ ప్రకటన చేశాడు. "పారిశ్రామికీకరణ చెందని ఏ దేశం కూడా ఈనాడు సైనిక పరంగా బలంగా లేదు" 'ఈనాడు మన ముందున్న కర్తవ్యం దేశాన్ని పారిశ్రామికంగా పటిష్టపరచడం. అంతేగాని విపరీతంగా ఉండే తుపాకీని, విపరీతంగా ఉండే విమానాన్ని గానీ తెచ్చుకోవడం కాదు'. పాకిస్తాన్‌తో ఇప్పటికే శత్రుత్వం ఉంది. భారతదేశం మరొక శత్రురాజ్యాన్ని కోరుకోదు. రెండువైపులా యుద్ధానికి సన్నద్ధం కావడమంటే అభివృద్ధికి అంతం పలకడమే. కాబట్టి ఘర్షణ అనివార్యమైనప్పటికీ స్నేహవైఖరిని పాటించి ఇతరులను కూడా అలాంటి వైఖరినే పాటించమని కోరుతూ ఉదాహరణకి చైనాని ఐక్యరాజ్యసమితిలోనికి రప్పించేందుకు కృషి చేస్తూ ఘర్షణని వీలైనంతవరకు వెనక్కి నెట్టివేయాలి.

చైనా టిబెట్ ఆక్రమణ అంటే ఘర్షణలకు అవకాశం గల ఉమ్మడి సరిహద్దు ఉండడమని నెహ్రూకు అవగాహన ఉంది. చైనాకి పరిష్కరించుకోవలసిన పెద్ద సమస్యలు ఉన్నాయి. కనుక విస్తరణను గురించే ఆలోచించదు. టిబెట్‌లో తిరుగుబాటు, దలైలామా రాక, సరిహద్దు ఘర్షణలు తర్వాత రానున్న ప్రమాదాల పట్ల నెహ్రూకి అవగాహన ఉంది. కానీ చైనాని బెదిరించడం వల్ల ఒనగూడే ప్రయోజనం ఏమిటి? చైనా ఆటకట్టించేందుకు సోవియట్‌కు సన్నిహితంగా జరిగి దానితో దౌత్య సంబంధాలు పెంచాడు. కమ్యూనిస్టు చైనా, కమ్యూనిస్టు సోవియట్ యూనియన్, భారతదేశ కమ్యూనిస్టులతో జతకట్టి దేశానికి ప్రమాదకరంగా పరిణమిస్తారని నెహ్రూ ఆలోచించలేదు. భారతదేశ కమ్యూనిస్టులు చైనా, సోవియట్‌ల చేతిలో పనిముట్లని ఆయన విశ్వసించలేదు. అలాగే భారతదేశంలో చాలామంది వాదించినట్లు భారతీయ మిత్రులకు వ్యతిరేకంగా సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు సోదరులకు మద్దతు ఇస్తుందని ఆలోచించే పొరపాటు ఆయన చేయలేదు.

అక్కడక్కడ సరిహద్దు ఘర్షణలు జరుగుతాయి కానీ అంతపెద్ద ఎత్తున దాడి జరుగుతుందని నెహ్రూ ఊహించలేదు. దాడి జరిగిన స్థాయి నెహ్రూని దిగ్భ్రాంతికి గురి చేసింది. దాడి స్వభావాన్ని, స్థాయిని అంచనా వేయలేకపోవడంలో నెహ్రూ తప్పు చేశారు. మరుసటి రోజు చైనా యుద్ధం విరమించడంతో అమెరికా, బ్రిటన్‌లను సహాయమర్థించడంలో వ్యక్తమయిన భయాందోళన మరొక పొరపాటు. కొన్ని పత్రికలు, ప్రతిపక్షపార్టీలు, తన సొంత పార్టీ సభ్యుల బాధ్యతా రాహిత్యమైన దాడులు ఈ కలవరపాటుకి దారి తీశాయి. నాయకులపై విశ్వాసంతో ప్రతికూలతను ధైర్యంగా ఎదుర్కొనడంలో దేశం అశక్తతను ప్రదర్శించింది. నిరాశానిస్పృహలతో కృంగిపోయింది.

పరస్పరం నిందలకు దిగింది. పరిస్థితిని సరిదిద్దేందుకు నెహ్రూ శాయశక్తులా కృషి చేశారు.

1962లో చైనా చేతుల్లో భారతదేశ పరాజయానికి కారణం చైనీయుల స్నేహితం పట్ల నెహ్రూకి గల నిష్కపటమైన విశ్వాసం ఊహాజనితమైన యుద్ధ వ్యతిరేకత, ఫలితంగా రక్షణ సన్నద్ధత పట్ల భారత అశ్రద్ధ కాదని పలువురు వ్యాఖ్యాతలు ఈనాడు అంగీకరిస్తారు. 1949 - 50 నాటికి 2,80,000 భారత సైనిక దళాలు 1962 నాటికి 5,50,000 కి పెరిగాయి. 1947 లో భారత వైమానిక దళంలో ఏడు కంబాట్ స్క్వాడ్రన్లు ఉండగా 1962 నాటికి 19 స్క్వాడ్రన్స్‌కి పెరిగాయి. 1965 లో అదే సైన్యం అవే ఆయుధాలతో పాకిస్తాన్‌తో యుద్ధం చేసింది. కానీ ఘోరపరాజయం పాలవలేదు. చైనాతో సరిహద్దు ఘర్షణలు జరిగే అవకాశాలున్నాయని నెహ్రూ 1959 నుండి హెచ్చరిస్తూ వచ్చారు. కానీ రాజకీయ నాయకత్వం కానీ, మిలటరీ నాయకత్వం కానీ చైనా దాడి స్వరూప స్వభావాన్ని అంచనా వేయలేకపోయాయి. అందువల్ల దాడి జరగడం పట్ల దిగ్భ్రమకు గురయ్యాయి. సరిహద్దు ఘర్షణలు గానీ లేక అస్సాం మైదానాలలో పూర్తిస్థాయి యుద్ధం జరగవచ్చునని మిలటరీ నాయకత్వం అంచనా వేసింది. కాని పరిమిత ప్రాంతంలోకి చొచ్చుకుని వచ్చి విరమించుకుంటుందని ఊహించలేదు. చైనాకు సోవియట్ పూర్తి మద్దతు ఉంటుంది కనుక చైనాతో పూర్తిస్థాయి యుద్ధం ఊహకు అందనిదిగా భావించారు సర్వసైన్యాధికారి జనరల్ తిమ్మయ్య. ఆయనకు ఇతర సీనియర్ అధికారులకూ చైనా సోవియట్ యూనియన్ మధ్య విభేదాలు ఉన్నట్లు తెలిసినట్లు లేదు. భారతవైమానిక దళం చైనానుండి ఎలాంటి ప్రతిఘటనా లేకుండా అరుణాచల ప్రదేశ్, టిబెట్‌లపై పూర్తి ఆధిపత్యం చెలాయించగలిగిన స్థితిలో ఉన్నప్పుడు వైమానిక దళం నిర్వహించగల పాత్రపై అవగాహన లోపించింది (నెహ్రూ తన వైమానిక బలంతో సంప్రదించకుండానే అమెరికా వైమానిక దళాలనుండి రక్షణ కోరాడు).

**వైఫల్యానికి కారణం :** రక్షణ ఆదేశాల యాజమాన్యం వ్యవస్థలోని లోపాలు, రక్షణ ప్రణాళికా వ్యవస్థ, సివిలు. మిలటరీ సంబంధాల నిర్మాణంలోని లోపాలు, ఉన్నతస్థాయి మిలటరీ అధికారులు పౌరవిధాన నిర్మాణ చట్రంలో విలీనం చేయబడలేదు. స్వల్పకాలిక భవిష్యత్తుకు సన్నద్ధం చేసేవారుగా ఉండిపోయారు. గాని దీర్ఘకాలిక రక్షణ వాతావరణానికి సన్నద్ధం కాలేదు. చైనాతో ప్రమాదం ఉందని 1959 నుండి నెహ్రూ హెచ్చరిస్తున్నప్పటికీ మిలటరీ అధికారులు హిమాలయాల్లో చైనా యుద్ధానికి ప్రణాళిక రూపొందించుకోలేదు. ఇది వ్యూహరచన వైఫల్యం, రహస్య సమాచార విభాగం వైఫల్యం. సైన్యం వైమానిక దళాల మధ్య సమన్వయ వైఫల్యం. గతంలో జరిగిన యుద్ధాలలో మంచి నిపుణత ప్రదర్శించినవాడు, కనీసం వారం రోజుల పాటు శత్రుసైన్యాన్ని

నిలువరించిగల సమర్థుడు అయిన సైన్యాధికారి ఆత్మవిశ్వాసం కోల్పోయి యుద్ధానికి తలపడకుండానే వెనక్కితగ్గడం మరొక వైఫల్యం. ఇక చైనీయుల విషయానికొస్తే వారు వేగంగా పరిమితమైన ప్రాంతంలో లోపలికి చొచ్చుకుని వచ్చి భారతదేశాన్ని న్యూనత పరచే వారి లక్ష్యాన్ని సాధించుకుని అంతే వేగంగా వెనక్కి వెళ్లిపోయారు. భారతదేశం చైనా యుద్ధ విరమణని అంచనా వేయడంలో విఫలమయింది. అస్సాం మైదానాలలో పూర్తిస్థాయి యుద్ధాన్ని ఎదుర్కొనడానికి పథకాలు ప్రారంభించింది.

భారతదేశ దురాక్రమణ తత్వాన్ని గురించి మేక్స్‌వెల్ చేసిన నిర్ధారణలను నిపుణులు తీవ్రంగా పరిగణించలేదు. భారతదేశానికి యుద్ధాన్ని రెచ్చగొట్టిన జాడలు గానీ రెచ్చగొట్టే ఆలోచనలు గానీ లేవు. భారతదేశ ప్రధానమంత్రి, రక్షణమంత్రి దేశంలో లేరు. ఆర్మీ ఛీఫ్ సెలవులో ఉన్నారు. ఒక సీనియర్ కమాండర్ సముద్రయానంలో ఉన్నారు. యుద్ధాన్ని రెచ్చగొట్టడం వలన భారతదేశం పొందే ప్రయోజనం ఏంటి? దానికి భిన్నంగా మేక్స్‌వెల్‌కి అవగాహన లేని చైనా అనివార్య పరిస్థితులు చైనాని యుద్ధంవైపు నెట్టివేశాయి. చైనాని ఘర్షణ దిశగా నెట్టివేసిన అంశాలు నెహ్రూ అదుపులో లేనివి.

టిబెట్ విషయం తీసుకోండి. ప్రతి బలమైన చైనా ప్రభుత్వం టిబెట్‌ని విలీనం చేయాలని ప్రయత్నించింది. నెహ్రూ కూడా 1954 పంచశీల ఒప్పందంలో టిబెట్‌పై చైనా వైఖరిని ఆమోదించాడు. 1959లో మాత్రమే చౌ-యన్-లై లడఖ్, నేపాల్‌లో తమ భూభాగం ఉందని చెప్పారు. అడీఖాంసా తిరుగుబాటు, చాలామంది కాందిశీకులతో కలిసి దలైలామా పారిపోయి వచ్చిన నేపథ్యంలో చెప్పాడు. భారతదేశం దలైలామాని రెచ్చగొట్టిందని చైనా ఆరోపించింది. ఆశ్రయమివ్వడాన్ని ఆక్షేపించింది. ఏ భారత ప్రభుత్వం ఆశ్రయమివ్వడాన్ని తిరస్కరించి ఉండేది కాదు. భారతదేశం తిరుగుబాటుని ప్రోత్సహించలేదు. నెహ్రూ ప్రవాస టిబెట్ ప్రభుత్వాన్ని గానీ ఎలాంటి రాజకీయ కార్యకలాపాలను గానీ అనుమతించలేదు. కానీ ఆయన టిబెట్ తిరుగుబాటుని నివారించగలిగి ఉండేవాడు కాదు.!

నెహ్రూ తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ అమెరికా విధానాన్ని ప్రభావితం చేయలేకపోయాడు. చైనాకి స్థానం కల్పించేందుకు అమెరికా తిరస్కారం, ఫార్మోజా (తర్వాత తైవాన్) మాత్రమే చట్టబద్ధమైన చైనా అని దాని (అమెరికా) పట్టు. అంటే కమ్యూనిస్టు చైనాకు ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో స్థానం నిరాకరణ, చైనాని నిరాశా నిస్పృహలకు గురిచేశాయి. దురాక్రమణ దారికి నెట్టివేశాయి. అంతేగాక అమెరికా చైనాలోని దుందుడుకు వాద శక్తుల్ని ప్రోత్సహించి వారిని రాజకీయరంగం పైకి వచ్చేందుకు తోడ్పాటునందించి చైనాకి కంటిమీద కునుకు లేకుండా చేయడంలో

అమెరికా పెద్ద పాత్ర పోషించింది.

చైనా సోవియట్ విభేదాలకు నెహ్రూ కారకుడు కాదు. ఈ విభేదాలు చైనా అభద్రతా భావాన్ని పెంచి దాన్ని దుందుడుకువాద దశలోకి నెట్టివేయడంలో తమ పాత్ర తాము పోషించాయి. కొంతకాలం నుండి ఉంటూ వచ్చిన ఈ విభేదాలు 1959లో బట్టబయలయ్యాయి. భారత్ చైనా సరిహద్దు ఘర్షణలు జరిగినప్పుడు సోవియట్ యూనియన్ తటస్థంగా ఉంది. 1962 ఏప్రిల్, మే కాలంలో సింకియాంగ్‌లో సోవియట్ చైనా సరిహద్దుపై చాలా ఘటనలు జరిగాయి. సరిహద్దులో ఐదువేలకి పైగా ఉల్లంఘనలు జరిపినట్లు సోవియట్ ఆరోపించింది. సరిహద్దు పొడవునా వేలాదిమంది తమ ప్రజల్ని మభ్యపెడుతున్నట్లు చైనా సోవియట్ యూనియన్ పై ఆరోపణలు చేసింది. అణు ఆయుధాల అభివృద్ధిపై సోవియట్ యూనియన్ చైనాతో చేసుకున్న ఒప్పందాన్ని సోవియట్ యూనియన్ 1959 లో నిరాకరించింది. 1962 ఆగస్టు మొదటి వారంలో మిగ్ - 21 విమానాల తయారీపై చేసుకున్న ఒప్పందంపై సోవియట్ యూనియన్, భారతదేశం సంతకాలు చేశాయి. చైనాతో అలాంటి ఒప్పందం చేసుకోలేదు. ఆగస్టు చివరి వారంలో సోవియట్ యూనియన్ తాము అణ్వస్త్రాల ప్రయోగాన్ని పాక్షికంగా రద్దు కొరకు చర్చలతో ముందుకు పోతున్నట్లు చైనాతో చెప్పింది. తమ అణ్వస్త్రాల పెంపుదలను అడ్డుకునే లక్ష్యంతోనే సోవియట్ యూనియన్ అలా చెప్పిందని చైనా భావించింది. అంతర్జాతీయ రంగంలో చైనా ప్రయోజనాల్ని పరిరక్షించగల స్థితిలో సోవియట్ యూనియన్ ఉందనే భావన కూడా చైనాని తికమక పెట్టింది. విదేశీ విధాన నిపుణుడు వి.పి. మీనన్ మాటల్లో :

"చైనా తన జాతీయ ప్రయోజనాలపై నూతన సైద్ధాంతిక అవగాహనకు వచ్చింది. అమెరికాతో తనకు గల సమస్యలకు శాంతియుత పరిష్కారం పట్ల ప్రాథమిక లక్ష్యాలు నెరవేరడం పట్ల - అంటే తైవాన్ తిరిగి తనకు దక్కడం... చైనాకు గొప్పశక్తిగా గుర్తింపు, భద్రతా మండలిలో స్థానం... రాకెట్లు, ఐ.సి.బి.యం లలో సోవియట్ పురోగమనం కారణంగా అంతర్జాతీయ బలాల పొందికలో సోవియట్ శిబిరానికి మొగ్గువుంది కనుక అమెరికాపై ఒత్తిడి పెంచేందుకు చైనాకు రాయితీలు పొందేందుకు రాజీలేని సమరశీల విధానాన్ని అమలు జరిపే సమయం వచ్చింది".

ఆఫ్రో ఆసియా దేశాలు భారతదేశ పద్ధతిని అనుసరిస్తూ అటు సోవియట్ యూనియన్ ఇటు అమెరికా స్నేహ సహకారాలు కోరాయి. కానీ చైనాలాగా రెండింటికీ దూరంగా ఉండే పద్ధతిని అనుసరించలేదు. ఇది కూడా చైనాని కలవరపరచింది. భారతదేశ స్థాయిని తగ్గించడం ద్వారా వారి పంథాని ఆమోదింపజేయగలమని ఆశించారు.

కాబట్టి భారతదేశంపై చైనా దాడికి భారత చైనా దేశాల మధ్య సమస్యలతో

సంబంధం లేదు. దాడి, ఒంటరితనం, సంయమనం కోల్పోవడం, నిరుత్సాహం నిష్ఫలతల ప్రతిచర్య.. భారతదేశంపై దాడి చేయడం ద్వారా చైనీయులు నెహ్రూ ప్రభుత్వాన్ని కూలదోయాలని కోరి ఉండవచ్చు లేక భారతదేశాన్ని పశ్చిమదేశాల శిబిరంలోకి నెట్టివేయాలని ఆశించి ఉండవచ్చు. ఆ విధంగా సోవియట్ యూనియన్ భారతదేశం యొక్క అలీన విధానం పైగల భ్రమల్ని తొలగించుకుని, తన శాంతియుత సహజీవన విధానాన్ని గురించి పునరాలోచించుకోవచ్చు. కాని ఈ రెండు అంచనాలలో చైనా విఫలమయింది. 1962 యుద్ధానికి కృశ్చేవ్ బాధ్యుడని తర్వాతి కాలంలో భారత ప్రతినిధి వర్గంతో డెంగ్ సియానోపెంగ్ చెప్పినట్లు ఆ ప్రతినిధి వర్గంలో ఒక సభ్యుడుగా ఉన్న వి.పి.దత్ పేర్కొన్నారు.

ఆ విధంగా 1962 దాడికి కారణాలు చైనాయొక్క అనివార్య పరిస్థితులకు సంబంధించినవి గాని, నెహ్రూగాని, భారతదేశం గానీ తెచ్చిపెట్టినవి కావు. అమెరికా గుర్తింపు తెచ్చుకోలేక భద్రతా మండలిలో స్థానం పొందలేక, ఆఫ్రో ఆసియా నాయకత్వం పొందలేక అణ్వస్త్రాల విషయంలో గానీ చైనాతో సరిహద్దు వివాదంలో గానీ సోవియట్ మద్దతు పొందలేక చైనా రాజకీయాలలో దుందుడుకువాద మార్పు చోటుచేసుకుంది. భారతదేశాన్ని న్యూనత పరచడం ద్వారా భారతదేశం యొక్క శాంతి అలీన విధానాలు ఆచరణ సాధ్యమైనవి కావని చూపయత్నించింది. అలాగే సోవియట్ శాంతియుత సహజీవనం కూడా, ఒత్తిడికిలోనై భారతదేశం అలీన విధానాన్ని వదిలిపెడుతుందని, ఆసియా ఆఫ్రికా దేశాలు చైనా నాయకత్వాన్ని అనుసరిస్తాయని ఆశించింది. ఆవిధంగా భారతదేశం మిలటరీ పరంగా పొందిన న్యూనత భారతదేశ విదేశీ విధాన వైఫల్యంగా పరిగణించబడరాదు.అంచనా వేయడానికి వీలుపడని అరుదైన చారిత్రక ఘటనలలో ఒకటిగా పరిగణింపబడాలి.

చైనాపట్ల భారతదేశ విధానం వైఫల్యమయినట్లయితే మరి ఏ ఇతర దేశ విధానం విజయవంతమైయినట్లు? 1971 అమెరికా తన విధానాన్ని పూర్తిగా మార్చుకున్నది. సోవియట్ యూనియన్ 1959 తర్వాత తన విధానాన్ని మార్చుకోవడం ప్రారంభించింది.

భారత చైనా యుద్ధం నెహ్రూ విదేశాంగ విధానంపై ఎలాంటి సందేహాలను రేకెత్తించదు. ఉదాహరణకు భారతదేశ అలీన విధానం కారణంగా అమెరికా, సోవియట్ యూనియన్‌లు పరస్పర వ్యతిరేక పక్షాలలో చేరిపోలేదు. భారతదేశం రెండింటి నుండి తరతమ భేదాలతో సానుభూతి పొందగలిగింది. ఇది ప్రచ్ఛన్న యుద్ధకాలంలో చాలా అసాధారణ ఘటన : రెండవ అంశంగా చైనా యుద్ధం జరిగి అలా ముగిసినప్పటికీ చైనాతో స్నేహ సంబంధాలు కలిగివుండాలన్న నెహ్రూ విధానం సరియైనదే. ఒకవైపు పాకిస్తాన్‌తో సత్‌సంబంధాలు లేని పరిస్థితులలో (స్వతంత్రానంతరం కాశ్మీర్‌పై ఘర్షణ

1954లో పాకిస్తాన్‌కి మిలటరీ సహాయం చేయాలని అమెరికా నిర్ణయంతో తీవ్రమైన ప్రమాదంగా పరిణమించిన పరిస్థితుల్లో) మరొక పొరుగుదేశంతో శత్రుసంబంధాలతో అడకత్తెరలో చిక్కుకునే ప్రమాదాన్ని నివారించడం భారత ప్రయోజనాల రీత్యా అవసరం. పశ్చిమ రాజ్యాలు చైనాని ఒంటరిని చేయడం వల్లనే చైనా మరీ బాధ్యతారాహిత్యంగా మారిందని నెహ్రూ సరిగా అంచనా వేయగలిగాడు కనుకనే భారత చైనా యుద్ధం తరువాత కూడా ఐక్యరాజ్యసమితిలో చైనాకి సభ్యత్వం ఇవ్వాలన్న వాదనని నెహ్రూ కొనసాగించాడు. అంతేగాక నెహ్రూ చాలా తరచుగా ప్రస్తావించినట్లు రక్షణ అనేది కేవలం ఆయుధాల వ్యవహారం కాదు. ఆర్థికాభివృద్ధి, స్వావలంబన కర్తవ్యం కూడా. కొత్తగా స్వతంత్రం పొందిన భారతదేశం లాంటి పేదదేశం తన అరుదైన వనరుల్ని భారీ మిలటరీ యంత్రాంగాన్ని నిర్మించడం వైపు మరల్చలేదు. దానికి భిన్నంగా నెహ్రూ భారతదేశ ఆర్థిక బలాన్ని పెంచడం ద్వారా తన వారసులు ఘనమైన విజయాలు సాధించడాన్ని సుసాధ్యం చేశాడు.

## ముగింపు

1966లో ఇందిరాగాంధీ ప్రధానమంత్రి అయినప్పుడు అమెరికాతో ఇతర పశ్చిమదేశాలతో సంబంధాలు నాటకీయంగా మెరుగుపరుచుకోవలసిన అవసరం ఉన్నట్లు భావించారు. ఎందుకంటే చైనా సమరశీలతని గురించి చైనాకి సరియైన అవగాహన వుంది. చైనా మరలా దాడిచేస్తే సహాయం చేస్తానని అమెరికా వాగ్దానం చేసింది. మరొక వైపు తీవ్రమైన కరువు క్లిష్టమైన ఆర్థిక పరిస్థితి. 1962, 1965 యుద్ధాల కారణంగా ఏర్పడిన భారీ ఆహార కొరతలు అలాంటి సహాయం అవసరమయ్యేలా చేశాయి. ఈ విధానం కొనసాగింపుగా అమెరికా సలహా మేరకు రూపాయి విలువను తగ్గించేందుకు శ్రీమతి ఇందిరాగాంధీ అంగీకరించారు. భారతదేశ ప్రయోజనాల రీత్యా కూడా అలా తగ్గించవలసిన అవసరం ఉంది. ఆర్థిక సహాయాన్ని పొందేందుకు, నూతన సంబంధాలను పెంపొందించుకునేందుకు, ఆహార ధాన్యాల్ని నౌకల్ని త్వరగా రప్పించేందుకు శ్రీమతి ఇందిరాగాంధీ అమెరికా సందర్శించారు. కానీ ఆమె బాధతో తిరిగి వచ్చారు. ప్రెసిడెంట్ లిండన్ జాన్సన్ చేసిన ప్రకటనలకు విరుద్ధంగా ఉద్దేశపూర్వకంగా తాత్సారం చేశారు. అందుకు ఒక కారణం వియత్నాంపై అమెరికా కురిపిస్తున్న బాంబు దాడుల్ని విమర్శించడం ఆపివేయాల్సిందిగా భారతదేశంపై ఒత్తిడి తెచ్చేందుకు అలా చేశారని తరువాత ఇందిరాగాంధీ చెప్పారు. దీని నుండి గుణపాఠాన్ని ఇందిరాగాంధీ నేర్చుకున్నది. హరిత విప్లవ వ్యూహాన్ని అమలు పరచడం ద్వారా స్వతంత్ర వ్యవసాయ మార్గాన్ని పటిష్టపరచింది. అలీన ఉద్యమాన్ని అంతర్జాతీయ

వ్యవహారాలలో స్వయం ప్రతిపత్తిని పటిష్టపరచ సమాయత్తమయింది. భారత, పాకిస్తాన్‌లను సోవియట్ యూనియన్ సమాన ప్రాతిపదికన ఆదరించడాన్ని పాకిస్తాన్‌కి మిలటరీ సహాయాన్ని అందజేయడాన్ని అడ్డుకునేందుకు 1966-67 లో దౌత్యపరమైన ప్రయత్నాల ద్వారా నచ్చజెప్పి సోవియట్ యూనియన్‌తో సంబంధాలు దృఢపడేలా చేసింది.

1977లో అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం అసలైన అలీన విధానాన్ని అమలు జరుపుతామని ఘనంగా చెప్పింది. పరిస్థితులను గమనించి వెనక్కి తగ్గి నెహ్రూ విధానాలు అమలు జరిపింది. పెద్ద ఎత్తున ఆయుధాల ఒప్పందాలకై సోవియట్ యూనియన్‌తో చర్చలు జరిపింది. 1980లో ఇందిరాగాంధీ అధికారంలోకి వచ్చిన తర్వాత చర్చలు ముగిశాయి. జనతా ప్రభుత్వం రక్షణ వ్యయాన్ని తగ్గిస్తామన్న వాగ్దానం నుండి వెనకడుగు వేయవలసి వచ్చింది.

రాజీవ్ గాంధీ కూడా అమెరికాకు దగ్గరయ్యేందుకు చేసిన ప్రయత్నాలు ఫలప్రదం కాలేదని త్వరలో గుర్తించాడు. అలీన విధానం, అణు నిరాయుధీకరణ దక్షిణాఫ్రికాకు మద్దతు వగైరాలకు ప్రాధాన్యతనిచ్చే పద్ధతులకు మరలాడు.

అలీనత ఒక విధానానికి విపులమైన ప్రణాళిక కాదు. అదొక వైఖరి. ఒక చట్రం. ఒక పద్ధతి. యువజాతికి చీకటి రాత్రిలో దారిచూపే వెలుగు. భారత విదేశాంగ విధానాన్ని కఠినమైన నియమ నిబంధనతో కట్టిపడేయడానికి బదులుగా భారతీయ సమాజం యొక్క మారుతున్న అవసరాలను తీర్చే విధంగా అలీనత రూపుదిద్దుకొనే అవకాశం కల్పించింది. అది 1954 నుండి సోవియట్ యూనియన్ తో సన్నిహిత సంబంధాలు పెంచుకోడానికి అడ్డురాలేదు. భారతదేశం కామన్‌వెల్త్‌లో చేరడానికి అడ్డురాలేదు. నెహ్రూ అంతర్జాతీయ మానవతావాద ప్రాపంచిక దృక్పథం కొందరు ఆరోపించినట్లుగా భారత ప్రయోజనాలు త్యాగం చేయడానికి గానీ, రక్షణ అవసరాలను అశ్రద్ధ చేయడానికి గానీ దారి తీయలేదు. అవసరమైనప్పుడు భారత ప్రయోజనాల పరిరక్షణకు బలప్రయోగాన్ని నిరాకరించే శాంతివాదికాదు నెహ్రూ. 1947-48 లో కాశ్మీర్‌లో, జునాఘడ్‌లో, హైదరాబాద్‌లో సైన్యాన్ని ప్రయోగించమని ఆదేశాలు జారీ చేశాడు. అలాగే 1961లో గోవాపై కూడా.

మొదట నెహ్రూ చెప్పినప్పుడు ఆచరణ సాధ్యంగానివని తోసిపుచ్చబడిన అంశాలనే ప్రపంచం తర్వాత నెమ్మదిగా అమలు జరపవలసి వచ్చింది. ఇది అంతర్జాతీయ సంబంధాలపై నెహ్రూ అవగాహన యొక్క దార్శనిక స్వభావాన్ని తెలియజేస్తుంది. అణు నిరాయుధీకరణ ప్రపంచ వ్యాప్తంగా అంగీకారం పొందిన, ఆశించదగిన లక్ష్యమయింది.

అణుయుద్ధంలో గెలుపు వుండదని కాబట్టి అణుయుద్ధం చేయరాదని అమెరికా సోవియట్ యూనియన్‌లు అంగీకరించాయి. 1972 ఫిబ్రవరిలో అమెరికా చైనా సంబంధాలు శాంతియుత సహజీవనం యొక్క ఐదు సూత్రాలు - నెహ్రూ పంచశీల ప్రాతిపదికన ఉండాలని షాంఘై ప్రకటనలో సంతకాలు చేశాయి.

1962లో భారతదేశంపై దాడిచేసినప్పుడు ఏ వ్యక్తినైతే నిర్దాక్షిణ్యంగా వంచన చేశారో ఆ వ్యక్తి ప్రతిపాదించిన సూత్రాలు చైనా అమలు జరపక తప్పనిసరి పరిస్థితి రావడం సాధారణ విషయం కాదు. ఈ సూత్రాలు 1954 లో భారతదేశం, చైనాల మధ్య టిబెట్‌పై ఒప్పందంలో నెహ్రూ ప్రేరణతో రూపుదిద్దుకున్నాయి. అంతర్జాతీయ సంబంధాలలో జాతుల సామాజిక జీవితంలో అహింసా సూత్రాన్ని పొందుపరచిన ఢిల్లీ ప్రకటనపై సోవియట్ నాయకుడు మెహైల్ గోర్బచెవ్ భారత ప్రధాని రాజీవ్ గాంధీలు 1986 నవంబర్‌లో సంతకాలు చేశారు. అంతకంతకు సాంప్రదాయ యుద్ధాలు కూడా విధ్వంసకరమైనవని గుర్తించబడినది. అంతేకాక ఈ యుద్ధాలు సరిహద్దుల్ని అంతగామార్చడంలో గానీ (ఇరాక్ - ఇరాన్‌యుద్ధంలో లాగా) లేక ఆక్రమణలో ఉన్న ప్రజల్ని ఉంచడంలో గానీ (వియత్నాం, ఆఫ్ఘనిస్తాన్, వెస్ట్‌బ్యాంక్) విఫలమయ్యాయి. కాబట్టి ఆచరణీయమైన ఆదర్శం అణ్వస్త్ర రహిత అహింసాయుత ప్రపంచాన్ని రూపొందించుకోవడమే.

నెహ్రూకి పాత శత్రువు అయిన చర్చిల్ రాసిన లేఖలోని ఈ పంక్తుల్ని ఉటంకించి అధ్యాయాన్ని ముగించవచ్చు. 'శాంతి కొరకు మీ ప్రగాఢ ఆకాంక్షను మనల్ని గతంలో విభజించిన వైరాలు పరిగణించడంలో మీరు కాఠిన్యం కనబరచకపోవడాన్ని నేను ఎప్పుడూ అభిమానించాను. దేశంలోని కోట్లాది ప్రజల భవితవ్యాన్ని తీర్చిదిద్దుతూ ప్రపంచ వ్యవహారాల్లో విశిష్టమైన పాత్ర నిర్వహిస్తూ మీరు పెద్ద బరువును మోస్తున్నారు. బాధ్యత నిర్వహిస్తున్నారు. మీ కర్తవ్య నిర్వహణని అభినందిస్తున్నాను. ఆసియా కీర్తి ప్రతిష్టల్ని గమనంలో ఉంచుకోండి.'

అధ్యాయం 17

# పంచవర్ష ప్రణాళికలు - ప్రాంతీయ అభివృద్ధి

ఒక నిర్ణీత కాల వ్యవధిలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి ప్రభుత్వం ఆర్థికవ్యవస్థను నియంత్రించడాన్నే ఆర్థిక ప్రణాళిక విధానంగా చెప్పవచ్చు. ఆర్థిక ప్రణాళిక విధానంలో వివిధ లక్ష్యాలు వివిధ దేశాల్లో కాలానుగుణంగా మారుతుంటాయి. మనదేశంలో ప్రణాళికలకు సంబంధించి 1934సం॥లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య 'Planned Economy for India' అనే గ్రంథంలో ప్రణాళిక నమూనాను పేర్కొన్నారు. ఈయనను "భారత ప్రణాళికపిత" అని పిలుస్తారు. వ్యవసాయ రంగ శ్రామికులను పారిశ్రామిక రంగానికి తరలించడం ద్వారా దశాబ్ది కాలంలోనే జాతీయాదాయాన్ని రెట్టింపు చేయవచ్చని అందులో వివరించారు. అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఈ నమూనాపై స్పందించలేదు. కానీ, స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించి అమలుపర్చడానికి ఈ నమూనా తోడ్పడింది.

1938 సం॥అక్టోబర్ 2, 3 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించిన ప్రొవిజనల్ మినిస్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ సమావేశంలో అప్పటి జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్ జాతీయ ప్రణాళిక ఆవశ్యకతను ప్రస్తావించారు. ఈ సమావేశం ఫలితంగానే 1938 సం॥ అక్టోబర్‌లో నెహ్రూ అధ్యక్షతన, కె.టి.షా ప్రధాన కార్యదర్శిగా 'నేషనల్ ప్లానింగ్ కమిటీ'ని ఏర్పాటు చేశారు. 15 మంది సభ్యులున్న నేషనల్ ప్లానింగ్ కమిటీ, 29 ఉప కమిటీలతో కలిపి మొత్తం 350 మందితో 29 సంపుటాలతో ప్రతిపాదనలను రూపొందించింది. 1944సం॥లో 8 మంది బొంబాయి పారిశ్రామికవేత్తలు 'బొంబాయి ప్లాన్'ను రూపొందించారు. 1944సం॥లో బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం అర్దేశిర్ దలాల్ అధ్యక్షతన ప్రణాళిక, అభివృద్ధిశాఖ (Planning and Development Department) ను నియమించింది. కానీ 1946సం॥లో దీన్ని రద్దు చేశారు. నేషనల్ ప్లానింగ్ కమిటీ, బొంబాయ్ ప్లాన్ రెండింటిలో సారూప్యం ఉన్న ప్రధాన లక్ష్యాలే మనదేశ స్వాతంత్ర్యానంతరం ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్ని నిర్ణయించడంలో ప్రధాన పాత్ర పోషించాయి. గాంధీ ఆలోచనా విధానానికి అనుగుణంగా 1944సం॥లో శ్రీమాన్ నారాయణ అగర్వాల్ గాంధీ ప్రణాళికను రూపొందించారు. ఇది వికేంద్రీకరణకు, గ్రామీణ స్వయం పోషకత్వానికి వ్యవసాయ రంగం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది.

1945సం॥లో భారతీయ ట్రేడ్ యూనియన్ చైర్మన్ ఎం.ఎన్.రాయ్ 'పీపుల్స్ ప్లాన్'ను రూపొందించారు. ఇందులో మార్క్సిజం, సామ్యవాదం ప్రాతిపదికగా ప్రజలు జీవించడానికి కావాల్సిన కనీస అవసరాలు కల్పిస్తూ, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు సమాన ప్రాధాన్యమిస్తూ ఆర్థికాభివృద్ధికి కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం పంచవర్ష ప్రణాళికలను అమలుపర్చాలని నిర్ణయించిన సమయంలోనే 1950సం॥ జనవరిలో జయప్రకాశ్ నారాయణ్ స్వతంత్రంగా 'సర్వోదయ ప్రణాళిక'ను రూపొందించారు. ఈ ప్రణాళికను గాంధీ, వినోబాభావే ఆలోచనల మిళితంగా పేర్కొనవచ్చు.

స్వాతంత్ర్యం వచ్చేనాటికి మనదేశం, పేదరికం, ఆదాయ, ప్రాంతీయ అసమానతలు, నిరుద్యోగిత తదితర అనేక ఆర్థిక, సామాజిక సమస్యలను ఎదుర్కొంటోంది. ఈ సమస్యల పరిష్కారానికి ప్రణాళికలను ఆచరించడమే ఏకైక మార్గమని అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్‌నెహ్రూ భావించారు. అందుకనుగుణంగా 1948 సం॥ ఏప్రిల్, 6న ప్రకటించిన మొదటి పారిశ్రామిక విధాన తీర్మానంలో ప్రభుత్వ రంగానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చారు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో అగ్రగామిగా కొనసాగుతున్న అమెరికా 200 ఏళ్లలో సాధించలేని అభివృద్ధిని, రష్యా కేవలం 30 ఏళ్లలో సాధించడం, ఆర్థిక మాంద్యం దుష్ఫలితాలు రష్యాపై ప్రభావం చూపకపోవడం తదితర కారణాలవల్ల మనదేశం ఆర్థిక ప్రణాళికల ఆచరణ పట్ల మొగ్గు చూపింది.

స్వాతంత్ర్యానంతరం మనదేశంలో ప్రణాళిక సలహా సంఘం విజ్ఞప్తి మేరకు ఆదేశిక సూత్రాల్లోని 39వ రాజ్యాంగ నిబంధన ప్రకారం 1950సం॥ మార్చి 15న ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేశారు. భారతదేశంలో ఆర్థిక ప్రణాళిక యొక్క భావన రష్యా నుంచి తీసుకోబడింది. భారతదేశం 12 పంచవర్ష ప్రణాళికలను ఇప్పటివరకు ప్రారంభించింది. మొదటి పంచవర్ష ప్రణాళిక 1951సం॥లో ప్రారంభించబడింది. ఇప్పుడు ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం అయిదు సంవత్సరాల ప్రణాళికను ఆపివేసింది. కాబట్టి 12 వ పంచవర్ష ప్రణాళిక భారతదేశం యొక్క గత అయిదు సంవత్సరాల ప్రణాళిక.

**భారత ప్రణాళికా సంఘం :** కేంద్ర మంత్రిమండలి తీర్మానం ద్వారా మార్చి 15, 1950సం॥ న ఏర్పడిన కేంద్ర ప్రభుత్వ సలహా సంస్థ. ఇది రాజ్యాంగేతర, శాసనేతర సంస్థ. దీనికి చైర్మన్‌గా ప్రధాన మంత్రి, క్రియాశీలకంగా పనిచేసే వాస్తవ కార్యనిర్వాహకుడిగా ఉపాధ్యక్షుడు వ్యవహరిస్తారు. పార్లమెంటులో ప్రణాళికల గురించి మాట్లాడుతూ నెహ్రూ ప్రభుత్వ రంగాన్ని పెంచుతూ, ఉత్పత్తి రంగాలను ప్రభుత్వపరం చేస్తూ వీటి ఫలితాలను ప్రజలకు అందేలా చేయాల్సి ఉంది. ప్రజాస్వామ్య స్థాపనకు దోహదం చేస్తూ ఆర్థిక, పారిశ్రామిక రంగాలలో ప్రగతిని సాధించడమే ఆర్థికప్రణాళికల ముఖ్యోద్దేశ్యం అని పేర్కొన్నాడు. దేశ వనరులు, అవసరాలను రూపొందించేందుకు 1950సం॥లో ప్రణాళిక సంఘం ఏర్పడింది. ఇంతవరకు మనదేశంలో 12 పంచవర్ష ప్రణాళికలు పూర్తి అయ్యాయి.

ప్రణాళిక సంఘానికి ప్రధాన మంత్రి ఎక్స్-అఫీషియో చైర్మెన్‌గా వ్యవహరిస్తాడు, కాగా కేబినెట్ ర్యాంకు కల డిప్యూటీ చైర్మెన్ ఆ తర్వాతి స్థానంలో కొనసాగుతాడు.

| క్ర.సం. | ప్రణాళిక | ప్రణాళిక వ్యయం (కోట్ల రూ.లో) | వ్యవధి |
|---|---|---|---|
| 1. | మొదటి పంచవర్ష ప్రణాళిక | 2,068 | 1951-1956 |
| 2. | రెండో పంచవర్ష ప్రణాళిక | 4,672 | 1956-1961 |
| 3. | మూడవ పంచవర్ష ప్రణాళిక | 8,577 | 1961-1966 |
| 4. | నాల్గవ పంచవర్ష ప్రణాళిక | 24,759 | 1969-1974 |
| 5. | అయిదవ పంచవర్ష ప్రణాళిక | 53,411 | 1974-1978 |
| | రోలింగ్ ప్రణాళిక | | 1978-1980 |
| 6. | ఆరవ పంచవర్ష ప్రణాళిక | 1,10,467 | 1980-1985 |
| 7. | ఏడవ పంచవర్ష ప్రణాళిక | 2,18,729 | 1985-1989 |
| | సంవత్సర ప్రణాళికలు | | 1990-1992 |
| 8. | ఎనిమిదవ పంచవర్ష ప్రణాళిక | 7,98,000 | 1992-1997 |
| 9. | తొమ్మిదవ పంచవర్ష ప్రణాళిక | 8,59,200 | 1997-2002 |
| 10. | పదవ పంచవర్ష ప్రణాళిక | 15,92,300 | 2002-2007 |
| 11. | పదకొండవ పంచవర్ష ప్రణాళిక | 36,44,000 | 2007-2012 |
| 12. | పన్నెండవ పంచవర్ష ప్రణాళిక | **47,70,000** | 2012-2017 |

**భారత ప్రణాళిక లక్ష్యాలు**

- జాతీయ, తలసరి ఆదాయ వృద్ధి రేట్లు పెంచడం,
- పేదరికాన్ని నిర్మూలించడం
- సంపూర్ణ ఉద్యోగిత కల్పించడం
- ఆదాయ అసమానతలను తగ్గించడం,
- సామాజిక న్యాయంతో కూడిన శీఘ్రవృద్ధి సాధించడం,
- సంతులిత ప్రాంతీయాభివృద్ధిని సాధించడం,
- వివిధ రంగాల ఉత్పాదకతని పెంచడం,
- ప్రజల జీవన ప్రమాణ స్థాయిని పెంచడం

## భారతదేశంలో ప్రణాళికల ద్రవ్య వనరులు

అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయడానికి కావాల్సిన వనరులను ప్రభుత్వం పన్ను వసూళ్లు, పొదుపు మొత్తాలు, అంతర్గత రుణాలు, విదేశీ రుణాలు వంటి వాటిద్వారా సమీకరించాల్సి ఉంటుంది. ఈ మొత్తం సరిపోని పక్షంలో ప్రభుత్వం లోటు ద్రవ్య విధానం ద్వారా ద్రవ్యాన్ని సమకూర్చుకుంటుంది. ప్రభుత్వానికి అందుబాటులో ఉండే ద్రవ్యపరమైన ఆధారాలను ముఖ్యంగా మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

అవి 1. దేశీయ బడ్జెట్ వనరులు 2. విదేశీ వనరులు 3. లోటు ద్రవ్య విధానం

### దేశీయ బడ్జెట్ వనరులు

ప్రభుత్వం దేశంలో సమీకరించిన నిధులనే దేశీయ వనరులుగా పరిగణిస్తారు. 1. ప్రస్తుత రాబడి నుంచి వచ్చే మిగులు 2. ప్రభుత్వ సంస్థల వాటా, 3. దేశీయంగా ఉండే ప్రైవేట్ పొదుపు 4. అదనపు పన్నుల ఆదాయం, 5. ప్రభుత్వ సంస్థల నుంచి వచ్చే అదనపు ఆదాయం

### విదేశీ వనరులు

1. విదేశీ రుణాలు, 2. విదేశీ గ్రాంట్లు, 3. ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్ నుంచి వచ్చే రుణాలు లోటు ద్రవ్య విధానం ఆర్.బి.ఐ.ద్వారా అదనపు కరెన్సీని జారీచేసి రుణం పొందడం.

ప్రణాళికా సంఘం స్థానంలో కొత్త సంస్థను ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోడీ తన స్వాతంత్ర్య వేడుకల ప్రసంగంలో చెప్పిన విషయం తెలిసిందే. ఈ మేరకు నీతి ఆయోగ్ అనే కొత్త సంస్థ మనుగడలోకి వచ్చింది. ప్రణాళికా సంఘం స్థానంలో నీతి ఆయోగ్ **ఏప్రిల్ 1, 2017సం॥ రోజున ఏర్పడి మూడు సంవత్సరాల కార్యాచరణ ప్రణాళికను** ప్రారంభించింది. ప్రణాళికా సంఘం స్థానంలో నీతి ఆయోగ్ ఉనికిలోకి వచ్చింది. ప్రణాళికా సంఘానికి నీతి ఆయోగ్ అని పేరు పెడుతూ ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రణాళికా సంఘానికి నీతి ఆయోగ్ అనే పేరు పెట్టడం కొత్త పంథాలో సంస్థలను ఏర్పాటు చేయడానికి ప్రారంభంగా చెబుతున్నారు. ప్రణాళిక సంఘం ఏర్పాటు విషయంలో తొలుత నెహ్రూ కూడా ప్రతిఘటన ఎదుర్కున్నారు. అయితే, క్రమంగా అది ఆర్థిక విధానాలను, అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి, ముందుకు నడిపించే సంస్థగా రూపుదిద్దుకుంది. ప్రణాళిక సంఘం స్థానంలో ఏర్పాటు చేసే సంస్థ విషయంలో సహకార ఫెడరలిజం సూత్రాన్ని అనుసరిస్తామని ప్రస్తుత ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. తన 65 ఏళ్ల చరిత్రలో ప్రణాళికా సంఘం 12 పంచవర్ష ప్రణాళికలను, ఆరు వార్షిక ప్రణాళికలను రూ.200 లక్షల కోట్లతో రూపొందించింది.

### మొదటి పంచవర్ష ప్రణాళిక

1951-52 సం॥ నుంచి 1955-56సం॥ వరకు మొదటి పంచవర్ష ప్రణాళిక అమలులో ఉంది. భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ డిసెంబర్ 8, 1951సం॥న పార్లమెంటులో మొదటి పంచవర్ష ప్రణాళికను ప్రవేశపెట్టాడు. ఈ ప్రణాళిక మొత్తం కేటాయింపులు 2068 కోట్ల రూపాయలు. ఇందులో నీటిపారుదల, ఇంధనానికి 27.2%, వ్యవసాయం 31.0 %, గ్రామీణాభివృద్ధికి 17.4%, రవాణా, ప్రసార సాధనాలకు 24%, పారిశ్రామిక రంగానికి 8.4%, సాంఘిక సేవలకు 16.64%, కేటాయింపులు చేశారు. రెండవ ప్రపంచ యుద్ధం, దేశ విభజన వల్ల దెబ్బతిన్న ఆర్థిక రంగాన్ని వృద్ధిచేయడంతో పాటు అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కోసం పథకాలను చేపట్టాలనే లక్ష్యాల కోసం ఈ ప్రణాళికను రూపొందించారు. 1951సం॥లో ఆహార ధాన్యాలను అధికంగా దిగుమతి చేసుకోవడంతో వ్యవసాయ రంగాన్ని స్వావలంబన చేయాలనే ఉద్దేశంతో ఈ రంగానికి పెద్ద పీట వేసి అధిక శాతం నిధులు కేటాయించారు. చివరి రెండు సంవత్సరాలు మంచి వర్షపాతం కురియడం, తద్వారా పంట ఉత్పత్తి పెరగడంతో ఈ ప్రణాళికలో వ్యవసాయ రంగం విజయవంతమైందని చెప్పవచ్చు.

ఈ ప్రణాళిక కాలంలో స్థూల దేశీయోత్పత్తిలో 2.1% వృద్ధి సాధించాలనే లక్ష్యం ఉండగా అంతకు మించి 3.6 లక్ష్యం సాధించబడింది. ఈ కాలంలో నికర దేశీయోత్పత్తి 15% వృద్ధి చెందింది. దీనికి రుతుపవనాలు కూడా అనుకూలించడం ఒక కారణం. కాని జనాభా పెరుగుదల రేటు అధికంగా ఉండుటచే తలసరి ఆదాయం మాత్రం తక్కువ స్థాయిలో పెరిగింది. భాక్రానంగల్ ప్రాజెక్టు, హిరాకుడ్ ప్రాజెక్టు, మెట్టూరు డ్యాం వంటి పలు భారీ నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మించాలనే ఉద్దేశానికి ప్రేరణ ఈ ప్రణాళిక కాలంలోనే కల్గింది. 1956సం॥లో ఈ ప్రణాళిక చివరి నాటికి దేశంలో 5 ఐఐటిలు స్థాపించబడ్డాయి. ఉన్నత విద్యకు నిధులు అందజేసి బలోపేతం చేయడానికి యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్ కూడా ఈ ప్రణాళిక కాలంలోనే ఏర్పాటు చేయబడింది. దేశంలో 5 ఉక్కు పరిశ్రమలు స్థాపించడానికి కూడా కాంట్రాక్టుల పైన ఈ ప్రణాళిక కాలంలోనే సంతకాలు తీసుకున్నప్పటికీ, ఉక్కు కర్మాగారాలు మాత్రం రెండో ప్రణాళిక మధ్యకాలంలో ప్రారంభమయ్యాయి.

ఇది 1951సం॥ నుంచి 1956 సం॥ కాల వ్యవధిలో జరిగింది. ఇది హారోడ్-డోమార్ నమూనా ఆధారంగా రూపొందించబడింది. దేశం యొక్క వ్యవసాయ అభివృద్ధిపై దీని ప్రధాన దృష్టి సారించింది. ఈ ప్రణాళిక విజయవంతమై 3.6% వృద్ధి రేటు సాధించింది (లక్ష్యం కంటే ఎక్కువ). ప్రణాళిక లక్ష్యం: వ్యవసాయరంగం అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణం. వృద్ధిరేటు లక్ష్యం-2.1 శాతం, సాధించిన వృద్ధిరేటు- 3.6 శాతం. ప్రణాళిక వ్యయంలో ప్రభుత్వరంగం వాటా- 53.5

శాతం, ప్రైవేటురంగం వాటా- 46.5 శాతం. ప్రభుత్వరంగ పెట్టుబడి-రూ. 1960 కోట్లు. స్థాపించిన సంస్థలు: హిందుస్థాన్ మెషిన్‌టూల్స్, ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీ, చిత్తరంజన్ రైలు ఇంజన్ ఫ్యాక్టరీ, హిందుస్థాన్ షిప్ బిల్డర్స్, నాగార్జునసాగర్, భాక్రానంగల్, హిరాకుడ్ బహుళార్థసాధక ప్రాజెక్టులు. ప్రారంభించిన పథకాలు: సమాజాభివృద్ధి కార్యక్రమం (సీడీపీ)-1952, సమాజ విస్తరణ అభివృద్ధి కార్యక్రమం, 1952సం॥లో జమిందారి విధానం రద్దుచేసి భూ సంస్కరణలు అమలుచేసారు.

**రెండవ పంచవర్ష ప్రణాళిక**

ఈ పంచవర్ష ప్రణాళిక 1956-57సం॥ నుంచి 1960-61సం॥ వరకు కొనసాగింది. 1954సం॥లో భారత జాతీయ కాంగ్రెస్ సదస్సులో సామ్యవాద సమాజాన్ని నిర్మించాలని ప్రకటన చేసినందున రెండో ప్రణాళికలో పారిశ్రామిక రంగంపై అందులోనూ ప్రభుత్వ రంగ సంస్థలపై అధిక దృష్టి కేంద్రీకరించారు. అందకు తగినట్లుగా మహలనోబిస్ నమునాను ఈ ప్రణాళిక నమునాగా స్వీకరించారు. పరిశ్రమల ద్వారా దేశీయోత్పత్తి పెంచడానికి ప్రోత్సాహం కల్పించారు. నీటిపారుదల ప్రాజెక్టులు మరియు భిలాయ్, బొకారో, జంషెడ్పూర్ లాంటి చోట్ల భారీ ఉక్కు కర్మాగారాలను ఈ ప్రణాళిక కాలంలోనే ప్రారంభించారు. బొగ్గు ఉత్పత్తి కూడా పెంచబడింది. ఉత్తర భారతదేశంలో నూతన రైలు మార్గాలు కూడా ప్రారంభించబడ్డాయి. హెూమీ-జే-భాభా చైర్మెన్ గా 1957సం॥లో అణు ఇంధన సంస్థ (Atomic Energy Commission) కూడా ఏర్పాటు చేయబడింది. పరిశోధనా సంస్థగా టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (Tata Institute of Fundamental Research) కూడా ఈ ప్రణాళికలో స్థాపించబడింది.

ఇది 1956 నుంచి 1961 కాల వ్యవధిలో జరిగింది. ఇది PC మహాలనోబిస్ నమూనా ఆధారంగా రూపొందించబడింది. దేశంలో పారిశ్రామిక అభివృద్ధిపై దీని ప్రధాన దృష్టి సారించింది. ఈ ప్రణాళిక విజయం సాధించింది మరియు 4.1% వృద్ధిరేటు సాధించింది.

ప్రణాళిక లక్ష్యం - ప్రభుత్వరంగ భారీ పరిశ్రమలకు ప్రాధాన్యం

వృద్ధిరేటు లక్ష్యం - 4.5శాతం, సాధించిన వృద్ధిరేటు- 4.1 శాతం

ప్రణాళిక వ్యయంలో ప్రభుత్వరంగం వాటా- 60.3 శాతం, ప్రైవేటు రంగం వాటా- 39.7 శాత, ప్రభుత్వరంగ పెట్టుబడి- రూ. 4,600 కోట్లు

స్థాపించిన సంస్థలు- రూర్కెలా ఇనుము-ఉక్కు పరిశ్రమ (జర్మనీ సహకారం), దుర్గాపూర్ ఇనుము-ఉక్కు కర్మాగారం (బ్రిటన్ సహకారం), భిలాయ్ ఇనుము- ఉక్కు కర్మాగారం (రష్యా సహకారం). ఈ ప్రణాళికను ధైర్యవంతుల ప్రణాళిక అని కూడా అంటారు.

**మూడవ పంచవర్ష ప్రణాళిక**

ఈ పంచవర్ష ప్రణాళిక 1961-62 సం॥ నుంచి 1965-66సం॥ వరకు కొనసాగింది. స్వయం సమృద్ధి లక్ష్యంతో ముఖ్యంగా వ్యవసాయ రంగంలో, మౌళిక పరిశ్రమల రంగంలో ఉత్పత్తులు పెంచాలని ఈ ప్రణాళిక లక్ష్యంగా నిర్ణయించి దీనిని ప్రారంభించారు. మూడవ ప్రణాళిక వ్యయం 8577 కోట్ల రూపాయలు. రెండో ప్రణాళికలో భారీ పరిశ్రమలను ప్రాధాన్యత ఇవ్వడం వల్ల వ్యవసాయ రంగంలో ధరలు పెరిగినందువల్ల ఈ ప్రణాళికలో వ్యవసాయ రంగానికి పెద్దపీఠ వేయబడింది. భారతదేశ వ్యవసాయ రంగంలోనే విప్లవాత్మకమైన హరిత విప్లవం (Green Revolution) ఈ కాలం లోనే ప్రారంభించబడింది. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం ఈ ప్రణాళికాకాలంలోనూ కొనసాగింది. పలు చోట్ల సిమెంటు మరియు ఎరువుల కర్మాగారాలు స్థాపించబడ్డాయి. సస్యవిప్లవం ప్రభావం వల్ల పంజాబ్‌లో గోధుమల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాలలు విరివిగా స్థాపించబడి విద్యావకాశాలను మెరుగుపర్చబడింది. కిందిస్థాయి వరకు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి పంచాయతీ ఎన్నికలను నిర్వహించారు. పలు రాష్ట్రాలలో విద్యుత్తు బోర్డులను స్థాపించి గృహ, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు విద్యుత్ సరఫరా మెరుగు పర్చబడింది. ఇన్ని సౌకర్యాలు కల్పించబడినప్పటికీ మూడవ పంచవర్ష ప్రణాళిక చివరికి విఫలమైంది. దీనికి ప్రధాన కారణం చైనా యుద్ధం, రుతుపవనాల తిరోగమనం. ఈ రెండింటి కారణాల వల్ల ఆహార ధాన్యాల ధరలు పెరిగి, విదేశీ మారక నిల్వలు తగ్గి, అప్పుల భారం పెరిగింది. ఇది 1961సం॥ నుంచి 1966 కాల వ్యవధిలో జరిగింది. ఈ ప్రణాళికను గాడ్గిల్ యోజన అని పిలుస్తారు. ఈ పథకం యొక్క ముఖ్య లక్ష్యంగా ఆర్థిక వ్యవస్థను స్వతంత్రంగా మార్చడం మరియు స్వీకరించే స్వయంగా చురుకైన స్థానాన్ని పొందడం. చైనా యుద్ధం కారణంగా ఈ ప్రణాళిక వృద్ధిరేటు 5.6% లక్ష్యం సాధించలేదు.

ఈ ప్రణాళిక కాలంలో రష్యా సహకారంతో బొకారో ఇనుము-ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు. 1964సం॥లో భారత పారిశ్రామిక అభివృద్ధి బ్యాంకు (IDBI), 1965సం॥లో భారత ఆహార సంస్థ (FCI)లను స్థాపించారు. హరితవిప్లవం ఈ ప్రణాళిక కాలంలోనే ప్రారంభమైంది. ఈ ప్రణాళికను దీర్ఘదర్శి ప్రణాళిక అంటారు.

ప్రణాళిక లక్ష్యం – వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో స్వావలంబన, స్వయం సమృద్ధి సాధించడం

వృద్ధిరేటు లక్ష్యం – 5.6 శాతం, సాధించిన వృద్ధిరేటు – 2.8 శాతం

ప్రణాళికా వ్యయంలో ప్రభుత్వరంగం వాటా – 64.7 శాతం

ప్రణాళికా వ్యయంలో ప్రైవేటురంగం వాటా – 35.3 శాతం

ప్రభుత్వరంగ పెట్టుబడి - రూ. 8,580 కోట్లు

**ప్లాన్ హాలిడే ప్రణాళిక సెలవు :** చైనాతో యుద్ధం మూలంగా మరియు వ్యవసాయ రంగంలో అనుకున్న ఫలితాలను సాధించ లేకపోవుట వల్ల వెంటనే నాల్గవ ప్రణాళిక ప్రారంభించడం అసాధ్యమని భావించిన ప్రభుత్వం 1966-69సం॥ వరకు ప్రణాళిక సెలవుగా ప్రకటించింది. 1966-69సం॥ కాలానికి 3 వార్షిక ప్రణాళికలను రూపొందించింది. ఈ కాలంలో రుతుపవనాలు కరుణించి మంచి వర్షపాతాన్ని కురిపించడంతో వ్యవసాయ ఉత్పత్తులు పెరిగి, ధరలు తగ్గి మళ్ళీ భారత ఆర్థిక వ్యవస్థ పురోగాభివృద్ధి చెందింది.

ప్రణాళిక సెలవు కాల వ్యవధి 1966 సం॥ నుంచి 1969సం॥ వరకు ఉంది. ప్రణాళిక సెలవు వెనుక ప్రధాన కారణం ఇండో పాకిస్తాన్ యుద్ధం మరియు మూడవ ప్రణాళిక వైఫల్యం. ఈ ప్రణాళికలో వార్షిక పథకాలు జరిగాయి మరియు వ్యవసాయం దాని అనుబంధ రంగాలు మరియు పరిశ్రమ రంగాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వబడింది.

**నాల్గవ పంచవర్ష ప్రణాళిక:** ఈ ప్రణాళిక 1969-70 సం॥ నుంచి 1973-74సం॥ వరకు కొనసాగింది. సుస్థిరమైన అభివృద్ధి సాధించడం ఈ ప్రణాళిక లక్ష్యంగా నిర్ణయించారు. వ్యవసాయ రంగంలో రైతులకు తగినంత రుణాలను అందించడానికి దేశంలోని ప్రముఖ పెద్ద బ్యాంకులను ఇందిరా గాంధీ ప్రభుత్వం జాతీయం చేసింది. పాకిస్తాన్‌తో యుద్ధం మరియు బంగ్లాదేశ్ శరణార్థుల సమస్య ఈ ప్రణాళికపై భారంపడింది. పారిశ్రామిక అభివృద్ధి కోసం కేటాయించబడిన నిధులను యుద్ధం కోసం ఖర్చు చేయవలసి వచ్చింది. రాజస్థాన్ ఎడారిలోని పోఖ్రాన్లో అణుపరీక్షలు చేయడంతో అమెరికా ఆగ్రహానికి గురై ఆ దేశ సహాయంలో కూడా కోతపడింది. ఇన్ని ప్రతికూల పరిస్థితుల వల్ల ఈ ప్రణాళిక విఫలమైంది. అయిననూ ఈ ప్రణాళికలో అనేక గ్రామీణాభివృద్ధి పథకాలను చేపట్టడంతో పేదరిక నిర్మూలనకు, ఉపాధి అవకాశాలకు దోహదపడింది. పారిశ్రామిక రంగంలో 9% వృద్ధిరేటు సాధించాలనే లక్ష్యం కలగానే మిగిలిపోయింది. దీని వ్యవధి 1969 సం॥ నుంచి 1974సం॥ వరకు ఉంది. ఈ పథకం యొక్క రెండు ప్రధాన లక్ష్యాలు అంటే స్థిరత్వం మరియు స్వీయ విశ్వాసం యొక్క ప్రగతిశీల సాధించిన అభివృద్ధి. ఈ ప్రణాళికలో 1971సం॥ ఎన్నికలలో ఇందిరా గాంధీచే " గరీబీ హటావో" యొక్క నినాదం ఇవ్వబడింది. ఈ ప్రణాళిక విఫలమైంది మరియు 5.7% లక్ష్యంతో మాత్రమే 3.3% వృద్ధి రేటును సాధించింది.

ప్రణాళిక లక్ష్యం - స్థిరత్వంతో కూడిన వృద్ధిరేటు, స్వావలంబన సాధన

వృద్ధిరేటు లక్ష్యం - 5.7 శాతం, సాధించిన వృద్ధిరేటు - 3.3 శాతం

ప్రణాళికా వ్యయంలో ప్రభుత్వరంగం వాటా - 63.9 శాతం, ప్రణాళికా వ్యయంలో ప్రైవేటురంగం వాటా - 36.1 శాతం, ప్రభుత్వరంగ పెట్టుబడి - రూ. 15,900 కోట్లు.

ఈ ప్రణాళిక కాలంలో రష్యా సహకారంతో విశాఖపట్నం, కర్ణాటకలోని విజయనగర్, తమిళనాడులోని సేలంలో 3 మినీ స్టీల్ కర్మాగారాలను స్థాపించారు. ఈ ప్రణాళిక కాలంలోనే (1971లో) ప్రధాని ఇందిరాగాంధీ గరీబీ హటావో నినాదం ప్రారంభించారు. శ్వేత విప్లవం (1970), ఉపాధి హామీ పథకం (1972-మహారాష్ట్ర), కరువు పీడిత ప్రాంతాల పథకం (1973) ఈ ప్రణాళిక కాలంలోనే ప్రారంభమయ్యాయి. చిన్నకారు రైతుల అభివృద్ధి ఏజెన్సీ, ఉపాంత రైతుల వ్యవసాయ కూలీల ఏజెన్సీలను కూడా ఈ ప్రణాళిక కాలంలోనే ఏర్పాటు చేశారు.

**ఐదవ పంచవర్ష ప్రణాళిక:** ఈ ప్రణాళిక 1974-75సం॥ నుంచి 1978-79సం॥ కాలంలో చేపట్టబడింది. గ్రామీణాభివృద్ధి, స్వయం సమృద్ధి ధ్యేయంగా ప్రారంభించబడిన ఈ ప్రణాళిక మురార్జీ దేశాయ్ నాయకత్వం లోని జనతా ప్రభుత్వం ఒక సంవత్సరం ముందుగానే నిల్పివేసింది. ద్రవ్యోల్బణంను తగ్గించడానికి ఈ ప్రణాళిక మంచి కృషి చేసింది. ఐదవ పంచవర్ష ప్రణాళిక యొక్క మొత్తం పెట్టుబడి 53411 కోట్ల రూపాయలు. ఈ ప్రణాళిక కాలంలోనే దేశ రాజకీయాలలో విపరీత పరిణామాలు సంభవించాయి. ఇందిరాగాంధీ ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని విధించడం ఈ కాలంలోనే జరిగింది. ఈ పరిణామాలు దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం కలిగించాయి. ఎమర్జెన్సీ తర్వాత వచ్చిన మురార్జీ ప్రభుత్వం ఈ ప్రణాళికను రద్దు చేసి నిరంతర ప్రణాళికలను (Rolling Plans) ప్రారంభించింది.

ప్రణాళిక వ్యవధి 1974సం॥ నుంచి 1979సం॥ వరకు ఉంది. ఈ పథకంలో వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వబడింది, తరవాత పరిశ్రమ మరియు గనులకి వచ్చింది. మొత్తంమీద ఈ ప్రణాళిక విజయం సాధించింది, ఇది 4.8% వృద్ధి సాధించి 4.4% లక్ష్యాన్ని సాధించింది. ఈ ప్రణాళిక యొక్క ముసాయిదా DP ధర్ చేత తయారుచేయబడి, ప్రారంభించబడింది. ఈ ప్రణాళిక 1978లో రద్దు చేయబడింది.

ప్రణాళిక లక్ష్యం- పేదరిక నిర్మూలన, స్వావలంబన సాధన

వృద్ధిరేటు లక్ష్యం- 4.4 శాతం, సాధించిన వృద్ధిరేటు - 4.8 శాతం

ప్రణాళికా వ్యయంలో ప్రభుత్వరంగం వాటా- 69.7 శాతం,

ప్రణాళికా వ్యయంలో ప్రైవేటురంగం వాటా-30.3 శాతం. ప్రభుత్వరంగ పెట్టుబడి-రూ. 39,430 కోట్లు.

ఈ ప్రణాళిక కాలంలో 1975సం॥లో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, 1976సం॥లో మొదటి జాతీయ జనాభా విధానాలను ప్రారంభించారు. ఈ ప్రణాళిక కాలంలో అమలైన పథకాలు: 1974సం॥లో- జాతీయ కనీస అవసరాల పథకం, 1975సం॥లో- 20 సూత్రాల కార్యక్రమం,

1977సం॥లో- పనికి ఆహార పథకం (నిజ వేతన పథకం), 1977సం॥లో- అంత్యోదయ (రాజస్థాన్ రాష్ట్రంలో ప్రారంభమైంది), 1978-79సం॥లో- సమీకృత గ్రామీణాభివృద్ధి పథకం. ఒకటో ప్రణాళిక నుంచి అయిదో ప్రణాళిక వరకు సగటు వృద్ధిరేటు 3.5 శాతంగా ఉంది.

**రోలింగ్ ప్లాన్:** ఈ ప్రణాళిక 1978-79సం॥ కోసం వార్షిక పథకాన్ని ప్రారంభించి అయిదవ సంవత్సరం ప్రణాళికను కొనసాగించింది. కేంద్రంలో ప్రభుత్వం మారడంతో ఇందిర ప్రభుత్వం ప్రారంభించిన ప్రణాళికను అర్థాంతరంగా ముగించి జనతా పార్టీ లక్ష్యాలతో మురార్జీ ప్రభుత్వం నిరంతర ప్రణాళికలను ప్రవేశపెట్టింది. ప్రముఖ ఆర్థిక వేత్త డి.టి.లక్డావాలాను ప్రణాళిక సంఘం డిప్యూటీ చైర్మెన్‌గా నియమించారు. ఈ ప్రణాళికనే ఆరవ ప్రణాళికగా భావించారు. కాని కేంద్రంలో మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో దీన్ని కూడా రద్దుచేసి 1980సం॥ నుంచి ఆరవ పంచవర్ష ప్రణాళికను ప్రారంభించారు.

**ఆరవ పంచవర్ష ప్రణాళిక:** ఈ ప్రణాళిక 1980సం॥ నుంచి 1985సం॥ వరకు అమలులో ఉంది. పేదరిక నిర్మూలన ఈ ప్రణాళిక ధ్యేయం. ఈ ప్రణాళిక మొత్తం పెట్టుబడి 109290 కోట్ల రూపాయలు. అభివృద్ధి రేటు సంవత్సరానికి 5.2%గా నిర్ణయించారు. ఈ ప్రణాళికకాలంలో పలు ఉపాధి, పేదరిక నిర్మూలన కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. ఐ.ఆర్.డి.పి. ట్రైసిమ్, యన్.ఆర్.ఇ.పి అందులో ముఖ్యమైనవి. ఈ ప్రణాళిక కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరగడంతో పాటు అనుకున్న వృద్ధిరేటు కూడా 0.5 % అధికంగా సాధించడం జరిగింది. ఈ ప్రణాళికలో ఇంధన రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. వ్యవసాయరంగానికి, పరిశ్రమలకు అవస్థాపనా సౌకర్యాలను అభివృద్ధి పరుచుట, గ్రామీణ రంగాలలో ఉపాధి సౌకర్యాలు కల్పించుట వ్యూహంగా నిర్ణయించారు. ఆర్థిక, సాంకేతిక రంగాలలో స్వావలంబన మరియు పేదరికం, నిరుద్యోగం నిర్మూలన మొదలైనవి ఈ ప్రణాళిక లక్ష్యాలు. దీని వ్యవధి 1980సం॥ నుంచి 1985సం॥ వరకు ఉంది. ఈ ప్రణాళిక యొక్క ప్రాథమిక లక్ష్యం పేదరిక నిర్మూలన మరియు సాంకేతిక స్వీయ విశ్వాసం. ఇది పెట్టుబడి యోజన, మౌలిక మార్పు మరియు అభివృద్ధి నమూనా ధోరణిపై ఆధారపడింది. దీని పెరుగుదల లక్ష్యం 5.2% కానీ అది 5.7% సాధించింది.

ప్రణాళిక లక్ష్యం-పేదరిక నిర్మూలన, స్వావలంబన సాధన

వృద్ధిరేటు లక్ష్యం- 5.2 శాతం, సాధించిన వృద్ధిరేటు- 5.7 శాతం

ప్రణాళికా వ్యయంలో ప్రభుత్వరంగం వాటా- 61.7 శాతం, ప్రణాళికా వ్యయంలో ప్రైవేట్ రంగం వాటా- 38.3 శాతం; ప్రభుత్వరంగ పెట్టుబడి రూ.1,09,290 కోట్లు ఈ ప్రణాళిక కాలంలో బ్లూ రెవల్యూషన్ (నీలి విప్లవం) 1980సం॥లో ప్రారంభించబడింది; ఈ ప్రణాళిక కాలంలో ప్రారంభించిన ప్రభుత్వ పథకాలు: -1980సం॥లో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం (ఎన్ఆర్ఈపీ), -1982సం॥లో-

గ్రామీణ ప్రాంతాల స్త్రీ, శిశు అభివృద్ధి పథకం, 1983సం॥లో - గ్రామీణ భూమి లేని వారి ఉపాధి హామీ పథకం, -1985సం॥లో- ఇందిరా ఆవాస్ యోజన.

**ఏడవ పంచవర్ష ప్రణాళిక:** ఈ ప్రణాళిక 1985సం॥లో ప్రారంభమై 1990సం॥ వరకు కొనసాగింది. రాజీవ్ గాంధీ హయంలో తయారైన ఈ ప్రణాళికలో ఆహారోత్పత్తి మరియు ఉపాధి అవకాశాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. 20 వ శతాబ్దంలోకి పయనం అనే నినాదంతో దేశ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని తయారుచేయబడిన ప్రణాళిక ఇది. శాస్త్ర, సాంకేతిక రంగాలలో గణనీయమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి ప్రణాళికలో అధిక ప్రాధాన్యత ఇచ్చారు. పేదరిక నిర్మూలన, నిరక్ష్యరాస్యత నిర్మూలన, మౌలిక సదుపాయాలు కల్పించడం దీని ఉప లక్ష్యాలు. ఏడవ ప్రణాళిక మొత్తం పెట్టుబడి 218730 కోట్ల రూపాయలు. తలసరి ఆధాయ వృద్ధిరేటు 3.6%. ప్రణాళిక కాలంలోనే జవహర్ రోజ్‌గార్ యోజనను (JRY) ప్రారంభించారు. ఈ యోజన వివిధ రకాల పేర్లు మార్చుకొని ఇప్పటివరకు కూడా అమలులో ఉంది. ఈ ప్రణాళికలో నిర్ణయించిన లక్ష్యాలు సాధించినందువల్ల ఏడవ పంచవర్ష ప్రణాళిక విజయవంతమైందని చెప్పవచ్చు. దీని వ్యవధి 1985సం॥ నుండి 1990సం॥ వరకు ఉంది. తగినంత ఆర్థిక వ్యవస్థ ఏర్పాటు, ఉత్పాదక ఉపాధి అవకాశాలు ఈ ప్రణాళిక యొక్క లక్ష్యాలుగా ఉన్నాయి. దీని పెరుగుదల లక్ష్యం 5.0% కానీ అది 6.0% సాధించింది ప్రణాళిక లక్ష్యం- ఆహారం, పని, ఉత్పాదకత వృద్ధిరేటు లక్ష్యం- 5 శాతం, సాధించిన వృద్ధిరేటు- 6 శాతం. ప్రణాళిక వ్యయంలో ప్రభుత్వరంగం వాటా- 51.7 శాతం, ప్రైవేట్ రంగం వాటా- 48.3 శాతం, ప్రభుత్వరంగ పెట్టుబడి- రూ. 2,18,730 కోట్లు.

ఈ ప్రణాళిక కాలంలో 1986సం॥లో CAPART, 1988లో నేషనల్ హౌసింగ్ బ్యాంక్ స్థాపించారు. ఈ ప్రణాళిక కాలంలో ప్రారంభించిన ప్రభుత్వ పథకాలు: 1986సం॥లో పట్టణ పేదలకు స్వయం ఉపాధి పథకం, 1988సం॥లో మిలియన్ బావుల పథకం, 1989సం॥లో- జవహర్ రోజ్‌గార్ యోజన, 1989సం॥లో నెహ్రూ రోజ్‌గార్ యోజన.

**వార్షిక పథకాలు :** కేంద్రంలో అస్థిర రాజకీయ పరిస్థితి కారణంగా ఎనిమిదవ పంచవర్ష ప్రణాళిక జరగలేదు. కాబట్టి రెండు వార్షిక కార్యక్రమాలు 1990-91సం॥ & 1991-92సం॥ లో ఏర్పడ్డాయి.

**ఎనిమిదవ పంచవర్ష ప్రణాళిక:** ఏడవ ప్రణాళిక అంతం తర్వాత దేశంలో రాజకీయ అస్థిరత వల్ల ఎనిమిదవ ప్రణాళిక ప్రారంభించడానికి రెండు సంవత్సరాలు ఆలస్యం అయింది. చివరికి 1992 ఏప్రిల్ 1 న ఈ ప్రణాళిక పట్టాలకెక్కింది. ఈ ప్రణాళిక పెట్టుబడి 7,98,000 కోట్ల రూపాయలు, ఇందులో పబ్లిక్ రంగం వాటా 4,34,100 (మొత్తం ప్రణాళిక పెట్టుబడిలో 45%). 1997 మార్చి 31 వరకు అమలులో ఉన్న ఈ ప్రణాళిక లక్ష్యాలు వ్యవసాయ రంగంలో స్వయం సమృద్ధి, ఏటా

5.6% అభివృద్ధి రేటు సాధించడం, ఎగుమతులు స్థూల జాతీయోత్పత్తిలో 13.6% పెరగడం, దిగుమతుల రేటు 8.4%కి పరిమితం చేయడం, పొదుపు 21.6% దాకా ఉంచడం, జనాభా పెరుగుదల రేటు తగ్గించడం నిరక్ష్యరాస్యత నిర్మూలన మొదలైనవి. దీని వ్యవధి 1992 నుంచి 1997సం॥ వరకు జరిగింది. ఈ పథకంలో మానవ వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వబడింది అంటే ఉపాధి, విద్య, ప్రజా ఆరోగ్యం మొదలైనవి ఈ ప్రణాళికలో కొనసాగాయి. భారతదేశం యొక్క నూతన ఆర్థిక విధానం ప్రారంభించబడింది. ఈ పథకం విజయవంతమైంది, వార్షిక వృద్ధిరేటు 6.6% ను 5.6% లక్ష్యాన్ని సాధించింది. ప్రణాళిక లక్ష్యం - పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత నిర్మూలన వృద్ధిరేటు లక్ష్యం - 5.6 శాతం, సాధించిన వృద్ధిరేటు-6.8 శాతం ప్రణాళికా వ్యయంలో ప్రభుత్వరంగం వాటా - 49.8 శాతం, ప్రణాళికా వ్యయంలో ప్రైవేట్ రంగం వాటా - 50.2 శాతం, ప్రభుత్వరంగ పెట్టుబడి - రూ. 4,85,460 కోట్లు. ఈ ప్రణాళిక కాలంలో అమలైన ప్రభుత్వ పథకాలు: 1993సం॥లో- ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన (పీఎంఆర్2), 1993సం॥లో- ఉపాధి హామీ పథకం (ఈఏఎస్), 1993సం॥లో- మహిళా సమృద్ధి యోజన (ఎంఎస్.వై), 1993సం॥లో- ఎంపీ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి పథకం (ఎంపీఎల్ఏడీఎస్), ఈ ప్రణాళిక కాలంలో భాగంగా 1993సం॥లో జిల్లా గ్రామీణాభివృద్ధి పథకం (DRDA) స్థాపించబడింది.

**తొమ్మిదో పంచవర్ష ప్రణాళిక:** తొమ్మిదవ పంచవర్ష ప్రణాళిక 1997సం॥ ఏప్రిల్ 1 నుంచి 2002 మార్చి 31 వరకు అమలులో ఉంది. ఈ ప్రణాళిక మొత్తం పెట్టుబడి 21,90,000 కోట్ల రూపాయలు. ఈ ప్రణాళిక లక్ష్యాలు పేదరిక నిర్మూలన, వ్యవసాయ రంగ అభివృద్ధి, ద్రవ్యోల్బణ నిర్మూలన, ప్రాథమిక ఆరోగ్య వసతులు మెరుగు పర్చడం, స్థానిక సంస్థల అభివృద్ధి, జనాభా నియంత్రణ, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడం మొదలగునవి. దీని వ్యవధి 1997సం॥ నుంచి 2002సం॥ వరకు ఉంది. ఈ ప్రణాళిక యొక్క ప్రధాన దృష్టి "న్యాయం మరియు సమానత్వంతో పెరుగుదల" ఇది భారతదేశం యొక్క స్వాతంత్ర్యం 50 వ సంవత్సరంలో ప్రారంభించబడింది. ఈ ప్రణాళిక 7% వృద్ధి లక్ష్యాన్ని సాధించడంలో విఫలమైంది, 5.6% చొప్పున మాత్రమే పెరుగుతుంది.

ప్రణాళిక లక్ష్యం - అభివృద్ధి, సమానత్వం, సాంఘిక న్యాయం

వృద్ధిరేటు లక్ష్యం - 6.5 శాతం, సాధించిన వృద్ధిరేటు - 5.4 శాతం

ప్రణాళికా వ్యయంలో ప్రభుత్వరంగం వాటా - 37.3 శాతం, ప్రైవేట్ రంగం వాటా - 62.7 శాతం.

ప్రభుత్వరంగ పెట్టుబడి - రూ. 9,41,041 కోట్లు. ప్రణాళిక కాలంలో అమలైన ప్రభుత్వ పథకాలు: 1997సం॥లో- స్వర్ణజయంతి షహరీ రోజ్గార్ యోజన (ఎస్జీఎస్వై), -1999సం॥లో- స్వర్ణ జయంతి గ్రామ్ స్వరాజ్‌గార్ యోజన (ఎస్‌జీఎస్‌వై),-1999సం॥లో- జవహర్ గ్రామ సమృద్ధి యోజన

(జేడీఎస్),-2000సం॥లో- జనశ్రీ బీమా యోజన,-2000సం॥లో- ప్రధానమంత్రి గ్రామోదయ యోజన,-2000సం॥లో ప్రధానమంత్రి అన్న యోజన (పీఎంఏవై).

**పదవ పంచవర్ష ప్రణాళిక:** ఈ ప్రణాళిక ఏప్రిల్, 2002సం॥ నుంచి మార్చి 1, 2007సం॥ వరకు కొనసాగింది 10వ ప్రణాళికలో ఆర్థికవృద్ధి రేటు లక్ష్యం 7.6% పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రణాళికలో వ్యవసాయ రంగం 2.13 వృద్ధిరేటు నమోదైంది. పారిశ్రామికరంగంలో 8.74%, సేవల రంగంలో 9.28% వృద్ధిరేటు నమోదైంది. దీని వ్యవధి 2002 సం॥ నుంచి 2007 సం॥ వరకు జరిగింది. రాబోయే 10 సంవత్సరాల్లో భారతదేశపు తలసరి ఆదాయాన్ని రెట్టింపు చేయాలని ఈ ప్రణాళిక లక్ష్యంగా పెట్టుకుంది. ఇది 2012 సం॥ నాటికి పేదరికం నిష్పత్తి 15% తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీని పెరుగుదల లక్ష్యం 8.0% అయితే అది కేవలం 7.2% మాత్రమే సాధించింది.

ప్రణాళిక లక్ష్యం - అభివృద్ధి, సమానత్వం, సుస్థిరత

వృద్ధిరేటు లక్ష్యం - 8 శాతం, సాధించిన వృద్ధిరేటు -7.8 శాతం

మొత్తం ప్రణాళిక వ్యయంలో ప్రభుత్వ రంగం వాటా - 34.8 శాతం, ప్రైవేట్ రంగం వాటా - 65.2 శాతం.

ప్రభుత్వ రంగం పెట్టుబడి - రూ. 15,25,639 కోట్లు

ఈ ప్రణాళిక కాలంలో అమలైన ప్రభుత్వ పథకాలు: ప్రవాసీ బీమా యోజన, -వందేమాతరం -జాతీయ పనికి ఆహార పథకం, జననీ సురక్ష యోజన, -భారత్ నిర్మాణ్ యోజన,-రాజీవ్ గాంధీ గ్రామీణ విద్యుదీకరణ యోజన, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, -మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం. ఈ ప్రణాళిక కాలంలోనే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ పిల్లల కోసం కస్తూర్బాగాంధీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభమయ్యాయి.

**పదకొండవ పంచవర్ష ప్రణాళిక:** పదకొండవ పంచవర్ష ప్రణాళిక ముసాయిదాను జాతీయ ప్రణాళిక సంఘం నవంబర్ 2007సం॥లో ఆమోదించింది. 2007సం॥ నుంచి 2012సం॥ కాలంలో అమలయ్యే ఈ ప్రణాళికలో ఆర్థికవృద్ధి రేటును 9%కు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించారు. ప్రాధాన్య రంగాల కార్యక్రమాల్లో పెట్టుబడులను గణనీయంగా పెంచడం ద్వారా మరింత సమగ్రంగా అభివృద్ధి సాధించాలని ప్రణాళికలో నిర్దేశించారు. నేపథ్యం: "వేగంగా మరియు మరింత సఘంటిత అభివృద్ధి" దీని వ్యవధి 2007 సం॥ నుంచి 2012 సం॥ వరకు ఉంది. దీని ప్రధాన నేపథ్యం "వేగవంతమైన మరియు మరింత కలుపుకొని ఉన్నవృద్ధి" దీని పెరుగుదల రేటు లక్ష్యం 8.1% అయితే సాధించినవృద్ధి 7.9%.

ప్రణాళిక **లక్ష్యం**-శీఘ్రతర, సమ్మిళిత వృద్ధి, వృద్ధి రేటు లక్ష్యం-9 శాతం, సాధించిన వృద్ధిరేటు -8 శాతం, ప్రభుత్వరంగం పెట్టుబడి - రూ. 36,44,718 కోట్లు.

**ఈ ప్రణాళిక కాలంలో ప్రారంభించిన పథకాలు:** రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, -ఆమ్ ఆద్మీ బీమా యోజన, -ప్రధానమంత్రి ఉద్యోగ కల్పనా పథకం, -ప్రధానమంత్రి ఆదర్శగ్రామ్ యోజన,-ధనలక్ష్మి, - రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన, -రాజీవ్ గాంధీ గ్రామీణ్ ఎల్పిజీ వితరస్ యోజన, -మహిళా కిసాన్ స్వశక్తికరణ్ పరియోజన, -ఇందిరాగాంధీ మాతృత్వ సహ్యోగ్ యోజన.

**పన్నెండవ పంచవర్ష ప్రణాళిక:** పన్నెండవ పంచవర్ష ప్రణాళిక 2012సం॥ నుంచి 2017సం॥ వరకు ప్రణాళికా ముసాయిదా ముఖ్యాంశాలు : ప్రణాళిక అమలు కోసం కేంద్రం కేటాయించాల్సిన స్థూల బడ్జెటరీ మద్దతు 14,21,711 కోట్ల రూపాయలు. ఇది గత ప్రణాళిక కంటే 6,00,000 కోట్లు అధికం. ప్రధానంగా ఈ ప్రణాళికలో సామాజిక, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధిపై దృష్టి పెట్టారు. ప్రాధాన రంగాలకు స్థూల బడ్జెట్ లో 74.67%కు పెంచారు. గత ప్రణాళికలో ఇది 55.2% మాత్రమే. విద్యారంగానికి ఈ ప్రణాళికలో మంచి కేటాయింపులు చేశారు. స్థూల బడ్జెట్‌లో దీని వాటా 19.36%. దీని ప్రకారం ఈ ప్రణాళిక కాలంలో విద్యకై 2,75,000 కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంది. వ్యవసాయ రంగంలోవృద్ధి రేటు 4%గా నిర్ణయించారు. పారిశ్రామిక, సేవల రంగం వృద్ధి రేటును 9-11%గా నిర్ణయించారు.

12వ పంచవర్ష ప్రణాళిక ప్రగతి: పన్నెండో పంచవర్ష ప్రణాళిక (2012-17) ప్రారంభంలో ఆర్థిక వ్యవస్థలో ఏర్పడిన వృద్ధి క్షీణతను నివారించడంతోపాటు ప్రణాళికలో అధికవృద్ధి సాధన దేశ ఆర్థిక వ్యవస్థకు సవాలుగా పరిణమించింది. 2012-13సం॥లో 5.6% వృద్ధి నమోదు చేసిన భారత ఆర్థిక వ్యవస్థ. ప్రణాళికలోని చివరి రెండేళ్లలో 9% వృద్ధిని సాధించింది. ప్రణాళిక ప్రారంభానంతరం వృద్ధి ధోరణులను పరిశీలిస్తే పన్నెండో ప్రణాళికలో వృద్ధి. 7శాతానికి పరిమితమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. 2016-17సం॥లో భారత ఆర్థిక వృద్ధిని ఐ.ఎం.ఎఫ్. 7.4%గా అంచనా వేసింది. ప్రణాళిక తొలి నాలుగేళ్లలో వ్యవసాయ రంగ సగటు వృద్ధి 1.6%గా నమోదైంది. 2013-14సం॥లో రుతుపవనాల అనుకూలతతో వ్యవసాయానుబంధ రంగం 4.2% వృద్ధిని సాధించింది. పన్నెండో పంచవర్ష ప్రణాళిక తయారీ రంగ వృద్ధి లక్ష్యాన్ని 10%గా తీసుకొంది. అయితే లక్ష్య సాధనలో భారత్ వెనుకబడే సూచనలు కన్పిస్తున్నాయి. 12వ ప్రణాళికా వృద్ధిని సేవా రంగ ఆధారిత వృద్ధిగా చెప్పవచ్చు. 2014సం॥లో భారత సేవా రంగ వృద్ధి 10.3%గా నమోదైంది. 2011-12సం॥ నుంచి 2015-16సం॥ (నవంబర్ వరకు) సేవా రంగ ఎఫ్‌డిఐల్లో జపాన్ 20%, అమెరికా 19% వాటా కలిగి ఉన్నాయి. మారిషస్, సింగపూర్, నెదర్లాండ్స్‌ల వాటాలు వరుసగా 18.9%, 18.6%, 15.4% ఉన్నాయి.

**అనిశ్చితిలో సానుకూల ఫలితాలు:** కీలక రంగాల్లో సంస్కరణలు చేపట్టిన కారణంగా ఈ ప్రణాళికలో స్థూల ఆర్థిక చలాంకాల్లో ప్రగతి సాధ్యమైంది. ధరల స్థిరత్వం, బహిర్గత కరెంట్ అకౌంట్లో లోటు తగ్గడం, ఆర్థిక క్రమశిక్షణ పాటించడం వంటి అంశాలు క్రమంగా భారత ఆర్థిక వ్యవస్థలో వృద్ధి పెంపునకు దోహదపడ్డాయి. ఈ ప్రణాళికా కాలంలో ప్రపంచ ఆర్థిక వాతావరణంలో అనిశ్చిత పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతోపాటు రుతుపవనాల అననుకూలత వ్యవసాయ రంగవృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపించింది. అయినప్పటికీ పారిశ్రామిక, సేవారంగాల్లో అనుకూల వాతావరణం కారణంగా 2013-14సం॥లో 6.6%, 2014-15సం॥లో 7.2%, 2015-16సం॥లో 7.6% వృద్ధి నమోదైంది. 2016-17సం॥లో భారత ఆర్థిక వృద్ధిని ఐ.ఎం.ఎఫ్. 7.4%గా అంచనా వేసింది.

12వ ప్రణాళికకు సంబంధించి తొలి నాలుగేళ్లలో పెట్టుబడి రేటులో క్షీణత ఏర్పడినప్పటికీ సమిష్టి డిమాండ్‌లో పెరుగుదలను గమనించవచ్చు. ప్రణాళిక చివరి సంవత్సరంలో వేతన సంఘ సిఫార్సుల అమలుతోపాటు వ్యవసాయ రంగ వృద్ధిలో పెరుగుదల వంటి పరిస్థితులు వినియోగ వ్యయ పెరుగుదలకు దారితీయవచ్చు. అదే జరిగితే సమిష్టి డిమాండ్‌లో పెరుగుదల ఏర్పడి పెట్టుబడులు పెరిగి అధిక వృద్ధి నమోదయ్యే అవకాశం ఉంది. ప్రణాళిక ప్రారంభమైన తర్వాత (2013-14సం॥, 2014-15) థర్మల్, న్యూక్లియర్ విద్యుత్ కల్పనలోవృద్ధి నమోదైంది. ఇది దేశంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా అవకాశాలను మెరుగుపరిచింది.

2015-16సం॥లో విద్యుత్ అదనపు సామర్థ్య లక్ష్యం 20037.1 మెగావాట్లు కాగా, 2015 డిసెంబర్ 31 నాటికి 11,226 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన జరిగింది. పన్నెండో ప్రణాళికలో అదనపు ఉత్పత్తి సామర్థ్య లక్ష్యంలో డిసెంబర్ 2015సం॥నాటికి 81.6% సాధించడం జరిగింది. దీంతో మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానికి తగిన చేయూత లభించింది.

**ఆర్థిక ప్రగతి:** ఈ ప్రణాళికా కాలంలో స్థూల పొదుపు, స్థూల స్థిర మూలధన కల్పనలో ఆశించిన పెరుగుదల నమోదు కాలేదు. స్థూల పొదుపులో భాగంగా ప్రభుత్వ రంగ వాటా క్రమంగా తగ్గగా ప్రైవేటు, కార్పొరేటు రంగాల వాటా పెరిగింది. దీంతోపాటు కుటుంబ రంగ వాటా ప్రణాళిక తొలి రెండేళ్లలో పెరిగి, మూడో సంవత్సరంలో తగ్గింది. స్థూల పొదుపు మార్కెట్ ధరల వద్ద 2012-13సం॥లో GDPలో 33.8% కాగా, 2014-15సం॥లో 33 శాతానికి తగ్గింది. స్థూల స్థిర మూలధన కల్పన 2012-13సం॥లో GDPలో ప్రస్తుత ధరల వద్ద 33.4% కాగా 2014-15సం॥లో 30.8 శాతానికి2015-16సం॥లో 29.4%నికి క్షీణించింది. స్థూల స్థిర మూలధన కల్పనలో భాగంగా ప్రభుత్వ రంగ వాటా స్థిరంగా ఉండగా, ప్రైవేటు, కార్పొరేటు రంగ వాటాలో కొద్దిపాటి పెరుగుదల నమోదైంది. కుటుంబ రంగ వాటాలో తగ్గుదల అధికంగా ఉంది. తలసరి

స్థూల దేశీయోత్పత్తి వృద్ధి. ప్రణాళికలోని మొదటి నాలుగేళ్లలో వరుసగా 4.3%, 5.3%, 5.9%, 6.2%గా నమోదైంది.

ప్రణాళిక తొలి మూడేళ్లలో వినియోగంలో వృద్ధి సగటు 5.8% కాగా, స్థిర పెట్టుబడిలో వృద్ధి సగటు 4.4%. ప్రణాళిక ప్రారంభమైన నాలుగేళ్ల తర్వాత టోకు ధరల సూచీ సగటులో తగ్గుదల రేటు అధికంగా ఉంది. ప్రణాళిక నాలుగో సంవత్సరంలో టోకు ధరల సూచీ సగటు రుణాత్మకంగా నమోదైంది. 2013-14 సం॥ మినహా మిగిలిన మూడేళ్లలో ఎగుమతుల్లో వృద్ధి రుణాత్మకంగా ఉంది. మొదటి నాలుగు సంవత్సరాల ప్రణాళికా కాలంలో కరెంటు అకౌంటు లోటులో స్థిరమైన తగ్గుదలను గమనించవచ్చు. ప్రణాళిక నాలుగేళ్ల కాలంలో విదేశీ మారక నిల్వల్లో స్థిరమైన పెరుగుదల కనిపించింది. 2012-13సం॥లో 292 బిలియన్ డాలర్లుగా ఉన్న విదేశీ మారక నిల్వలు 2015-16సం॥లో 349.6 బిలియన్ డాలర్లకు చేరాయి. షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులిచ్చిన పరపతిలో వృద్ధి తొలి రెండేళ్లతో పోల్చితే తరవాత 2 సంవత్సరాల్లో తగ్గింది. ప్రైవేటు వినియోగ వ్యయంలో వృద్ధి స్థిరంగా ఉండగా, ప్రభుత్వ వినియోగ వ్యయంలో వృద్ధి 2013-14సం॥లో 0.4% కాగా, 2014-15సం॥లో అధికంగా 12.8%గా నమోదైంది.

**వ్యవసాయ రంగం:** ప్రణాళిక తొలి నాలుగేళ్లలో వ్యవసాయ రంగ సగటు వృద్ధి 1.6%గా నమోదైంది. వ్యవసాయోత్పత్తుల క్షీణత అల్పవృద్ధికి ప్రధాన కారణం. 2013-14సం॥లో మినహా మిగిలిన కాలంలో సాంవత్సరిక పంట ఉత్పత్తిలో తగ్గుదలకు లోటు వర్షపాతం, అననుకూల వాతావరణం కారణమయ్యాయి. 2014-15లో వ్యవసాయానుబంధ రంగాలపై పెట్టుబడి రూ. 2,56,495 కోట్లు. ఈ ప్రణాళికలో వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకొంది. రైతులకు సంస్థాపరమైన పరపతి అందించడం, గిడ్డంగి సౌకర్యాలను పెంచడం, అగ్రి-టెక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధి ఏర్పాటు వంటి చర్యల వల్ల వ్యవసాయం లాభదాయకంగా మార్చి వాణిజ్య ఆర్గానిక్ ఫార్మింగ్ అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వం భావించింది. 2012-13సం॥లో తీవ్ర కరువు వ్యవసాయానుబంధ రంగాల్లో వృద్ధి 1.5%గా నమోదు కావడానికి కారణమైంది. 2013-14సం॥లో రుతుపవనాల అనుకూలతతో పాటు ఆహార ధాన్యాలు, నూనె గింజలు, పండ్లు, కూరగాయలు, జీవ సంపద, ఫిషరీస్లో ప్రగతి నమోదవడంతో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వృద్ధి 4.2%గా నమోదైంది. 2014-15సం॥లో దేశంలో కొన్ని ప్రాంతాల్లో ఏర్పడిన కరువు, రబీ కాలంలో అననుకూల వాతావరణం వంటి కారణాలతో పంట ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. దాంతో 2014-15సం॥లో రుణాత్మక వృద్ధి (-0.2 శాతం) నమోదు కాగా, 2015-16సం॥లో 1.1%గా ఉంటుందని అంచనా. దేశంలో ఆహార భద్రత సాధించడంతోపాటు రైతుల జీవన ప్రమాణాన్ని పెంచేందుకు వ్యవసాయ రంగ పరివర్తన ఎంతైనా అవసరం. వ్యవసాయ ఉత్పాదకత పెంపు, సమర్థవంతమైన

నీటి పారుదల సౌకర్యాలు, సాంకేతిక పరిజ్ఞానంపై పెట్టుబడుల పెంపు, ఉత్పాదకాల సమర్థ వినియోగం వంటి చర్యలు వ్యవసాయ రంగ పరివర్తనకు దోహదపడతాయి.

**పారిశ్రామిక రంగం :** పన్నెండో పంచవర్ష ప్రణాళిక తయారీ రంగ వృద్ధి లక్ష్యాన్ని 10%గా తీసుకొంది. లక్ష్య సాధనకు ఈ ప్రణాళికా కాలంలో ప్రభుత్వం Invest India, make in india, Easy of doing business, నేషనల్ ఈ-గవర్నెన్స్ ప్లాన్లో భాగంగా ఈ-బిజ్ మిషన్ మోడ్ ప్రాజెక్టు వంటి కార్యక్రమాలను ప్రారంభించింది. ప్రణాళిక ప్రారంభమైన తరవాత మొదటి సంవత్సరంతో పోల్చితే తరవాత కాలంలో స్థూల మూలధన కల్పనలో తయారీ రంగ వాటా తగ్గింది. షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులిచ్చిన పరపతి వృద్ధిలోనూ అనేక ఒడిదొడుకులు వచ్చాయి. తయారీ రంగానికి షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులిచ్చిన పరపతిలో వృద్ధి 2014-15సం॥లో 13.2% కాగా, అది 2015-16సం॥లో 2.5% శాతానికి తగ్గింది. ప్రపంచవ్యాప్తంగా బలహీనమైన డిమాండ్, వస్తు ధరల్లో తగ్గుదల, అనిశ్చిత పెట్టుబడి వాతావరణం వంటి పరిస్థితులున్నప్పటికీ తయారీ రంగం 2013-14, 2014-15సం॥లో వృద్ధిలో తగ్గుదలను అధిగమించడంతోపాటు 2015-16లో మంచి వృద్ధిని కనబరిచింది. మొత్తంగా పన్నెండో ప్రణాళికలో తయారీ రంగ వృద్ధి లక్ష్య సాధనలో భారత్ వెనుకబడే సూచనలున్నాయి.

**సేవా రంగం:** అమెరికా సంక్షోభానికి ముందు సేవారంగంలో సగటు వార్షిక వృద్ధి 9.3%కాగా, సంక్షోభానంతర కాలంలో సగటు వృద్ధి 8.3%గా నమోదైంది. 2014సం॥లో భారత్లో సేవా రంగవృద్ధి 10.3%గా నమోదైంది. గడచిన రెండేళ్లలో సేవారంగంలో ఎఫ్డిల ప్రవాహం అధికమైంది. మెడికల్ టూరిజంతోపాటు పర్యాటక రంగం, షిప్పింగ్, పోర్ట్ సర్వీసెస్, సాఫ్ట్వేర్తో కూడిన ఐటీ రంగ అభివృద్ధికి తీసుకొనే చర్యలు భవిష్యత్తులో సేవారంగ అభివృద్ధిని ప్రోత్సహిస్తాయి. అంతర్జాతీయ పర్యాటకులకు సంబంధించి 2013 సంవత్సరంలో 7 మిలియన్ల మంది భారతను సందర్శించగా, అది 2014సం॥లో 7.7 మిలియన్లకు పెరిగింది. మొత్తం సేవల ఎగుమతుల్లో వృద్ధి 2013-14సం॥లో 4% కాగా, ఏవియేషన్, పర్యాటకం, షిప్పింగ్, రైల్వేస్, పోర్టులు వంటి సర్వీసులకు సంబంధించి పన్నెండో ప్రణాళిక తొలి నాలుగేళ్లలో చక్కని ప్రగతి నమోదైంది. వ్యవసాయ, తయారీ రంగాలతో పోల్చితే సేవా రంగంలో వృద్ధి ఆశాజనకంగా ఉండనుంది. మొత్తంగా 12వ ప్రణాళికలో వృద్ధిని service led growth (సేవారంగ ఆధారిత వృద్ధి)గా భావించవచ్చు.

**సాంఘిక సేవలు- కేంద్ర ప్రభుత్వ వ్యయం:** ప్రణాళికా కాలంలో మొదటి నాలుగేళ్లలో సాంఘిక సేవలపై కేంద్ర ప్రభుత్వ వ్యయం సగటున జీడీపీలో 27-28% ఉండగా, విద్యపై వ్యయం సగటున జీడీపీలో 3 శాతంగా, ఆరోగ్యంపై సగటున 1.3%గా నమోదైంది. కేంద్ర ప్రభుత్వ మొత్తం వ్యయంలో శాతం పరంగా మొదటి నాలుగేళ్లలో సామాజిక సేవలపై వ్యయం సగటు సుమారు 25%కాగా, విద్య, ఆరోగ్య రంగాలపై సగటు వ్యయం వరుసగా 11%, 4.8%గా నమోదైంది. సాంఘిక సేవలపై

జరిగిన మొత్తం వ్యయంలో మొదటి నాలుగు సంవత్సరాల కాలంలో సగటున విద్య, ఆరోగ్య రంగాలపై వరుసగా 45%, 19% వ్యయం జరిగింది. 2011సం॥లో జనాభా లెక్కల ప్రకారం మొత్తం జనాభాలో 0-6 వయో వర్గం 13.6% కాగా, ఏటా 26 మిలియన్ల మంది భారత్‌లో జన్మిస్తున్నారు. అయిదేళ్లలోపు శిశు మరణాలు 1990సం॥లో ప్రతి వెయ్యి జననాలకు 126 ఉండగా, 2013సం॥లో 49కు తగ్గింది. 2011సం॥ లెక్కల ప్రకారం బిహార్, ఛత్తీస్‌ఘఢ్, జార్ఖండ్, ఒడిశాల్లోని 75% కుటుంబాలకు మరుగుదొడ్డి సౌకర్యం లేదు. 2014సం॥ అక్టోబర్ 2 -2015 అక్టోబర్ 2 కాలంలో స్వచ్ఛ భారత్ మిషన్ కింద 88 లక్షల టాయ్‌లెట్ల నిర్మాణం జరిగింది.

**మహిళా సాధికారత:** ఈ ప్రణాళిక అమలు కాలంలో మహిళా సాధికారత, సమ్మిళితవృద్ధికి సంబంధించి చెప్పుకోదగ్గ ప్రగతి సాధ్యం కాలేదు. 2012 సం॥ నాటికి 24.2% మహిళలు మాత్రమే షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల్లో ఖాతాలను ప్రారంభించారు. మొత్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 25.5%, పట్టణ ప్రాంతాల్లో 23.6% మహిళలు బ్యాంకు ఖాతాలు నిర్వహిస్తున్నారు. 2014సం॥ నాటికి దేశంలో 27.5% మహిళలు మాత్రమే షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల్లో ఖాతాలు తెరిచారు. గ్రామీణ ప్రాంతాల్లో 26.9%, పట్టణ ప్రాంతాల్లో 27.2%, మెట్రోపాలిటన్ ప్రాంతాల్లో 29.7% మహిళలు మాత్రమే బ్యాంకుల్లో ఖాతాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పన్నెండో పంచవర్ష ప్రణాళికలో సమ్మిళిత వృద్ధి సాధన నెరవేరలేదని భావించవచ్చు. 2015 సం॥ మానవాభివృద్ధి నివేదిక ప్రకారం 2014సం॥లో మహిళల్లో మానవాభివృద్ధి సూచీ విలువ 0.525 కాగా, పురుషుల్లో 0.660గా నమోదైంది. దీని ఆధారంగా ఆ సూచీకి సంబంధించిన అనేక సూచికల విషయంలో లింగ బేధాన్ని గమనించవచ్చు. 2014సం॥లో భారత్‌లో తలసరి స్థూల జాతీయాదాయం మహిళల్లో 2116 డాలర్లు, పురుషుల్లో 8656 డాలర్లుగా నమోదైంది. ఇదే సంవత్సరానికి సంబంధించి expected years of schooling బాలికల్లో 11.3 ఏళ్లు, బాలురలో 11.8 ఏళ్లుగా ఉంది. mean years of schooling బాలికల్లో 3.6 ఏళ్లు, బాలురలో 7.2 ఏళ్లుగా నమోదైంది.

**విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు:** ఈ ప్రణాళికా కాలంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రవాహం పెరిగింది. ఎఫ్డీఐలకు సంబంధించి తీసుకొచ్చిన అనేక సంస్కరణల ఫలితంగా వాటి ప్రవాహంలో పెరుగుదల నమోదైంది. 2012-13సం॥లో దేశంలోకి వచ్చిన ఎఫ్‌డీఐలు 22.4 బిలియన్ డాలర్లు కాగా, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించిన / తరవాత ఎఫ్‌డీఐల ప్రవాహ వేగం మరింత పెరిగింది. అక్టోబర్ 2014 నుంచి జూన్ 2015 సం॥ మధ్య ఎఫ్‌డీఐల్లో 40% పెరుగుదల ఏర్పడింది. 2011-12 సం॥ నుంచి 2015-16 సం॥ (నవంబర్ వరకు) సేవా రంగానికి లభించిన ఎఫ్‌డీఐల్లో జపాన్ 20% కాగా, అమెరికా 19% వాటాలను కలిగున్నాయి. మారిషస్, సింగపూర్, నెదర్లాండ్స్‌ల

వాటాలు వరుసగా 18.9%, 18.6%, 15.4%గా ఉన్నాయి. గత రెండేళ్లలో దేశంలో ప్రవేశించిన మొత్తం ఎఫ్‌డీఐల్లో 70% మేర ఢిల్లీ, హర్యానా, మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లోనే కేంద్రీకృతమయ్యాయి. దీంతోపాటు పారిశ్రామిక, అవస్థాపనా ప్రాజెక్టుల్లో అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్, చైనా, ఫ్రాన్స్, దక్షిణ కొరియాలు సంసిద్ధత వ్యక్తం చేశాయి.

విద్య, ఆరోగ్య రంగాలపై పెట్టుబడుల క్షీణత కారణంగా మానవాభివృద్ధిలో పెరుగుదల లేదు. ఈ ప్రణాళికలో అదనపు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్య లక్ష్యాన్ని సాధించే అవకాశం ఉన్నందున మేక్ ఇన్ ఇండియాకు తగిన చేయూత లభించనుంది. తొలి నాలుగేళ్లలో వ్యవసాయ రంగంలో వృద్ధి సగటు 1.6 శాతంగా ఉండటం ఆందోళన కలిగించే పరిణామం.

12వ ప్రణాళిక వ్యవధి 2012 సం॥ నుంచి 2017 సం॥ వరకు ఉంది. దీని ప్రధాన అంశం "వేగంగా, మరింత కలుపుకొని, "సుస్థిర అభివృద్ధి" (Sustainable growth). దీని పెరుగుదల రేటు లక్ష్యం 8%. భారతదేశ ప్రస్తుత అయిదు సంవత్సరాల ప్రణాళిక ఇది. మూడు సంవత్సరాల కార్యాచరణ ప్రణాళిక పత్రం ప్రభుత్వానికి విస్తృత మార్గదర్శిని మాత్రమే అందిస్తుంది. ఈ పత్రం ఏ పథకాలు లేదా కేటాయింపులు లేకుండా ఏ విధమైన ఆర్థిక అధికారాలను కలిగి ఉండదు. ఇది కేంద్ర కేబినెట్ ఆమోదం పొందనందున, దాని సిఫార్సులు ప్రభుత్వంపై ఆధారపడవు.

**ప్రణాళిక లక్ష్యం:** శీఘ్రతర వృద్ధి - సుస్థిర వృద్ధి వృద్ధిరేటు లక్ష్యం: 8 శాతం, సాధించిన వృద్ధిరేటు: 8 శాతం, ప్రభుత్వరంగ పెట్టుబడి: రూ.76,69,807 కోట్లు. ఈ ప్రణాళిక నిర్దేశిత లక్ష్యాలు -50 మిలియన్ల అదనపు ఉద్యోగాలను సృష్టించడం,-శిశు మరణాల రేటును 25కు, ప్రసూతి మరణాల రేటును 1కి తగ్గించడం, ◆నుంచి 3 ఏండ్ల వయోగ్రూప్ పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని సగానికి తగ్గించడం, ◆పాఠశాల విద్య, హాజరు నిష్పత్తిలో ఉన్న లింగ, సామాజిక వ్యత్యాసాన్ని తొలగించడం, ఉన్నత విద్యలో ప్రవేశించే వారి సంఖ్యను పెంచడానికి 2 మిలియన్ల అదనపు సీట్లను సృష్టించడం, ◆అడవుల విస్తీర్ణాన్ని ఏడాదికి 1 మిలియన్ హెక్టారు చొప్పున పెంచడం, ◆నీటిపారుదల వసతులున్న భూమి వైశాల్యాన్ని 90 మిలియన్ హెక్టార్ల నుంచి 130 మిలియన్ హెక్టార్లకు పెంచడం, ◆దేశంలో ఉన్న అన్ని రాష్ట్ర, జాతీయ రహదారులను ప్రణాళిక అంతానికి రెండు లైన్ల రోడ్లుగా తీర్చిదిద్దడం, ◆దేశంలో 90 శాతం కుటుంబాలకు బ్యాంకింగ్ సౌకర్యాలను కల్పించడం, ◆ ప్రణాళిక ముగిసే నాటికి ఆధార్‌ను ఉపయోగించుకుని అన్ని ప్రధాన సంక్షేమ సంబంధ, సబ్సిడీ సంబంధ చెల్లింపులను బ్యాంకు ఖాతాలకు నేరుగా బదిలీ అయ్యేలా చూడటం.

**12వ పంచవర్ష ప్రణాళిక (2012-17)** : 12వ ప్రణాళిక ముసాయిదాను 2012సం॥ డిసెంబర్ 7న 57వ సమావేశంలో ఆమోదించారు. ◆ 12వ ప్రణాళికలో కేంద్ర, రాష్ట్రాల ప్రణాళికల వాటా 52:48 ◆ ప్రాధాన్యత ◆ వేగవంతమైన సమ్మిళిత వృద్ధి, సత్వర ప్రగతి. పెట్టుబడి వ్యయం - అంచనా వ్యయం - 76,69,807 కోట్లు, ◆ వాస్తవ వ్యయం - ఆశించిన వృద్ధిరేటు - 8 శాతం, ◆ సాధించిన వృద్ధిరేటు - రంగాల వారీగా వృద్ధిరేటు - వ్యవసాయ రంగ వృద్ధిరేటు లక్ష్యం - 4 శాతం, ◆ పారిశ్రామిక రంగ వృద్ధిరేటు లక్ష్యం - 8.1 శాతం, సేవారంగ వృద్ధిరేటు లక్ష్యం 9.1 శాతం.

**కేటాయింపులు :** సాంఘిక సేవలు - 34.07 శాతం, శక్తి - 18.08 శాతం, రవాణా, సమాచారం - 16.8 శాతం, గ్రామీణాభివృద్ధి - 6.0 శాతం, వ్యవసాయం, నీటిపారుదల - 10.2 శాతం ◆ పరిశ్రమలు, ఖనిజాలు - 4.9 శాతం ◆ సాంకేతిక పరిజ్ఞానం - 4.0 శాతం ◆ పర్యావరణం - 1.4 శాతం

**12వ ప్రణాళికలో వార్షిక వృద్ధిరేటు**

2012-13సం॥లో - 5.6 శాతం, 2013 -14సం॥లో-6.6 శాతం, 2014-15సం॥లో - 7.2 శాతం - 2015 -16సం॥లో -7.6 శాతం, 2016-17సం॥లో - 7.5 శాతం (ముందస్తు అంచనా).

12వ పంచవర్ష ప్రణాళిక 1 ఏప్రిల్, 2012సం॥లో ప్రారంభమైంది. ఈ ప్రణాళిక లక్ష్యం సత్వర, నిలకడగల సమీకృతాభివృద్ధి సాధించడం. 12వ ప్రణాళికలోని ఏడు రంగాలు, 25 అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు.

**ఆర్థికవృద్ధి (నాలుగు అంశాలు) అంచనాలు:** జిడిపి వృద్ధిరేటు - 8 శాతం, వ్యవసాయ వృద్ధిరేటు - 4 శాతం, పారిశ్రామిక రంగం-8.1 శాతం,11వ ప్రణాళిక సాధించిన వృద్ధిరేటు కంటే 12వ ప్రణాళిక ఎక్కువ వృద్ధిరేటు సాధించాలి.

**పేదరికం - ఉద్యోగిత (రెండు అంశాలు):** పేదరికం 10 పాయింట్లకు తగ్గించడం, వ్యవసాయేతర రంగాలలో కొత్తగా 50 మిలియన్ల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలి.

**విద్య (మూడు అంశాలు):** ప్రణాళిక చివరి నాటికి అక్షరాస్యతను 100 శాతం సాధించాలి. ఉన్నత విద్యకు వెళ్లేవారి శాతాన్ని పెంచడం. ప్రణాళిక చివరి నాటికి పాఠశాలలో లింగ వ్యత్యాసాన్ని నిర్మూలించడం.

**ఆరోగ్యం (మూడు అంశాలు):** శిశుమరణాల రేటును 25కి తగ్గింపు, ప్రసూతి మరణాల రేటును ఒకటికి తగ్గించడం, ప్రణాళిక చివరికి సంతాన ఉత్పత్తి రేటును తగ్గించడం. పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న పిల్లల సంఖ్యను ప్రస్తుత స్థాయి నుంచి సగానికి తగ్గించడం.

**అవస్థాపనా సౌకర్యాలు (ఎనిమిది అంశాలు):** ప్రణాళిక చివరినాటికి అవస్థాపనా సౌకర్యాల పెట్టుబడిని తొమ్మిది శాతానికి పెంచడం, స్థూల నీటిపారుదల భూమిని, 90 మిలియన్ల హెక్టార్ల నుంచి 168 మిలియన్ల హెక్టార్లకు పెంచడం. ప్రణాళిక చివరి నాటికి అన్ని గ్రామాలకూ రహదారులను ఏర్పాటు చేయడం, ప్రణాళిక చివరి నాటికి అన్ని గ్రామాలకూ విద్యుత్ సౌకర్యం కల్పించడం, జాతీయ రహదారులను అభివృద్ధిచేయడం. ప్రణాళిక చివరి నాటికి విద్యుత్ సామర్థ్యం లక్ష మెగావాట్లకు పెంచడం. పర్యావరణ పరిరక్షణ కలుషితమైన నదులను శుభ్రపరచడం.

**పర్యావరణం (మూడు అంశాలు):** ప్రణాళిక కాలంలో ఏటా మిలియన్ మొక్కలను నాటడం, పునరావృత విద్యుత్ సామర్థ్యాన్ని అదనంగా 30 వేల మెగావాట్లకు పెంచడం. 2020 సం॥ నాటికి ప్రస్తుతం ఉన్న వాతావరణ కలుషితాలను 20-25% మధ్య తగ్గించాలి.

**సేవలు (రెండు అంశాలు):** ప్రణాళిక చివరి నాటికి దేశంలో 90 శాతం కుటుంబాలకు బ్యాంకింగ్ సేవలు అందించడం. ప్రణాళిక చివరినాటికి ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతాల ద్వారా సబ్సిడీ, ఇతర సంక్షేమ కార్యక్రమాలు చెల్లింపులు అందించడం, పై లక్ష్య సాధనకు జాతీయాభివృద్ధి మండలి ఆమోదించిన 12వ ప్రణాళిక ముసాయిదా 12 కీలక అంశాలకు చెందిన సవాళ్లకు పటిష్ట పథకాలు రూపొందించి, లక్ష్యాలు సాధించాలని నిర్ణయించింది.

**ఆర్థికవ్యవస్థ నిర్మాణ సామర్థ్య పెంపుదల :** 9 నుంచి 10 శాతం జిడిపి వృద్ధి లక్ష్యసాధనకు అవసరమైన పెట్టుబడులు, సమకూర్చుకోవడానికి సమర్థవంతమైన మూలధన మార్కెట్లు, అవస్థాపనాభివృద్ధికి, పబ్లిక్, ప్రయివేటు పార్టనర్షిప్ (పిపిపి), పబ్లిక్ రంగ వనరులు మరింత సమర్థవంతంగా ఉపయోగించే మార్గదర్శకాలు రూపొందించడం.

భారత ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో ప్రణాళికా సంఘం స్థానంలో ఏర్పడిన సరికొత్త వ్యవస్థ నీతి ఆయోగ్. నేషనల్ ఇన్స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్ఫార్మింగ్ ఇండియా పేరు యొక్క సంక్షిప్త రూపమే నీతి (N.I.T.I). దీనిని తెలుగులో భారత పరివర్తనకు జాతీయ సంస్థ అంటారు. హిందీ భాష ప్రకారం నీతి అంటే విధానం, ఆయోగ్ అంటే కమిటీ దీనిని బట్టి నీతి ఆయోగ్ అంటే విధాన కమిటీ అని అర్థం. దీనికి అధ్యక్షుడుగా ప్రధానమంత్రి ఉంటాడు. దీనికి ఒక ఉపాధ్యక్షుడు, ఒక సీఈవో ఉంటారు. భారత్ లోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు దీని పాలకమండలి సభ్యులుగా ఉంటారు. దీనిలో ఐదుగురు పూర్తికాల సభ్యులు, ఇద్దరు పాక్షిక కాల సభ్యులు ఉంటారు. వీరిద్దరినీ విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల నుంచి ఎంపిక చేసుకుంటారు. పదవిలో కొనసాగుతున్న కేంద్రమంత్రుల నుంచి నలుగురు దీనిలో సభ్యులుగా ఉంటారు. శక్తివంతమైన రాష్ట్రాలతోనే శక్తివంతమైన దేశం అనే విశ్వాసానికి అనుగుణంగా కీలకమైన

విధాన నిర్ణయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అవసరమైన వ్యూహాత్మక, సాంకేతిక సలహాలను నీతి ఆయోగ్ అందిస్తుంది.

**ప్రధాన లక్ష్యాలు :** ఇది ఆర్థికాంశాలతో పాటు ప్రాధాన్యం ఉన్న జాతీయ, అంతర్జాతీయ విషయాలపై సూచనలిస్తుంది. జాతీయ లక్ష్యాల సాధన కోసం రాష్ట్రాలకు చురుకైన పాత్రను, భాగస్వామ్యాన్ని కల్పిస్తుంది. గ్రామస్థాయి నుంచి విశ్వసనీయ ప్రణాళికలను రూపొందింపజేసే యంత్రాంగాన్ని తీర్చిదిద్ది, వాటి అమలు తీరును పర్యవేక్షిస్తుంది. ఆర్థిక వ్యూహాలు, విధానాల్లో జాతీయ భద్రత ప్రయోజనాలను చూస్తుంది. ఆర్థిక పురోగతి నుంచి తగినంత లబ్ధి పొందలేకపోతున్న సామాజిక వర్గాలపై ప్రత్యేక దృష్టి పెడుతుంది. పౌరుల భాగస్వామ్యాన్ని పెంచడం, అందరికీ అవకాశాలు కల్పించడం, భాగస్వామ్య పాలన, సాంకేతిక వినియోగాన్ని పెంచడం వంటివి దీని యొక్క ప్రధాన లక్ష్యాలు.

**ప్రణాళికల విజయాలు**

1947 సం॥లో కొత్తగా స్వాతంత్ర్యం పొందిన మనదేశం ప్రతి అవసరాలకు ఇతర దేశాలపై ఆధారపడే అవసరం లేకుండా ప్రణాళిక బద్ధంగా రూపొందిన లక్ష్యాల ఆధారంగా అభివృద్ధిని సాధించడం పంచవర్ష ప్రణాళికల విజయమేనని చెప్పవచ్చు. ప్రారంభంలో ఎన్ని ఆటంకాలు ఎదురైననూ అభివృద్ధిపథం వైపు పయనించడానికి ప్రణాళికలు కృషిచేశాయి. మొదటి పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయ రంగంలో మంచి ఉత్పత్తి సాధించగలిగాం. రెండో ప్రణాళికలో భారీ పరిశ్రమలకు మంచి ఊతం లభించింది. మూడో ప్రణాళిక విఫలమవడానికి చైనా యుద్ధం (1962), నెహ్రూ మరణం (1964), పాకిస్తాన్‌లో యుద్ధం (1965) కారణాలు. ఆ తర్వాత కూడా రుతుపవనాలు, దేశ రాజకీయ కారణాలు మొదలగునవి ప్రణాళికల అభివృద్ధిని తాత్కాలికంగా ఆపినా, దేశ అభివృద్ధిని మాత్రం అడ్డగించలేవు. ఈనాడు దేశం శాస్త్ర, సాంకేతిక రంగాలలో అగ్రరాజ్యాలతో పోటీ పడుతున్నదానికి, సమాచార, శాస్త్ర, సంకేతిక, అంతరిక్ష రంగాలలో అంతెత్తున ఎగిరినదానికి ప్రణాళికబద్ధ లక్ష్యాలే కారణం. పారిశ్రామికంగా కూడా బాగా అభివృద్ధి సాధించాం. ఒకప్పుడు ఆహారధాన్యాలకై ఇతరదేశాలపై ఆధారపడిన భారతదేశం ఈనాడు ఎగుమతి దశకు చేరడానికి, పారిశ్రామిక మరియు రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించడానికి ప్రణాళికలు దోహదం చేశాయి.

**ప్రణాళికల వైఫల్యాలు :** పంచవర్ష ప్రణాళికల వల్ల ఎన్నో విజయాలు సాధించిననూ అవి నాణేనికి ఒక వైపు మాత్రమే. మరో వైపు చూస్తే." ఎన్నో అపజయాలు, వైఫల్యాలు కొట్టొచ్చినట్లు కనబడతాయి. 6 దశాబ్దాల ప్రణాళికా భారతి ఏమి సాధించిందో గ్రామీణ రంగాన్ని ఒక్కసారి చూస్తే అర్థమవుతుంది. గత 60 సంవత్సరాలుగా కోట్ల రూపాయలు దారిద్యం, నిరుద్యోగం, జనాభా నిర్మూలన, ఉద్యోగ అవకాశాలపై ఖర్చు చేస్తున్ననూ అవి మరింతగా పెరగడం ఆశ్చర్యం కల్గుతుంది. ఇప్పటికీ పేదవారికి

వారి జీవితాలలో మార్పేమీ లేదని పలు ఆర్థిక విశ్లేషణలు తెల్పుతున్నాయి. అంకెల్లో ప్రగతి బాగున్ననూ వాటి ఫలాలు మాత్రం కొందరే అనుభవిస్తున్నారు. అంతేకాకుండా ప్రణాళికలకు ఒక స్థిరమైన గమ్యంలేదని, రాజకీయ పార్టీలు తమ వాగ్దానాల కోసం, పార్టీ సిద్ధాంతాల కోసం ప్రణాళిక లక్ష్యాలను మార్చివేస్తున్నారనే అపవాదు ఉంది. మొదటి, రెండో ప్రణాళికలో పొందుపర్చిన లక్ష్యాలనే 11 వ ప్రణాళికలో కూడా ఉండటం కచ్చితంగా ప్రణాళికా వైఫల్యమేనని చెప్పవచ్చు. ప్రణాళికా వ్యయంలో కూడా అధిక భాగం పనికిరాని పథకాల మీద, సబ్సిడీల మీద వెచ్చిస్తున్నారు. దాంతో రుణభారం మరింతగా పెరిగి భవిష్యత్తు భారం అవుతుంది. నాల్గవ ప్రణాళిక అనంతరం చెప్పుకోదగ్గ భారీ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం జరుగలేదు. వ్యవసాయరంగంలో తాత్కాలిక ఫలితాల సాధనకే ప్రాధాన్యం ఇచ్చారు. దేశంలో అధిక ప్రాంతాలు నేటికీ వ్యవసాయం పైనే ఆధారపడవల్సిన పరిస్థితి పోలేదు. దేశంలో సమతుల అభివృద్ధి ఏర్పడలేదు.

**భారత ప్రణాళికల ప్రాధాన్యం**

| ప్రణాళిక కాలం | ప్రాధాన్యం |
|---|---|
| మొదటి ప్రణాళిక 1951-56 | వ్యవసాయ రంగం |
| రెండవ ప్రణాళిక 1956-61 | భారీ పారిశ్రామిక రంగం |
| మూడవ ప్రణాళిక 1961-66 | ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి |
| వార్షిక ప్రణాళిక 1966-69 | ప్రణాళిక విరామం |
| నాలుగవ ప్రణాళిక 1969-74 | ఆర్థిక స్వావలంబన |
| అయిదవ ప్రణాళిక 1974-79 | పేదరిక నిర్మూలన (1978లో రద్దయింది) |
| నిరంతర ప్రణాళిక 1978-80 | చిన్న తరహా పరిశ్రమల ప్రాధాన్యం |
| ఆరవ ప్రణాళిక | 1980-85 లాభదాయక ఉపాధి కల్పన |
| ఏడవ ప్రణాళిక | 1985-90 ఆహారం, పని, ఉత్పాదకత పెంచడం |
| వార్షిక ప్రణాళిక | 1990-92 ప్రణాళిక విరామం |
| ఎనిమిదవ ప్రణాళిక | 1992-97 మానవ వనరుల అభివృద్ధి |
| తొమ్మిదవ ప్రణాళిక | 1997-2002 సాంఘిక న్యాయంతో ఆర్థికవృద్ధి |
| పదవ ప్రణాళిక | 2002-2007 సమానత్వం, సాంఘిక న్యాయం, జన నాణ్యత పెంచడం |
| పదకొండవ ప్రణాళిక | 2007-2012 సమ్మిళిత వృద్ధి, సత్వర ప్రగతి |
| పన్నెండవ ప్రణాళిక | 2012-2017 సమ్మిళితవృద్ధి కొనసాగించగలిగే అభివృద్ధి |

భారతదేశంలో వివిధ ప్రణాళిక వృద్ధి రేట్లు, ప్రణాళిక కేటాయింపులు

| ప్రణాళిక లక్ష్యం | సాధించిన (శాతం) | వృద్ధి రేటు(శాతం) | ప్రణాళిక కేటాయింపులు |
|---|---|---|---|
| మొదటిది | 2.1 | 3.6 | 1960 |
| రెండవది | 4.5 | 4.1 | 4600 |
| మూడవది | 5.6 | 2.8 | 8580 |
| నాలుగవది | 5.7 | 3.3 | 15900 |
| అయిదవది | 4.4 | 4.8 | 39430 |
| ఆరవది | 5.2 | 5.7 | 109290 |
| ఏడవది | 5.0 | 6.0 | 218730 |
| ఎనిమిదవది | 5.6 | 6.8 | 485460 |
| తొమ్మిదవది | 6.5 | 5.4 | 859200 |
| పదవది | 8.0 | 7.8 | 1525639 |
| పదకొండవది | 8.1 | 7.9 | 3644718 |
| పన్నెండవది | 8.0 | 8.0 | 74770000 |

1950 సం॥ మార్చి 15న దేశప్రధాని నెహ్రూ ప్రణాళికా సంఘాన్ని "యోజనా ఆయోగ్' పేరిట నెలకొల్పారు. 1951 సం॥ ఏప్రిల్ నుంచి మొదటి పంచవర్ష ప్రణాళిక ప్రారంభమైంది. ఇప్పటికి 12 పంచవర్ష ప్రణాళికలను ప్రవేశపెట్టారు. ప్రస్తుతం ప్రణాళికా సంఘంను రద్దు గావించి జనవరి 1, 2015 సం॥ నాడు నీతి ఆయోగ్‌ను ఏర్పరచారు.

**నీతి ఆయోగ్ కి, ప్రణాళికా సంఘానికి తేడాలు, పోలికలు**

**ప్రణాళికా సంఘం**

దీనికి వివిధ మంత్రిత్వ శాఖలకు, రాష్ట్ర ప్రభుత్వాలకు నేరుగా నిధులు కేటాయించే అధికారాలు కలవు. దీనిలో సభ్యుల సంఖ్య ఎనిమిది మంది ఉంటారు. దీనిలో రాష్ట్రాల పాత్ర జాతీయ అభివృద్ధి మండలికీ, వార్షిక సమావేశాలకీ పరిమితంగా ఉంటాయి. ప్రణాళికా సంఘంలో పాక్షిక సభ్యులు ఉండరు. దీనిలో కార్యదర్శులు, సభ్య కార్యదర్శులను ప్రభుత్వం నియమించేది. దీనిలో ప్రాంతీయ మండళ్ల వ్యవస్థ లేదు.

నీతి ఆయోగ్

దీనిలో ఆర్థిక సలహా సంఘం నిధులు కేటాయించే అధికారాలను ఆర్థికమంత్రిత్వ శాఖ ఇవ్వవచ్చు. దీనిలో పూర్తికాల సభ్యులు అయిదుగురు. ♦దీనిలో రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్కువ పాత్రను పోషించనున్నవి. పాక్షికకాల సభ్యులు ఉంటారు. ♦నీతి ఆయోగ్ కార్యదర్శిని ప్రధాని కార్యనిర్వహణాధికారిగా పిలుస్తారు. దీనిలో ప్రాంతీయ మండళ్లు ఉంటాయి.

## ప్రాంతీయ అభివృద్ధి

ఏ ఆర్థిక వ్యవస్థలోనైనా ఆయా ప్రాంతాలలోని సహజ వనరుల లభ్యత, వినియోగం, మార్కెట్ పరిస్థితులవల్ల అభివృద్ధిస్థాయిలో తేడాలు ఏర్పడి అసమానతలు ఉంటాయి. అంతేకాక మానవ ఆర్థిక కార్యకలాపాలు, ప్రభుత్వవిధానాలు కూడా వివిధ ప్రాంతాల మధ్య వ్యత్యాసాలకు కారణమై ఆర్థికాభివృద్ధిలో ప్రాంతీయ అసమానతలకు దారితీస్తాయి. ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిలో అసమానతలను, వ్యత్యాసాలను సూచించే అంశాలలో ముఖ్యమైనవి జనాభా వత్తిడి, వ్యవసాయ రంగంపై ఆధారపడడం, ఉత్పాదక అల్పంగా ఉండుట, నిరుద్యోగం, తక్కువ పట్టణీకరణ స్థాయి, సౌకర్యాలకొరత, పేదరికం, నిరక్షరాస్యత, సేవారంగాల అభివృద్ధి తక్కువగా ఉండుట మొదలైనవి.

దేశంలోని వివిధ రాష్ట్రాలమధ్య అభివృద్ధిలో అనేక అసమానతలు ఉన్నాయి. వీటిని తగ్గించడానికి ప్రభుత్వం ప్రణాళికకాలం ప్రారంభంనుంచి అనేక చర్యలు చేపట్టింది. అయినను వివిధ ప్రాంతాలమధ్య అసమానతలను తొలగించడంలో సఫలీకృతంకాకపోవటంవల్ల అనుకున్నంత అభివృద్ధి జరగలేదు.

### వనరుల లభ్యత, వినియోగంలో అసమానతలు

దేశంలోని వివిధ రాష్ట్రాలలో లభ్యమయ్యే, భౌతిక, మానవ వనరులు ఒకేవిధంగా లేవు. నేల క్షీణతవల్ల, నీరు, గాలి, భూసారకోతల ప్రభావంవల్ల, వనరుల నాణ్యత, ఉత్పాదకతలు క్షీణిస్తున్నాయి. నీటిపారుదలలో పంజాబ్, హర్యానాలు మెరుగుగా ఉండగా, ఖనిజనిక్షేపాలలో బీహార్, ఒరిస్సా రాష్ట్రాలలో ఇనుము, బొగ్గు, మాంగనీస్, మైకా, ఇల్మనైట్‌లు విస్తారంగా కలవు. పెట్రోలియం నిక్షేపాలు అస్సాం, గుజరాత్ పశ్చిమ తీరప్రాంతంలో కలవు. నదీపరివాహక ప్రాంతాలలో గంగానదీ పరివాహక ప్రాంతం దేశ పరివాహకప్రాంతంలో 34 శాతంకాగా, కృష్ణా పరివాహక ప్రాంతం 10.25 శాతం, గోదావరి పరివాహక ప్రాంతం 12.34 శాతం, సింధూ పరివాహక ప్రాంతం 12.7 శాతంగా కలవు.

కేంద్రీకృత ప్రణాళికా విధానాలు, మారుతున్న రాజకీయ పరిస్థితులు, లోపభూయిష్టమైన కార్యక్రమాల అమలు వల్ల ప్రాంతీయ అసమానతలు పెరిగి అన్ని ప్రాంతాలలో అభివృద్ధికాలేదు. సంతులిత ప్రాంతీయ అభివృద్ధి సాధించాలని ప్రభుత్వం వెనకబడిన ప్రాంతాలలో అనేక పరిశ్రమలను నెలకొల్పింది. కాలక్రమేణ వీటి పరిస్థితి క్షీణించి ఆప్రాంతాల అభివృద్ధి కుంటుపడింది.

### జనాభా, పేదరికంలో అసమానతలు

దేశంలోని వివిధరాష్ట్రాలమధ్య విస్తీర్ణంలోను, జనాభాలోను, జనసాంద్రతలోను ఎక్కువ వ్యత్యాసాలు కలవు. 2011సం॥ గణాంకాలను చూసిన 8 రాష్ట్రాల జనాభా దేశ సగటుకన్నా ఎక్కువగా ఉంది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలు మొదటి ఆరుస్థానాలలోను, సిక్కిం, మిజోరాం, అరుణాచల్‌ప్రదేశ్, గోవారాష్ట్రాలు చివరి నాలుగు స్థానాలలో కలవు. మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు సాధించిన పురోగతివల్ల అక్కడ పేదరిక సమస్యలు తక్కువగా కలవు. అయితే ఆర్థికంగా వెనుకబడిన బీహార్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో ఎక్కువశాతం జనాభా దారిద్ర్యరేఖకు దిగువగా ఉంది. ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలు సాధించిన అభివృద్ధివల్ల తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్నను, ఆ రాష్ట్రాలలో దారిద్రరేఖకు దిగువన ఉన్న జనాభా కూడా ఎక్కువగా కలదు. ఈ రాష్ట్రాలలో వెనకబడిన వర్గాల ప్రజలకు అభివృద్ధిఫలాలు లభించకపోవుటవల్ల ఆదాయపంపిణిలో అసమానతలవల్ల అభివృద్ధికి నోచుకోలేదు. దేశంలోని 29 రాష్ట్రాలలో 12 రాష్ట్రాలలోని జనాభా దేశ సగటు దారిద్రరేఖకు దిగువ ఉన్నట్లు అంచనాలు తెలుపుతున్నాయి.

### వ్యవసాయాభివృద్ధిలో అసమానతలు

పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో కొంతభాగం అధిక నీటిపారుదల (78శాతం) సౌకర్యాలు కలిగి ఉండుట, ఎక్కువ ఎరువుల వాడకంవల్ల అధిక ఉత్పాదకతను కలిగి ఉన్నాయి. కేరళ, హిమాచల్‌ప్రదేశ్, అస్సాం రాష్ట్రాలలో 20శాతం కన్న తక్కువ నీటిపారుదల సౌకర్యం కలిగి ఉన్నాయి. పంజాబ్, హర్యానా రాష్ట్రాలలో నూతన వ్యవసాయ వ్యూహంద్వారా హరితవిప్లవంకు నాంది కలిగింది. దేశ ఉత్తరప్రాంతంలో వ్యవసాయ ఉత్పత్తులు, అధికంగా ఉండగా, దక్షిణాది రాష్ట్రాలలో ఉత్పత్తులు తక్కువస్థాయిలో కలవు.

## పారిశ్రామికాభివృద్ధి

స్వాతంత్ర్యానికి పూర్వం మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు మాత్రమే పారిశ్రామికంగా అభివృద్ధి చెందగా, ప్రణాళికా కాలంలో గుజరాత్, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందాయి. తరవాత కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ రాష్ట్రాలు కూడ




**పటం 18.1 భారతదేశం-పంచవర్ష ప్రణాళికలు**

పారిశ్రామికంగా పురోగతి సాధించి పారిశ్రామికాభివృద్ధి చెందాయి. దేశంలో పారిశ్రామికాభివృద్ధి సాధించినా రాష్ట్రాల మధ్య పరిశ్రమలు నెలకొల్పుటలో అసమానతలు పెరిగాయి. బీహార్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు పారిశ్రామికంగా వెనకబడ్డాయి.

అభివృద్ధి చెందిన రాష్ట్రాలు, నగరాలు, పట్టణాలలో మౌళిక సౌకర్యాలకు అధికంగా వనరులు కేటాయిస్తే పరిశ్రమలు స్థాపనకు ప్రోత్సహిస్తున్నాయి. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో 70శాతం పరిశ్రమలు హుగ్లిజిల్లాలోనే కేంద్రీకృతమైనాయి. మహారాష్ట్రలో 80 శాతంపైగా పరిశ్రమలు పట్టణ, నగర ప్రాంతాలలో కేంద్రీకృతంకాగా, పంజాబ్ రాష్ట్రంలో 96శాతం పరిశ్రమలు పట్టణ ప్రాంతాలలో కలవు. పరిశ్రమల స్థాపనలో అంతర్‌రాష్ట్ర అసమానతలు ఏర్పడుచున్నాయి. ప్రభుత్వ విధానమైన పరిశ్రమల వికేంద్రీకరణవల్ల పట్టణాలలో పారిశ్రామిక కేంద్రీకరణ తగ్గుతుంది. అభివృద్ధి చెందిన పంజాబ్, హర్యానా, కేరళ, కర్నాటక రాష్ట్రాలలో చిన్నతరహా పరిశ్రమల వికేంద్రీకరణపై ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు.

## సామాజిక సేవారంగం

మానవ వనరులు సూచికలైన విద్య, వైద్యం, గృహవసతి, త్రాగునీరు, పారిశుద్ధ్యం వంటి సామాజిక సేవారంగంపై ప్రభుత్వం వనరులు కేటాయించి వీటి అభివృద్ధికి కృషిచేస్తున్నది. సామాజిక సేవలపై వ్యయాన్ని పెంచి సేవారంగంలో సౌకర్యాలను కల్పించడంద్వారా మానవ వనరుల నాణ్యత పెంచి వాటి అభివృద్ధికి కృషిచేస్తూ అసమానతలను రూపుమాపుటకు ప్రయత్నాలు చేయుచున్నది. అయితే ఈపెట్టుబడి అన్ని రాష్ట్రాలలో ఒకే విధంగా లేదు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో సామాజిక సేవలపై తలసరివ్యయం తక్కువగా ఉండుటవల్ల ఈ రాష్ట్రాలు ర్యాంకు 13 నుంచి 22 మధ్యలో ఉన్నవి. 2011 సం॥ గణాంకాల ప్రకారం పెద్ద రాష్ట్రాలలో అక్షరాస్యత రేటు 80 శాతం కన్న ఎక్కువ నమోదు కాలేదు. వైద్యసేవలో ఆశించిన ప్రగతి సాధించలేదు. శిశుమరణాలరేటు నియంత్రించబడ్డా ఇతర దేశాలతోపోల్చిన అది ఎక్కువగానే ఉంది. రాష్ట్రాలవారిగా చూస్తే తమిళనాడు, మహారాష్ట్రలలో సామాజిక రంగాలై వ్యయం స్థిరంగా ఉండగా, గుజరాత్, పశ్చిమబెంగాల్‌లలో తగ్గింది. పంజాబ్, ఆంధ్రప్రదేశ్‌లలో స్వల్పంగా పెరిగింది. ఈ విధంగా మానవాభివృద్ధి సూచిలో కూడ రాష్ట్రాల మధ్య అసమానతలు ఎక్కువగా కలవు.

## పట్టణీకరణ స్థాయిలో అసమానతలు

దేశ జనాభాలో పట్టణ జనాభాశాతం రాష్ట్రాలవారిగా చూచిన అసమానతలు గోచరిస్తున్నాయి. మౌలిక వసతులు, సౌకర్యాలతోపాటు సామాజిక సౌకర్యాలను విద్య, ఆరోగ్యం, రవాణా వంటి సేవలు ఎక్కువగా కల్పించుటవల్ల గ్రామీణ ప్రాంతంలో ప్రజలు పట్టణాలకు వలసపోతున్నారు. దేశంలోని 29 రాష్ట్రాలలో పట్టణ జనాభా 10 రాష్ట్రాలు మాత్రమే దేశసగటుకన్నా (31.17 శాతం) ఎక్కువగా ఉన్నాయి. అత్యధిక పట్టణ జనాభాశాతంతో తమిళనాడు రాష్ట్రం అగ్రస్థానంలో ఉండగా తరవాత స్థానంలో మహారాష్ట్ర, గుజరాత్, కర్నాటక, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు కలవు. వెనుకబడిన రాష్ట్రాలలో బీహార్ 1.30 శాతం పట్టణ జనాభాలో చివరిస్థానంలో ఉండగా అస్సాం, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లు ఆపై స్థానాలలో కలవు.

## ఉపాధి అవకాశాల కల్పన

ప్రతి లక్షమందిలో ఉపాధి పొందినవారి శాతంలోని వ్యత్యాసాలు కూడ ప్రాంతీయ అసమానతలను సూచిస్తాయి. వ్యవసాయరంగంలో ప్రచ్ఛన్న నిరుద్యోగిత ఎక్కువగా ఉంది. కాబట్టి పారిశ్రామిక రంగంలో వీరికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. కాని ఉపాధి అవకాశాలలో, కల్పనలో సారూప్యత కనిపించుటలేదు. పారిశ్రామికంగా అభివృద్ధిచెందిన

రాష్ట్రాలలో ప్రతి లక్షమందిలో ఉపాధి కల్పించబడినవారి సంఖ్య తక్కువగాను, రాష్ట్రాలమధ్య అంతరాలు ఎక్కువగాను ఉన్నట్లు చెప్పవచ్చు. గణాంకాలను నిశితంగా పరిశీలించిన పారిశ్రామికంగా అభివృద్ధిచెందిన గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో పరిశ్రమలలో ఉపాధి కల్పన అవకాశాలు పెంచడానికి వీలులేని స్థాయికి చేరుకున్నాయి. కాబట్టి ఆ రాష్ట్రంలో గ్రామీణ, వ్యవసాయరంగంపై ఎక్కువశాతం శ్రామికులు ఆధారపడిఉన్నట్లు తెలుస్తున్నది. వెనుకబడిన రాష్ట్రాలైన అస్సాం, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్‌లలో పారిశ్రామికరంగంలో ఉపాధికల్పన అల్పస్థాయిలో ఉంది.

2013-14 సంవత్సరాలలో రాష్ట్రాలయొక్క తలసరి జాతీయోత్పత్తి వృద్ధిరేటును పరిశీలించిన 15 రాష్ట్రాలు జాతీయ సగటుకన్నా (14.50 శాతం) ఎక్కువగా ఉన్నాయి. గోవా, రాజస్థాన్ రాష్ట్రంలో అత్యధిక వృద్ధిరేటు, ఒరిస్సా, అస్సాం రాష్ట్రాలలో అత్యల్ప వృద్ధిరేటు నమోదైనవి. వృద్ధిరేటు పెంచుకున్న కర్నాటక, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు తలసరి వృద్ధిరేటులో అగ్రస్థానంలో నిలిచాయి. వెనకబడిన ఒరిస్సా రాష్ట్రంతోపాటు గుజరాత్ రాష్ట్రంలోను తలసరి జాతీయ ఉత్పత్తిరేటు తక్కువగా కలదు.

రాజకీయ పరిస్థితులు, ఆర్థిక పరిస్థితులలో వచ్చిన మార్పులవల్ల 2015-16 సం॥లో సగటు దేశ జాతీయోత్పత్తిరేటు 11.5శాతానికి తగ్గినది. అయినను దేశంలోని 10 రాష్ట్రాలు మాత్రమే ఈ సగటురేటుకంటే ఎక్కువరేటు సాధించాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతోపాటు ఉత్తరప్రదేశ్ వృద్ధిరేటు మెరుగుపడింది. దాదాపు 6 దశాబ్దాలకాలం గడిచిన ఒరిస్సా, బీహార్ రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు తగినంతగా మెరుగుపడలేదు. అందువల్ల ఆ రాష్ట్రాల తలసరిరేటు అల్పంగానే కలదు.

దేశంలో రాష్ట్రాలవారిగా చూచిన మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, గుజరాత్, పశ్చిమబెంగాల్, కర్నాటక, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో 2015 సం॥లో గణాంకాల ప్రకారం (G.D.P.) జిడిపిలో అభివృద్ధిచెందిన రాష్ట్రాలుగా విశ్లేషించబడ్డాయి. ఇవి పారిశ్రామిక రంగంలో పట్టణ జనాభాలో, సమాచార సాంకేతిక కేంద్రాలు, వ్యవసాయరంగ అభివృద్ధి, భారీ మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి, ఖనిజవనరుల పరంగా, పరిశ్రమల సేవారంగాల, సాంకేతిక సమాచార రంగాలపై ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి సాధించాయి. ఈ రాష్ట్రాలలో పోల్చిన మిగిలిన రాష్ట్రాలు వెనకబడి ఉండటంవల్ల ప్రాంతీయ అసమానతలు పెరిగి ప్రాంతీయ అభివృద్ధికి ఆటంకం ఏర్పడింది. ఆర్థికాభివృద్ధి సాధనలో బీహార్, ఛత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఒరిస్సా రాష్ట్రాలు, ఇంకా వెనకబడి ఉన్నాయి. గ్రామీణ హర్యానా, గ్రామీణ పంజాబ్ రాష్ట్రాలు ప్రగతి పయనంలో పయనిస్తుండగా, గ్రామీణ ఒరిస్సా, బీహార్ ప్రాంతంలో పేదరికం, వెనుకబాటుదనంతో ఉన్నాయి.

ప్రాంతీయ అసమానతలు తగ్గించాలంటే ప్రభుత్వ విధానాలు చురుకుగా వేగవంతంగా అమలుచేయాలి. ఆయా ప్రాంతాలలోని వనరుల లభ్యతనుబట్టి అభివృద్ధికి అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పిస్తూ పట్టణప్రాంతాలలోగాక గ్రామీణ పరిసరప్రాంతాలలో పరిశ్రమలస్థాపనను అధికంగా ప్రోత్సహించాలి. విదేశీ, ప్రైవేట్‌రంగం పెట్టుబడులను ఆకర్షించుటకు పరిశ్రమలస్థాపన, అవసరమైన భూమిని తక్కువ ధరకు అందుబాటులో ఉంచి, నీరు, విద్యుత్, రవాణా సౌకర్యాలను విస్తృతపరచి పన్ను రాయితీలను, పన్ను విరామ సౌకర్యాలను కొంతకాలం ప్యాకేజి రూపంలో అమలుచేయాలి. ఈ విధంగా చేయటంవల్ల ప్రాంతాల అభివృద్ధి జరిగి ఆయా రాష్ట్రాలు అభివృద్ధి జరిగి ఆయా రాష్ట్రాలు అభివృద్ధి పథంలోకి దూసుకుపోతాయి. దీనివల్ల ప్రాంతీయ అసమానతలు చాలా వరకు రూపుమాపవచ్చు.

13

# ఆంధ్రోద్యమం - ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర అవతరణ ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవం

ఆంధ్రోద్యమ ఆవిర్భావం : 19వ శతాబ్దంలో ఆంధ్రదేశంలో సాంఘిక, సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమాలు ప్రారంభమై, తెలుగు జాతి జాగృతమైంది. జాతీయోద్యమ ప్రభావం తెలుగు రాజకీయ చైతన్యాన్ని మేలుకొలిపింది. పాశ్చాత్య విద్యా ప్రభావం, వందేమాతర, స్వదేశీ ఉద్యమాలు, ఆధునిక తెలుగు సాహిత్యం, సమకాలీన సమస్యలపట్ల తెలుగు పత్రికలు చూపిన శ్రద్ధ, ఆంధ్రులలో నూతన భావాలకు, ఉత్సాహానికి దోహదంచేశాయి. 1910లో విజ్ఞాన చంద్రికా మండలి ప్రచురించిన 'ఆంధ్రుల చరిత్ర' లోని తొలిపలుకులో తెలుగువారి గత వైభవ సంస్మరణ కనిపిస్తుంది. ఆంధ్రులకు మహోన్నత గత చరిత్ర ఉందని భారతదేశంలోని ప్రజలలో ఎవరికి తీసిపోని రాజ్య వైభవం, సంస్కృతి, మేధస్సు తెలుగువారికి ఉండేవని ఈ గ్రంథంలో ఆధారాలతో సహా నిరూపించడమైంది. ప్రాచీన వైభవాన్ని సంస్మరించుకొంటున్న ఆంధ్రులకు, వారి సమకాలీన బలహీనత, మద్రాసు రాష్ట్రంలో వారికి జరుగుతున్న అన్యాయాలు, అవమానాలు, నిరాదరణ భరింపశక్యం కాని వయ్యాయి. తత్ఫలితంగా ఆంధ్రోద్యమం ప్రారంభమైంది. తమ విశిష్ట వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకొని, తమ ప్రయోజనాలను సాధించడానికి సంస్కృతిని పరిరక్షించుకోవడానికి ఆంధ్రోద్యమం కృషి చేసింది. ఇది జాతీయ ఉద్యమానికి శాఖ అయిన ఉపజాతీయోద్యమం అని పట్టాభి సీతారామయ్య గారు పేర్కొన్నారు. స్వతంత్ర ప్రతిపత్తితోనే ఆంధ్రదేశ ప్రగతి, సంస్కృతి, తెలుగు భాషా అభివృద్ధి జరగగలదనే భావనతో ఈ ఉద్యమం ఆవిర్భవించింది.

## మద్రాసు రాష్ట్రంలో ఆంధ్రుల స్థితి

మద్రాసు రాష్ట్రంలో ఆంధ్రప్రాంతం 58% విస్తీర్ణం ఉంది. తెలుగు వారి జనాభా రెండు కోట్లు. రాష్ట్ర జనాభాలో 40%. దేశంలోనే భాషా పరంగా ఆలోచిస్తే, తెలుగువారు మూడవ స్థానం అలంకరిస్తారు. కాని బెంగాలీలు, గుజరాతీలు, తమిళులతో పోలిస్తే, ఆంధ్రులు చాలా వెనకబడి ఉన్నారు. ఆంధ్రులకు ప్రత్యేకమైన గుర్తింపు ఉండేదికాదు. వారిని 'మద్రాసీలు' గానే ఇతర భారత ప్రజలు వ్యవహరించేవారు. ఉద్యోగాలలో, విద్యలో వ్యవసాయంలో పరిశ్రమలలో, సైన్యంలో ఆంధ్రులపట్ల నిరాదరణ ప్రదర్శితమయ్యేది. 1910లో మద్రాసు రాష్ట్రంలో ఉద్యోగ విషయంలోని గణాంకాలు తెలుగువారు ఎంత వెనకబడి ఉన్నారో విదితం చేయగలవు.

| ఉద్యోగం | తెలుగువారు | ఆంధ్రేతరులు |
|---|---|---|
| సబ్‌కలెక్టర్‌లు | 1 | 3 |
| డిప్యూటీ కలెక్టర్‌లు | 21 | 39 |
| జిల్లా జడ్జీలు | 0 | 19 |
| డిస్ట్రిక్ట్ మున్సిఫ్‌లు | 30 | 93 |
| జిల్లా రిజిస్ట్రార్‌లు | 2 | 17 |
| విద్యాశాఖలో ఉన్నతోద్యోగాలు | 5 | 28 |
| రాష్ట్ర ఉన్నతోద్యోగాలు | 8 | 56 |

పైగా ఆంధ్రదేశంలోని గుంటూరు, మచిలీపట్నం, బాపట్ల, రాజమండ్రి, విశాఖపట్నం తదితర ప్రాంతాలలోని కళాశాలలకు, ఉన్నత పాఠశాలలకు ప్రిన్సిపాల్‌గా, హెడ్‌మాస్టర్‌గా ఆంధ్రేతరులు పనిచేసేవారు. ఆంధ్రదేశంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య చాలా తక్కువ. **1915లో రాష్ట్రంలో 31 కళాశాలలో కేవలం 8 మాత్రమే ఆంధ్రదేశంలో స్థాపితమయ్యాయి. 583** సెకండరీ పాఠశాలలు తక్కిన ప్రాంతంలో ఉండగా, ఆంధ్రలో **163** మాత్రమే ఉండేవి. ఇంజనీరింగ్, మెడికల్, లా కాలేజీలలో ఒక్కటి కూడా ఆంధ్రదేశంలో లేదు. పారిశ్రామిక పాఠశాలలు రాష్ట్రంలో **3800 ఉండగా, ఆంధ్రదేశంలో కేవలం 400 మాత్రమే స్థాపితమయ్యాయి.**

రాష్ట్ర రాజధాని అయిన మద్రాసులోనే అన్ని కళాశాలలు పరిశ్రమలు స్థాపితమయ్యాయి. మద్రాసు చుట్టూ ఉన్న ప్రాంతం తమిళదేశమే రైల్వేలు వేయడంలో కూడా సర్కారు జిల్లాలను మద్రాసుతో కలపడం ఆఖరుగా జరిగింది. **19**వ శతాబ్దంతం వరకు ఆంధ్రులు స్టీమర్‌లోనే ప్రయాణించేవారు. ఈ కారణాలవల్ల ఆంధ్రదేశం ఆర్థికంగా, విద్యావిషయకంగా బాగా వెనకబడిపోయింది. పారిశ్రామికాభివృద్ధి, విద్యాభివృద్ధి తమిళదేశంలో నిరాకటంకంగా సాగాయి. కాబట్టి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంలోనే తమకు న్యాయం జరగగలదని, అలాంటి పాలనలోనే తమ భాష, సంస్కృతి పరిరక్షితం కాగలవని తెలుగువారు భావించడంవల్ల ఆంధ్రోద్యమం బయలుదేరింది.

ఆంధ్రోద్యమంలో ప్రథమ దశను 'భావనా దశ' గా రెండో దశను 'ప్రచారదశ' గా మాదాల వీరభద్రరావుగారు అభివర్ణించారు.

**భావనదశ 1903 - 1904** మధ్య గుంటూరులో "యంగ్‌మెన్ లిటరరీ అసోసియేషన్" స్థాపితమైంది. జొన్నవిత్తుల గురునాథంగారు అందులో ప్రముఖ సభ్యులు, ఈయన గుంటూరు క్రైస్తవ కళాశాలలో ఉపన్యాసకులుగా, కురుపాం రాజాగారి కార్యదర్శిగా పనిచేసి కేంద్రశాసన మండలి సభ్యులుగా

నియమితులయ్యారు. ఈయన 'హిందూ' పత్రికలలో తెలుగు వారి బడుగు తనంపై అనేక వ్యాసాలు రాసి ఆంధ్రోద్యమ భావనకు అంకురార్పణ చేశారు. చల్లా శేషగిరిరావు, గొల్లపూడి సీతారామశాస్త్రి, ఉన్నవ లక్ష్మీనారాయణ, దుగ్గిరాల గోపాల కిష్టయ్య ప్రభృతులు ఈ సంఘంలో ప్రముఖ సభ్యులు.

1905లో ప్రారంభమైన వందేమాతరం ఉద్యమం ఆంధ్రదేశంలో రాజకీయ చైతన్యానికి నాందిపలికింది. ఈ కాలంలోనే ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర భావన మొలకెత్తింది. ఆంధ్రదేశంలోని పత్రికలు, విజ్ఞానమండలి ప్రచురించిన ఆంధ్రులచరిత్ర మొదలైన గ్రంథాలు ఈ ఉద్యమానికి చేయూత నిచ్చాయి. ఆంధ్రపత్రిక కృష్ణాపత్రిక, దేశాభిమాని, దేశమాత, దర్బారు మొదలైన పత్రికలలో ఉద్యమాన్ని బలపరుస్తూ వ్యాసాలు వచ్చాయి. నిర్మాణాత్మక సూచనలు అనేకం వచ్చాయి. 1911తో బెంగాలు విభజన వ్యతిరేకోద్యమం ఫలించి, బెంగాలు విభజన రద్దుకావడం ఆంధ్రులలో నూతనోత్సాహాన్ని కల్పించింది. బెంగాలీయులు సాధించిన ఈ ఘనవిజయం తెలుగువారికి ఆదర్శప్రాయమైంది. 1911లో ఉన్నవ లక్ష్మీనారాయణ జొన్నవిత్తుల గురునాధంగార్లు మద్రాసు రాష్ట్రంలోను, నిజాం రాజ్యంలోను, మైసూర్ సెంట్రల్ ప్రావిన్సస్‌లోను ఉన్న తెలుగు ప్రజల మొత్తం ప్రాంతాన్ని ఒకే చిత్రపటంగా రూపొందించారు. బెంగాలీలు బీహారీల మాదిరి మద్రాసు రాష్ట్రంలో నిరాదరణకు పాలైన తెలుగువారు కూడా ప్రత్యేక పాలనా విభాగంగా రూపొందాలన్న కోరిక ప్రథమంగా 1911 డిసెంబర్ 12వ తేదీన జరిగిన ఢిల్లీ దర్బారులో వ్యక్తం అయింది. "తెలుగు వారిని ఏకీకృతంచేసి వారికి ప్రత్యేక రాష్ట్రాన్ని, గవర్నర్‌ను, శాసనమండలిని ఏర్పాటు చేయడం ఆంగ్ల పాలకుల ధర్మమని" ఆంధ్రకేసరి పత్రిక ఉద్ఘాటించింది. ఈ ఢిల్లీ దర్బారులోనే భాషా ప్రయుక్త రాష్ట్రాల భావనకు బీజం నాటడం జరిగింది. బీహారీలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఎందుకు ఇవ్వకూడదనే ప్రశ్న ఉత్పన్నమైంది. "బీహారీలమాదిరి తెలుగు మాట్లాడే ప్రజలకు ప్రత్యేక ప్రభుత్వం ఇవ్వాలి. తెలుగు ప్రతిభ త్వరితగతిలో అంతరిస్తుంది. అది పూర్తిగా అంతరించకుండా కాపాడటం ప్రభుత్వం విధి. ప్రత్యేక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తేనే తప్ప తెలుగు ప్రజల సంస్కృతికి రక్షణలేదు" అని 'దేశాభిమాని' అభిప్రాయ పడింది. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర స్థాపనకోసం ప్రతినిధి వర్గాన్ని పంపాలనే ఆలోచన కూడా వచ్చింది.

1912 మే నెలలో నిడదవోలులో 21వ క్రిష్ణా గుంటూరు, గోదావరి జిల్లాల సంయుక్త సమావేశాలు జరగాలని నిశ్చయమైంది. ఈ సమావేశంతో పాటు సాంఘిక సంస్కరణ సభ, ఆంధ్ర సాహిత్య సమావేశం కూడా జరపాలని భావించారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును సమావేశ చర్చనీయాంశాలలో చేర్చాలని గుంటూరు జిల్లా సమావేశం అభిప్రాయ పడింది. వేమవరపు రామదాసులు పంతులు గారి అధ్యక్షతన జరిగిన ఈ సంయుక్త సమావేశంలో గుంటూరు

ప్రతినిధులు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ప్రస్తావన తీసుకొనివచ్చారు. గోదావరి జిల్లా ప్రతినిధులు ఈ అభిప్రాయాన్ని ప్రారంభంలో ఆవహేళన చేసినా, చివరకు ప్రత్యేక రాష్ట్ర వాదన బలాన్ని గుర్తించక తప్పలేదు. ఈ విషయాన్ని కూలంకషంగా చర్చించడానికి అఖిలాంధ్ర సమావేశాన్ని ఏర్పరచాలని నిర్ణయించడం జరిగింది. 'ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు' తీర్మానాన్ని సూర్యనారాయణగారు ప్రతిపాదించగా, తీర్మానాన్ని వాయిదావేయలాని సాంబశివరావుగారు కోరారు. అత్యధికులు సాంబశివరావుగారిని సమర్థించారు.

ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర తీర్మానం నెగ్గక పోయినా గుంటూరు ప్రతినిధులు నిరుత్సాహపడలేదు. నిడదవోలు నుంచి తిరిగిరాగానే ఉన్నవ లక్ష్మీనారాయణ, గురునాథం, చల్లా శేషగిరిరావు కొండా వెంకటప్పయ్య, వింజమూరి భావనాచారిగార్లు కలసి అఖిలాంధ్ర సమావేశం ఏర్పాటు చేయడానికి ఒక స్థాయీ సంఘాన్ని నియమించారు. దీనికి ప్రచారం జరపాలని నిశ్చయించి శ్రీ కొండా వెంకటప్పయ్య గారిని స్థాయీ సంఘానికి కార్యదర్శిగా నియమించారు. వారు గురునాథం గారితో కలసి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఆవశ్యకతను వివరిస్తూ ఆంగ్ల, తెలుగు భాషలలో ఒక చిన్న పుస్తకం ప్రచురించారు. ప్రథమ ఆంధ్ర మహాసభ 1913లో బాపట్లలో జరపాలని నిశ్చయించారు. ప్రత్యేక రాష్ట్ర నిర్మాణం గురించి పత్రికలలో వాదవివాదాలు జరిగాయి. "ఇప్పటికే దేశంలో విభజన గోడలు ఎన్నో ఉండి సమైక్యం కష్టమైంది. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రంవల్ల మరో అడ్డంకి ఏర్పడుతున్నది." అని హిందూ పత్రిక రాసింది. ఉద్యోగాల కోసం ఆంధ్రులు ఉద్యమం ప్రారంభించారని కొందరు విమర్శించారు. ప్రత్యేక రాష్ట్రం అడగడం కంటే తమ స్థితిని మెరుగుపరచుకోవటానికి ఆంధ్రులు ప్రయత్నించడం ఉచితమని అవహేళన చేశారు. తెలుగువారైన న్యాపతి సుబ్బారావు కూడా ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర కోరికను వ్యతిరేకించారు. పట్టాభిగారు న్యాపతి సుబ్బారావు వాదనను తిరస్కరించారు. 'దేశమాత' క్రిష్ణాపత్రికలలో ఈ విషయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తూ పాఠకులు రాశారు.

## 1913 బాపట్ల ప్రథమాంధ్ర మహాసభ

ప్రథామాంధ్ర మహాసభలు గుంటూరు జిల్లా బాపట్లలో 1913మే 20వ తేదీన ప్రారంభమయ్యాయి. సమావేశ స్థలం 22 ద్వారాలతో అలంకృతమైంది. ప్రతి ద్వారానికి ఆంధ్రదేశంలోని మహాపురుషుని పేరో, మహిళా పేరో, కవి పేరో పెట్టారు. మద్రాసు రాష్ట్రంలోని తెలుగు జిల్లాల నుంచి 800 మంది ప్రతినిధులు, నాగపూర్, వరంగల్, హైదరాబాద్‌ల నుంచి పరిశీలకులు వచ్చారు. మొత్తం రెండు వేల మంది సభ్యులు ఈ సభలకు హాజరయ్యారు. సమావేశమైన ప్రజలందరూ ముక్త కంఠంతో వందేమాతరం గీతం పాడారు. తెలుగులో సమావేశ కార్యక్రమాలు నిర్వహించారు. మద్రాసు శాసన మండలి సభ్యులు శ్రీ బయ్యా నరసింహేశ్వర శర్మ (బి.ఎన్.శర్మ) సభలకు అధ్యక్షత వహించారు. అధ్యక్షోపన్యాసంలో శర్మగారు, ఆంధ్రులు ఆంగ్లేయ ప్రభుత్వంపట్ల విధేయత చూపాలని, సమష్టిగా ఆంధ్రుల ఉన్నతికి పాటుపడాలని

ఉద్బోధిస్తూ "ప్రథమంగా మనము భారతీయులం ఆ తరవాతనే ఆంధ్రులం" అని పలికారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం గురించి ప్రస్తావిస్తూ, ఈ ఆలోచనవల్ల నేడు లాభం కంటే నష్టమే ఎక్కువని అభిప్రాయ పడ్డారు. ఈ విషయంపై విస్తృత చర్చలు జరగగలవని ప్రకటించారు.

ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర తీర్మానంపై విషయ నిర్ణయ సంఘంలోను, సాధారణ సమావేశంలో తీవ్ర వాద వివాదాలు జరిగాయి. బహిరంగ సమావేశంలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర తీర్మానాన్ని మద్రాసుకు చెందిన వేమవరపు రామదాసు పంతులు ప్రతిపాదించారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం లక్ష్యంగాలేని ఆంధ్రోద్యమం అర్థరహితం అని వీరు అభిప్రాయ పడ్డారు. ఈ తీర్మానాన్ని న్యాపతి సుబ్బారావు మోచర్ల రామచంద్రరావు, గంటి వెంకటరామయ్య వంటి ప్రముఖులు వ్యతిరేకించారు. భారతదేశంలోని ఇతర భాషా విభాగాల అభిప్రాయాలు తెలుసుకోవడం అవసరం అని, ప్రత్యేకాంధ్ర రాష్ట్రమనే కోరిక ఆనాటి పరిస్థితులలో అనుచితమని వారు భావించారు. మూడు గంటలసేపు చర్చలు జరిగిన తరవాత కృష్ణరావుగారు ప్రతిపాదించిన సవరణ తీర్మానం పెద్ద మెజారిటీతో నెగ్గింది. ప్రత్యేకాంధ్ర విషయం వచ్చే సమావేశంలో నిర్ణయించవచ్చునని, ఈ విషయంపై ప్రజాభిప్రాయం సేకరించాలని నిర్ణయమైంది. ఆంధ్రులలో సమకాలీన సమస్యలపట్ల ఆసక్తి, వారు తమ ప్రగతికోసం సమైక్యంగా నిలవబడాలనే లక్ష్యం, బాపట్ల సమావేశంలో వ్యక్తమయ్యాయి. బాపట్ల సమావేశం ప్రత్యేకాంధ్రోద్యమానికి నారు పోసింది.

బాపట్ల సమావేశానంతరం ప్రత్యేకాంధ్ర విషయం వివిధ జిల్లా సమావేశాలలో చర్చకు వచ్చింది. భిన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గుంటూరు, విజయవాడ, గోదావరి సమావేశాలు ప్రత్యేకాంధ్రకు అనుకూలంగా తీర్మానాలు చేశాయి. విశాఖపట్నం సమావేశం కూడా వాటిని అనుసరించింది. గంజాం జిల్లా సమావేశంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. నెల్లూరుజిల్లా సమావేశంలో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సమయం ఆసన్నం కాలేదని తీర్మానించడం జరిగింది. దత్త మండాలలో ఈ ఉద్యమంపట్ల పెద్దగా ఆసక్తి కనిపించలేదు. కాన కొండా వెంకటప్పయ్యగారి అధ్యక్షతన ఒక ప్రతినిధి వర్గం వివిధ ప్రాంతాలను సందర్శించి ప్రత్యేకాంధ్రావశ్యకతను వివరించింది. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కోరికను కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రికలు సమర్థించాయి. పట్టాభి సీతారామయ్యగారు సమకాలీన స్కాట్లండ్, ఐర్లాండ్ ప్రత్యేకోద్యమాలను ప్రస్తావిస్తు ప్రత్యేక రాష్ట్ర కోరిక ఏరీతిగాను దేశభక్తికి ఆటంకం కాదని 'హిందు పత్రిక'కు వ్యాసాలు రాశారు. భాషా ప్రయుక్త రాష్ట్ర విభాగాలతో భారతదేశ సమ్మేళన రాజ్యాంగాన్ని ఆయన ఆనాడే సూచించారు.

**ఆంధ్ర మహాసభ ఇతర సమావేశాలు :** రెండో ఆంధ్ర మహాసభ సమావేశాలు విజయవాడలో 1914 ఏప్రిల్ నెలలో జరిగాయి. న్యాపతి సుబ్బారావు గారు అధ్యక్షత వహించారు. ఆయన ఉపన్యాసం ప్రతినిధులకు నచ్చలేదు. మంధా సూర్యనారాయణ గారి ప్రత్యేకాంధ్ర రాష్ట్ర తీర్మానాన్ని

ప్రతిపాదించగా వేమవరపు రామదాసు పంతులు గారు బలపరచారు. నెల్లూరు, కడప ప్రతినిధులు తీర్మానాన్ని వ్యతిరేకించారు. అయినా, అత్యధిక సంఖ్యాబలంతో తీర్మానం నెగ్గింది. ప్రత్యేక ఆంధ్రోద్యమం పటిష్టమైంది.

మూడో ఆంధ్ర మహాసభ **1915** మే నెలలో విశాఖపట్నంలో పానగల్ రాజా, పానుగంటి రామ రాయణింగారి అధ్యక్షతన జరిగింది. ఆనాటి వరకు పానగల్ రాజా గారు ప్రత్యేకాంధ్ర తీర్మానానికి వ్యతిరేకులు. కానీ సభలో ఆయన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కోరికను సమర్థిస్తూ ప్రసంగించడం ఆంధ్రోద్యమానికి బలం చేకూర్చింది. "పదకొండు తెలుగు జిల్లాలను ప్రత్యేక రాష్ట్రంగా రూపొందించడం న్యాయము ఆవశ్యకం" అని తీర్మానించడం జరిగింది. సెకండరీ పాఠశాలలో తెలుగు బోధన భాషగా ఉండాలని, సమావేశ చర్చలు తెలుగులోనే జరపాలనే తీర్మానాలు చేశారు. "రాజకీయ నాయకత్వంపై ప్రజాభిప్రాయం విజయం సాధించిందని" వ్యాఖ్యను చేయడమైంది.

నాలుగో ఆంధ్ర మహాసభ సమావేశాలు **1916** మే నెలలో కాకినాడలో జరిగాయి. ఆహ్వాన సంఘ అధ్యక్షులు కృష్ణారావుగారు, సమావేశ అధ్యక్షులు మోచర్ల రామచంద్రరావుగారు ప్రత్యేకాంధ్ర ఏర్పాటును సమర్థిస్తూ ప్రసంగించడం గమనార్హం. ఈ ఉద్యమాన్ని వ్యతిరేకించిన వారు కూడా ప్రత్యేకాంధ్ర ఆవశ్యకాన్ని గుర్తించడం మొదలుపెట్టారు. ఈ సభలో ఆంధ్రోద్యమ లక్ష్యాలను వివరించడమైంది. "ఆంధ్ర ప్రాంతాలన్నిటినీ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పరచడం న్యాయం, ఆవశక్యం కాబట్టి యుద్ధానంతరం సాధ్యమైనంత త్వరలో రాష్ట్ర ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్నీ ప్రార్థించడమైంది" అనే తీర్మానం జరిగింది. నెల్లూరు అనంతపురం ప్రతినిధులు తీర్మానాన్ని వ్యతిరేకించారు.

**1917** ఏప్రిల్ నెలలో ఆంధ్ర రాజకీయ సమితి బి.యన్. శర్మగారి అధ్యక్షతన ఏర్పడింది. జూన్ నెలలో నెల్లూరులో జరిగిన ఐదో ఆంధ్ర మహాసభలు వివాదాత్మకంగా పరిణమించాయి. సర్కారు, రాయలసీమ జిల్లాల మధ్యగల అభిప్రాయ భేదాలను బహిర్గతంచేశాయి. సభకు కొండా వెంకటప్పయ్యగారు అధ్యక్షత వహించారు. మొదటి నుంచి నెల్లూరు, రాయలసీమ ప్రతినిధులలో అధిక సంఖ్యాకులు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రానికి సముఖులుకారు. నెల్లూరు వారికి మద్రాసు నగరంపై మోజు, రాయళసీమలో రాజకీయ నాయకత్వం తమిళుల చేతులలో ఉండేది. తమిళదేశం నుంచి ప్రవాసం వచ్చిన కేశవపిళ్ళే (అనంతపురం జిల్లాలోనిగుత్తి) ఏకాంబర్ అయ్యర్ (కర్నూల్ జిల్లాలోని నంద్యాల) ప్రముఖులు. కానీ రాయలసీమకు చెందిన గాడిచెర్ల హరిసర్వోత్తమరావు వంటి ఆంధ్ర నాయకులు ఉద్యమానికి అనుకూలురే.

సాధారణ సమావేశానికి హాజరయిన 740 మందిలో ప్రత్యేకాంధ్ర తీర్మానాన్ని ఓడించడానికి ఒక్క నెల్లూరు జిల్లానుంచే 480 మంది ప్రతినిధులు వచ్చారు. ఓటింగ్ జిల్లాల

వారిగా జరగాలని, ప్రతి జిల్లాకు ఒక ఓటు ఇవ్వాలని హరి సర్వోత్తమరావు ప్రతిపాదించారు. ఇంతలో సర్కారు జిల్లాల నుంచి మరికొందరు ప్రతినిధులు రావడంతో ఈ తీర్మానం నెగ్గింది. తమ ప్రయత్నాలు విఫలం కావడంతో ప్రత్యేకాంధ్ర వ్యతిరేకులు ప్రత్యేక సమావేశం జరిపి,మద్రాసు నగరంతో కూడిన ఆంధ్ర రాష్ట్రమే తమకు సమ్మతమని తీర్మానించారు. బి.యన్. శర్మగారు మధ్యవర్తిత్వం జరిపి ఈ అసమ్మతి వర్గాన్ని మరసటిరోజు సభలకు హాజరయ్యేటట్లుగా కృషి చేశారు. ఈ సమావేశంలో ప్రత్యేకాంధ్ర తీర్మానం నెగ్గింది.

మాంటేగ్‌ను కలియడం ఈ సమావేశాలనంతరం దేశ రాజకీయాలు ప్రాముఖ్యాన్ని సంతరించుకొన్నాయి. హోంరూల్ ఉద్యమం, కాంగ్రెస్, ముస్లింలీగ్‌ల మధ్య సహాయ సహకారాలు జాతీయోద్యమాన్ని బలపరచాయి. 1917లో మాంటేంగ్ రాజ్యాంగ సంస్కరణలకు గురించి పరిశీలించడానికి భారతదేశం వచ్చాడు. ఆనాటికి ప్రత్యేకాంధ్ర ఏర్పాటుపై ఆంధ్రులలో చాలావరకు ఏకాభిప్రాయం ఏర్పడింది. ప్రత్యేకాంధ్ర ఆవశ్యకాన్ని వివరించడానికి ప్రతినిధి వర్గమొకటి మాంటేంగ్‌ను కలవాలని 1917 అక్టోబర్ నెలలో విజయవాడలో జరిగిన ప్రత్యేకాంధ్ర మహాసభ నిర్ణయించింది. దీనికి మద్రాసు ప్రభుత్వం ప్రథమంలో అనుమతించలేదు. ఆంధ్ర శాసనసభ సభ్యుల పట్టుదలవల్ల చివరకు వారు మాంటేంగ్‌ను కలియడానికి అనుమతి లభించింది. 1917 డిసెంబర్ 17వ తేదీన న్యాపతి సుబ్బారావుగారి నాయకత్వంలో ప్రతినిధి వర్గం మాంటేంగ్‌ను కలసి తక్షణ ప్రత్యేకాంధ్ర రాష్ట్ర ఆవశ్యకతను వివరించింది. కొండా వెంకటప్పయ్య, కాశీనాధుని వాగేశ్వరరావు, పట్టాభి సీతారామయ్య, గాడిచెర్ల హరిసర్వోత్తమరావు ఓరుగంటి వెంకటరంగయ్య, పి. పట్టాభిరామిరెడ్డి, మోచర్ల రామచంద్రరావు ఈ ప్రతినిధి వర్గ సభ్యులలో ప్రముఖులు. ప్రతినిధివర్గంలో అన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం ఇవ్వడం జరిగింది.

1918 ఫిబ్రవరి నెలలో కేంద్ర శాసనసభలో బి.యన్.శర్మ ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. రాష్ట్రాలను వీలైనంత వరకు భాషా ప్రయుక్తంగా పునర్విభజించాలని ప్రతిపాదించారు. సభ్యులలో ఎక్కువమంది ఈ తీర్మానాన్ని వ్యతిరేకించారు. జిన్నా, శ్రీనివాసశాస్త్రి వంటి ప్రముఖులు కూడా వ్యతిరేకంగా మాట్లాడారు. భాషా ప్రయుక్త రాష్ట్రాలకు సమయం ఆసన్నం కాలేదని సురేంద్రనాద్ బెనర్జి అభిప్రాయపడగా, తీర్మానం ఒక్క ఆంధ్ర రాష్ట్రానికే పరిమితమైతే సమర్థించి ఉండే వాడినని తేజ్‌బహదుర్ సప్రూ అన్నారు. శర్మగారి తీర్మానం వీగిపోయింది. ఆంధ్రులు నిరుత్సాహపడ్డారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఉద్యమం తీవ్రం చేయాలని క్రిష్ణా, విశాఖపట్నం జిల్లా సంఘాలు నిర్ణయించాయి. విశాఖపట్నం జిల్లా సమావేశానికి అధ్యక్షత వహించిన జయపూర్ మహారాజ విక్రమ దేవశర్మ తాను పుట్టుకతో ఆంధ్రుడు కాకపోయిన ఆంధ్రోద్యమంపట్ల తనకు అపారమైన సానుభూతి ఉందని పేర్కొన్నారు. 1918 కడపజిల్లా సమావేశానికి అధ్యక్షత వహించిన పట్టాభి రామారావు తన పాత అభిప్రాయాలను మార్చుకొని ప్రత్యేకాంధ్రోద్యమాన్ని బలపరచారు.

## ప్రత్యేకాంధ్ర కాంగ్రెసు సర్కిల్ ఏర్పాటు

భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన నుంచి ఆంధ్రులు జాతీయోద్యమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. 1891లో ఆనందచార్యులు కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నిక అయ్యారు. న్యాపతి సుబ్బారావు జాతీయ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కొన్నాళ్ళు పనిచేశారు. ఆంధ్ర నాయకులు అనేకమంది జాతీయ కాంగ్రెస్ కార్యకలాపాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. 1914లో జరిగిన మద్రాసు కాంగ్రెస్ సభలలో ఆంధ్ర నుంచి 256 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. కానీ వారికి సరియైన ప్రాతినిధ్యం ఇవ్వడానికి, ప్రత్యేకాంధ్ర రాష్ట్ర తీర్మానం ప్రవేశపెట్టడానికి తమిళులు అడ్డుపడ్డారు. తమకు ప్రత్యేక కాంగ్రెస్ విభాగం ఏర్పాటు కావాలని, ఆంధ్రులు అభిప్రాయపడ్డారు. బీహారు, ఒరిస్సాలలో ఇటువంటి ప్రత్యేక కాంగ్రెస్ విభాగాలు ఉన్నాయి. 1916 లక్నోలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఈ విషయం పరిశీలించింది. కానీ నిర్ణయం తీసుకోలేదు. పట్టాభి సీతారామయ్య, కొండా వెంకటప్పయ్యల కృషివల్ల తిలక్ జోక్యంతో 1918 జనవరి 22 తేదీ నుంచి మద్రాసులోని తెలుగు మాట్లాడే జిల్లాలతో ప్రత్యేక ఆంధ్ర కాంగ్రెస్ విభాగ మేర్పడింది. న్యాపతి సుబ్బారావు, కొండా వెంకటప్పయ్యగార్లు దీని ప్రథమ అధ్యక్ష కార్యదర్శులు. ఆంధ్రోద్యమ నాయకులకు ఇది ప్రథమ విజయంగా చెప్పవచ్చు.

మాంటేగ్, చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు 1918 జూలై నెలలో ప్రకటితమైయ్యాయి. కాశీనాథుని నాగేశ్వరరావు అధ్యక్షతన, ఆంధ్ర మహాసభ ప్రత్యేక సమావేశాలు, 1918 ఆగస్టు 17వ తేదీన గుంటూరులో జరిగాయి. ప్రముఖ ఆంధ్ర నాయకులందరు ఈ సభకు వచ్చారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర ప్రస్తావన నూతన రాజ్యాంగ సంస్కరణలలో లేకపోవడం ఆంధ్రులకు నిరుత్సాహం కలిగించింది. డాక్టర్ పట్టాభి సీతారామయ్య అఖిల భారత భాషా ప్రయుక్త రాష్ట్రాలసమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కానీ కాంగ్రెస్ నాయకులు అంగీకరించలేదు. ఆంధ్ర సంఘం తరపున మోచర్ల రామచంద్రరావు రాష్ట్రాల పునర్విభజన, ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుపై ఒక వినతి పత్రాన్ని లండన్‌లో ఆంగ్ల ప్రభుత్వానికి సమర్పించారు. వెంకట పతిరాజు మద్రాసు శాసనమండలిలో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మద్రాసు రాష్ట్రంలోని తెలుగు ప్రాంతాలలో స్వయం పాలనకు అవసరమయ్యే రీతిలో సంస్థలను, శాఖలను కార్యాలయాలను ఏర్పరచి వాటి అధికారాలను ఆంధ్ర ప్రాంతానికి విస్తరింప జేయవలెనని, పార్లమెంట్ ఆమోదించిన తరవాత ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు ఇది దోహదకారి కాగలదని, ఆ తీర్మానంలో వివరించడం జరిగింది. ఈ తీర్మానాన్ని శాసనమండలి ఆమోదించింది.

### 1920-1935 మధ్య ఆంధ్రోద్యమ చరిత్ర

1920లో మహాత్మాగాంధీ నాయకత్వాన సహాయ నిరాకరణోద్యమం ప్రారంభమైంది. ఆనాటి నుంచి ప్రత్యేకాంధ్రోద్యమం మరుగున పడింది. ఆంధ్రదేశ నాయకులు జాతీయోద్యమంలో

నిమగ్నమయ్యారు. వారు సత్యాగ్రహంలో పాల్గొని కారాగార శిక్షలను పాత్రులైయ్యారు. ఆంధ్ర మహాసభలు ఈ కాలంలో నిర్వహించడానికి వీలులేక పోయింది. "స్వరాజ్యంలోనే స్వరాష్ట్రమనే" భావన వారిలో కలగడంవల్ల ప్రత్యేకాంధ్రోద్యమము చాలావరకు విస్మరింపబడింది. 1920లో నాగపూర్ కాంగ్రెస్ సమావేశాలలో భాషా ప్రయుక్త కాంగ్రెస్ విభాగాల ఏర్పాటు ఆమోదితమైంది. 1922లో రామయ్యపంతులు కేంద్ర శాసనమండలిలో ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును గురించి తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ విషయం పరిశీలించడానికి సమయం రాలేదని, మద్రాసు శాసన మండలిలోని ఆంధ్ర సభ్యులు యావత్తు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరితే ప్రభుత్వం పరిశీలించగలదని హోంశాఖ సభ్యులు సమాధాన మివ్వగా తీర్మానం ఉపసంహరించబడింది.

**జస్టిస్ పార్టీ అవతరణ - ఆంధ్రోద్యమంపట్ల చిన్నచూపు**

మద్రాసు రాష్ట్రంలో ఉద్యోగాలలోను, పదవులలోను బ్రాహ్మణులు అధికంగా ఉండేవారు. అంతేకాక జాతీయ కాంగ్రెస్ నాయకులలోను, ప్రత్యేకాంధ్రోద్యమ నాయకులలోను బ్రాహ్మణులే ఎక్కువగా ఉండేవారు. బ్రాహ్మణేతరులకు అన్యాయం జరుగుతుందని వారిని రాజకీయంగా, వైజ్ఞానికంగా పైకి రానివ్వకుండా కొన్ని శక్తులు అడ్డుకొంటున్నాయని వారి సమస్యలను ప్రభుత్వానికి విన్నవించుకోవడానికి "దక్షిణ భారత ప్రజల సంఘం" అనే బ్రాహ్మణేతర సంఘం 1916 నవంబరు నెలలో మద్రాసులో ఏర్పడింది. పిట్టి త్యాగరాయచెట్టి ఈ సంఘం ఏర్పాటుకు మూల పురుషుడు. ఆయన ఆంగ్లం, తెలుగు, తమిళం భాషలలో బ్రాహ్మణేతరుల సమస్యలను చర్చించడానికి పత్రికలు నడపవలెనని నిర్ణయించారు. ఆయన ఆంగ్లంలో ప్రచురించిన వార్తా పత్రికకు 'జస్టిస్' (Justice) అనే పేరు పెట్టారు. బ్రాహ్మణేతరులు ఒక రాజకీయ పార్టీగా ఏర్పడటం ఉచితమని భావించి వారు జస్టిస్ పార్టీని స్థాపించారు. 1917లో మాంటేగ్ రాజ్యాంగ సంస్కరణం ప్రతిపాదన చేయగానే, జస్టిస్ పార్టీ తన ప్రతినిధులను 'జాయింట్ సెలక్ట్ కమిటి' ముందు సాక్ష్యమివ్వడానికి లండన్ పంపింది. వారిలో ఏలూరుకు చెందిన కె.వి.రెడ్డినాయుడు, బర్హంపూర్ వాస్తవ్యులు కోకా అప్పారావు నాయుడు పానగల్ రాజ ప్రముఖులు, జస్టిస్ పార్టీ ఆంగ్లేయ పాలనను మొదటి నుంచి సమర్థించింది.

1919లో మాంటేగ్, చమ్స్ఫర్డ్ సంస్కరణలు ప్రవేశపెట్టడం జరిగింది. 1920లో జరిగిన మద్రాసు రాష్ట్ర ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పాల్గొనలేదు. ఎన్నికలలో పాల్గొన్న జస్టిస్ పార్టీ మద్రాసు రాష్ట్ర మంత్రివర్గ మేర్పరచింది. 1921 నుంచి అధికారంలో ఉన్న జస్టిస్ పార్టీలో ఎందరో ప్రముఖాంధ్రులు ఉన్నారు. అయినా, ఆ పార్టీ ఏనాడు ప్రత్యేకాంధ్రోద్యమాన్ని బలపరచలేదు. 1929-30 మధ్య మద్రాసు రాష్ట్ర రాజకీయాలలో ఆంధ్ర - తమిళుల విభేదాలే కాకుండా బ్రాహ్మణ-బ్రాహ్మణేతరుల వివాదాలు కూడా ప్రముఖంగా చోటు చేసుకొన్నాయి.

1925లో కొత్తగా ఏర్పడిన రెండో 'కౌన్సిల్ ఆఫ్ స్టేట్' సభలో మద్రాసుకు చెందిన డాక్టర్ రామారావు ప్రత్యేక కన్నడ రాష్ట్ర ఏర్పాటుకు కావలసిన అంశాలను పరిశీలించవలసిందిగా తీర్మానం ప్రవేశపెట్టారు. రామదాసు పంతులు దీనికి సవరణ ప్రతిపాదించి, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు పరిశీలించవలసిందిగా కోరారు. 1926లో శంకరన్ నాయర్ ప్రత్యేక తమిళ రాష్ట్ర ఏర్పాటుకు తీర్మానం ప్రతిపాదించారు. అదే సమయంలో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు రామదాసు పంతులు మరో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాలన్ని వీగి పోయాయి.

### ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటు (1926) ఆంధ్ర - రాయలసీమ మధ్య అపోహలు

జస్టిస్ పార్టీ మంత్రివర్గ కాలంలో ఆంధ్రులు సాధించిన ఏకైక విజయం ఆంధ్ర విశ్వవిద్యాలయ స్థాపన మాత్రమే. కానీ విశ్వవిద్యాలయస్థాపన అనేక వాద, వివాదాలకు ఆంధ్రుల మధ్య అపోహలకు దారి తీసింది.

1913 బాపట్ల ప్రథమాంధ్ర మహాసభలో ప్రత్యేక ఆంధ్ర విశ్వవిద్యాలయ ఆవశ్యకాన్ని గురించి చర్చించడం జరిగింది. మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగు భాషకు సరైన పరిగణన లేదని తెలుగు పాఠ్యపుస్తకాలను పరిశీలించే సంఘ సభ్యులకు, పరీక్ష పేపర్లు దిద్దే వారికి కూడా సరిగా తెలుగుభాష రాదని, మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగు వారి ప్రవేశం కష్టసాధ్యమని అనేక మంది సభ్యులు పేర్కొన్నారు. తెలుగువారి విద్యాభివృద్ధికోసం తెలుగు భాషాభివృద్ధికోసం ప్రత్యేక ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని, ఇది ప్రత్యేకాంధ్ర రాష్ట్ర స్థాపనకు దారి తీయగలదని వారు భావించారు. భాష ప్రయుక్తంగా విశ్వవిద్యాలయాలు ఏర్పాటు కావాలని వారు కోరారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటు వీలుకాదని మద్రాసు ప్రభుత్వం సమాధానం చెప్పింది.

1917 ఫిబ్రవరిలో వెంకటపతిరాజు మద్రాసు శాసనసభలో ఒక తీర్మానం ప్రతిపాదిస్తూ యుద్ధానంతరం తెలుగు జిల్లాలకు ఒక ప్రత్యేక విశ్వవిద్యాలయం ఏర్పరచాలని ఈ లోపుగా ఆంధ్రదేశంలో మరికొన్ని కళాశాలలు, పాఠశాలలు స్థాపించాలని కోరారు. 1919, 1920లో ఇలాంటి అభ్యర్థనలే వచ్చాయి.

1920 అక్టోబర్ 15వ తేదీన మద్రాసు విశ్వవిద్యాలయ సెనెట్ రాష్ట్రంలో మరికొన్ని విశ్వవిద్యాలయాల ఏర్పాటుక సమయం ఆసన్నమైందని, వీలైనంత వరకు ఈ విశ్వవిద్యాలయాలు భాషా ప్రయుక్తంగా ఉండాలని తీర్మానించింది. ప్రత్యేకాంధ్ర విశ్వవిద్యాలయం స్థాపించాలని కోరుతూ విశాఖపట్నం సభ్యుడు సూర్యనారాయణ శాసన మండలిలో తీర్మానం ప్రతిపాదించారు. కొందరు తమిళ సభ్యులు తీర్మానం వ్యతిరేకించినా, మరికొందరు సమర్థించారు. చివరకు తీర్మానం 1921 సెప్టెంబర్ 2వ తేదీన శాసన మండలి ఆమోదం పొందింది. కానీ విద్యామంత్రి ఎ.వి పాత్రో

మద్రాసు విశ్వవిద్యాలయ పునర్ వ్యవస్థీకరణకు బిల్లు ప్రవేశపెట్టారు. ఇది ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పడకుండా పన్నిన ఎత్తుగా తెలుగువారు భావించారు. వారు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొని వచ్చారు.

నాలుగేళ్ళ కాల వ్యవధి తరవాత చిట్టచివరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంబంధించిన బిల్లు శాసనమండలిలో ప్రవేశపెట్టి సెలక్ట్ కమిటికి నివేదించడం జరిగింది. ఈ కమీటిలోని రాయలసీమ సభ్యులు తమ ప్రాంతాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయ అధికార పరిధి నుంచి తొలగించాలని కోరారు. బళ్ళారి జిల్లాను మినహాయించమని సత్యమూర్తి కోరారు. ఈ సవరణలన్నీ వీగిపోయాయి. కె.వి. రెడ్డి నాయుడు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి బదులుగా తెలుగు విశ్వవిద్యాలయమని వ్యవహరించాలని సవరణ ప్రతిపాదించగా, అది కూడా రెండు ఓట్ల తేడాతో వీగిపోయింది. చివరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం **1926** ఏప్రిల్ **26** తేదీన విజయవాడలో ప్రారంభమయింది. మద్రాసు రాష్ట్రంలోని తెలుగు జిల్లాలకు ప్రాతినిధ్యం వహించే ఈ విశ్వవిద్యాలయానికి కట్టమంచి రామలింగారెడ్డి (సి.ఆర్.రెడ్డి) ప్రథమ వైస్ ఛాన్సలర్‌గా నియమితులయ్యారు. భాషాపరంగా పేరుపెట్టిన భారతదేశం ప్రథమ విశ్వవిద్యాలయం ఇదే. అంతేకాకుండా తెలుగు, కన్నడ, ఒరియా, మొదలైన ప్రాంతీయ భాషాలలో బోధన, పరీక్షల నిర్వహణ అనుమతించిన మొదటి విశ్వవిద్యాలయం కూడా ఇదే.

ఆంధ్ర విశ్వవిద్యాలయ స్థాపన ఆంధ్రులకు హర్షదాయకమైంది. కానీ విశ్వవిద్యాలయ కేంద్రం ఎంపికపై ఏర్పడిన వివాదం దురదృష్టవశాత్తు ఆంధ్ర, రాయలసీమ ప్రజల మధ్య అనేక వివాదాలకు, అనుమానాలకు దారి తీసింది.

విశ్వవిద్యాలయ కేంద్ర వివాదం : ఆంధ్ర విశ్వవిద్యాలయ చట్టంలో విశ్వవిద్యాలయ పాలనా విభాగాలు విజయవాడలో ఏర్పరచారని, రాజమండ్రిలో బోధన శాఖలు ప్రారంభించాలని నిర్ణయమైంది. కానీ ఈ వికేంద్రికరణ అనుచితమని గమనించిన ప్రభుత్వం బోధన శాఖలను కూడా విజయవాడకు మార్చడం ఉచితమని విశ్వవిద్యాలయ సెనెట్‌కు సిఫారస్ చేసింది. దీనితో బ్రహ్మాండమైన వివాదం ఏర్పడింది. విశ్వవిద్యాలయ కేంద్రం గురించి అనేక తీర్మానాలను ప్రతిపాదించడమైంది. రాయలసీమ సభ్యులు విశ్వవిద్యాలయం తమ ప్రాంతంలో ఉండాలని పట్టుపట్టారు. వారి అభిప్రాయాన్ని మన్నించి ఆంధ్ర విశ్వవిద్యాలయ సెనెట్ అనంతపురం విశ్వవిద్యాలయ కేంద్రంగా **35-20** ఓట్ల మెజారిటీతో ఆమోదించింది. మద్రాస్ శాసనమండలి సెలక్ట్ కమిటీ దీనిని అంగీకరించింది. వివాదం ముగిసినట్లే కనిపించింది. కానీ ముఖ్యమంత్రి డాక్టర్ సుబ్బరాయన్ విశ్వవిద్యాలయ కేంద్రంగా రాజమండ్రి తగిన ప్రదేశమని ప్రతిపాదించి వివాదాన్ని తిరిగి లేవనెత్తారు. ప్రాంతీయ బేధాలు తలెత్తడంవల్ల విజయవాడ, రాజమండ్రి,

విశాఖపట్నం మొదలైన ప్రదేశాలు విశ్వవిద్యాలయ కేంద్రంగా అనేక మంది అనేక ప్రతిపాదనలు చేశారు. డా. సుబ్బారాయన్ విశాఖపట్నాన్ని విశ్వవిద్యాలయ కేంద్రంగా ఏర్పరచి దానిని కేవలం బోధన విశ్వవిద్యాలయంగా ఉంచాలని మరో ప్రతిపాదన చేశారు. అంటే ఈ విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలు తిరిగి మద్రాసు విశ్వవిద్యాలయ పరిధిలోకి వస్తాయన్నమాట. చిత్తూరుకు చెందిన బొల్లిని మునుస్వామి నాయుడు రాయలసీమ ప్రాంతాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయ పరిధి నుంచి తొలగించమని సవరణ తీర్మానం ప్రతిపాదించగా దానిని ఆమోదించడమైంది. చివరకు ఆంధ్ర విశ్వ విద్యాలయం విశాఖపట్నంలో స్థాపితమైంది. రాయలసీమ జిల్లాలకు తిరిగి మద్రాసు విశ్వవిద్యాలయ పరిధిలోనే ఉంచడం జరిగింది.

దీనితో రాయలసీమ ప్రజలకు సర్కారు జిల్లాలపట్ల ఆగ్రహం కలగడం సహజమే. వెనకబడిన తమ ప్రాంతాలకు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంలో కూడా ఎలాంటి ప్రయోజనాలు చేకూరవని పైగా సర్కారువారు తమపై రాజకీయాధికారాన్ని నెరపగలరని వారు భయపడ్డారు. ఈ అభిప్రాయ భేదాలు ఆంధ్ర రాష్ట్ర అవతరణను కొన్నేళ్ళపాటు వాయిదా వేయించాయి డాక్టర్. సుబ్బారాయన్ కావలసే ఈ విభేధాలు సృష్టించాడని అనేకమంది అభిప్రాయం. 1927లో వారిపైన పేర్కొన్న విశ్వాస రాహిత్యా తీర్మానానికి అనుకూలంగా ఆంధ్ర సభ్యులలో అత్యధికులు ఓటు వేయడంలో విడ్డూర మేమీలేదు.

1927 మార్చి నెలలో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర ఏర్పాటును గురించి మద్రాస్ శాసన మండలిలో 55 తీర్మానాలకు నోటీసు ఇవ్వడం జరిగింది. మార్చి 14వ తేదీన ప్రత్యేకాంధ్ర తీర్మానం 40-32 ఓట్లతో నెగ్గింది. తీర్మానాన్ని యథాతథంగా మద్రాసు ప్రభుత్వం కేంద్రానికి విన్నవించింది. సైమన్ కమీషన్ భారతదేశం వచ్చేసరికి బాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు తీర్మానాన్ని సూత్ర ప్రాయంగా జాతీయ కాంగ్రెస్ ఆమోదించింది. కానీ మద్రాసు ప్రభుత్వం సైమన్ కమీషన్‌కు నివేదించిన పత్రంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును వ్యతిరేకించింది.

1930-31 మధ్య రౌండ్ టేబుల్ సమావేశాలు జరిగాయి. గాంధీజీ రెండో రౌండ్ టేబుల్ సమావేశానికి లండన్ వెళుతున్న సందర్భంగా ఆయనను పట్టాభి సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు కలిసి ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటును గురించి ప్రస్తావించారు. భారతదేశ స్వాతంత్ర్యానంతరం ప్రత్యేకాంధ్ర రాష్ట్రం ఏర్పాటు కాగలదని గాంధీజీ చెప్పారు. ఆంధ్ర నాయకులైన వి.వి.గిరి. మోచర్ల రామచంద్రరావు, బొబ్బిలిరాజా, ఎ.పి. పాత్రో ఇండియా అండర్ సెక్రటరీ ఆఫ్‌స్టేట్ లార్డ్ లోధరన్‌ను కలిసి నూతన రాష్ట్రాల ఏర్పాటులో ఆంధ్రను కూడా చేర్చమని కోరారు. కొత్తగా ఒరిస్సా రాష్ట్రం ఏర్పడింది. కానీ ఆంధ్రరాష్ట్ర విషయంలో ఎలాంటి చర్య తీసుకోవడం జరగలేదు. 1932లో తిరిగి శాసనోల్లంఘనోద్యమం దేశ వ్యాప్తంగా ప్రారంభమైంది. ఆంధ్ర నాయకులు జాతీయోద్యమంలో విరివిగా పాల్గనడంలో ప్రత్యేక రాష్ట్రోద్యమం మరోసారి మరుగున పడింది.

1932లో బొబ్బిలి రాజా మద్రాస్ ముఖ్యమంత్రి అయ్యాయడు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు తక్షణమే జరగాలని గాడిచెర్ల హరి సర్వోత్తమరావు శాసన మండలిలో తీర్మానం ప్రతిపాదించారు. కానీ అంతవరకు ప్రత్యేకాంధ్రోద్యమాన్ని బలపరచిన బొబ్బిలిరాజా ముఖ్యమంత్రి కాగానే ఉద్యమ వ్యతిరేకి అయ్యాడు. ఆగ్రహం చెందిన ఆంధ్ర సభ్యులు అనేక ప్రత్యేకాంధ్ర రాష్ట్ర తీర్మానాలను ప్రతిపాదించారు. 1933 నవంబర్‌లో శాసన మండలి ఈ తీర్మానాన్ని ఆమోదించింది. తెలుగు దేశం నుంచి కేవలం ఒక్క సభ్యుడే తీర్మానాన్ని వ్యతిరేకించాడు. ఆరేళ్ళ క్రితం చేసిన ప్రత్యేకాంధ్ర తీర్మానం మరోసారి ధ్రువపడింది. మద్రాస్ ప్రభుత్వం తన సహజ ధోరణిలో తీర్మాన ప్రతిని ఎలాంటి సిఫారస్ లేకుండా కేంద్రానికి విన్నవించింది.

ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు జాతీయోద్యమంలో పాల్గొంటూ, ప్రత్యేకాంధ్రోద్యమాన్ని విస్మరిస్తున్నారని కొందరు ఆంధ్ర నాయకులు అభిప్రాయ పడ్డారు. సింధీలు, ఒరియాలు తమ ప్రత్యేక రాష్ట్రాలను సాధించుకోగా ఆంధ్రులు ప్రత్యేక రాష్ట్రం సాధించలేక పోవడానికి కాంగ్రెస్ నాయకత్వ బలహీనతే కారణమని వారు భావించి 1934లో ఆంధ్ర కాంగ్రెస్ స్వరాజ్య పార్టీ స్థాపించారు. ఆంధ్ర రాష్ట్ర స్థాపన వారి ధ్యేయం. జి.వి. సుబ్బారావుగారు ఈ పార్టీ కార్యదర్శి, ఆంధ్ర మహాసభను ఆనాటి రాజకీయాల నుంచి, రాజకీయ నాయకుల నుంచి వేరు పరచాలని వారు భావించారు. ఒక ఏడాదిలో ఆంధ్రరాష్ట్రం ఏర్పడటానికి కావలసిన కార్యక్రమం చేపట్టాలని వారు భావించారు. కాని వారి అభిప్రాయాలను మన్నించిన సహచరులులేకపోయారు.

1934లో శాసనోల్లంఘనోద్యమం ఆగిపోగా, ఆంధ్రోద్యమం తిరిగి తెలుగువారి ప్రధాన కార్యక్రమమైంది. 1934 డిసెంబర్‌లో విశాఖపట్నంలో ఆంధ్ర మహాసభ సమావేశం జరిగింది. ఆంధ్ర కాంగ్రెస్ కమిటి కార్యదర్శి అయిన కాళేశ్వరరావు ఆంధ్ర రాష్ట్ర స్థాపన జీవన్మరణ సమస్యగా పరిగణించాలని కోరారు. 'ఆంధ్ర నిధి' ఏర్పాటు చేయాలని నిర్ణయించడమైంది. ఒరిస్సా సరిహద్దును పునర్విమర్శ చేయడానికి, ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ఆంగ్లేయ ప్రభుత్వానికి నచ్చ చెప్పడానికిగాను లండన్‌కు ఆంధ్ర ప్రతినిధి వర్గాన్ని పంపడమైంది. 1935 మార్చి నెలలో లండన్ చేరిన ఆంధ్ర ప్రతినిధుల కృషివల్ల 'కెప్టెన్ షా' బ్రిటిష్ పార్లమెంట్‌లో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర ఏర్పాటుకోసం వాదించాడు. కానీ ఆంగ్ల ప్రభుత్వం ఎలాంటి హామి ఇవ్వలేదు. సమయం వచ్చినప్పుడు దీని గురించి ఆలోచించగలమని మాత్రం సమాధానమిచ్చింది.

## 1935-1947 మధ్య ఆంధ్రోద్యమ చరిత్ర

సర్కారు - రాయలసీమ విభేదాలు 1937లో జరిగిన 'శ్రీబాగ్' ఒప్పందం తెలుసుకొనే ముందు ఆంధ్ర రాయలసీమ ప్రాంతాల మధ్య ఏర్పడిన వివాదాలను వాటి కారణాలను క్లుప్తంగా పరిశీలించాలి.

బాపట్ల ఆంధ్రమహాసభకు ముందుగా 1913 ఏప్రిల్ నెలలో కర్నూల్ జిల్లాలోని మహానంది వద్ద రాయలసీమ జిల్లాల మహాసభ జరిగింది సభకు రెండు వందల మంది ప్రతినిధులు హాజరయ్యారు. గుత్తికి చెందిన కేశవపిళ్ళై అనే ప్లీడరు అధ్యక్షత వహించారు. ఆంధ్రోద్యమానికి ఒకవైపున మద్దతు ప్రకటిస్తూనే ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు ఆచరణ యోగ్యంకాదని వారు ప్రకటించారు. బాపట్ల సభకు ఈ జిల్లాల నుంచి కొద్దిమంది ప్రతినిధులు మాత్రమే వచ్చారు. ఆంధ్ర మహాసభలలో ప్రత్యేకాంధ్రోద్యమాన్ని ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును సభ్యులలో అత్యధికులు సమర్థించారు. కేశవపిళ్ళై ఆంధ్ర రాష్ట్రోద్యమాన్ని బ్రాహ్మణ ఉద్యమంగా భావించి చిత్రించారు. రాయలసీమ జిల్లాలలో ఆంధ్రోద్యమంపై వివాదాలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంత ప్రజల అనుమానాలను తొలగించడానికి ఆంధ్ర మహాసభ నాయకులు విస్తృతంగా రాయలసీమ జిల్లాలో పర్యటించారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు క్రమంగా రాయలసీమ జిల్లాలలో అనుకూల వాతావరణ మేర్పడింది. 1915లో జరిగిన రెండో కర్నూలుజిల్లా మహాసభ, 1916లో జరిగిన కడపజిల్లా మహాసభ ఆంధ్రోద్యమాన్ని బలపరచగా, 1916లో జరిగిన మూడో కర్నూల్‌జిల్లా మహాసభ, మదనపల్లి మహాసభలు ప్రత్యేకాంధ్ర రాష్ట్ర ఏర్పాటును సమర్థించాయి. కానీ రాయలసీమకు ప్రవాసంగా వచ్చి ప్రముఖ పౌరులుగా స్థిరపడిన తమిళులు ఆంధ్రోద్యమాన్ని వ్యతిరేకించారు. "ఈ పిళ్ళైలు, అయ్యర్‌లు ఏనాడు ఆంధ్రోద్యమాన్ని బలపరచరు. వారు ఆంధ్రదేశానికి డబ్బు చేసుకోవడం కోసం వచ్చారు... తమిళుల నుంచి తెలుగువారు విడిపోవడం దేశ ఐక్యతకు ఏరీతిగా భంగకరంకాదు..." అని 'ఆంధ్ర పత్రిక' లో ఒక విలేకరి రాశాడు.

1917లో నెల్లూరులో జరిగిన ఆంధ్ర మహాసభలో ఏర్పడిన వివాదం మనం చదివి ఉన్నాం. చివరకు సభలో ప్రత్యేకాంధ్ర తీర్మానం నెగ్గినా, రాయలసీమ ప్రజలను ఆకట్టుకోవడానికి సర్కారు జిల్లాల వారు గట్టి కృషి చేయాలని విదితమైంది. మాంటేగ్ మద్రాసువచ్చిన సందర్భంలో సర్కారు రాయలసీమ నాయకులు ముక్త కంఠంతో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర ఏర్పాటును ప్రారంభించారు. ప్రతినిధి వర్గంలోని 27 మంది సభ్యులలో 10మంది రాయలసీమ ప్రాంతంవారే. అంతే కాకుండా ప్రత్యేక ఆంధ్ర కాంగ్రెస్ విభాగం ఏర్పడిన తరవాత కూడా రెండు ప్రాంతాల వారి మధ్య సదవగాహన ఏర్పడింది.

కానీ 1924లో విజయవాడలో జరిగిన ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ కమిటి ఎన్నికలలో రాయలసీమకు చెందిన గాడిచెర్ల హరి సర్వోత్తమరావును అధ్యక్షునిగా ప్రతిపాదించగా సర్కారు ప్రతినిధులు ఆ ప్రతిపాదనను ఓడించారు. దీనితో అభిప్రాయ బేధాలు మొదలయ్యాయి. రాయల సీమ జిల్లాలకు ప్రత్యేక కాంగ్రెస్ విభాగం కావాలనే కోరిక వ్యక్తమైంది. 1926-27లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటుపై జరిగిన వాద వివాదాలు ఈ బేధాలను తీవ్రతరం చేశాయి. రాయలసీమ ప్రజలకు సర్కారుజిల్లా నాయకులపై నమ్మకం సడలింది.

1931లో ఈ విభేదాలు మరింత తీవ్ర రూపం దాల్చాయి. 1931 అక్టోబర్ నెలలో ఆంధ్ర మహాసభ ప్రత్యేక సమావేశం మద్రాసులో జరిగింది. రాయలసీమకు చెందిన ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు కడపకోటిరెడ్డి అధ్యక్షత వహించాడు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర శాసనసభలో రాయలసీమలో రాయలసీమకు ప్రత్యేక ప్రాతినిధ్యం ఇవ్వాలని కల్లూరి సుబ్బారావు రాయలసీమకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పరచాలని మరో రాయలసీమ ప్రతినిధి సుబ్రమణ్యం సవరణలు ప్రతిపాదించారు. సర్కారు జిల్లాలపట్ల రాయలసీమ జిల్లాల ప్రతినిధులకు ఏర్పడిన అపనమ్మకానికి ఈ తీర్మానాలు నిదర్శనం.

**రాయలసీమ మహాసభలు : 1933-34** నాటికి మద్రాసు శాసనసభలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర తీర్మానాలు రెండుసార్లు ఆమోదింపబడ్డాయి. 1933లో జరిగిన చర్చ సందర్భంగా ఆంధ్రరాష్ట్రానికి మద్రాసు రాజధానిగా ఉండాలని కడపకోటిరెడ్డి ప్రతిపాదించారు. 1934లో తూర్పు గోదావరికి చెందిన నరసింహస్వామి రాయలసీమ ప్రాంతాలను ఆంధ్ర విశ్వవిద్యాలయ పరిధిలోకి తీసుకొని రావలెనని శాసనసభలో ప్రైవేటు బిల్లు నొకదానిని ప్రతిపాదించారు. ఇది రాయలసీమ ప్రజలకు నచ్చలేదు. 1934 రాయలసీమ మహాసభ స్థాపితమైంది.

రాయలసీమ మహాసభల ప్రథమ మహాసమావేశం 1934 జనవరి 28వ తేదీన యన్. పట్టాభిరామారావు అధ్యక్షతన జరిగింది. సత్యమూర్తి సభలను ప్రారంభిస్తూ రాయలసీమ ప్రాంతం, ఆంధ్రరాష్ట్రంలో, చేరాలని లేదా అనే విషయం రాయలసీమ ప్రజలకు వదలి వేయాలని పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంతాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయ పరిధిలో చేర్చడాన్ని సభ వ్యతిరేకించింది. తిరుపతిలో ప్రత్యేక విశ్వవిద్యాలయం స్థాపించాలని వారు కోరారు. ఆంధ్రరాష్ట్ర తీర్మానంపై ఎటువంటి తీర్మానమూ చేయలేదు. రెండో రాయలసీమ మహాసభలు కడపలో 1935 సెప్టెంబర్‌లో జరిగాయి. రాయలసీమ ప్రముఖ నాయకులు కడప కోటిరెడ్డి పప్పూరి రామాచారి. గాడిచెర్ల ఈ సభలకు హాజరుకాలేదు. ఈ సభలో ప్రత్యేకాంధ్ర రాష్ట్రం ఏర్పాటును వ్యతిరేకించాలని తీర్మానించడం జరిగింది.

1937లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పాల్గొన్నది. ఈ ఎన్నికలలో రాయలసీమ మహాసభ ప్రతినిధులు, ఆంధ్రరాష్ట్ర స్థాపన వ్యతిరేకులైన సి.ఆర్. నరసింహారెడ్డి, కె. సుబ్రమణ్యం ప్రభృతులు కాంగ్రెస్ పార్టీ ప్రతినిధుల చేతిలో ఓడిపోయారు. 1937 జులై నెలలో శ్రీ రాజగోపాలాచారి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ మంత్రి వర్గం మద్రాసులో అధికారం స్వీకరించింది. ఆంధ్రరాష్ట్ర స్థాపనకు తీవ్ర ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. పట్టాభి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. "వివాదాస్పదమైన భారత రాజ్యాంగ సమ్మేళన రాజ్యాంగం అమలుకు ముందే ఆంధ్రరాష్ట్రం ఏర్పడాలని శాసనసభ స్పీకర్ బులుసు సాంబమూర్తి ప్రకటించారు. పట్టాభి రాష్ట్రమంతటా విస్తృతంగా పర్యటించి ఆంధ్రోద్యమానికి ప్రజల సహకారం అర్థించారు.

రాజగోపాలాచారి మంత్రివర్గంలో 10 మంది క్యాబినెట్ మంత్రులలోను ఆంధ్రులు ముగ్గురు మాత్రమే. ప్రకాశం, బెజవాడ గోపాలరెడ్డి, వి.వి.గిరి. రాయలసీమ జిల్లాలకు ఎలాంటి ప్రాతినిధ్యమూ ఇవ్వడం జరగలేదు. రాజగోపాలాచారి ఆంధ్రోద్యమాన్ని దెబ్బతీయాడానికే రాయలసీమకు ప్రాతినిధ్యం ఇవ్వలేదని కొందరి అభిప్రాయం. రాయలసీమ ప్రతినిధులు, సర్కారు నాయకులు తమను మోసగించారని భావించడంలో తప్పులేదు. వీరి మధ్య ఏర్పడిన విబేధాలను పునస్కరించుకొని రాజగోపాలచారి, రాజన్ మొదలైన తమిళ నాయకులు ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రకటనలు చేశారు. "మనకు తమిళ మంత్రుల ప్రత్యేక రాష్ట్రం ఇచ్చే ముందే ఆంగ్లేయులు దేశానికి స్వాతంత్ర్యం ఇవ్వగలరని" పట్టాభి ఆనాడు చేసిన వ్యాఖ్య నిజమయింది కదా!

## శ్రీబాగ్ ఒప్పందం (1937)

1937లో ఆంధ్ర మహాసభ రజితోత్సవాలు విజయవాడలో ప్రారంభమయ్యాయి. 300మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఆనాటికి ఆంధ్ర, రాయలసీమ ప్రజల మధ్య విబేదాలు పరాకాష్టనందుకున్నాయి. ఆంధ్రరాష్ట్ర సత్వరస్థాపనకోసం ఈ ప్రాంతాల ప్రజల మధ్య ఉన్న అభిప్రాయ బేధాలను పూర్తిగా తొలగించాలని, రెండు ప్రాంతాల నాయకులు కృతనిశ్చయలయ్యారు. సభను హలహర్వి సీతారామిరెడ్డి ప్రారంభించగా, కడప కోటిరెడ్డి అధ్యక్షత వహించారు. వీరిద్దరూ రాయలసీమవారే. వారు తమ ఉపాన్యాసాలలో రాయలసీమ ప్రజలకు ఉన్న అనుమానాలను వ్యక్తీకరించి వీటిని తొలగించవలసిన బాధ్యత సర్కారు నాయకులపై ఉన్నదని ఉద్ఘాటించారు. రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేక రక్షణ కల్పించాలని, ఈ రక్షణలు మంత్రి వర్గం, నీటిపారుదల, రాజధాని విషయాలలో స్పష్టంగా ఉండాలని వారు కోరారు. వీరి న్యాయమైన కోర్కెలు పరిశీలించి అంగీకరిస్తేకాని ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు సాధ్యంకాదని నాయకులు గుర్తించారు. రెండు ప్రాంతాల సమైక్యం ఆవశ్యకమని భావించడం జరిగింది.

ఈ రక్షణల హామీల విషయం పరిశీలించడానికి ఒక సంఘాన్ని నియమించాలని ఆ సంఘం చేసిన సిఫారసులను మరుసటి సంవత్సరం రాయలసీమలో జరిగే ఆంధ్ర మహాసభలలో ఆమోదించాలని నిర్ణయించడం జరిగింది. ఈ సంఘంలో కడప కోటిరెడ్డి, రామకృష్ణారెడ్డి, కొండా వెంకటప్పయ్య, మహబూబ్ అలీబేగ్, దేశిరాజు హనుమంతరావు, హలహర్వి సీతారామిరెడ్డి కల్లూరు సుబ్బారావు, దేశపాండే సుబ్బారావు, వరదాచారి, రామాచారి, గాడిచెర్ల, సుబ్బరామిరెడ్డి పట్టాభి సభ్యులు. పట్టాభి ఆంధ్రోద్యమాన్ని నడిపించాలని సభ్యులు కోరారు. కొద్దిరోజుల తరవాత జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సమావేశంలో ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు గురించి 62 అనధికార తీర్మానాలకు నోటీసు ఇవ్వడం జరిగింది. ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును జాతీయ కాంగ్రెస్ ఆమోదించింది. 1937 దీపావళి పండుగను ఆంధ్రులు, ఆంధ్రరాష్ట్ర దినోత్సవంగా జరుపుకొన్నారు.

1937 నవంబర్ 16వ తేదీన బెజవాడ సమావేశంలో నియమితమైన సంఘసభ్యులు

మద్రాసులో కాశీనాధుని నాగేశ్వరరావు నివాసగృహమైన "శ్రీబాగ్" లో సమావేశమై, వివిధ విషయాలు చర్చించి ఒక అంగీకారానికివచ్చారు. దీనిని "శ్రీబాగ్" ఒప్పందం" అని వ్యవహరిస్తారు.

ఒప్పంద విషయాలు

**1.** విశ్వవిద్యాలయం : ఆంధ్ర విశ్వవిద్యాలయం పర్యవేక్షణలో రెండు కేంద్రాలు వాల్తేరు, అనంతపురంలో అభివృద్ధికావాలి. ఆంధ్రుల మధ్య సాంఘిక, సంస్కృతి సమన్వయం సాధించాలి. అందుకుగాను కళాశాలలు స్థాపించాలి.

**2.** నీటిపారుదల : రాయలసీమ ప్రజల వ్యవసాయ, ఆర్థిక ప్రయోజనాలను, పరిరక్షించడానికి, వారు కోస్తా జిల్లాల వారితో సమానం కావడానికి పదేళ్ళపాటు లేదా అంతకుమించి నీటి పారుదల విషయాలలో వారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించాలి. తుంగభద్రా, కృష్ణ, పెన్నార్ నదీజలాల వినియోగంలో అక్కడ నిర్మించే బృహత్తరమైన ఆనకట్టల విషయంలో పదేళ్ళపాటు రాయలసీమకు పూర్తిగా ప్రాధాన్యం ఇవ్వాలి.

**3.** శాసనసభ : శాసనసభ స్థానాల విషయంలో జిల్లాలన్నిటికి వీలైనంత వరకు సమాన ప్రాతినిధ్యం ఉండాలి. విశ్వవిద్యాలయాన్ని ఉన్నచోటనే కొనసాగించి రాజధాని, హైకోర్ట్‌లను రాయలసీమ, సర్కారు జిల్లాలో వేరు వేరుచోట్ల స్థాపించాలి. ఈ విషయంలో వారికేది కావలెనో కోరుకొనే హక్కు రాయలసీమకు ఇవ్వడం జరిగింది.

ఈ ఒప్పందం షరతులను ఇరు ప్రాంతాలవారి అంగీకారంతో మార్పులు చేయవచ్చు. రాయలసీమ ప్రతినిధులు కోరిన హామీలు, రాయితీలు ఈ ఒప్పందంలో పూర్తిగా అంగీకరించడం జరిగింది. 'శ్రీ బాగ్ ఒప్పందం' కుదిరిన వెంటనే ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు తీర్మానం ప్రతిపాదించమని ఆంధ్ర ప్రతినిధులు రాజగోపాలచారిని కోరారు. ఆంధ్ర, తమిళ, కేరళ, కర్ణాటక రాష్ట్రాలు ఏర్పాటు చేయాలనే తీర్మానం ప్రవేశపెట్టడం ద్వారా రాజగోపాలాచారి ఆంధ్రరాష్ట్ర స్థాపన ప్రాధాన్యాన్ని తగ్గించారు. ఈ తీర్మానాన్ని ఆంగ్ల ప్రభుత్వానికి నివేదించడం జరిగింది. ప్రస్తుతానికి భారతదేశంలో ఎలాంటి నూతన రాష్ట్రాలు ఏర్పాటు చేయడానికి వీలుకాదని **1938** మే నెలలో ఆంగ్ల ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రకటన ఆంధ్రోద్యమానికి ఆశనిపాతమైంది. దీనికి నిరసనగా బులుసు సాంబమూర్తి తన స్పీకర్ పదవికి రాజీనామాచేయ నిశ్చయించగా, కాంగ్రెస్ అధిష్ఠానవర్గం అంగీకరించలేదు. **1939**లో రెండో ప్రపంచయుద్ధం ప్రారంభమైంది. ఆంధ్ర రాష్ట్రోద్యమము తిరిగి మరుగు పడింది.

ఆంధ్రోద్యమానికి నాయకత్వం కాంగ్రెస్ వారి చేతులలో ఉన్నందువల్ల ఆంధ్రరాష్ట్ర స్థాపనలో విలంబన జరుగుతున్నదని, కాబట్టి నాయకత్వాన్ని మార్చాలని అనేక మంది భావించారు. **1941** నవంబర్‌లో ఆంధ్ర మహాసభలు విశాఖపట్నంలో జరిగాయి. విజయనగరానికి చెందిన శ్రీ

విజయ అధ్యక్షత వహించారు. శ్రీ విజయ ఏ పార్టీకి చెందినవ్యక్తికాదు. యావద్భారతదేశ ప్రజలకు ఆయన తెలిసినవ్యక్తి. ఆయన నాయకత్వంలో ఆంధ్ర మహాసభ ఉత్సాహంగా పనిచేసింది. రాయలసీమలో కరువురాగా, ఆంధ్రమహాసభ లక్షరూపాయల నిధి వసూలుచేసి సహాయ కార్యక్రమాలు చేపట్టింది. 1942లో క్రిప్స్ రాయబారవర్గం భారతదేశం వచ్చినప్పుడు ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర స్థాపన కోరుతూ విజ్ఞానపత్రం సమర్పించడం జరిగింది. 1943లో ఆంధ్ర మహాసభ బళ్ళారిలో జరిగింది. ఎన్నికలలో ఆంధ్రమహాసభ సభ్యులను నిలబెట్టాలని శ్రీ విజయ ప్రతిపాదించారు. 1946లో శ్రీ విజయ ఆంధ్రమహాసభ అధ్యక్షులుగా రాజీనామా చేశారు.

1945లో రెండో ప్రపంచయుద్ధం ముగిసింది. 1947లో స్వతంత్ర భారతదేశానికి నెహ్రూ ప్రధాని అయ్యారు. ఆయన 1947 నవంబర్‌లో ఒక ప్రకటనచేస్తూ "భాషా సాంస్కృతిక ప్రాతిపదికలపై భాష ప్రయుక్త రాష్ట్ర సూత్రాన్ని భారత ప్రభుత్వం ఆమోదించింది. ఆంధ్రరాష్ట్ర నిర్మాణం అత్యంత సమంజసమైనకోర్కె. దీనిని అంగీకరిస్తున్నాం. నూతన రాజ్యాంగంలో ఈ విషయాన్ని చేర్చవచ్చు అని హామి ఇచ్చారు. అయినా మరో ఏడేళ్ళకు కానీ ఆంధ్రరాష్ట్రం ఏర్పడలేదు. అది కూడా పొట్టి శ్రీరాములు ఆత్మాహుతి తరవాతనే జరిగింది.

## ఆంధ్రరాష్ట్ర అవతరణ

భారతదేశ రాజ్యాంగ ముసాయిదా ప్రతి 1948 ఫిబ్రవరి నెలలో ప్రకటితమైంది ప్రత్యేకాంధ్రరాష్ట్రం అందులో చేర్చలేదు. ముందు రాష్ట్రం ఏర్పడితేనేగాని రాజ్యాంగ షెడ్యూల్‌లో చేర్చడానికి వీలుకాదని రాజ్యాంగ పరిషత్ ప్రకటించడంతో ఆంధ్రులు నిరాశ చెందారు. రాజ్యాంగ పరిషత్తుకు చెందిన 10 తమిళ సభ్యులు తమకు తమిళరాష్ట్రం కావాలనే నినాదం లేవదీయడంతో ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుచేస్తే తదితర భాషా ప్రాంతాల నుంచి అలాంటి రాష్ట్రాల ఏర్పాటుకు ఉద్యమాలు బయలుదేరవచ్చునని భారత ప్రభుత్వం భావించడం రాష్ట్ర సమస్య మరికొంత వెనక పడింది.

**ధార్ కమీషన్ ఏర్పాటు :** 1948 మార్చి నెలలో నెహ్రూ విశాఖపట్నం సందర్శించారు. కాంగ్రెసేతర పక్షాలన్నీ ప్రదర్శనలు జరిపాయి. ఏప్రిల్ నెలలో ఆంధ్రరాష్ట్ర విషయం స్థూలంగా పరిశీలించడానికి ఒక సంఘం ఏర్పడగలదని, ఈ సంఘంచేసే సిఫారసుల ననుసరించి సరిహద్దు నిర్ణయ సంఘాలను నియమించగలమని నెహ్రూ చెప్పారు. ఆంధ్ర రాష్ట్రంతో పాటు తాము కూడా స్వరాష్ట్రాలను సాధించుకోవాలని కన్నడిగులు, మహారాష్ట్రులు ప్రభుత్వంపై ఒత్తిడితీసుకొనివచ్చారు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సమస్యలలో సతమవతమవుతున్న కేంద్ర ప్రభుత్వం, ఈ విషయాన్ని వాయిదా వేయాలని ఆలోచించింది. కాని చివరకు ప్రజాభిప్రాయాన్ని మన్నించి రాజ్యాంగ సభ 1948 జూన్ 17వ తేదీన భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు పరిశీలించమని, అలహాబాద్ హైకోర్ట్‌లో పదవీవిరమణ చేసిన న్యాయమూర్తి యస్.కె. ధార్ అధ్యక్షులుగా పన్నాలాల్,

జగత్‌నారాయణలాల్ సభ్యులుగా ఒక సంఘాన్ని నియమించింది. ధార్ సంఘం కొత్త రాష్ట్రాల ఏర్పాటు వాటి సరిహద్దుల నిర్ణయం, అవి ఆర్థికంగా పాలనాపరంగా, రాజకీయంగా ఎలాంటి ఫలితాలకు దారితీస్తాయి అనే విషయాలు తెలియజేయాలి. కొత్త రాష్ట్రాల ఏర్పాటు మంత్రి వర్గం మాత్రమే నిర్ణయిస్తుంది. అంటే ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు తదితర రాష్ట్రాల పునర్విభజనతో ముడిపడి ఉందన్నమాట.

ధార్ కమీషన్ **1948** సెప్టెంబర్ నెలలో మద్రాస్ వచ్చింది. తెలుగుమాట్లాడే ప్రాంతాలన్నిటితో ప్రత్యేకాంధ్రరాష్ట్రం ఏర్పాటు చేయవలసిందిగా ఆంధ్ర మహాసభ విజ్ఞానపత్రం సమర్పించింది. 20 మంది రాయలసీమ ప్రతినిధుల తరపున సంజీవరెడ్డి భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటను వాయిదావేయవలసిందిగాను, లేనట్లయితే "శ్రీబాగ్ ఒప్పందాన్ని" రాజ్యాంగంలో చేర్చవలసిందిగాను కోరారు. దీనికి కారణం లేకపోలేదు. 1946లో జరిగిన ఎన్నికలలో సర్కారు, రాయలసీమల నుంచి కాంగ్రెస్ అభ్యర్థులు ఎక్కువగా గెలుపొందారు. రాయలసీమ సభ్యులందరు ప్రకాశంగారికి పార్టీ నాయకునిగా ఓటువేయగా, ఆయన గెలిచి ముఖ్యమంత్రి అయ్యారు. కానీ రాయలసీమకు ఒకే ఒక మంత్రి పదవి లభించింది. ఇది వారికి అవమాన కారణమైంది. **1947** అక్టోబర్ నెలలో నంద్యాలలో జరిగిన రాయలసీమ మహాసభలో సంజీవరెడ్డి ఆంధ్రరాష్ట్రం ఏర్పడితే రాయలసీమకు తగు రక్షణలు ఇస్తేకానీ దానిని రాష్ట్రంలో చేర్చడం యుక్తంకాదని భావించారు. ప్రతి జిల్లాకు మంత్రివర్గంలో సమాన ప్రాతినిధ్యం ఉండాలని వారు ఉద్ఘాటించారు. **1948** జూన్ నెలలో జరిగిన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎన్నికలలో పట్టాభి వర్గం సంజీవరెడ్డిని బలపరచగా రంగాను ప్రకాశం వర్గం బలపరచింది. సంజీవరెడ్డి ఓడిపోయారు. రంగా తెలివిగా రాయలసీమకు చెందిన పెద్దిరెడ్డిని తిమ్మారెడ్డిని, కందుల ఓబులరెడ్డిని ఆంధ్ర కాంగ్రెస్ కార్యదర్శులుగా నియమించి, సంజీవరెడ్డి బలం తగ్గించడానికి యత్నించారు. అంటే1948 నాటికి కాంగ్రెసు పార్టీలోని ముఠాతగాదాలు కొంతవరకు ఆంధ్ర రాష్ట్రోద్యమంపై తమ ప్రభావాన్ని చూపాయని గుర్తించక తప్పదు. రాయలసీమ ప్రతిసధులలో మరికొందరు ప్రత్యేకాంధ్ర రాష్ట్రాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. రాయలసీమ ప్రజల భయాలను ధార్ కమీషన్ గుర్తించింది. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ రాయలసీమ ప్రజలను తృప్తి పరచడానికి రాయలసీమ మహాజన సభను ఏర్పాటు చేసింది. శ్రీబాగ్ ఒప్పందానికి రాజ్యాంగ రక్షణ ఇవ్వవలసిందిగా కోరారు.

ధార్ కమీషన్ వేయి విజ్ఞాపక పత్రాలను అందుకొన్నది. ఎందరో సాక్షులను విచారించింది. ధార్ కమీషన్ తన రిపోర్ట్‌ను **1948** డిసెంబర్ 10వ తేదీన సమర్పించింది. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు దేశసమైక్యానికి, శ్రేయస్సుకు భంగకరంగా పరిణమించగలదని, కొంతకాలం తరవాత పాలనా సౌలభ్యం ప్రాతిపదికగా మాత్రమే రాష్ట్రాలను పునర్విభజించాలని సంఘం అభిప్రాయపడింది.

జె.వి.పి. రిపోర్ట్ : ఈ సంఘ నివేదిక ఎవరినీ తృప్తిపరచలేదు. అనేక చోట్ల నివేదికకు నిరసనగా ప్రకటనలు, ప్రదర్శనలు జరిగాయి. 1948 డిసెంబర్‌లో జయపూర్‌లో జరిగిన కాంగ్రెస్ మహాసభలలో ప్రజాభిప్రాయం మేరకు భాషాప్రయుక్త రాష్ట్రాలను గురించి పునర్విచారణ జరపాలని నిశ్చయించడం జరిగింది. దీనికోసం ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ, ఉపప్రధాని వల్లభాయ్‌పటేల్, కాంగ్రెస్ అధ్యక్షుడు పట్టాభి సీతారామయ్యతో ఒక సంఘం ఏర్పరచారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటువల్ల ఉత్పన్నమయ్యే సమస్యలను, ధార్ కమీషన్ నివేదికలను పరిశీలించడానికి ఏర్పడిన ఈ సంఘం తన నివేదికను 1949 ఏప్రిల్‌లో ప్రకటించింది. ఈ నివేదికను సంఘ సభ్యుల పేర్లలోని మొదటి అక్షరాలతో జె.వి.పి. రిపోర్ట్ అని వ్యవహరిస్తారు.

భాషా ప్రయుక్త రాష్ట్రాలను కొన్నేళ్ళపాటు వాయిదావేయాలని సంఘం అభిప్రాయపడింది. కానీ ఆంధ్ర విషయంలో మాత్రం, మద్రాసునగరాన్ని వారు వదులుకుంటే రాష్ట్ర నిర్మాణం చేయవచ్చునని సంఘం భావించింది. ఈ రాష్ట్ర ఏర్పాటుకు పొరుగురాష్ట్రాల సమ్మతి అవసరమని టి.టి. కృష్ణమాచారి అడ్డంకి కల్పించడానికి ప్రయత్నించారు. సంఘ నివేదికను ప్రభుత్వం 1949 ఏప్రిల్ 4వ తేదీన అంగీకరించింది.

ఈ నివేదికలో తిరిగి ప్రాంతీయ భేదాలు తలెత్తాయి. మద్రాసు లేకుండా ఆంధ్ర రాష్ట్రాన్ని రాయలసీమ ప్రజలు అంగీకరించకపోవచ్చు. మద్రాసుపై హక్కువదలుకోవడానికి ప్రకాశం అంగీకరించలేదు. మేనెలలో సమావేశమైన ఆంధ్ర కాంగ్రెస్ కమిటి నివేదికాంశాల పట్ల విచారం వెలిబుచ్చుతూ, మద్రాసు రాజధానిగా వెంటనే ఆంధ్ర ప్రాంతాలతో రాష్ట్రం ఏర్పాటు చేయవలసిందిగా తీర్మానించింది. మద్రాసు ఆంధ్రలో చేరదంటే తమిళనాడులో చేరుతుందనికాదు, అది ప్రత్యేక ప్రాంతంగా ఉంటుందని పట్టాభి వ్యాఖ్యానించారు. వెంటనే వివాదాస్పదం కానీ 12 జిల్లాలతో ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేసి మద్రాసునగరం తాత్కాలికంగా ఆంధ్ర, మద్రాసు రాష్ట్రాలకు రాజధానిగా ఉండేటట్లు చూడమని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ సంఘం కోరింది. అప్పటికే జె.వి.పి. రిపోర్ట్ ప్రకారం ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు తమిళనాడు కాంగ్రెస్ సంఘం తన ఆమోదాన్ని తెలిపింది. మద్రాసు ప్రభుత్వంకూడా దీనికి ఆమోదం తెలిపింది. మద్రాసు నగరం లేకుండా ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుచేయమని కాంగ్రెస్ వర్కింగ్ కమిటి ప్రభుత్వానికి సిఫారస్ చేసింది.

పార్టిషన్ కమిటీ : మద్రాసు ప్రభుత్వం ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకోసం 'ఆస్తుల విభజన' లేదా పార్టిషన్ సంఘాన్ని నియమించింది. 1950 జనవరి 26 తేదీలోపుగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడగలదని అందరూ భావించారు. ఈ సంఘ సభ్యులు ప్రకాశం, బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి, కళావెంకట్రావు, యం. భక్తవత్సలం, టి.టి. కృష్ణమాచారి, మాధవన్ ముఖ్యమంత్రి కుమార్‌స్వామి రాజా సంఘ అధ్యక్షులు.

ఈ సంఘ సభ్యులలో మద్రాసునగర విషయంలో అభిప్రాయభేదాలు వచ్చాయి. ఆంధ్రరాష్ట్రంలో నూతన రాజధాని ఏర్పడేవరకు మద్రాసునగరంలోనే ఆంధ్రరాజధాని హైకోర్టు

ఉండాలని ప్రకాశం కోరగా, ఆంధ్రలోనే తాత్కాలిక రాజధాని ఉండాలని ఆంధ్రశాసనసభ సమావేశాలు, మంత్రివర్గ ప్రమాణ స్వీకారం సెక్రటరీయేట్‌లో ముఖ్యభాగం ఆంధ్ర ప్రాంతానికి తరలించాలని ఎక్కువమంది అభిప్రాయ పడ్డారు. ఆస్తుల పంపకం విషయంలో కూడా ప్రకాశం మెజారీటి సభ్యుల వాదనను నిరాకరించారు. ప్రకాశం తన అసమ్మతిని లిఖిత పూర్వకంగా తెలియచేశారు. ఈ అసమ్మతిని సాకుగా తీసుకొని ఆంధ్రరాష్ట్ర స్థాపనను, కేంద్ర ప్రభుత్వం వాయిదావేసింది. కాంగ్రెస్ పార్టీలోని నాటి ముఠా రాజకీయాలు కూడా ఆంధ్రరాష్ట్ర స్థాపనను వాయిదావేయడానికి తోడ్పాడ్డాయనడం వాస్తవమే. 1950 జనవరి 26 లోపుగా రాష్ట్రస్థాపన అసాధ్యమని నెహ్రూ ప్రకటించారు.

